ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 24-2-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 195
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

హెచ్1బి మరింత కష్టం



- వీసాల జారీ కఠినతరం
- మూడో పార్టీ సైట్‌లో నియమించే సంస్థలకు కఠిన మార్గదర్శకాలు
- మూడేళ్ల కన్నా తక్కువ వ్యవధికీ వీసాలు జారీ చేయవచ్చు
- ఉద్యోగి అవసరంపై ఆధారాలన్నీ చూపాల్సిందే

వాషింగ్టన్: హెచ్1బి వీసాల జారీ ప్రక్రియను మరింత కఠినతరం చేస్తూ ట్రంప్ యంత్రాంగం కొత్త విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం తక్షణం అమల్లోకి రానుంది. తాజా నిబంధనలు భారత ఐటీ సంస్థలు, వాటి ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. 'అమెరికా ఉత్పత్తులనే కొనాలి-అమెరికన్లనే నియమించుకోవాలి' అంటూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో భాగంగానే అమెరికా పౌర, వలసల సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) తాజాగా ఏడు పేజీల విధాన పత్రాన్ని ప్రకటించింది. ఏప్రిల్ 2 నుంచి హెచ్1బి వీసాలకు దరఖాస్తు చేసుకునే సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కఠిన నిబంధనలు అమల్లోకి రావడం గమనార్హం. మూడో పార్టీ సైట్‌లో తమ ఉద్యోగులతో పని చేయించడానికి హెచ్1బి వీసాల కోసం దరఖాస్తు చేసే కంపెనీలకు ఇకపై పత్రాల పని ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగిని నియమించుకున్న కంపెనీ.. తన సేవలు అందించేందుకు వేరే సంస్థకు ఆ వ్యక్తిని పంపిస్తే ఆ మరో సంస్థ మూడో పార్టీ సైట్ అవుతుంది. అర్హులైన అమెరికన్లు లేని (మిగతా 2లో)



భాగస్వామ్య సదస్సు ప్రధాన వేదిక

పెట్టుబడులకు పెద్ద వేదిక

నేటి నుంచే విశాఖలో భాగస్వామ్య సదస్సు

- ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం
- దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజాల రాక
- పలువురు కేంద్ర మంత్రులు, ఇతర దేశాల మంత్రుల హాజరు
- విస్తృత ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.3 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు జరుగుతాయని అంచనా
- సుమారు 2 వేల మంది ప్రతినిధుల హాజరు 2లో

ఇక డిజిటల్ అక్షరాస్యత

- కొత్త సంవత్సరంలో కోటి మంది ప్రజలకు శిక్షణ
- విశ్వవిద్యాలయ స్థాయిలో ఈ-ప్రగతి ప్రాజెక్టు అభివృద్ధి
- ఈ-ప్రగతి పట్టభద్రులకు సర్టిఫికేట్ల ప్రదానోత్సవ సభలో చంద్రబాబు

ఈనాడు - అమరావతి

మార్చి నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా ఆన్‌లైన్‌లో దస్త్రాలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సచివాలయ స్థాయిలో ప్రస్తుతం అమలులో ఉందని, కార్యదర్శులతోపాటు మంత్రులు కూడా ఇందుకోసం ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నారని అన్నారు. పరిపాలనలో ఆధునిక సాంకేతికతను అనుసంధానిస్తున్న ఈ-ప్రగతి ప్రాజెక్టును ఒక విశ్వవిద్యాలయంగా అభివృద్ధిచేసి అధికారుల నుంచి ప్రజల వరకు నిరంతరం శిక్షణ అందిస్తామన్నారు. 2018-19 సంవత్సరంలో సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు; ఆన్‌లైన్‌లో జిల్లా అధికారులకు; మరో కోటి మంది ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సహకారంతో ఈ ప్రాజెక్టులో శిక్షణ పొందడం ఎంతో గొప్ప విషయమని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఉండవల్లిలోని సీఎం నివాస ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ఈ-ప్రగతి పట్టభద్రులకు సర్టిఫికేట్ల ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, విద్య, వినోదం... ఇలా రంగాలు ఏవైనా విజ్ఞానానికి ఐటీని అనుసంధానించడంతో అద్భుత ఫలితాలు సాధించొచ్చని అనేక చిన్న దేశాలు సైతం నిరూపించాయని వివరించారు. మెరుగైన పరిపాలన కోసం భూమి బ్యాంకు తరహాలో రాష్ట్రంలోని అన్ని కుటుంబాల వివరాలను అనుసంధానించే సూక్ష్మస్థాయి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.



ఈ-ప్రగతి పట్టభద్రులకు ధ్రువపత్రాల ప్రదానోత్సవంలో భాగంగా.. గుంటూరు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేణుక కుమార్తెను ఎత్తుకొని ఈశ్వరి ప్రగతిగా నామకరణం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రత్యామ్నాయ విద్యుత్తు కోసం..

విద్యుత్తు సంస్కరణల అమలుతో కరెంటు కొరత నుంచి మిగులు స్థాయికి చేరుకోవడంతో పాటు ధరలు కూడా అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. రెండో దఫా సంస్కరణల్లో భాగంగా సౌర, పవన విద్యుత్తు వినియోగం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిపాలనలో ఐటీ అనుసంధానం అత్యావశ్యమని భావించే (మిగతా 2లో)

మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంచుకోకపోయినా... అన్నీ తెలుసనే అజ్ఞానంతో ఉన్నా పరుగు పందెంలో వెనుకబడిపోతాం. ఇప్పటికీ ఒక విద్యార్థిగా కొత్త విషయాలు తెలుసుకోడానికి నేను ప్రయత్నిస్తుంటా.

\- ఈ-ప్రగతి కార్యక్రమంలో చంద్రబాబు

అమరావతిలో 1000 ఫ్లాట్లు

- సీఆర్‌డీఏ ద్వారా నిర్మాణం
- వేలంలో విక్రయించాలని నిర్ణయం
- ముఖ్యమంత్రి సూత్రప్రాయ ఆమోదం
- మంత్రి నారాయణ వెల్లడి

11లో

26న ఎంసెట్ నోటిఫికేషన్

28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ, ఈనాడు: ఎంసెట్-2018 నోటిఫికేషన్‌ను ఈ నెల 26న విడుదల చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ సన్నద్ధమైంది. ఫిబ్రవరి 28 నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని కన్వీనర్ సీహెచ్.సాయిబాబు 'ఈనాడు'కు తెలిపారు. 30 రోజులపాటు ఎలాంటి ఆలస్యరుసుం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తరువాత ఆలస్య రుసుం రూ. 500, రూ.1000, రూ.అయిదు వేలు, రూ.10 వేలు చెల్లించి కూడా దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ ఏడాది దరఖాస్తు ధరకు అదనంగా జీఎస్‌టీ కలవడంతో దరఖాస్తు రుసుంను రూ.500గా నిర్ణయించినట్లు కన్వీనర్ తెలిపారు. వచ్చే దరఖాస్తులను బట్టి ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. గత సంవత్సరం రీతిలోనే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఎంసెట్ నిర్వహించనున్నారు.

ఆంధ్రా గురించి అనుకొనేవారేరీ?

- ఒక్క అంశంపైనా చర్చించింది లేదు 2లో
- ప్రధాని మోదీ, అమిత్ షాలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నం
- పార్లమెంటు ముగిసి రెండు వారాలైనా కనిపించని పరిష్కార మార్గాలు



శుక్రవారం దిల్లీలో రాష్ట్రపతి భవన్ వద్ద కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఆయన కుటుంబ సభ్యులతో ప్రధాని మోదీ

ప్రజాధనం దోచేవారిని వదలం

- అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవు
- 'గ్లోబల్ బిజినెస్ సమిట్'లో ప్రధాని మోదీ

దిల్లీ: ఆర్థిక అవకతవకలపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుందనీ, ప్రజాధనం దోచుకోవడాన్ని సహించేది లేదనీ ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ పెద్దఎత్తున మోసగించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్య చేశారు. 'ఎకనామిక్ టైమ్స్' (మిగతా 2లో)

ఇదీ సంగతి!



సమైక్యతను సవాల్ చేసేవారిని ఉపేక్షించం

- రాజకీయాల కోసం మతాన్ని దుర్వినియోగం చేయకూడదు
- కెనడా ప్రధానితో భేటీ తర్వాత మోదీ వ్యాఖ్యలు

14లో

ఇక డిజిటల్ అక్షరాస్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఐటీ సలహాదారుగా సత్యనారాయణను నియమిస్తూ ముఖ్యమంత్రి అయ్యాక మొదటి సంతకం చేశానని వివరించారు. గోదావరి, కృష్ణా నదులు అనుసంధానించి రాయలసీమకు 144 టీఎంసీల నీటిని అందించి కరవును జయించామని, అనంతపురం జిల్లాలో 70 మీటర్ల ఎత్తుకు భూగర్భ జలాలు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఆ జిల్లాతో పోల్చిచూస్తే పశ్చిమ గోదావరిలో భూగర్భ జలాలు తక్కువగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయబద్ధంగా అందాల్సిన సాయం కోసం పోరాటం చేస్తానని, సాధించే వరకు వదిలిపెట్టేది లేదన్నారు. ఈ-ప్రగతి ప్రాజెక్టు ముఖ్య కార్యనిర్వాహక అధికారి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించిన ఈ సభలో ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సర్టిఫికేట్ రహిత పాలన కోసం చేస్తున్న ప్రయత్నానికి అధికారులంతా సహకరించాలని కోరారు. రేషన్ కార్డు, పింఛన్, ఇతర సర్టిఫికేట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం లేని రోజులు రాష్ట్రంలో రాబోతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఐటీ సలహాదారు జె.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ-ప్రగతి ప్రాజెక్టు అమలుతో ప్రభుత్వ సేవలను ప్రజలు ఎంతో సులువుగా అందుకోవచ్చుని, ఇతర రాష్ట్రాలు సైతం ఈ ప్రాజెక్టుపై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నాయని వివరించారు. ఐటీ కార్యదర్శి విజయానంద్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ దీపారాణి తదితరులు ప్రసంగించారు. ఈ-ప్రగతి పట్టభద్రులైన వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు ముఖ్యమంత్రి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.



ఈ-ప్రగతి పట్టభద్రులకు ధ్రువపత్రాల ప్రదానోత్సవంలో భాగంగా.. సీఎం నివాస ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బహుళ ప్రయోజన కియోస్క్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చిత్రంలో ఐటీ శాఖ కార్యదర్శి విజయానంద్

మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం: చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ముస్లిం మైనారిటీలు సమావేశాలు నిర్వహించాలని, ఐకమత్యంగా ఉండాలని సూచించారు. నాయకులుగా ఎదగడానికి కృషి చేయాలని, అవకాశాలు కల్పిస్తామని అన్నారు. శుక్రవారం ఎస్టీ, ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆధ్వర్యంలో ముస్లిం హక్కుల పోరాట సమితి, ఆల్ ఇండియా ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, దళిత లంబాడీ మహిళా మోర్చ ప్రతినిధులు సచివాలయంలో సీఎంను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై 40 ఏళ్లు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేగా మొదటిసారి ఎన్నికై ఈనెల 27 నాటికి 40 ఏళ్లు పూర్తవుతుంది. ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన ఈ-ప్రగతి పట్టభద్రుల సర్టిఫికేట్ల ప్రదానోత్సవ సభలో పాల్గొన్న ఆయన తన హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన అనేక సంస్కరణలు, హైదరాబాద్‌కు ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) తీసుకురావడం వంటివి ప్రస్తావిస్తూనే, మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై 27 నాటికి 40 ఏళ్లు పూర్తవుతుందన్న విషయాన్ని వెల్లడించడంతో అధికారులంతా చప్పట్లు కొట్టి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌కు ఐఎస్‌బీని తీసుకొచ్చినా ఇప్పటివరకు ఎవరికీ ప్రవేశం కోసం సిఫార్సు చేయలేదని వివరించారు. అమరావతిని ప్రపంచశ్రేణి నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలన్నదే ముందున్న లక్ష్యమని ప్రకటించారు.

అధికారిణి కుమార్తెకు పేరు పెట్టిన ముఖ్యమంత్రి.....

ఎక్సైజ్, ప్రొహిబిషన్ గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ వి.రేణుక కుమార్తెకు ముఖ్యమంత్రి నామకరణం చేశారు. ఈ-ప్రగతి ప్రాజెక్టు తరఫున శిక్షణ తీసుకున్న 96 మంది అధికారుల్లో రేణుక ఒకరు. గర్భిణిగా ఉంటూనే శిక్షణ తీసుకున్న ఆమె నెల రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. సర్టిఫికేట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి బిడ్డతోపాటు హాజరైన ఆమె... పేరు పెట్టాలని ముఖ్యమంత్రిని కోరగా వెంటనే ఆయన ఈ-ప్రగతి అని నామకరణం చేశారు. పక్కనే ఉన్న ప్రభుత్వ సలహాదారు సత్యనారాయణ ఈ.. అంటే ఈశ్వరి... అని చెబుతూ ఈశ్వరి ప్రగతిగా ఖరారు చేశారు.

హెచ్1బి మరింత కష్టం

(మొదటి పేజీ తరువాయి)

వృత్తుల్లో విదేశాల నుంచి అత్యధిక నైపుణ్యం ఉన్న వారిని నియమించుకోవడానికి హెచ్1బి కార్యక్రమం ఉపకరిస్తుంది. భారత ఐటీ సంస్థలు అమెరికాలోని మూడో పార్టీ సైట్‌లో తమ ఉద్యోగులను ఈ వీసాలపై ఎక్కువగా నియమిస్తున్నాయి. అక్కడి బ్యాంకింగ్, ప్రయాణ-వాణిజ్య సేవలు ఎక్కువగా భారత్ నుంచి వచ్చిన ఆన్‌సైట్ ఐటీ నిపుణులపై ఆధారపడి ఉన్నాయి. యూఎస్‌సీఐఎస్ తాజా మార్గదర్శకాల ప్రకారం...

- మూడో పార్టీ సైట్‌లో ఎంతకాలం పని ఉందో అంతకాలానికే హెచ్1బి వీసాలను మంజూరు చేస్తారు. ఇప్పటివరకు వీటిని కనీసం మూడేళ్ల కాలానికి జారీ చేస్తుండగా ఇక నుంచి మూడేళ్ల కన్నా తక్కువ కాలానికి కూడా పరిమితం చేయవచ్చు.
- ఒక కంపెనీ నియమించుకోవాలనుకుంటున్న హెచ్1బి ఉద్యోగి.. దరఖాస్తులో పేర్కొన్నంత కాలమూ మూడో పార్టీ వర్క్‌సైట్‌లో ప్రత్యేక వృత్తిలో ప్రత్యేక అసైన్‌మెంట్‌లు చేపట్టనున్నట్లు రుజువు చేయడానికి కావాల్సిన ఆధారాలన్నింటినీ సదరు కంపెనీ సమర్పించాల్సి ఉంటుంది. అసలు పనికి సంబంధించిన ఆధారాలు-సాంకేతిక డాక్యుమెంటేషన్, మైల్‌స్టోన్ పట్టికలు, మార్కెటింగ్ విశ్లేషణ, వ్యయ-ప్రయోజన విశ్లేషణ, బ్రోచర్లు, ఫండింగ్ పత్రాలు వంటివి సమర్పించాలి.
- ఎండ్-క్లయింట్ కంపెనీకి చెందిన ఆధీకృత అధికారి సంతకం చేసిన లేఖ కూడా చూపాలి. ఈ లేఖలో.. లబ్ధిదారు నిర్వహించే ప్రత్యేక విధుల వివరణ, అందుకు అవసరమయిన అర్హతలు, ఉద్యోగ కాలం, జీతభత్యాల వివరాలు, ఎన్నిగంటలు పని చేసేది, లబ్ధిదారును పర్యవేక్షించేది ఎవరు తదితర వివరాలుండాలి. హెచ్1బి వీసా కింద ఒక ఉద్యోగిని నియమించుకున్న సంస్థ రెండు లేదా అంతకన్నా ఎక్కువ సంస్థలతో సేవలు అందించడానికి ఒప్పందాలు కుదుర్చుకుని ఉండొచ్చు. ఆ ఒప్పందాల్లో భాగంగా సదరు ఉద్యోగిని ఏ సంస్థలో విధులు నిర్వర్తించడానికి పంపిస్తే ఆ సంస్థ ఎండ్-క్లయింట్ అవుతుంది.
- లబ్ధిదారును ఎంత కాలం కోసం నియమించుకుంటామని విజ్ఞప్తి చేస్తున్నారో అంత కాలానికీ వారితో హెచ్1బి దరఖాస్తు చేసే సంస్థ.. యజమాని-ఉద్యోగి సంబంధాన్ని కొనసాగించాలి.
- హెచ్1బి వీసాల పొడిగింపూ మరింత కఠినం కానుంది. ముఖ్యంగా గత ఉద్యోగ కాలంలో ఎప్పుడైనా సదరు ఉద్యోగి బెంచ్‌మీద ఉన్నట్లయితే వీటి పొడిగింపు కష్టం కావచ్చు.
- కొన్ని సందర్భాల్లో అమెరికా సంస్థలు అర్ధంతరంగా కాంట్రాక్టును రద్దు చేసుకుంటాయి. ఫలితంగా ఉద్యోగులకు తాత్కాలికంగా పని ఉండదు. ఈ పరిస్థితినే ఐటీ రంగంలో బెంచ్ మీద ఉండడం అంటారు. ఈ కాలంలో ఆయా సంస్థలు హెచ్1బి హోదాను కొనసాగిస్తున్నా సంబంధిత విదేశీ ఐటీ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని పలు సందర్భాల్లో అధికారిక విచారణల్లో వెల్లడయింది. ఇది వ్యవస్థను దుర్వినియోగం చేయడమేనని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేస్తోంది.
- ఒక ఉద్యోగి హెచ్1బీ వీసాను పొడిగించాలని దరఖాస్తు చేసే సంస్థ.. గతంలో ఆ వీసా ఆమోదం పొందిన మొత్తం వ్యవధి అంతా నిబంధనలను పాటించినట్లు రుజువు చేసుకోవాలి. ఒక వేళ సదరు సంస్థ ఆ షరతులను పాటించకపోతే... పొడిగింపు దరఖాస్తుపై యూఎస్‌సీఐఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు.

ప్రజాధనం దోచేవారిని వదలం

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ సమిట్'లో ప్రధాని ప్రసంగించారు. ఆర్థిక సంస్థల యాజమాన్యాలు, పర్యవేక్షక సంస్థలు తమ విధుల్ని అత్యంత అప్రమత్తతతో నిర్వర్తిస్తూ అవకతవకలకు కళ్లెం వేయాలని మోదీ చెప్పారు. ఆర్థిక అక్రమాలపై ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటూ వస్తున్నామనీ, అవి ఇకపైనా కొనసాగుతాయనీ తేల్చిచెప్పారు. పీఎన్‌బీ పేరును గానీ, కీలక నిందితుల పేర్లను గానీ ప్రధాని నేరుగా ప్రస్తావించలేదు. ఆడిటర్లు, నియంత్రణ సంస్థలు పూర్తి అంకిత భావంతో తమ విధుల్ని నిర్వర్తించాలన్నారు. నియమ నిబంధనల్ని, విధానాలను రూపొందించేవారు, విలువల్ని కాపాడేవారు అంకితభావంతో మెలగాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 45 నిమిషాలపాటు ఆయన ప్రసంగించారు. ప్రధానంగా వ్యాపారంలో నిజాయతీ గురించి ప్రస్తావించారు. ఆర్థిక అవకతవకల్ని ఏమాత్రం భరించేది లేదని చెప్పారు. ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటు, ద్రవ్యలోటు, జీడీపీ వృద్ధి, వడ్డీరేట్లు, విదేశీ పెట్టుబడులు... ఇలా అన్ని ప్రామాణికాల్లోనూ దేశం మెరుగైన పనితీరు ప్రదర్శిస్తోందన్నారు. 'అదే దేశం. అదే ప్రజలు. అదే అధికారులు. కానీ భారత్ మాత్రం ఇప్పుడు మారిన దేశంగా కనిపిస్తోంది. మనతో కలిసి నడవాలని ప్రపంచం అనుకొంటోంది. ప్రపంచ ఆర్థిక రంగం ఎనిమిదేళ్లలో సాధించినదానిని భారత్ నాలుగేళ్లలోనే సాధించింది. కొత్త పని సంస్కృతితో దేశం దూసుకుపోతోంది. మన పోటీతత్వాన్ని ప్రపంచం కొనియాడుతోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే రహదారులు/ రైలు మార్గాల నిర్మాణం సహా అనేక రంగాల్లో పురోగతి గణనీయంగా ఉంది' అని మోదీ వివరించారు.

పెట్టుబడులకు పెద్ద వేదిక

- నేటి నుంచే విశాఖలో భాగస్వామ్య సదస్సు

విశాఖ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

విశాఖ వేదికగా శనివారం నుంచి మరో భారీ పెట్టుబడుల సదస్సు జరుగుతోంది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడం, రాష్ట్రంలోని అనుకూలతలు, వనరులు, ప్రభుత్వ విధానాలను దేశవిదేశాల పారిశ్రామికవేత్తలకు వివరించడం, ఆంధ్రప్రదేశ్‌కు మరింత ప్రత్యేక గుర్తింపు (బ్రాండ్ ఇమేజ్) తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తోంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖల సహకారంతో రాష్ట్రం ఈ సదస్సుకు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేసింది. రెండేళ్లుగా విశాఖలో భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తున్న ప్రభుత్వం మూడో సదస్సుకూ విశాఖనే వేదిక చేసుకుంది. గత రెండు సదస్సులకంటే మరింత ఘనంగా ఈ సదస్సును నిర్వహించనుంది. పర్యాటకులను ఆకర్షించే విశాఖలో మూడు రోజులపాటు దిగ్గజ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రముఖ సంస్థల యజమానులు, సీఈఓలు, రాజకీయ ప్రముఖులు సందడి చేయనున్నారు. హార్బర్‌పార్కులోని ఏపీఐఐసీ గ్రౌండ్స్‌లో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతేడాది జనవరిలో జరిగిన సదస్సుతో పోలిస్తే ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాట్లు చేశారు. సమావేశ మందిరాలు, ప్రదర్శన కేంద్రాలు, వేదికల విస్తీర్ణం గత సదస్సు కంటే 20 శాతం పెంచారు. 'నవభారతాన్ని ప్రపంచశ్రేణి సంస్థలతో అనుసంధాన వ్యూహాలు రచిద్దాం' (చార్టింగ్ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ) అన్న ప్రధాన భావనతో ఈసారి భాగస్వామ్య సదస్సు జరుగుతోంది. సదస్సును శనివారం మధ్యాహ్నం మూడింటికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి సురేష్‌ప్రభు, కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, గ్రంధి మల్లికార్జునరావు తదితరులు పాల్గొంటారు. కియా మోటార్స్(ఇండియా) అధ్యక్షుడు కుక్ హ్యూన్ షిమ్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ కంట్రీ డైరెక్టర్ కెనిచి యొకొయామా, గ్రంధి మల్లికార్జునరావు ప్యానల్ చర్చలో పాల్గొంటారు. తొలిరోజు సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ అంశంపై సదస్సు జరుగుతుంది.



సదస్సులోని ఓ సమావేశ మందిరం

రెండు వేల మంది ప్రతినిధులు

మూడో భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంలో సుమారు రూ.మూడు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదురుతాయని అంచనా వేస్తున్నారు. కచ్చితంగా పెట్టుబడులు పెడతారని, ఒప్పందాల్ని ఆచరణలోకి తీసుకువస్తారన్న నమ్మకం ఉన్నవారితోనే ఎంఓయూలు చేసుకోనున్నట్టు సీఐఐ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల భాగస్వామ్య సదస్సుకు సుమారు రెండు వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా. వీరిలో 40 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వస్తున్నవారే ఉన్నారు. పలువురు కేంద్ర మంత్రులు, బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, సింగపూర్, శ్రీలంక వంటి సుమారు 14 దేశాలకు చెందిన మంత్రులు హాజరవుతారని అంచనా. 20కిపైగా దేశాల నుంచి వాణిజ్య, పారిశ్రామిక దిగ్గజాలు, ప్రతినిధులు హాజరవుతున్నారు.

ఇంద్రభవనాన్ని తలపించేలా..


సదస్సుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు చూస్తే. . అదేదో తాత్కాలికంగా చేసిన నిర్మాణం అన్నట్టే అనిపించదు. అంత పక్కాగా, సౌకర్యంగా ఏర్పాట్లున్నాయి. ప్రారంభ సమావేశం, ముఖ్యమైన సమావేశాలు జరిగే ప్రధాన మందిరం(హాల్)తో సహా మొత్తం ఐదు మందిరాలు ఏర్పాటుచేసింది. ప్రధాన సమావేశ మందిరంలో రెండు వేల మంది కూర్చునే వీలుంది. రెండో మందిరంలోనే చిన్న చిన్న సమావేశాల నిర్వహణ(బ్రేకవుట్ సెషన్స్)కు రెండు ప్రత్యేక సమావేశ మందిరాలుంటాయి. ప్రతినిధుల ముఖాముఖి చర్చలకు విశాలమైన లాంజ్ ఉంటుంది. ఇక్కడ ఏర్పాటుచేసిన ఏపీ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీనిలో ఆంధ్రప్రదేశ్ రాజధాని విశేషాల్ని, ఆకృతుల్ని ప్రదర్శించేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నారు. రియల్‌టైం గవర్నెన్స్‌కు ప్రత్యేక విభాగం ఉంది. మూడో మందిరాన్ని ముఖ్యమంత్రి, ఆయన కార్యాలయం కోసం కేటాయించారు. నాలుగో గదిని మీడియా ప్రతినిధుల కోసం, భోజనశాలగానూ వినియోగిస్తారు. ఐదో గది పూర్తిగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖతో పాటు ఆ శాఖ పరిధిలోని వివిధ విభాగాలకు కేటాయించారు. రష్యాకు ప్రత్యేక పెవిలియన్‌ను కేటాయించడంతో పాటు దక్షిణకొరియా, జపాన్‌లపై ఈసారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. కేంద్ర వాణిజ్యమంత్రి సురేష్ ప్రభు కీలకపన్యాసం చేస్తారు. రెండు ఎగ్జిబిషన్ కేంద్రాల్లో వివిధ ప్రభుత్వ శాఖలు 12 స్టాళ్లను ఏర్పాటుచేశాయి.

పారిశ్రామికవేత్తల చూపు.. విశాఖ వైపు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తల్లో అత్యధికులు భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సభ్యులే. సీఐఐ చరిత్రలో తొలిసారి ఒకే రాష్ట్రంలో, ఒక ప్రాంతంలో మూడుసార్లు సదస్సులు నిర్వహిస్తుండటం ఇదే తొలిసారి. మొదటి రెండు భాగస్వామ్య సదస్సుల్లో కుదుర్చుకున్న ఒప్పందాల్లో అధికశాతం సాకారమవుతున్నాయి. ఇసుజు మోటార్స్ రాకతో ఏపీలో ప్రప్రథమంగా వాహనాల తయారీ ప్రారంభమైంది. తాజాగా దక్షిణకొరియా దిగ్గజ సంస్థ కియా మోటార్స్ రూ.13,500 కోట్లతో అనంతపురంలో పెట్టుబడులు పెడుతోంది. ఫాక్స్‌కాన్ సంస్థ ఏర్పాటుతో ఏపీలోనే అధునాతన సెల్‌ఫోన్లు తయారవుతున్నాయి. శ్రీసిటీ అనూహ్యంగా అభివృద్ధి చెంది వేలాదిమందికి ఉపాధి కల్పన కేంద్రంగా మారింది. విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, తిరుపతి తదితర ప్రాంతాల్లో చిన్నాచితకా ఐటీ సంస్థలు కలిపి 200 వరకు ఆవిర్భవించడంతోపాటు ఇప్పటికే ఉన్న పలు ఐటీ సంస్థలు కార్యకలాపాలను విస్తరించాయి. విశాఖలో ఐటీ, ఫార్మా, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. విశాఖ- చెన్నై పారిశ్రామిక నడవా ప్రారంభమైతే విశాఖ నుంచి నెల్లూరు వరకు ఉన్న తీర ప్రాంతం కళకళలాడనుంది. సులభతర వ్యాపార నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించడం కూడా పలువురు పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూడడానికి కారణమవుతోంది.

అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవాలి..

– శివ్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు, భారత పరిశ్రమల సమాఖ్య



భారత పారిశ్రామిక సంస్థలు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేలా తీర్చిదిద్దడానికి ఎలాంటి వ్యూహాలను రచించాలన్నది ప్రస్తుత సదస్సు ప్రధానోద్దేశం.
ఏపీలో గత భాగస్వామ్య సదస్సుల్లో జరిగిన ఒప్పందాల అమలు సంతృప్తికరంగా ఉండడం, ఏపీలో పారిశ్రామిక ప్రగతి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుండడం దేశవ్యాప్త పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

ఆంధ్రా గురించి అనుకొనేవారేరీ?

ఈనాడు, దిల్లీ: విభజన చట్టం అమలుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయపార్టీలు చేస్తున్న ఆందోళనలు, ప్రకటనల సెగ దిల్లీని ఏమాత్రం తాకడంలేదు. రాష్ట్ర సమస్యల గురించి ఆలోచించేవారు కానీ, ఆలకించేవారుకానీ ప్రస్తుతం దేశరాజధానిలో కనిపించడం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా అసెంబ్లీ ఎన్నికల ప్రచార నిమిత్తం రోజుకో రాష్ట్రానికి వెళ్లడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఏపీలో జరుగుతున్న విషయాలపై దృష్టిసారించి పరిష్కారమార్గాలు ఆలోచించేవారు ఇక్కడ కనిపించడంలేదు. పార్లమెంటు బడ్జెట్ తొలి విడత సమావేశాలు ముగిసి శుక్రవారానికి రెండువారాలు పూర్తయింది. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేస్తున్న ఏ ఒక్క అంశంపైనా చర్చించిన దాఖలా కనిపించలేదు. హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో శుక్రవారం జరగాల్సిన తెలుగురాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశం కూడా వాయిదాపడటంతో ఉన్న ఆశకూడా కొడిగట్టిపోయింది. ఈ సమావేశం కూడా రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్రం స్పందించి ఏర్పాటు చేసిందేమీ కాదు. విభజన చట్టం అమలు బాధ్యత హోంశాఖదే కావడంతో క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలకు తేదీలు ఖరారుచేయడం, వాయిదాపడటం పరిపాటిగా వస్తోంది.

మేము చెప్పిందే ఒప్పన్నట్టుగా..

రెవిన్యూలోటు భర్తీ, ప్రత్యేకప్యాకేజీ నిధుల అంశంపై 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, కేంద్ర ఆర్థికశాఖ అధికారుల మధ్య జరిగిన చర్చల వల్ల ఎలాంటి ఫలితమూ రాలేదు. ఈ రెండు అంశాలపై ఫార్ములా కనుక్కొంటామని ఆర్థికమంత్రి చెప్పినా.. అధికారుల స్థాయి చర్చల్లో మాత్రం తాము చెప్పిందానికే ఒప్పుకోవాలని కేంద్రం రాష్ట్రంపై ఒత్తిడి తెస్తుండటంతో అడుగు ముందుకు పడలేదు.

అంశమేదైనా వారిద్దరిదే నిర్ణయం..

దిల్లీలో ప్రతి అంశంపైనా మోదీ, అమిత్‌షాలు రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో ఇటు అధికారులుకానీ, అటు మంత్రులుకానీ దేనిపైనా ముందడుగు వేయలేకపోతున్నారు. కేంద్రంలో అత్యున్నత స్థానాల్లో ఉన్న మంత్రులు సైతం ఆ ఇద్దరి మనసులోని ఆలోచనల ప్రకారం నడుచుకోవడం మినహా, చొరవ తీసుకొని సమస్యలకు పరిష్కారమార్గాలు చెప్పే ధైర్యం చేయలేకపోతున్నారు. కేంద్రమంత్రివర్గంలో ఉన్న భాజపా నాయకులెవ్వరికీ ఆంధ్రప్రదేశ్‌తో సరైన సంబంధాలు లేకపోవడంతో ఎవ్వరూ రాష్ట్రం గురించి ప్రస్తావించే సాహసం చేయలేకపోతున్నారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి హోదాలో ఉన్నందున అవకాశం వచ్చినప్పుడు చెప్పడం మినహా ఇదివరకటిలా చొరవ తీసుకొని చెప్పే పరిస్థితి కనిపించడంలేదు.

దిల్లీలో మాట్లాడని కాంగ్రెస్ జాతీయ నాయకులు

ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని చెబుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకులు దిల్లీలో దీని గురించి పెద్దగా మాట్లాడటంలేదు. ఇతర జాతీయపార్టీల నేతలదీ ఇదే తీరు. ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తున్నంత సమస్య తీవ్రత దిల్లీలో మచ్చుకైనా కనిపించడంలేదు. మార్చి 5న పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యేంతవరకూ పరిస్థితి ఇలాగే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

10 లక్షలమంది ఉపాధ్యాయులకు తుపాకులు

- సమకూర్చే యోచనలో ట్రంప్ ప్రభుత్వం
- నిధుల సమీకరణపై దృష్టి
- ప్రతిపాదనలపై కాంగ్రెస్ సభ్యులతో మాట్లాడనున్న దేశాధ్యక్షుడు

వాషింగ్టన్: పాఠశాలల్లో నరమేధాలు పునరావృతం కాకుండా చూసేందుకుగాను శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు తుపాకులు సమకూర్చాలంటూ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరపైకి తెచ్చిన ఆలోచన కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి! దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షలమంది ఉపాధ్యాయులకు ఆయుధాలు అందించి.. వినియోగంపై శిక్షణనిచ్చేందుకుగాను ప్రభుత్వం నిధులు సమీకరించే అవకాశముందని శ్వేతసౌధవర్గాలు వెల్లడించాయి. తుపాకులను కలిగి ఉన్న ఉపాధ్యాయులకు రూ.67 వేల చొప్పున బోనస్ ఇస్తే.. 10 లక్షలమందికిగాను రూ.6,700 కోట్లు ఖర్చవుతాయని పేర్కొన్నాయి. పాఠశాలల భద్రత కోణంలో చూస్తే అది పెద్దమొత్తమేమీ కాదని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు శాసన-బడ్జెట్ సంబంధిత ప్రతిపాదనలపై కాంగ్రెస్ సభ్యులతో ట్రంప్ త్వరలోనే మాట్లాడతారని తెలిపాయి. పాఠశాలల్లో కాల్పుల కవాతు(డ్రిల్)లను నిర్వహించడంపై అధ్యక్షుడు వ్యతిరేకంగా ఉన్నారన్న వార్తలను కొట్టిపారేశాయి. 'క్రియాశీల కాల్పుల కవాతు'కు బదులుగా 'భద్రతా కవాతు' పేరుతో వాటిని నిర్వహించాలన్నదే ఆయన అభిమతమని స్పష్టం చేశాయి. మరోవైపు, అసాల్ట్ రైఫిల్ కొనుగోలుచేసేవారి వయోపరిమితిని 21 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనకు మద్దతిచ్చే విషయాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారని శ్వేతసౌధవర్గాలు వెల్లడించాయి. అసాల్ట్ రైఫిళ్లు అమెరికా పౌరులకు దక్కకుండా పూర్తిస్థాయి నిషేధం విధించేందుకు మాత్రం ఆయన సుముఖంగా లేరని పేర్కొన్నాయి.

ఉపాధ్యాయులకు ఆయుధాలు సమకూర్చాలన్న ఆలోచనను ట్రంప్ పునరుద్ఘాటించారు. పాఠశాలల భద్రతపై అధికారవర్గాలతో శ్వేతసౌధంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో తుపాకులు లేకపోవడంతో హంతకులు సులభంగా లోనికి ప్రవేశించి మారణహోమాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల వద్ద గుప్త ఆయుధాలుండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తుపాకులను కలిగి ఉండేందుకు దేశంలో 10-40 శాతం మంది ఉపాధ్యాయులు అర్హత సాధించే అవకాశముందని అభిప్రాయపడ్డారు. వారి చేతికి ఆయుధాలు వస్తే పాఠశాలల్లో భద్రత కట్టుదిట్టమవుతుందని పేర్కొన్నారు.

యూపీలో యువతి సజీవ దహనం

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువతి(18)ని గురువారం సాయంత్రం సజీవ దహనం చేశారు. ఉన్నావో జిల్లా సత్నీబాలఖేడా గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఆమె మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తీసుకుని సైకిలుపై తిరిగి వస్తుండగా దాడికి దిగిన దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఆమె ఇంటికి కొద్ది దూరంలోని నిర్మానుష్య ప్రాంతం (పొలాల్లో)లో ఈ అకృత్యానికి పాల్పడ్డారు. ఎస్పీ, డీఐజీ సహా పోలీసు అధికారులు ఘటనస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబీకులతో మాట్లాడారు. కాగా తమకు ఎవరితోనూ విరోధం లేదని యువతి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని కొందరిని విచారిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

24-2-2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
నవమి: రా. 7-54 తదుపరి దశమి
రోహిణి నక్షత్రం: ఉ. 9-10 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: ఉ. 7-40 వరకు
తిరిగి రా. 11-23 నుంచి 12-53 వరకు
వర్జ్యం: మ. 2-24 నుంచి 3-56 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-25 నుంచి 7-58 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-27; సూర్యాస్తమయం: సా.6-00

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	17.5	36.5
తిరుపతి	17.8	32.6
అనంతపురం	17.9	34.2
విశాఖపట్నం	18.2	34.6
కడప	19.0	36.0
గుంటూరు	19.2	34.5
రాజమహేంద్రవరం	20.0	35.0
హైదరాబాద్	20.2	33.5
విజయవాడ	20.5	33.6
తాడేపల్లిగూడెం	21.0	31.0
నరసాపురం	21.3	32.0
కర్నూలు	21.4	36.0
నెల్లూరు	22.0	32.0
ఖమ్మం	22.0	36.0
ఒంగోలు	22.1	31.9
సూర్యాపేట	24.0	34.5

ఆహార పదార్థాలు దొంగిలించాడని...

గిరిజన యువకుడి దారుణ హత్య!

- మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తి
- కేరళలో సంచలనం... నిరసనలు

పాలక్కాడ్ (కేరళ): ఘోరం! ఆహార పదార్థాలను దొంగిలించాడని 30 ఏళ్ల మతిస్థిమితం లేని గిరిజన యువకుడిని దారుణంగా చంపేశారు!! కేరళలోని అగలీ పట్టణం శివారులో గురువారం పొద్దుపోయాక చోటుచేసుకుందీ ఘటన. దీనితో నేరుగా ప్రమేయమున్న ఇద్దరు వ్యక్తులు సహా మొత్తం ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి పేరు మధు. అతనిది కేరళలో బాగా వెనుకబడిన అట్టప్పాడిలోని కడుకూమన్న గిరిజన ప్రాంతం. మానసిక స్థితి సరిగాలేక కొన్ని నెలల క్రితమే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మాసిన బట్టలతో ముక్కలి ప్రాంతంలో తిరుగుతుండేవాడు. ఆకలి తీర్చుకోడానికని గురువారం స్థానిక దుకాణాల నుంచి ఆహార పదార్థాలను తీసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు దొంగతనం చేశాడని అతడిని పట్టుకుని చేయిచేసుకున్నారు. కిందపడేలా తోసేశారు. తర్వాత పోలీసులకూ అతడిని అప్పగించారు. కొందరైతే పోలీసులు వచ్చేలోగా... చేతులు కట్టేసి ఉన్న మధుతో సెల్ఫీలు కూడా దిగారు! పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండగానే... మధు వాంతులు చేసుకున్నాడు. స్పృహతప్పి ప్రాణాలు కోల్పోయాడు. శవపరీక్షల నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని తీసుకెళ్తుండగా గిరిజన సంఘాలు వారిని అడ్డుకున్నాయి. మధు మృతికి కారణమైనవారిని అరెస్టు చేసేవరకూ కదలబోమని నిరసనకారులు భీష్మించారు. జిల్లా కలెక్టరు, పోలీసు ఉన్నతాధికారులు వారికి సర్దిచెప్పాల్సి వచ్చింది. విషయం తెలిసి మధు తల్లి కన్నీరుమున్నీరైంది. తన కొడుకును పొట్టన పెట్టుకున్నారనీ.. ప్రాణాలతో వదిలేసినా ఎలాగోలా బతికేవాడని రోదించింది. ప్రగతిపథ కేరళ సమాజానికి ఈ దారుణం మాయని మచ్చని సీఎం పినరయి విజయన్ విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

పాఠశాల వద్దే విద్యార్థిని దారుణహత్య

మధ్యప్రదేశ్‌లో అమానుషం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో మరో దారుణం.. పాఠశాల బయటే ఓ విద్యార్థిని(17)ని గుర్తు తెలియని వ్యక్తి గురువారం మధ్యాహ్నం కత్తితో తల నరికి హతమార్చాడు. అనుప్పుర్ జిల్లా కోట్మా పట్టణానికి కొద్ది దూరంలో.. అంతగా జన సంచారం లేని సమయంలో ఈ అమానుషానికి తెగబడ్డాడు. 12వ తరగతి చదువుతున్న బాలిక పరీక్షకు హాజరయ్యేందుకు గాను బడిలోకి ప్రవేశిస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు అకస్మాత్తుగా దాడికి పాల్పడినట్లు ఎస్పీ సునీల్ జైన్ తెలిపారు. ఆమె మెడపై పలుమార్లు కత్తితో దాడిచేయడంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను కొద్ది దూరం నుంచి చూసిన ఓ ఉపాధ్యాయురాలు కేకలు పెట్టడంతో.. దుండగుడు కత్తిని అక్కడే వదిలేసి పారిపోయాడు. అనంతరం ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్‌కు తరలించి, ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా గత కొంతకాలంగా ఓ వ్యక్తి బాలిక వెంటపడుతూ బెదిరిస్తున్నట్లు మృతురాలి కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. ఈమేరకు కొందరు వ్యక్తులను విచారిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య..: బాలిక హత్య జరిగిన కొద్దిసేపటికి ఆమె స్వగ్రామంలోనే ఓ యువకుడు ఉరేసుకుని చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ఘటనపై కూడా దృష్టి సారించారు.

తాపీగా కాదు.. వడివడిగా

- తుర్క్, అఫ్గాన్, పాక్, భారత్ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో వేగం
- అఫ్గాన్ సెక్షన్ పనులకు శ్రీకారం
- నాలుగు దేశాల ప్రముఖుల హాజరు

దక్షిణాసియా ఇంధన ఇక్కట్లను తీర్చే 'తాపి గ్యాస్' ప్రాజెక్టులో మరో కీలక ఘట్టానికి తెరలేచింది. తుర్క్‌మెనిస్థాన్ నుంచి అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, భారత్(తాపి)లకు గ్యాస్‌ను సరఫరాచేసే అతి పెద్ద పైప్‌లైన్ నిర్మాణంలో భాగమైన అఫ్గాన్ సెక్షన్ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో అఫ్గాన్ అధ్యక్షుడు అస్రాఫ్ ఘనీ, తుర్క్‌మెనిస్థాన్ అధ్యక్షుడు గర్బంగులి బెర్దీముఖమెదోవ్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షాహిద్ కె.అబ్బాసీ, భారత విదేశాంగశాఖ సహాయమంత్రి ఎం.జె.అక్బర్ హాజరయ్యారు. అఫ్గాన్-తుర్క్‌మెనిస్థాన్ సరిహద్దులోని సెర్హెతాబాత్‌లో ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. తుర్క్‌మెనిస్థాన్ సెక్షన్‌లో ఇప్పటికే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి.

ప్రాజెక్టు ప్రత్యేకత

గతంలో బ్రిటీష్ సర్కారు మూసేసిన చరిత్రాత్మక దక్షిణాసియా, మధ్యఆసియా మార్గం తిరిగి అనుసంధానమవుతుంది.



తుర్క్‌మెనిస్థాన్‌లో జరుగుతున్న పైపులైన్ పనులు

ఎక్కడ్నుంచి ప్రారంభం

తుర్క్‌మెనిస్థాన్‌లోని అతిపెద్ద చమురు, సహజవాయు క్షేత్రం గల్కినిష్ నుంచి..

ఏయే ప్రాంతాల గుండా


హెరాత్, కాందహార్ (అఫ్గాన్), క్వెట్టా, ముల్తాన్(పాక్), ఫజిల్కా(భారత్)

ప్రాజెక్టు గరిష్ఠ సామర్థ్యం

ఏటా 3300 కోట్ల ఘనపు మీటర్ల మేర గ్యాస్ సరఫరా. రోజుకు 9 కోట్ల ప్రామాణిక ఘనపు మీటర్ల(ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ను 30 ఏళ్ల పాటు సరఫరా చేస్తారు.

ఏ దేశంలో ఎంత దూరం

తుర్క్‌మెనిస్థాన్	214 కి.మీ
అఫ్గానిస్థాన్	774 కి.మీ
పాకిస్థాన్	824 కి.మీ
భారత్	219 కి.మీ



పైప్‌లైన్ దూరం

1,840 కి.మీ.ల మేర భూగర్భ పైప్‌లైన్

గ్యాస్ సరఫరా ప్రారంభమయ్యేది రెండేళ్లలో (2020 నాటికి)

గ్యాస్ అవసరాలు తీరేది

పాకిస్థాన్‌కు 25 శాతం మేర, భారత్, అఫ్గానిస్థాన్‌లకు 15 శాతం మేర.

ఖర్చు అంచనా

రూ.64,863 కోట్లు (1000 కోట్ల డాలర్లు)

భారత్, పాకిస్థాన్‌లు పొందేది

ఒక్కో దేశానికి 38 ప్రామాణిక ఘనపు మీటర్ల చొప్పున. అఫ్గాన్‌కు 14 ప్రామాణిక ఘనపు మీటర్లు ఇస్తారు. భారత్ 43-44 ప్రామాణిక ఘనపు మీటర్లు పొందాలనే యోచనలో ఉంది.

గల్కినిష్ ప్రత్యేకత ఏమిటి?

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సహజ వాయు నిక్షేప క్షేత్రమిది. 16 లక్షల కోట్ల ఘనపుటడుగుల గ్యాస్ నిక్షేపాలు ఇక్కడున్నాయి.

శుక్రవారం అఫ్గాన్ సెక్షన్ పనుల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్, అఫ్గానిస్థాన్ అధ్యక్షుడు అస్రాఫ్ ఘనీ, తుర్క్‌మెనిస్థాన్ అధ్యక్షుడు గర్బంగులి బెర్దీ ముఖమెదోవ్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి షాహిద్ కె.అబ్బాసీ



భారత్ ఎలా సంధానమయింది?

ఈ ప్రాజెక్టులో భాగస్వామి అవుతామని 2008 ఏప్రిల్‌లోనే భారత్ ప్రకటించింది. తదుపరి సమావేశాల్లో చురుగ్గా పాల్గొంది. అయితే పైప్‌లైన్‌ను పేల్చేస్తామని అప్పట్లో తాలిబాన్లు హెచ్చరించడంతో కొద్దిరోజులు పునరాలోచనలో పడింది. ఇప్పుడు తాలిబాన్లు మద్దతు ఇస్తుండడంతో భారత్ కూడా ముందుకు వెళుతోంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం నాలుగు దేశాలు కలిసి ఏర్పాటుచేస్తున్న కంపెనీలో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) భాగస్వామి అవుతోంది.

ఆందోళనలు

- తాలిబాన్లకు మంచి పట్టున్న అఫ్గానిస్థాన్‌లోని కాందహార్, పాకిస్థాన్‌లోని క్వెట్టాల గుండా ఈ పైప్‌లైన్ వెళుతుంది. వారి మద్దతుంటే తప్ప ఈ ప్రాజెక్టు అమలు సాధ్యంకాదు. మొదట్లో బెట్టుచేసిన తాలిబాన్లు ఇప్పుడు పట్టు సడలించారు. తాము ఈ పైప్‌లైన్ నిర్మాణానికి హామీ ఇస్తామని, ఇది అఫ్గానిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన ప్రాజెక్టు అని తాలిబాన్ల ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ప్రకటించారు.
- గ్యాస్ ధరకు సంబంధించి ఇప్పటికీ భారత్, పాకిస్థాన్‌లకు ఆందోళనలున్నాయి. తుర్క్‌మెనిస్థాన్ చెప్పిన ధరపై భారత్ సంతృప్తిగా లేదు. పునఃచర్చలు జరుగుతున్నాయి.

-ఈనాడు ప్రత్యేక విభాగం

ఆరు ఆర్థిక నగరాలకు పరిపాలన అనుమతి

వీటిల్లో ఈబీసీ కుటుంబాల కోసం నిర్మించే ఇళ్లకు రాయితీలు

ఈనాడు, అమరావతి: ప్రయివేట్ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆరు ఆర్థిక నగరాల ఏర్పాటుకు ప్రభుత్వం శుక్రవారం అనుమతులిచ్చింది. ఇందులో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల కోసం నిర్మించే ఇళ్లకు పలు రాయితీలు, మినహాయింపులున్నాయి. పని చేసిన ప్రాంతానికి ఉద్యోగులు, కార్మికులు నడిచి వెళ్లే వాతావరణం కల్పించాలన్నది లక్ష్యం. ప్రయివేట్ సంస్థలు తమ సొంత స్థలాల్లో చేపట్టాలన్న ప్రతిపాదనలపై ఆరు సంస్థలు ముందుకొచ్చాయి.

రాయితీలు, మినహాయింపులిలా....

- ఆరు ఆర్థిక నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రూ. 51.2 కోట్లు ఖర్చు చేస్తుంది.
- ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై)లో క్రెడిట్ లింక్‌డ్ సబ్సిడీ స్కీం (సీఎల్ఎస్ఎస్) కింద మాత్రమే ఇళ్లు నిర్మించాలి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎలాంటి రాయితీ లభించదు.
- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల జాబితాలను ప్రభుత్వమే రూపొందించి ప్రయివేట్ సంస్థలకు అందజేస్తుంది. వీరికి మాత్రమే కేటాయించాలి. ఇళ్ల రిజిస్ట్రేషన్లపై స్టాంపు డ్యూటీ మినహాయింపు ఉంటుంది.
- పురపాలక, నగరపాలక సంస్థల నుంచి అనుమతులపై ఇది వరకే ప్రభుత్వం విడుదల చేసిన జీవో (నం:244)లో పేర్కొన్న రాయితీలన్నీ వర్తిస్తాయి.
- ఏకగవాక్ష విధానంలో 21 రోజుల్లో ఆర్థిక నగరాల నిర్మాణాలకు ప్రభుత్వశాఖల నుంచి అనుమతులిస్తారు.

ప్రయివేట్ సంస్థలు తమ సొంత స్థలాల్లో ప్రభుత్వ సహకారంతో నిర్మించనున్న ఆర్థిక నగరాలు, వీటి అంచనా విలువ ....

సంస్థ పేరు	ప్రాంతం	అంచనా విలువ (రూ.కోట్లలో)
మాలక్ష్మి	చెవుటూరు, పినపాక (విజయవాడ)	6.3
ఎల్ఈపీఎల్-అమరావతి	మంగళగిరి (గుంటూరు)	12.3
ఎల్ఈపీఎల్-వైజాగ్	అచ్యుతాపురం	3.9
రాగమయూరి	వెలుగుబంద (రాజమహేంద్రి)	7.0
చైతన్య	బి.తాండ్రపాడు, తడకనపల్లి (కర్నూలు)	21.7
ఆర్ఎస్ బిల్డర్స్	అచ్యుతాపురం (వైజాగ్)	-

ఏప్రిల్ 20న రాజమండ్రిలో ప్రత్యేక హోదా ఆత్మగౌరవ సభ

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు రాజకీయ పార్టీలన్నీ ఏకమై ఉద్యమించాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ కోరారు. ఏప్రిల్ 20న రాజమండ్రిలో ప్రత్యేక హోదా ఆత్మగౌరవ పోరాట సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై పోరాడితే దాడులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ఈ సందర్భంగా రామకృష్ణ ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి విడుదల చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మార్చి 6న దిల్లీలో ఆందోళనలు నిర్వహించి ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతామన్నారు.

బోళ్ల బులిరామయ్య మృతికి జస్టిస్ చలమేశ్వర్ సంతాపం

తణుకు, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోళ్ల బులిరామయ్య మృతికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ సంతాపం తెలిపారు. బులిరామయ్య రాజకీయ రంగంలో నిబద్ధత, నిజాయితీ కలిగిన నేత అని పేర్కొన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు వచ్చిన ఆయన బులిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోళ్ల కుటుంబ సభ్యులైన రమేష్‌కుమార్, రాజీవ్, బంధువులు పెండ్యాల నరేంద్రనాథ్, అచ్యుతరామయ్య, ముళ్లపూడి నరేంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే వైటీ రాజాలను పరామర్శించారు. జస్టిస్ చలమేశ్వర్ వెంట హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు, ఏపీ హిందీ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు.

టీటీవీ దినకరన్ వర్గంలోకి మరో అన్నాడీఎంకే ఎమ్మెల్యే!

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట అన్నాడీఎంకేను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్న ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ వర్గంలోకి అధికార పార్టీకి చెందిన కళ్లకురిచ్చి ఎమ్మెల్యే ప్రభు చేరారు. చెన్నైలోని దినకరన్ నివాసంలో శుక్రవారం ఆయనతో భేటీ అయ్యారు. తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని నడిపించడానికి దినకరన్ వెంట ఉంటానని తెలిపారు. అన్నాడీఎంకేలో సక్రమంగా ప్రజాసేవ చేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

రేషన్ కార్డుకు 'ఆధార్' అనుసంధానం తప్పనిసరి

ముంబయి, న్యూస్‌టుడే: ఆధార్ కార్డు, రేషన్ కార్డు అనుసంధానం(లింక్) అనివార్యమని ముంబయి హైకోర్టు స్పష్టం చేసింది. మార్చి ఒకటినుంచి బయోమెట్రిక్ కార్డుదారులకే చౌక ధరకు రేషన్ సరకులను అంద చేయనున్నారు.

పారిశ్రామిక వాడ... ప్రజలకు గూడూ నీడ!

- శాటిలైట్ టౌన్‌షిప్, ఆర్థిక నగరాల ఏర్పాటుకు సర్కారు చొరవ
- ఇప్పటికే ప్రారంభమైన కార్యాచరణ
- ఇవన్నీ పెట్టుబడుల సదస్సులో ప్రతిఫలిస్తాయంటున్న యంత్రాంగం

ఈనాడు - విశాఖపట్నం

కార్మికులు పనిచేసేచోటే నివాసాలకు ప్రాధాన్యం ఇస్తే ఎక్కువ ఉత్పాదకతకు అవకాశం ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం శాటిలైట్ టౌన్‌షిప్, ఆర్థిక నగరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. వీటిని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే విశాఖలోని లంకెలపాలెం సమీపంలోని పరవాడ, సబ్బవరం, గాజువాక మండలాల పరిధిలోని 900 ఎకరాల్లో శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. ఈ బాధ్యతలు విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (ఉడా) పర్యవేక్షించనుంది. ఇక్కడ కొంత భాగంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇళ్లను కేటాయిస్తారు. విశాఖనగరంలో 25 ఎకరాల్లో.. ఇదే జిల్లాలోని అచ్యుతాపురం పారిశ్రామికవాడ ప్రాంతంలో 198 ఎకరాల్లో ఆర్థిక నగరాల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇదే తరహాలో కృష్ణా, కర్నూలుతో పాటు గుంటూరు జిల్లా మంగళగిరి, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలలో ఏర్పాటుకు ప్రణాళికలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 980 ఎకరాల్లో ఆరు ఆర్థిక నగరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతుంటే.. కృష్ణాజిల్లా జక్కంపూడిలోని 234 ఎకరాల్లో ఇప్పటికే చర్యలు మొదలయ్యాయి. వీటి ఏర్పాటు ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య, తరహాల పారిశ్రామిక (ఎంఎస్ఎంఈ) రంగంలో రూ. 22,280 కోట్ల పెట్టుబడులు వస్తాయని. .1.61 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి దక్కుతుందని భావిస్తున్నారు. పారిశ్రామికవాడలు, కారిడార్ల ఏర్పాటు, అందుకు అనువుగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం 13 జిల్లాల సమగ్రాభివృద్ధికి విస్పష్ట ప్రణాళికతో ముందుకెళ్తోంది. రాష్ట్రంలో సుస్థిర ఆర్థికాభివృద్ధికి అవసరమైన పరిశ్రమల ఏర్పాటుకు సర్కారు నిర్దేశించుకున్న పారిశ్రామిక రంగ మిషన్‌లో ఇవన్నీ అంతర్భాగంగా ఉన్నాయి. విద్యుత్తు, వ్యవసాయం, ఆహార శుద్ధి, మౌలిక వసతులు, తయారీరంగం, పెట్రో కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్ రంగాలలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించడమే ఈ మిషన్ లక్ష్యం. ప్రభుత్వం విశాఖ వేదికగా నిర్వహిస్తున్న ఉషోదయాంధ్రప్రదేశ్ పెట్టుబడుల సదస్సులో వీటి ఆలంబనతో సానుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు విశ్వసిస్తున్నారు.



భాగస్వామ్య సదస్సు ప్రాంగణం..

విశాఖ సదస్సులో ప్రారంభంకానున్న ఈ-స్పైస్ బజార్

ఈనాడు డిజిటల్, గుంటూరు: విశాఖ భాగస్వామ్య సదస్సులో ఈ-స్పైస్ బజార్‌ను కేంద్రమంత్రి సురేష్ ప్రభు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుగంధ ద్రవ్యాల సంస్థ ఛైర్మన్ జయతిలక్ ఆదివారం ప్రారంభించనున్నారు. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార, సాంకేతిక పరిజ్ఞాన శాఖ(డైటీ), సుగంధ ద్రవ్యాల సంస్థ సంయుక్త నిర్వహణలో దీన్ని రూపొందించినట్లు ఆ సంస్థ ఉపసంచాలకుడు శ్రీకాంతన్ థంపి తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు, ఆన్‌లైన్ వేదికగా దేశీయ విపణిలో ఎక్కడైనా పంటను అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్పైస్ బజార్‌ను రూపొందించింది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మిరప, పసుపు రైతులకు ఆన్‌లైన్ వాణిజ్య వేదికగా ఈ-స్పైస్ బజార్ పనిచేస్తుంది.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: 'ఈనెల 28 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రం నుంచి 10 లక్షలకు పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరిలో ఏ ఒక్కరు హాల్ టిక్కెట్ అందక ఇబ్బందులు పడకూడదని' రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈసీ మందిరం నుంచి ఇంటర్ విద్య మండలి కార్యదర్శి ఉదయలక్ష్మి, ఇతర అధికారులతో మంత్రి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్షలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఏ ఒక్కరూ కింద కూర్చొని పరీక్ష రాయకూడదన్నారు. ఇంటర్ విద్యార్థుల కోసం 18002749868 టోల్‌ఫ్రీ నంబరు, 24 గంటలు అందుబాటులో ఉండే 0866-2974130 నంబరుతో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. 0866-2970056 నంబరుతో ఫ్యాక్స్ పనిచేస్తుందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చిరునామాలు సులభంగా తెలుసుకొనేందుకు 'ఐపిఇ సెంటర్ లొకేటర్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ యాప్ ద్వారా హాల్‌టిక్కెట్లపై ముద్రించిన కేంద్రం కోడ్ నెంబరును అనుసరించి పరీక్షా కేంద్రాలను సులభంగా గర్తించవచ్చన్నారు. jnanabhumi.ap.go.in ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వీటిపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల సంతకాన్ని పెట్టించుకోవాన్నారు. విద్యార్థులందరికీ ఎస్ఎంఎస్‌ల ద్వారా కేంద్రాల వివరాలను పంపాలని ఆదేశించారు. ఈ ఏడాది నుంచి ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకు గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు.

చూచిరాతలకు పాల్పడొద్దు..: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని.. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి ఉదయలక్ష్మి సూచించారు. 9 గంటల అనంతరం నిమిషం దాటినా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించమన్నారు. సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు చూచిరాతకు పాల్పడితే నాలుగేళ్ల పాటు పరీక్షలు రాయకుండా అనర్హులను చేస్తామన్నారు.



ఏయూ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

గుండె కండరాలకు శక్తినిచ్చే బీట్‌రూట్ రసం!

వాషింగ్టన్: గుండె వైఫల్యం సమస్యలతో దుర్బలంగా తయారైన వారికి బీట్‌రూట్ రసం ఎంతో మేలుచేస్తుందని తాజా అధ్యయనం పేర్కొంది. ఈ అనారోగ్య సమస్య ఉన్న వారికి వ్యాయామం చేసే సామర్థ్యం క్షీణిస్తుంది. అలాంటి సందర్భాల్లో బీట్‌రూట్ దివ్య ఔషధంలా పనిచేస్తుందని ఇండియానా విశ్వవిద్యాలయ పరిశోధకులు వెల్లడించారు. దుర్బలంగా తయారైన రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడమే కాదు....చాలా సందర్భాల్లో జీవితకాలం పెరుగుదలకు కూడా తోడ్పడుతంది. బీట్‌రూట్ రసంలోని 'డైటరీ నైట్రేట్'(ఆహార సంబంధం నైట్రేట్) ప్రభావం వల్ల వ్యాయామం చేసే శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయి. గుండె కండరాల సంకోచవ్యాకోచాలు బాగా దెబ్బతిన్న సందర్భాల్లో ప్రాణవాయువు సమృద్ధిగా ఉండే రక్తాన్ని సమర్థంగా శరీరానికి చేరవేయడంలో వైఫల్యం చోటు చేసుకుంటుంది. దీంతో, రోగులు ఊపిరి తీసుకోవడానికి బాగా కష్టపడతారు. ఇలాంటి పరిస్థితుల్లో వారు తేలికపాటి వ్యాయామం చేయడానికి కూడా అత్యధిక స్థాయిలో శక్తిని వినియోగించాల్సి వస్తుంది. సరిగ్గా... ఈ సమస్యను తగ్గించడంలో బీట్‌రూట్ రసం సంజీవనిలా ఉపకరిస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. వ్యాయామం చేసే సమయమే కాదు... ప్రాణవాయువు స్వీకరణ సామర్థ్యం సైతం బీట్‌రూట్ వల్ల పెరుగుతుంది. అంతే కాదు, డైటరీ నైట్రేట్ మూలంగా ఆరోగ్యపరంగా ఇతరత్రా దుష్ప్రభావాలేవీ కూడా చోటు చేసుకోలేదని తమ పరిశోధనల్లో ప్రయోగాత్మకంగా రుజువైనట్లు వారు వివరించారు.

బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం

ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు

ఈనాడు డిజిటల్, అమరావతి: సంక్షేమరంగానికి 2018-19 బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధికారులకు సూచించారు. వ్యవసాయవృద్ధి రేటు, రవాణా, స్టాంపులు, రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ శాఖల ఆదాయం బాగుందని తెలిపారు. శుక్రవారం బడ్జెట్ కసరత్తుపై ఆర్థికశాఖ అధికారులతో మంత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ హామీల మేరకు కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని సూచించారు. యువత, మహిళలు, సంక్షేమరంగం, వ్యవసాయం, విద్య, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ఆదాయంలో వెనకబడి ఉందన్నారు. రానున్న బడ్జెట్‌లో గనులు, భూగర్భ వనరులకు సంబంధించి కొత్తపాలసీ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఏపీకి రూ.16 వేల కోట్ల రెవిన్యూలోటు ఉన్నట్లు కాగ్ చెప్పిందని మంత్రి గుర్తు చేశారు. రెవెన్యూలోటు, ఈఏపీ ప్రాజెక్టులకు రావాల్సిన నిధులు రాలేదని అధికారులు మంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లకు రూ.2 వేలకోట్లే వచ్చాయన్నారు. ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీ, ఈఏపీ ప్రాజెక్టుల నిధులు, కేంద్ర పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాగా 90:10 శాతం ఇస్తామన్నందువల్లే ప్యాకేజీకి అంగీకరించామని తెలిపారు.

పరోపకారార్థం... జన్మదినం

- పేదలకు ఉపయోగపడేలా కుమార్తె పుట్టినరోజు వేడుక చేసిన బెంగళూరు జంట
- కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి రూ.200 కోట్ల విరాళం

ఇంట్లో పిల్లల పుట్టినరోజు వస్తోందంటే చాలు..
నెల రోజుల ముందు నుంచే ప్రణాళికలు వేసేస్తాం
కొత్త బట్టలు కొంటాం, భారీ కేకులకు ఆర్డరు ఇచ్చేస్తాం
బంధుమిత్రులను పిలిచి వైభవంగా జరిపిస్తాం

అయితే ఈ బెంగళూరు జంట మాత్రం తమ కుమార్తె పుట్టినరోజును పేదలందరికీ ఉపయోగపడేలా మార్చాలని భావించింది. రూ.200 కోట్లతో ఉచిత కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకుని అందరినీ అబ్బురపరిచింది.

ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఈ వ్యాపారవేత్తల గురించి వివరాల్లోకి వెళ్తే..బెంగళూరులోని ప్రముఖ వ్యాపార కుటుంబాల్లో విజయ్ టాటా, అమృతా టాటాలది ఒకటి. తమ కుమార్తె పుట్టినరోజును మర్చిపోలేని విధంగా జరపాలని భావించిన ఈ జంట.. తమ కలల ప్రాజెక్ట్ అయిన 'న్యూ ఇండియా' స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. అంతేకాకుండా పేదల కోసం ఉచిత కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి ముందుకొచ్చి.. రూ.200 కోట్ల విరాళాన్ని ఇస్తున్నట్లు ప్రకటించింది. బెంగళూరులో రూ.100 కోట్ల విలువైన 50 ఎకరాల స్థలాన్ని ట్రస్ట్‌కు ఈ జంట అందజేసింది. మరో రూ.100 కోట్లను కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి వినియోగించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కేన్సర్ రోగులు ఇక్కడ ఎటువంటి ఖర్చు లేకుండా చికిత్స పొందొచ్చు. 150 పడకలతో ఏర్పాటు చేయనున్న ఈ ఆసుపత్రిని పలుదశలో పూర్తిచేయనున్నారు. 2018 డిసెంబరుకు తొలి దశ పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. న్యూ ఇండియా కోసం పూర్తిగా తమ నిధులనే వినియోగించనున్న జంట.. ఎవరి నుంచి విరాళాలు స్వీకరించకపోవడం విశేషం. గత ఆరేళ్లుగా 40 మంది పిల్లలకు ఆశ్రయం ఇస్తున్న వీరు.. సమాజానికి మరింత పెద్దగా ఏమైనా ఇవ్వాలని భావించారు. ఇదే న్యూ ఇండియా ఏర్పాటుకు దారితీసింది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ సంస్థను ప్రారంభించారు. పేద కేన్సర్ రోగులకు ఇది ఆశాకిరణంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈనాడు

అవినీతి అప్రతిష్ఠ

అవినీతి అష్టపాది దేశదేశాల్ని ఎలా చుట్టేస్తున్నదో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తాజాగా వెలువరించిన వార్షిక సూచీ కళ్లకు కడుతోంది. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల గతిగమనాల్ని అధ్యయనం చేసి ప్రతిష్ఠాత్మక సంస్థలు రూపొందించిన విశ్వసనీయ నివేదికల క్రోడీకరణ ద్వారా వెలుగు చూసిన అవినీతి సూచీలో ఇండియా స్థానం 79 నుంచి 81కి దిగజారింది. 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణాలు మోతెక్కిపోయిన 2013, '14 సంవత్సరాల్లో అవినీతి భ్రష్టత్వ రికార్డులో కొత్త లోతులు ముట్టిన ఇండియా, దరిమిలా క్రమంగా మెరుగుపడుతుండటం తెలిసిందే. క్రితంసారి మాదిరే 40 మార్కులు తెచ్చుకొన్న ఇండియా ఈసారి రెండుస్థానాలు దిగజారడం- అవినీతి నియంత్రణ చర్యల్లో స్తబ్ధతను పట్టిచ్చేదే! మెజారిటీ దేశాలు అవినీతి సూచీలో 50 కంటే తక్కువ స్కోరుకే పరిమితం కావడంతో ప్రపంచ సగటు 43గా నిగ్గుతేలింది. అంతకు మూడు మార్కులు తక్కువున్న ఇండియా- ఆసియా పసిఫిక్ ప్రాంతంలో దిగనాసి దేశంగా అప్రతిష్ఠ మూట కట్టుకొంది. అవినీతి సూచీలో 50 కంటే తక్కువ స్కోరు ఉందంటే ఆయా దేశాల్లో సమస్య తీవ్రంగా ఉందని అర్థం. 30 మార్కుల కంటే దిగువ స్కోరు నమోదైతే అవినీతి వ్యవస్థీకృతమైపోయిందన్నది సూచీ ప్రతిపదార్థం. ప్రపంచవ్యాప్తంగా 30 శాతం పైగా దేశాలు 50 కంటే అధిక స్కోరు సాధించి దిలాసాగా పురోగమిస్తుంటే, మరో 30 శాతం దేశాలు 30కి దిగువ మార్కులతో అవినీతి యమపాశానికి చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. 41 పాయింట్లతో చైనా 77వ స్థానంలో నిలిస్తే, 37 పాయింట్లు 96వ స్థానంలో బ్రెజిల్, 29 పాయింట్లు 135వ స్థానంలో రష్యాలు ఈసురోమంటున్నాయి. న్యూజిలాండ్, డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్ వంటివి నీతిమంతమైన దేశాలుగా తొలి అయిదు స్థానాల్లో వెలుగులీనుతుంటే, తరతమ భేదాలతో సమస్త పాలన వ్యవస్థలకు అవినీతి క్యాన్సర్ సోకిన ఇండియా శాపగ్రస్తగా కుములుతోంది. అవినీతిపై మరో స్వాతంత్ర్య సమరానికి జనస్వామ్య భారతి పర్జన్యశంఖం పూరించినప్పుడే- దేశం తెరిపిన పడగలిగేది!

గుత్తాధిపత్యానికి విచక్షణాధికారాలు జతపడి జవాబుదారీతనం పారదర్శకత నిజాయతీలు విలుప్తమైతే అవినీతి చీకట్లు దట్టంగా కమ్ముకొంటాయి. పన్నెండు పంచవర్ష ప్రణాళికలు కాలగర్భంలో కలిసిపోయినా ఇంకా ఇండియా దిగువ మధ్యాదాయ దేశంగా మిగిలిపోగులుతోందంటే కారణం ఏమిటి? పేరుగొప్ప ప్రణాళికలు, పథకాలన్నీ అవినీతి చిల్లికుండతో నీళ్లు మోసిన చందం అయినందువల్లేనని నడుస్తున్న చరిత్ర చాటుతోంది. 2016లో డెన్మార్క్ తన స్థూల దేశీయోత్పత్తిలో 57.1 శాతం దాకా ప్రజాపనులు, సేవలపై వెచ్చించింది. అదే భారత ప్రభుత్వం వెచ్చిస్తున్న నిష్పత్తి 13.5 శాతంగా నమోదైంది. డెన్మార్క్‌లో నీతిమంతమైన పాలన ఎంత భారీ మొత్తాలనైనా సద్వినియోగం చేసే వాతావరణంలో అభివృద్ధికి ఊతమిస్తుంటే, అరకొర మొత్తాలూ అవినీతి మోతుబరుల పాలబడే దురవస్థ ఇండియాలో సామాజిక అసమానతల్ని దారుణంగా పెంచేస్తోంది. పన్నుల ఎగవేత రూపేణా ఏటా ఇండియా రెండు లక్షల కోట్ల రూపాయల్ని కోల్పోతున్నదని, ప్రాజెక్టుల్లో కాలయాపనల వల్ల రూ.40 వేలకోట్లు నష్టపోతోందని, విద్యుత్ పంపిణీ సరఫరా నష్టాల్లో 30 శాతం దాకా సంబంధిత విభాగ సిబ్బంది చలవేనని, అవినీతి పొడే లేకపోతే ప్రభుత్వ రంగ సంస్థల లాభదాయకత 20 శాతం దాకా పెరుగుతుందనీ కేంద్ర నిఘా సంఘం అధిపతి స్థాయిలోని పెద్దలే లోగడ పూసగుచ్చారు. పరిమిత వనరుల్ని గరిష్ఠ ప్రయోజనదాయకంగా మార్చుకొంటూ పురోగమించాల్సిన దశలో అన్ని స్థాయుల్లోనూ అవినీతి రోగగ్రస్తగా భ్రష్టుపడుతున్న జాతికి అభివృద్ధి లక్ష్యాలు- అక్షరాలా ఎండమావులు! అవినీతిని మట్టగించే పటిష్ఠ యంత్రాంగాల అవసరాన్ని అయిదు దశాబ్దాల క్రితమే గుర్తించిన ఇండియా, కాలక్రమంలో ఆయా వ్యవస్థల్ని నామమాత్రావశిష్టంగా మార్చేసి అంతర్జాతీయంగా పరువుమాస్తోందిప్పుడు!

ఏనాడో 1964లో కేంద్ర నిఘా సంఘాన్ని కొలువుతీర్చినా 2003లో చట్టబద్ధత కల్పించేదాకా దానికి దిక్కూదివాణం లేదు. కాగ్, కేంద్ర సమాచార సంఘం, రాష్ట్రస్థాయిలో విజిలెన్స్ కమిషన్లు, అవినీతి నిరోధక సంస్థలు, ప్రత్యేక కోర్టులు- ఇలా భిన్న యంత్రాంగాలు చూపులకు ఏపుగానే ఉన్నా దేశవ్యాప్తంగా అక్రమాలు తాళప్రమాణాలకు చేరి ప్రజాధనాన్ని కైంకర్యం చెయ్యగలుగుతున్నాయంటే, అవినీతి చెద ఎంతలా పాకిపోయిందో అర్థం చేసుకోవచ్చు. తక్కువ 'రిస్క్'తో అగణిత లాభాలు ఆర్జించగల పరిశ్రమగా అవినీతి ఊడలు దిగింది. ప్రపంచవ్యాప్తంగా అవినీతి ఆర్జన పరిమాణం దాదాపు రూ. 130 లక్షల కోట్లుగా ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ లెక్కకట్టింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 16 దేశాల్లో 69 శాతం లంచాల రేటుతో ఇండియా 'అగ్రస్థానం'లో నిలిచిందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థే నిరుడు మార్చిలో ప్రకటించింది. ప్రజాప్రయోజనాలు, సేవలతో ముడివడిన సమస్త రంగాలూ అవినీతి అడుసులో ఈదులాడుతున్నట్లు ఏటికేడు రుజువవుతూనే ఉంది. బంగ్లాదేశ్‌లో ఖలీదా జియా, బ్రెజిల్‌లో లులా ద సిల్వా, మంగోలియాలో న్యామ్ దోర్జ్ ఎంక్‌బయర్, ఇటీవల దక్షిణాఫ్రికాలో జాకోబ్ జుమాల జాతకాలు ఎలా తారుమారైందీ నిబిడాశ్చర్యంతో పరికిస్తున్న సామాన్య జనావళిని- దేశీయంగా కోట్లకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తెగబొక్కుతున్న సర్కారీ సిబ్బంది నిష్పూచీగా అవినీతి సాగర మథనంలో తలమునకలవుతున్న తీరు నిశ్చేష్టపరుస్తోంది. కన్ను తెరవని లోక్‌పాల్, కోరల్లేని లోకాయుక్తలు ఏదో ఉద్ధరిస్తాయనుకోవడం కాదు; అవినీతి పంకిల వ్యవస్థల్ని సాంతం ప్రక్షాళించే మహోజ్జ్వల చైతన్యఝురిగా జనవాహిని కదలాలి. నేతల రాతల్ని మార్చే సామాన్య జనమే జాతి భవితకు విధాతలై అవినీతిపై సమరం సాగిస్తే అద్భుత ఫలితాలు ఒనగూడతాయి!

పెట్టుబడుల సాధనలో పట్టుదలగా...



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. విశాఖలో దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, హిందుస్థాన్ షిప్‌యార్డు వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్ని మినహాయిస్తే రాష్ట్రంలో చెప్పుకోదగిన భారీ పరిశ్రమలు లేవు. ఈ పరిస్థితిని అధిగమించి పారిశ్రామిక రంగంలో అగ్రశ్రేణి రాష్ట్రాలతో పోటీపడేలా ఏపీని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్లలో చెయ్యని ప్రయత్నం లేదు. ఎక్కడ ఏ అవకాశం ఉందన్నా ఆయా దేశాలకు వెళ్లి, పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేస్తోంది. విశాఖ వేదికగా భాగస్వామ్య సదస్సుల నిర్వహణ అందులో భాగమే. తాజాగా శనివారం నుంచి మూడు రోజులపాటు భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడో భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తోంది. ఆర్థిక లోటు, మౌలిక వసతుల కొరతకు తోడు కేంద్రప్రభుత్వం హామీలిచ్చిన ప్రత్యేక హోదా వంటి వాగ్దానాలు నెరవేరకపోవడం వంటి ప్రతికూలతల్ని అధిగమించి పారిశ్రామిక రంగంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది.

రాయితీల వెల్లువ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ఆంధ్ర ప్రాంతానికి చెందినవారు సైతం అత్యధికంగా హైదరాబాద్ చుట్టూనే పరిశ్రమలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని పరిశ్రమల్లో 85 శాతానికిపైగా తెలంగాణలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 15 శాతం లోపే ఉన్నాయి. రాష్ట్రం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలంటే వ్యవసాయరంగంతో పాటూ పరిశ్రమలనూ ప్రోత్సహించాలి. సుదీర్ఘ తీరప్రాంతం, కృష్ణా, గోదావరి నదులు, సహజ వనరులు, గనులు, ప్రశాంత వాతావరణం, నైపుణ్యంగల మానవ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని తూర్పు, ఆగ్నేయాసియా దేశాలకు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ముఖద్వారంగా మార్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం ప్రత్యేక పారిశ్రామిక అభివృద్ధి విధానాన్ని తీసుకువచ్చింది. ఆటోమొబైల్, ఐటీ, ఎంఎస్ఎమ్ఈ, బయోటెక్నాలజీ, రిటైల్, ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్, తయారీ, పర్యాటకం, కోళ్ల, మత్స్య పరిశ్రమలు... ఇలా రంగాలవారీగా పదికిపైగా ప్రత్యేక విధానాలు ప్రకటించింది. మిగిలిన రాష్ట్రాల కన్నా మిన్నగా రాయితీలు కల్పించింది.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల్ని ఒప్పించినా, దానికి అనుగుణమైన వాతావరణం ఇక్కడ ఉండాలి. అందుకోసం నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటుచేసింది. రాష్ట్ర విద్యార్థులకు సాన పడుతోంది. ఏ రంగంలో ఏ అవకాశమున్నా దాన్ని ఏపీ విద్యార్థులు అందిపుచ్చుకొనేలా ఇంజినీరింగ్ రెండు, మూడో ఏడాది నుంచే అవకాశాలు కల్పిస్తోంది. ఈ మేరకు బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. ప్రవాసాంధ్రుల నుంచి పెట్టుబడుల్ని ఆకర్షించడంతోపాటు వారి వ్యక్తిగత సమస్యల్ని పరిష్కరించేలా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) ఏర్పాటుచేసింది. వివిధ దేశాల్లో స్థిరపడిన 40వేల మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ సంస్థ ద్వారా పలు ఐటీ పరిశ్రమలు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. ఆగ్నేయాసియా దేశాల్లో మాదిరిగా పెట్టుబడుల ఆకర్షణకు 'ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్'(ఈడీబీ)ని రాష్ట్రం ఏర్పాటుచేసింది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 'ఇన్నోవేషన్ సొసైటీ', వైద్య రంగంలో ఉపకరణాల తయారీ పరిశ్రమల కోసం 'మెడ్‌టెక్ జోన్'... ఇలా అవకాశమున్న ప్రతి రంగంలో ఒక సంస్థను ఏర్పాటు చేసింది. ఫలితంగా గన్నవరం, మంగళగిరి, విశాఖల్లో ఐటీ సంస్థలు పదుల సంఖ్యలో ఏర్పడ్డాయి. హెచ్‌సీఎల్‌కు తోడుగా క్యాప్‌జెమిని వంటి సంస్థలూ ఆసక్తి చూపుతున్నాయి.

దేశ విదేశాలకు చెందిన పెట్టుబడుదారుల్ని, పారిశ్రామికవేత్తల్ని ఆకర్షించాలంటే రాష్ట్రంలోగల అవకాశాలను వారికి వివరించగలగాలి. అందుకు ఒక వేదిక కావాలి. భాగస్వామ్య సదస్సుల నిర్వహణ దానిలో భాగమే. 2016, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన సదస్సులు మంచి ఫలితాలనిచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో జరిగినవాటితో పోలిస్తే విశాఖ సదస్సుల్లో చేసుకున్న ఒప్పందాల్లోనే ఎక్కువ శాతం కార్యరూపం దాల్చాయని అధికారుల అంచనా. 2016, 2017 పారిశ్రామిక సదస్సుల్లో మొత్తం 876 ప్రాజెక్టుల ఒప్పందాలు జరిగాయి. ఇవన్నీ సాకారమైతే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులొస్తాయి. 22 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయి. ఇంతవరకు వీటిలో 156 సంస్థలు ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా రూ.88,074 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. 1,58,813 మందికి ఉద్యోగాలు లభించాయి. ఇక వివిధ దశల్లో ఉన్న సంస్థలు మరో 306 ఉన్నాయి. వీటితో రూ.3,30,676 కోట్ల పెట్టుబడులు వస్తాయి. 3,44,676 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తం ఒప్పందాలు జరిగిన ప్రాజెక్టుల్లో 34.93 శాతం, పెట్టుబడులు 29.81 శాతం ఆచరణలోకి వచ్చాయి. మిగతా 570 సంస్థలు భూమి కేటాయింపులు, అనుమతులు, డీపీఆర్‌లు సిద్ధం చేసుకోవడం వంటి దశల్లో ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లో భాగస్వామ్య సదస్సుల్లో జరిగిన ఒప్పందాల్లో 10-12 శాతమే ఆచరణలోకి వస్తుంటే, మన దగ్గర 35 శాతం వరకు ఆచరణలోకి రావడం విశేషమని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

విధాన నిర్ణయాల్లో వేగం

పరిశ్రమల స్థాపనకు వచ్చేవారికి ఏకగవాక్ష విధానంలో 21 రోజుల్లోనే అనుమతులు ఇవ్వడం నుంచి నాలాలో విప్లవాత్మక సవరణల వరకు పలు విధానాలు తీసుకొచ్చింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ప్రతిసారీ అగ్రశ్రేణి రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఉంటోంది. ఒక్కసారి హామీ ఇస్తే, ఎన్ని ఇబ్బందులొచ్చినా వెనుదిరగకుండా అమలుచేస్తోంది. శ్రీసిటీలో తయారైన ఇసుజు వాహనాల్ని రాష్ట్రంలో విక్రయిస్తే జీవిత పన్ను మినహాయిస్తామని తొలుత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని, రాష్ట్రానికి బాగా ఆదాయం సమకూర్చే జీవిత పన్నును మినహాయించలేమని రవాణాశాఖ తీవ్రస్థాయిలో అభ్యంతరం పెట్టినా సీఎం పట్టుదలతో దానికి మినహాయింపు లభించింది. రాష్ట్రంలో ఆ సంస్థ విక్రయించే ఒక్కో వాహనంపై కనీసం రూ.1.5 లక్షల మేర ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. తొలుత కొంత నష్టం వాటిల్లినా భవిష్యత్తు బాగుంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇది వాహన పరిశ్రమ వర్గాల్ని అమితంగా ఆకర్షించింది. ఒక్క కియా పరిశ్రమే రూ.13 వేలకోట్ల పెట్టుబడి పెడుతోంది. చిన్నా పెద్దా అనుబంధ పరిశ్రమలు పదుల సంఖ్యలో రానున్నాయి. హైదరాబాద్‌ను మినహాయిస్తే దక్షిణాదిన పరిశ్రమల స్థాపనకు చెన్నై, ఐటీ పరిశ్రమలకు బెంగళూరు ప్రసిద్ధి. ఆ రెండు ప్రాంతాలూ కిక్కిరిసి పోవడంతో, బెంగళూరుకు సమీపంలో అనంతపురం జిల్లా, చెన్నైకు సమీపంలో చిత్తూరు జిల్లా ఉండటంతో ఈ రెండుచోట్లా పరిశ్రమల స్థాపనకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. చెన్నైకు, కృష్ణపట్నం ఓడరేవుకు సమీపంలో ఉండటంతోనే శ్రీసిటీ అద్భుత విజయం సాధించింది. అన్నివిధాలుగా బాగా వెనకబడిన రాయలసీమలోని ఈ రెండు జిల్లాలు పారిశ్రామికంగా ముందంజ వేసే స్థితిలో ఉన్నాయి. విశాఖ ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. వీటితోపాటు రాజధాని ప్రాంతమూ పెట్టుబడులను ఆకర్షించగలిగే స్థాయి ఉన్నదే!

అడ్డంకులను అధిగమిస్తూ...

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో హామీ ఇచ్చినప్పుడు అందరిలోనూ పారిశ్రామికరణ వేగంగా జరుగుతుందని ఆశించారు. పరిశ్రమల ఏర్పాటుకు వివిధ రూపాల్లో రాయితీలు, పన్ను మినహాయింపులు ఉండటంతో దక్షిణాదిన పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం కేంద్ర స్థానం అవుతుందని భావించారు. వాగ్దానం కార్యరూపం దాల్చక పోవడంతో పరిశ్రమల్ని తీసుకురావాలంటే అనేక అదనపు రాయితీలు ఇవ్వాల్సి వస్తోంది. కియా వాహన తయారీ పరిశ్రమకు భూమి కేటాయింపు, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.650 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. దాదాపు రూ.6,000 కోట్ల మేర రాయితీలు ఇవ్వాల్సి వస్తోంది. ప్రత్యేక హోదా ఉంటే ఈ బాధ ఉండేది కాదు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ భూమి అందుబాటు బాగా తక్కువ. ప్రైవేట్ భూమిని సేకరించాలంటే ఎకరానికి సగటున 40-50 లక్షల రూపాయలవుతోంది. కృష్ణా జిల్లా వీరపనేనిగూడెంలో పరిశ్రమల స్థాపనకు ఎకరం ఎనిమిది లక్షల రూపాయలకే ప్రభుత్వం భూమి కేటాయించింది. అక్కడ మార్కెట్ ధర రూ.80 లక్షలపైమాటే. గన్నవరం వద్ద హెచ్‌సీఎల్ సంస్థకు 27 ఎకరాలు కేవలం రూ.30 లక్షలకు కేటాయించింది. అక్కడ ఎకరా ఏడెనిమిది కోట్ల రూపాయలకు పైమాటే. ఒక్కోసారి ప్రైవేట్ భూమిని సేకరించి ఆ భారాన్ని ప్రభుత్వం భరించాల్సి వస్తోంది. రాష్ట్రంలో అన్ని రకాల పంటలు పుష్కలంగా పండుతున్నా సంబంధిత పరిశ్రమల్లేవు. మత్స్య రంగంలో ప్రాసెసింగ్ పరిశ్రమల్లేవు. దాదాపు వెయ్యి కిలోమీటర్ల తీరప్రాంతమున్నా, పర్యాటకం నుంచి నౌకాశ్రయాల నిర్మాణం వరకు పనులు వేగంగా జరగడం లేదు. ఇక చిన్న, మధ్యతరహా పరిశ్రమలపైనా సర్కారు దృష్టి పెట్టాలి. పంట ఉత్పత్తులకు విలువ జోడిస్తే రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుంది. కోస్తా వెంబడి జాతీయ రహదారి, రైళ్ల అనుసంధానంలో అంతరాలు తొలగించాలి. రాయలసీమతో అమరావతి అనుసంధానానికి ఉద్దేశించిన 'ఎక్స్‌ప్రెస్ వే' బాలారిష్టాలు దాటడం లేదు. విశాఖకు ఉన్న నాలుగైదు సర్వీసులు మినహా అంతర్జాతీయ విమానాలే లేవు. గన్నవరం, రేణిగుంట విమానాశ్రయాలకు అంతర్జాతీయ హోదా లభించి నెలలు గడుస్తున్నా సేవలు ప్రారంభం కావడం లేదు. బకింగ్‌హాం కెనాల్‌ని జాతీయ జల మార్గంగా అభివృద్ధి చేసే ప్రాజెక్టు పనులు వేగం పుంజుకోవడం లేదు. విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవాలో పనులు బాగానే జరుగుతున్నా, బెంగళూరు-చెన్నై నడవాలో ఇంకా వేగం పుంజుకోవాలి. విభజన చట్టంలో పేర్కొన్న కడప స్టీల్ ప్లాంట్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, నౌకాశ్రయం నిర్మాణం జరిగితే పారిశ్రామికీకరణ వేగం పుంజుకొంటుంది. నేర్పుగా ఓర్పుగా సమస్యలను అధిగమించగల సానుకూల దృక్పథం నేడు అవసరం. రాష్ట్ర ప్రయత్నాలకు కేంద్రమూ యథాశక్తి తోడ్పాటు అందించాలి. అప్పుడే ఇతర దక్షిణాది రాష్ట్రాలతో ఆంధ్రప్రదేశ్ పోటీపడగల స్థితికి చేరుకుంటుంది!

– జె.కల్యాణ్‌బాబు

ఒక్కో అడుగు ముందుకు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్

హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రతిపాదనతో ఇటీవల అమరావతికి వచ్చారు. సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారులు పారిశ్రామికవేత్తల్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్తారు. కానీ, చంద్రబాబు తానే నేరుగా విమానాశ్రయానికి వెళ్లారు. శివనాడార్‌కి ఘనంగా స్వాగతం పలికి ఇంటికి తీసుకెళ్లారు. ఆయనతో కలిసి భోజనం చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు కోరిన రాయితీలిచ్చేందుకు అంగీకరించారు. కోరినచోట భూమి కేటాయించారు. మళ్లీ ముఖ్యమంత్రే శివనాడార్‌ను విమానాశ్రయానికి తీసుకెళ్లి వీడ్కోలు పలికి వచ్చారు. వేగంగా పారిశ్రామికీకరణ జరగాలంటే రాయితీలు, వెసులుబాట్లు ఇవ్వడం తప్పనిసరి. ఇలాంటి కృషి ఫలితంగానే అనంతపురంలో కియా కార్ల పరిశ్రమ, రేణిగుంటలో మొబైల్ ఫోన్ల తయారీ క్లస్టర్‌లు ఏర్పడ్డాయి.

బాల్యంపై పైశాచిక దాడి

పిల్లల కలల్ని కల్లలు చేయడాన్ని మించిన హింస ప్రపంచంలో మరొకటి ఉండదు. అది నానాటికీ పెరుగుతూ, పలు రూపాల్లోకి మారుతూ, ఆఖరికి వారి బలవన్మరణాలకే దారితీస్తుండటం విషాదభరిత వాస్తవ చిత్రం. ప్రపంచవ్యాప్తంగా శారీరక, లైంగిక, మానసిక, భావోద్వేగ సంబంధమైన హింసతో పాటు వేధింపులూ పెచ్చరిల్లుతున్నాయి. వాటి విషపూరిత కోరల్లో చిక్కి నరకయాతన పడుతున్న బాలబాలికల సంఖ్య వందకోట్లకు పైమాటే! నమ్మశక్యం కాని ఈ యథార్థాన్ని స్టాక్‌హోమ్ (స్వీడన్) వేదికగా ఇటీవల ముగిసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సదస్సు బయటపెట్టింది. విశ్వమంతటా పసితనాన్ని కర్కశంగా చిదిమేస్తున్నవాటిలో పోషకాహార లేమి మొదటిది. ఆ తరవాతి స్థానం హింసదేనంటూ పెనుప్రమాద ఘంటికలు ఇదివరకే మోగాయి. డబ్ల్యూహెచ్ఓ వెలువరించిన గణాంక సహిత నివేదిక ప్రకారం- ప్రతి అయిదుగురు బాలల్లో ఇద్దరు శారీరకంగా హింసకు గురవుతున్నారు. 18 శాతం బాలికలు లైంగిక వేధింపుల బారినపడి నిస్సహాయంగా కుములుతున్నారు. ఇండియాలో అనేక మంది బాలలపై వివిధ రకాల నేరాలు, ఘోరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. అన్నివిధాలా ఒత్తిళ్లకు లోనైన స్థితిలో, కొందరు దిక్కుతోచక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరికొంతమంది ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. ఇంటాబయటా మానసిక చిత్రహింసలు బాల్యాన్ని కసితీరా ఛిద్రం చేస్తున్నాయి. అపహరణ, మానవ రవాణా, వెట్టిచాకిరి, నడిరోడ్డుమీద యాచన చేయించడం, దానికి 'అనువు'గా అంగవైకల్యం కలిగించడం... నిష్కృతి లేని పాపాలే ఇవన్నీ! వీటన్నింటి నడుమ చిన్నారుల హృదయ విదారక రోదన- ప్రభుత్వాలకు మూకుమ్మడి సవాలు విసరుతోంది.

అడుగడుగునా వంచన

ఇల్లు, బడి, వసతిగృహం, ఆటస్థలం- ఒక్కటి కాదు, ప్రతిచోటా బాలలకు రక్షణ కరవవుతోంది. అనేక సందర్భాల్లో దగ్గర సంబంధీకులే మానవ తోడేళ్లుగా మారి పసివారి ఉసురుపోసుకుంటున్నారు. అమ్మ లేక, నాన్నకు ఇల్లూ వాకిలీ పట్టక, హైదరాబాద్‌లో అనాథగా మారిందో అమ్మాయి. ఆదరించి చేరదీశాడని సమీపంలోని ఒక పెద్దాయనను నమ్మింది. దాని పర్యవసానమేమిటో- తనలో ఊపిరిపోసుకున్న బిడ్డకు స్నానాల గదిలో జన్మనిచ్చాకే తెలిసిందామెకు! మానవతను నిట్టనిలువునా పాతరేస్తే ఎలా ఉంటుందో, రెండేళ్లనాటి మరో ఉదంతంతో ప్రస్ఫుటమైంది. తండ్రే తన ఇద్దరు కూతుళ్లతోనూ నరరూప మృగంలా ప్రవర్తించి, వారిలో ఒకరి గర్భానికి కారకుడయ్యాడు. అదే తరహాలో, నిరుడు ఓ కన్నతల్లే ప్రియుడి మోజులో కూరుకుపోయి, నాలుగేళ్ల తన కూతుర్ని మండే పెనంమీద బలవంతంగా కూర్చోబెట్టింది. ఆ పసిబిడ్డ చర్మమంతా ఎర్రగా కాలి, కమిలి, ఎక్కడికక్కడ అది ఊడి వస్తుంటే- ఇరుగుపొరుగుల కళ్ల నుంచి నీళ్లు ఉబికాయే కానీ, తల్లిలో చలనమే లేదు. కుటుంబ ఘర్షణలతో పాటు ఆస్తుల వివాదాలు, వ్యాపార తగాదాలు పిల్లలపై అకృత్యాలకు మూలకారణాలవుతున్నాయి. వారు అంగట్లో సరకులుగా మారుతున్నారు. బానిసలుగా, బిచ్చగాళ్లుగా, మాఫియాల చేతుల్లో లైంగిక దురాగతాల పావులుగా మగ్గుతూ కుంగి కృశించిపోతున్నారు. నేరగాళ్ల పనిపట్టాల్సిన పోలీసులే వంతపాడటం, తామే ఆ అవతారమెత్తడం మరో దారుణం. దాదాపు మూడు దశాబ్దాల క్రితం హరియాణాలో చోటుచేసుకున్న దుష్కృత్యాన్ని తలచుకుంటే ఒళ్లంతా ఒక్కసారిగా గగుర్పొడుస్తుంది. పద్నాలుగేళ్ల వయసులో ఒక పోలీసు అధికారి దుశ్చేష్టకు బలయ్యానని ఓ క్రీడాకారిణి వెల్లడించింది. రెచ్చిపోయిన అతడి వర్గీయులు విరుచుకుపడి రాళ్లు రువ్వారు. ఆమె సోదరిపై డజను కేసుల్ని పనిగట్టుకొని బనాయించారు. నిరంతర హింస, నిరవధిక వేధింపుల్ని తట్టుకోలేక చివరికి చేతులారా ప్రాణం తీసుకుందా అభాగిని! అలా నేరాలన్నింటికీ కారకుడైన ఆ పోలీసుశాఖ అధికారికి పడిన శిక్ష కేవలం ఆరునెలలు, విధించిన జరిమానా వెయ్యి రూపాయలు!



కఠిన శిక్షలతోనే ముకుతాడు

దేశమంతటా బాలలపై కొనసాగిన లైంగిక దాడులు, ఇతర నేరాలు 2014లో 79,758గా నమోదయ్యాయి. తదుపరి రెండేళ్లకే వాటి సంఖ్య 1.2 లక్షలకు ఎగబాకింది. ఆయా కేసుల్లో ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. అదే జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ 16, ఆంధ్రప్రదేశ్ 17వ స్థానాల్లో నిలిచాయి. జాతీయ నేరగణాంకాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) వివరాల్ని బట్టి- అంతర్జాలాన్ని అడ్డం పెట్టుకొని పిల్లలపై సాగిస్తున్న హింస, వేధింపులు అధికమయ్యాయి. 'ఆన్‌లైన్ ఆటల' పేరిట వారిని అనుచిత భావోద్వేగాల్లో ముంచెత్తి లోబరచుకోవడాన్ని 'సైబర్ బుల్లీయింగ్'గా పరిగణిస్తున్నారు. అమెరికా వంటి దేశాల మాదిరిగా భారత్‌లోనూ ఆయా నేరపరిశోధక ప్రత్యేక పోలీసు విభాగాల్ని పటిష్ఠీకరిస్తేనే గుట్టు రట్టవుతుంది. ఆరేళ్లనాటి సవరణ చట్టం దుమ్ము దులిపి, లొసుగుల్ని తొలగించి, నిబంధనలన్నింటినీ తు.చ. తప్పక అమలుచేస్తే తప్ప పసివాళ్లను కిరాతకుల కోరల నుంచి కాపాడుకోలేం. అనేక రకాల పాశవిక హింసను నిరోధించడానికి ఆస్ట్రేలియాలో గతంలోనే ఏర్పాటైన రాయల్ కమిషన్ ఎన్నో విలువైన సూచనలు పొందుపరచింది. జాతీయస్థాయిలో ప్రత్యేక ప్రణాళిక ఉండాలని, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై బాలలకు విద్యాలయాల్లో శిక్షణనివ్వాలని అది ప్రతిపాదించింది. బాల్యాన్ని కడతేర్చే దుర్మార్గుల పనిపట్టేలా ప్రాంతీయ స్థాయుల్లో భద్రతా విభాగాలు ఏర్పాటు కావాలన్నది ఇంకో ఆలోచన. పిల్లల్ని కొట్టడం శిక్షార్హ నేరమని దిల్లీ ఉన్నత న్యాయస్థానం ఒక కేసు విచారణ సందర్భంగా 16 ఏళ్ల క్రితమే తీర్పిచ్చింది. వేధింపులకు కఠినతర శిక్షలు తప్పవని తొమ్మిదేళ్లనాటి విద్యాహక్కు చట్టంలోని 17వ నిబంధన తేల్చిచెప్పింది. తిట్టినా, కొట్టినా, మరే ఇతర రూపంలోనైనా బాధించినా, వేధించినా, హింసించినా అటువంటి వ్యక్తులు సత్వర శిక్షార్హులని బాలల న్యాయచట్టం స్పష్టీకరించింది. వీటిని మాటలు, రాతలకే పరిమితం చేయకుండా ఆచరణకు తెచ్చినప్పుడే ప్రయోజనం ఉంటుంది.

పీడితులకు భరోసా

జర్మనీ, నార్వే వంటి దేశాల్లో పిల్లల నుంచి ఫిర్యాదు అందితే పోలీసులు తీవ్రంగా స్పందిస్తారు. నేరానికి పాల్పడిన, ఉసిగొల్పిన, కారకులైనవాళ్లను కటకటాల వెనక్కి పంపేదాకా వదలరు. బాలల్ని అపహరించినా, పెద్దమొత్తాలు ముట్టజెప్పకుంటే చంపేస్తామని తల్లిదండ్రుల్ని బెదిరించి భయోత్పాతం సృష్టించినా నెదర్లాండ్స్‌లో చట్టాలు ఊరుకోవు. నేరగాళ్లకు అవి పట్టపగలే చుక్కలు చూపిస్తాయి. పాకిస్థాన్‌లో ఏడేళ్ల బాలికను అపహరించి, లైంగికంగా హింసించి, కర్కశంగా చంపి, మృతదేహాన్ని చెత్తకుండీలోకి విసిరేశాడో కర్కోటకుడు! అతగాడిని పట్టి, కారాగారంలోకి నెట్టి, తక్షణ విచారణ చేపట్టి, మరణదండన విధిస్తూ నాలుగురోజుల్లోనే తీర్పు ప్రకటించారు. లైంగిక అఘాయిత్యాలకు గురైన బాలికలకు త్వరితంగా న్యాయసహాయం అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. ఇకముందు భాగ్యనగరంలోనూ ఓ ప్రత్యేక న్యాయస్థానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. ఇంత విస్తృత స్థాయిలో బాలల కోర్టు ఏర్పాటు కావడం మనదేశంలో ఇదే తొలిసారి. బాధితులైన పిల్లలకు, వారి కుటుంబాలకు ఆత్మస్థైర్యమిచ్చే ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా- హైదరాబాద్‌లో పదినెలల కిందట 'భరోసా' కేంద్రం నెలకొల్పారు. ఆ సమీపంలోనే బాలల కేసుల విచారణకు ఏర్పాటైన 'స్పెషల్ కోర్టు'ను సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా పర్యవేక్షణలో ప్రారంభించనున్నారు. హింస, వేధింపుల ఫలితంగా తల్లడిల్లిపోయే చిన్నారులు కోర్టుకు బదులు భిన్నమైన వాతావరణంలో ఉండటం వల్ల మానసికంగా కొంత కుదుటపడతారు. విచారణ సమయంలో నిజాలు నిర్భయంగా వెల్లడిస్తారు. పసిజీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తున్న లైంగిక హింసకు అడ్డుకట్ట పడేలా కేంద్రప్రభుత్వం 'పోక్సో'(పీఓసీఎస్ఓ) చట్టం తెచ్చింది. దానికి అనుగుణంగా ఫిర్యాదు చేసేలా 'పోక్సో ఈ-బాక్స్'ను కేంద్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం రూపొందించింది. ఉన్న నిబంధనల్ని పకడ్బందీగా అమలుపరచి, అంతర్జాతీయ అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చి సరైన రక్షణ కల్పిస్తేనే- మానవ మృగాల బారి నుంచి బాలలు తప్పించుకోగలుగుతారు!

– శరత్

యాదాద్రి కల్యాణం

మానవ కల్యాణాలు కుటుంబాలకే పరిమితాలు. దేవతల కల్యాణాలు జగత్కల్యాణ కారకాలు. మహావిష్ణువు దివ్యావతారాల్లో నృసింహావతారం విలక్షణమైంది. నర శరీరంతో, సింహ ముఖంతో దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు స్తంభం నుంచి ఆవిర్భవించిన మూర్తి నరసింహుడు. తెలంగాణ రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన 'యాదాద్రి'పై అవతరించిన నృసింహస్వామి చరిత్ర పుణ్యప్రదం. ఈ స్వామికి ఏటా జరిగే కల్యాణం విశ్వకల్యాణ కారకం.

పూర్వం విభాండక మహర్షికి ఋష్యశృంగుడు అనే కుమారుడు కలిగాడు. ఆయన కొడుకు యాదమహర్షి అకుంఠిత నృసింహ భక్తుడు. ఆ మహర్షికి నృసింహస్వామిని చూడాలనే కోరిక పుట్టింది. ఒక గుట్టపై కూర్చొని కఠోర తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చి స్వామి ఉగ్రరూపంతో ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు మహర్షి- 'స్వామీ! నీవు ఇంతటి ఉగ్రరూపంలో ఉంటే నాకు భీతి కలుగుతోంది. నన్ను అనుగ్రహించి శాంతమూర్తివై కనిపించు' అని కోరాడు. మహర్షి కోరికను మన్నించిన స్వామి ప్రశాంత రూపంతో ఎదుట నిలిచి, ఏదైనా కోరుకొమ్మన్నాడు. అప్పుడు ఆయన 'ఇదే శాంతస్వరూపంతో ఈ గుట్టపై అర్చామూర్తిగా కొలువై ఉండు' అని ప్రార్థించాడు.

స్వామి అనుగ్రహించి, ఆ గుట్టపైనే లక్ష్మీసమేతుడై ప్రశాంతమూర్తిగా కొలువుతీరాడు. అదే యాదగిరి గుట్టగా, యాదాద్రిగా ప్రసిద్ధమైంది. భక్తుల కొంగుబంగారంగా మారింది. యాదమహర్షికి ఇంకా స్వామిని చూడాలన్న కోరిక తీరలేదు. మళ్లీ తపస్సు ఆచరించాడు. ఆ దృఢ దీక్షకు స్వామి మరెంతో మెచ్చాడు. అయిదు రూపాలతో గుట్టపై కొలువుతీరాడని భక్తులు విశ్వసిస్తారు. ఆ రూపాలే జ్వాల, యోగ, ఆనంద, గండభేరుండ, లక్ష్మీనరసింహ మూర్తులుగా దర్శనమిస్తున్నాయి. అందుకే ఈ క్షేత్రానికి 'పంచ నారసింహ క్షేత్రం' అనే ప్రసిద్ధి కలిగింది. యాదమహర్షి పేరుతో ఇది 'యాదాద్రి'గా పేరుపొందింది.



అంతర్యామి

నృసింహుడి ఉగ్రరూపం దుష్టుల పాలిట సింహస్వప్నం. హిరణ్యకశిపుడి పట్ల ఆ రూపం ఎంతటి తీవ్రత సృష్టించిందో లోకానికి విదితమే. స్వామికి అంతటి ఉగ్రత చెడుపైన మాత్రమే! అంత ఉగ్రరూపమూ ప్రహ్లాదుడి వంటి సజ్జనుణ్ని చూసి ప్రసన్నమైంది. వాత్సల్యంతో లాలించింది. క్షేమాన్ని అందించి పాలించింది. దివ్యత్వం అంటే ఇదే!

చెడుపై ఉగ్రత్వం, సాధుత్వంపై శాంతత్వం దేవతల లక్షణం. మహా అవతార మూర్తి అయిన నృసింహుడి విషయంలో ఇక చెప్పేదేముంది? ఆయన సాధువులకు తండ్రి వంటివాడు. దుష్టులకు శత్రువు వంటివాడు. మానసిక బలహీనత, ఆత్మన్యూనత వల్ల కలిగే భయాల్ని స్వామి రూపుమాపుతాడని, గొప్ప శక్తిని ప్రసాదిస్తాడని పలువురి ప్రగాఢ నమ్మకం. అశాంతిని పోగొడతాడనే దృఢవిశ్వాసం నృసింహుడిపై అపార భక్తిప్రపత్తులకు నెలవవుతోంది. హృదయంలో ఆనందాన్ని పెంపొందించే స్వామినే ప్రజలు కొలుస్తారు. ఆయనే- యాదాద్రి లక్ష్మీనరసింహుడు.

స్వామికి ఏటా యాదాద్రిపై లక్ష్మీదేవితో కల్యాణం జరుగుతుంది. ఉత్సవమూర్తులైన లక్ష్మీనరసింహులకు కల్యాణవేదికపై వేదోక్తంగా, అంగరంగవైభవంగా మహోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ప్రధానార్చకులు, ఆగమశాస్త్ర పండితులు, వేదవిదుల పర్యవేక్షణలో భక్తుల 'గోవింద' నామస్మరణల మధ్య సాగే ఇది విశ్వకల్యాణమే! లక్ష్మీదేవి మెడలో మంగళసూత్రాన్ని అలంకరిస్తూ స్వామి- 'లోకకల్యాణం కోసం దీన్ని ధరింపజేస్తున్నాను. నీవు చిరకాలం వర్ధిల్లు' అంటాడు. భగవంతుడి కల్యాణం సమస్త ప్రపంచానికీ క్షేమదాయకం అనే భావన దీనివల్ల తేటతెల్లం అవుతుంది. మానవుల కల్యాణంలో వధువు మెడలో వరుడు తాళి కడుతూ - 'నా జీవన హేతువుగా దీన్ని నీ మెడలో ధరింపజేస్తున్నాను. చిరకాలం వర్ధిల్లు' అంటాడు. దేవతలకు, మానవులకు భేదం ఇదే! దేవతలు సహజంగానే విశ్వక్షేమ కారకులు. ఆత్మానంద స్వభావం వారి సొంతం.

యాదాద్రీశుడైన లక్ష్మీనరసింహుడు అపార కరుణామూర్తి. తలచిన వెంటనే కొలువుతీరే దయాహృదయుడు. భక్తుల కష్టాల్ని తొలగించే మార్గదర్శకుడు. ఆపదల నుంచి రక్షించే ఉదార హృదయుడు. ఆయనకు జరిగే కల్యాణం మానవాళికి ఐహికాముష్మిక ఫలాల్ని అందించే వరం. అందువల్ల యాదాద్రిలో కల్యాణం ప్రపంచ కల్యాణమే!

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

మూత్రపిండాల వ్యాధి కబళించేస్తోంది..!

- కృష్ణా జిల్లా ఎ.కొండూరులో వ్యాధి తీవ్రం
- నిరుపేద రోగుల పరిస్థితి దయనీయం
- వైద్యం కోసం నెలకు రూ.6-7వేలు ఖర్చు
- మందులు కొనలేక అవస్థలు
- క్షేత్రస్థాయిలో సీపీఎం నేతల అధ్యయనం

ఈనాడు – అమరావతి



ఈయన కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలం దీప్లానగర్ తండాకు చెందిన **బరోత్ జమ్లా**. రెండేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం, రవాణా ఖర్చుల కింద నెలకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దంపతులకు రెక్కల కష్టమే ఆధారం. జమ్లాకు ఆరోగ్యం బాగుంటే కూలీకి వెళ్తాడు. లేదంటే ఇంటివద్దనే. భార్య కూలీకి వెళ్తోంది. మందులు కొనుక్కునేందుకు డబ్బులు లేక నెలలో వాడాల్సిన మందులను రెండు, మూడు నెలలు వాడుతున్నాడు. డబ్బు లుంటే మందులు కొనుక్కోవడం, లేదంటే నొప్పిని భరించాల్సిందేనని జమ్లా కన్నీటిపర్యంతమయ్యాడు.



దీప్లానగర్ తండాకు చెందిన **బారోత్‌తైనా** ఐదేళ్లుగా వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం తనకున్న పొలాన్ని అమ్మేసుకున్నాడు. వైద్యులు డయాలసిస్ చేసుకోవాలని సూచించినప్పటికీ భయంతో మందులనే వాడుతున్నాడు. ఈయనకు ఐదుగురు ఆడపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్లయింది. మిగిలిన నలుగురు, భార్య కూలీకి వెళ్లి తెచ్చిన డబ్బులతోనే వైద్యం చేయించుకుంటున్నాడు. భార్యకు మూత్రపిండాల వ్యాధి ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో ఇద్దరికి కలిపి మందులను కొనుగోలు చేయలేక తన మందుల్లో నుంచే పంచుకుంటున్నారు. ఇలాంటి దయనీయ స్థితులు ఎ.కొండూరులోని దాదాపు 19 తండాలు, కాలనీల్లో నెలకొంది.

కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలోని 19 తండాలు, కాలనీల్లో మూత్రపిండాల వ్యాధి తీవ్రంగా ఉంది. ఇటీవల దీప్లానగర్ తండాలో ఓ సంస్థ 59మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తే వీరిలో 27మందికి క్రియాటినిన్ పరిమాణం అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణల ఆధ్వర్యంలో బృందం శుక్రవారం తండాలో పర్యటించినప్పుడు కూడా దయనీయ పరిస్థితులు కళ్లకుకట్టాయి. నీటిలో ఫ్లోరైడ్ వల్ల కీళ్లనొప్పులు రావడం, వాటికి నొప్పిమందులను వాడడం, ఎండలో పని చేస్తున్నప్పుడు నీరు తగిన మోతాదులో తీసుకోకపోవడంలాంటి కారణాలు కూడా వ్యాధి తీవ్రతకు కారణమవుతున్నాయి. మంచినీటి కోసం ఏర్పాటుచేసిన కొన్ని ఆర్వో ప్లాంట్లలో ఫ్లోరైడ్ 2.4శాతానికి పైగానే ఉన్నట్లు గ్రామీణ నీటిసరఫరా విభాగం తనిఖీలో వెల్లడైంది. ఇప్పటికే వైద్యం పొందుతున్న వ్యాధిగ్రస్తుల పరిస్థితి దయనీయం. వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాధి ముదిరేవరకు బాధితులు గుర్తించలేకపోతున్నారు. ఆ తరువాత వైద్యం కోసం పొలాన్ని అమ్ముకోవడంతో పాటు కూలీ డబ్బులను వెచ్చిస్తున్నారు.

ఇదీ దుస్థితి..!

ఎ.కొండూరు మండలంలో వ్యాధిగ్రస్తులు	సుమారు 500
మూత్రపిండాల వ్యాధితో ఇటీవల మృతిచెందిన వారు	25 మంది
ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నవారు	50 మంది
రోగుల వయస్సు	20 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు

డయాలసిస్ అంటే భయం..

దీప్లానగర్ తండాలో ఇటీవల భూక్యా రూప్లా, సక్రీ అనేవారు డయాలసిస్ చేయించుకోవడం వల్లే మృతి చెందారనే ప్రచారంతో ఇక్కడి రోగులు వెనుకంజ వేస్తున్నారు. రేపూడి తండాకు చెందిన వర్తియా కృష్ణ(40)కు ఐదెకరాల పొలం ఉంది. ఇందులో రెండెకరాలను రూ.8లక్షల చొప్పున అమ్మేసి వైద్యం కోసం వెచ్చిస్తున్నాడు. తండా నుంచి విజయవాడకు వారంలో రెండు, మూడు రోజులు డయాలసిస్‌కు వచ్చేందుకు పాతకారును కొనుక్కున్నాడు. కుమారుడి చదువు మాన్పించి కారు డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. ఎన్టీఆర్ ఆరోగ్యసేవలో డయాలసిస్‌కు రూ.వెయ్యి మాత్రమే ఇస్తుండడంతో మందులు, ఇతర ఖర్చులను బాధితులే భరించాల్సి వస్తోంది.

కృష్ణాలో మరో ఉద్దానం

ఎ.కోడూరులో ఉద్దానంలాంటి పరిస్థితులున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు తెలిపారు. మూత్రపిండాల సమస్యపై బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డయాలసిస్, మందులు, రవాణాఛార్జీల కింద వైద్యం కోసం ఈ ఒక్క మండలానికి చెందినవారే ఏడాదికి రూ.5కోట్ల వరకు వెచ్చిస్తున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం రూ.2,500 పింఛను ఇవ్వడం లేదన్నారు. ఒకే ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధి ఎందుకు ఇంత తీవ్రంగా ఉందనే అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకు అధ్యయనం చేయించలేదని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని సొంత జిల్లాలో ఈ పరిస్థితి దారుణమన్నారు. వ్యాధి పీడిత ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించాలని, ట్యాంకర్ల ద్వారానైనా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి రోగులకు మందులు అందించాలని డిమాండ్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు



జ్యోతి వెలిగిస్తున్న శ్రీశ్రీరవిశంకర్ గురూజీ

అన్నింటా మహిళాస్వామ్యమే

- శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ ప్రశంస

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఆధ్యాత్మికత, అభివృద్ధి అంశాలకు లింగభేదం ఉండదని ఆర్ట్ ఆఫ్ లివింగ్ (జీవనకళ) వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవి శంకర్ గురూజీ పేర్కొన్నారు. 'జీవితం ఒక నిగూఢ పయనం' అంశంపై ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఎనిమిదో అంతర్జాతీయ మహిళా సమావేశాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక రంగం, రాజకీయాలు, సంగీతం, వైద్యం, సమాజసేవ, కళలు, వినోదం.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా మహిళలు ముందంజలో ఉన్నారని ఆయన ప్రస్తుతించారు. ఆయా రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళలకు 'విశాలాక్షి' పేరిట పురస్కారాలను అందించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత, పారిశుద్ధ్యం, అక్షరాస్యత తదితర అంశాలకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో 60 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతర్జాలంలో ఈ సమావేశాలను లక్ష మందికిపైగా వీక్షించారని ఆశ్రమవాసులు తెలిపారు.

ఏఎన్‌యూలో నియామకాలపై స్టే

- ఫలితాలు సీల్డుకవర్‌లో ఉంచాలని హైకోర్టు ఆదేశం

ఈనాడు, గుంటూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య, సహాయ ఆచార్యుల పోస్టుల నియామకాల ప్రక్రియను పూర్తిచేసి ఫలితాలను సీల్డు కవర్‌లో ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. కంప్యూటర్ సైన్స్ ఆచార్యుని పోస్టు కోసం శనివారం జరగాల్సిన ఇంటర్వ్యూను నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. వర్సిటీలో ఏడు ఆచార్య పోస్టులు, 9 బ్యాక్‌లాగ్ సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ఈ నెల 22 నుంచి ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఎంపికైన వారికి ఈ నెల 26న పాలకమండలి సమావేశంలో నియామకపత్రాలు అందజేయటానికి రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో ఉమ్మడి హైకోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ పోస్టుల నోటిఫై దగ్గరి నుంచి రోస్టర్ నిర్ధారణ వరకూ సవ్యంగా జరగలేదని ఫిర్యాదులు వచ్చాయి. కొందరు తమకు అనుకూలంగా లాబీయింగ్ చేసుకుని లేని పోస్టులను సృష్టించారని వర్సిటీకి చెందిన కొందరు అధ్యాపకులు ఇంతకు ముందే ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్‌ను కలిసి అభ్యంతరం తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు రూ.4వేలకోట్లు కేటాయించాలి

ఈనాడు, అమరావతి: బడ్జెట్లో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు రూ.4వేల కోట్లను కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈమేరకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ మొత్తాన్ని అగ్రిగోల్డ్ ఆస్తులను ఎసెల్ గ్రూపు టేకోవర్ చేసిన అనంతరం ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరారు. తమ విజ్ఞప్తిపై స్పందించి ఎస్సెల్ గ్రూపు ఛైర్మన్‌తో మాట్లాడామని, కాస్త ఆలస్యమైనా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారన్నారు. విద్యుత్తు ఒప్పంద కార్మికులను ఆదుకోవాలని సీఎంను కోరినట్లు చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే భాజపా రాష్ట్రంలో తుడుచుకుపెట్టుకుపోతుందని విమర్శించారు. విభజన హామీల అమలుకు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తామన్నారు.

కర్ణాటక విధానసభలో 'లగడపాటి' రుణ ప్రస్తావన

ఈనాడు–బెంగళూరు: కర్ణాటక విధానసభలో బ్యాంకులకు రుణ ఎగవేతపై చర్చ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ పేరు ప్రస్తావనకు వచ్చింది. 2018-19 బడ్జెట్ ప్రతిపాదనల గురించి దిగువసభలో జరిగిన చర్చకు శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బదులిచ్చారు. శాసనసభ్యుడు కాత్సంద్ర రాజణ్ణ జోక్యం చేసుకుని 'నిరర్థక ఆస్తుల వల్ల కలిగిన నష్టాల నుంచి జాతీయ బ్యాంకుల్ని రక్షించేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం రూ.2.11 లక్ష కోట్ల నిధుల్ని బ్యాంకులకు వితరణ చేసింది. ఈ మొత్తంలో నీరవ్ మోది రూ.11 వేల కోట్లు దోచుకుని పారిపోయాడు. విజయ్‌మాల్య ఎగరేసుకుపోయిన రూ.9 వేల కోట్ల రుణ బకాయిలు ఇందులోనిదే. రైతుల రుణాల్ని రద్దు చేయమంటే దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని కేంద్రం ఆందోళన చెందుతోంది' అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై భాజపా సభ్యులు సి.టి.రవి, విశ్వేశ్వర హెగ్డే కాగేరి, విపక్ష నేత జగదీశ్ శెట్టర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ హయాంలోనే వారికి రుణాలు ఇచ్చారని, వారు చేసిన తప్పునకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యుల్ని చేయటం తగదని విరుచుకుపడ్డారు. సి.టి.రవి జోక్యం చేసుకొని.. 'మూడు, నాలుగు బ్యాంకులకు రూ.46 వేల కోట్లు ఎగవేసిన ల్యాంకో అధిపతి లగడపాటి రాజగోపాల్‌కు రుణాలు ఇచ్చింది ఎవ్వరు? బ్యాంకులకు కలిగిన నష్టాలకు బాధ్యులు ఎవ్వరు? మీరు కారా?' అని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు.

25 నుంచి సూర్యలంకలో జాతీయ బీచ్ కబడ్డీ పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: సూర్యలంక ప్రతిష్ఠ పెంచేలా 'ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పదో జాతీయ స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీల'ను ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వేగేశ్న ఫౌండేషన్ అధ్యక్షుడు, తెదేపా నేత వి.నరేంద్రవర్మరాజు తెలిపారు. గుంటూరు జిల్లా బాపట్లలో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో తమ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచే పురుషులు, మహిళల జట్లకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. సూర్యలంకలో ఈ నెల 25న పోటీలను ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 28న తుదిపోరు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పోలీసు వ్యవస్థపై దాడి

వైకాపా ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన ఏపీ ఐపీఎస్ అధికారుల సంఘం

ఈనాడు డిజిటల్, అమరావతి: నిఘా విభాగం అధిపతి ఏబీ వెంకటేశ్వరరావుపై వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఏపీ ఐపీఎస్ అధికారుల సంఘం ఖండించింది. ఇది పోలీసు వ్యవస్థపై దాడి అని పేర్కొంది. ఏబీ వెంకటేశ్వరరావుకు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించింది. ఈ తరహా వ్యాఖ్యలు పోలీసులు స్వేచ్ఛా వాతావరణంలో పనిచేయకుండా నిరోధిస్తాయని తెలిపింది. శుక్రవారం ఏపీ ఐపీఎస్ అధికారుల సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. చట్టానికి లోబడి పోలీసుశాఖ తమ పరిధి మేరకే విధులు నిర్వహిస్తుందని, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంకాదని ఏపీ ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి రాజీవ్‌కుమార్ మీనా ప్రకటనలో తెలిపారు.



విన్యాసం అపురూపం..

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో ఉన్న ఆడ ఏనుగు పద్మావతి తన విన్యాసాల ద్వారా సందర్శకులను అమితంగా ఆకర్షిస్తోంది. జూపార్కులోని శిక్షకుడు నాగరాజు ఏడాదిపాటు దీనికి శిక్షణఇచ్చాడు. ఏనుగు తొండంతో ముందుకాలిని గాలిలోనే పట్టి ఉంచి మరో కాలునూ లేపి.. వెనుక రెండు కాళ్ల ద్వారానే గెంతుతుంది. దీన్ని చూసేందుకు భారీగా సందర్శకులు వస్తున్నారు. – **ఈనాడు, తిరుపతి**

అక్కడ అమ్ముడుపోలేదని ఇక్కడకొచ్చారా?

- 'కాళేశ్వరం' పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- పిటిషన్‌ను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం



ఈనాడు, దిల్లీ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ, అటవీ అనుమతులపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చెన్నై హరిత ట్రైబ్యునల్‌కు వెళ్లకుండా దిల్లీ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేయడం పట్ల ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఒక మార్కెట్‌లో అమ్ముడు కాకపోతే మరో మార్కెట్‌కు రావడం(ఫోరం హంటింగ్)' చేస్తున్నారా అని ప్రశ్నించింది. హయాతుద్దీన్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ నారింగ్టన్ రోహిమన్, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌లో వాదన సరిగాలేదని.. ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయని తెలిపారు. అటు ఎన్జీటీ ఇటు న్యాయస్థానాల్లో పదేపదే పిటిషన్లు వేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలకు సంబంధించి అన్ని అనుమతులు ప్రాజెక్టుకు ఉన్నాయని, పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ వాదనలు వినిపిస్తూ.. ..అనుమతులపై అభ్యంతరాలు వ్యక్తంచేసిన తర్వాతే ప్రభుత్వం వేగంగా వాటిని తెచ్చుకుందని ఆరోపించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని "ప్రాజెక్టు ప్రారంభమైన ఆరు నెలల్లో రావాల్సి ఉన్నప్పటికీ తొమ్మిదేళ్లు గడిచాక ఎందుకు కోర్టుకి వచ్చారు" అని ప్రశ్నించింది. సరైన సమయంలోనే కోర్టుని ఆశ్రయించామన్న పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. కేసు వేసేటప్పుడు చెన్నైలోని ఎన్జీటీని ఆశ్రయించాలి కానీ దిల్లీకి ఎందుకొచ్చారు అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రాజెక్టుకు తెలంగాణతో కాకుండా మహారాష్ట్రతో కూడా సంబంధం ఉందని సంజయ్‌ఉపాధ్యాయ తెలిపారు. చెన్నై ఎన్జీటీలో పర్యావరణ నిపుణులు లేరని, ప్రాజెక్టుకు మహారాష్ట్రతో సంబంధం ఉన్న కారణంగా పుణె బెంచ్‌కు వెళ్లకుండా దిల్లీకి వచ్చామని వివరించారు. కేసు దాఖలు చేయడానికే ఆలస్యం చేశారన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. పిటిషనర్ హైకోర్టులో, ఎన్జీటీలో సుప్రీంకోర్టులో ఇలా కేసులు వేస్తూనే ఉన్నారని.. జరిమానా విధించాలని ముకుల్ రోహత్గి చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం అంగీకరించలేదు.

చిత్ర పరిశ్రమ ఆత్మపరిశీలన చేసుకోవాలి

- నాగిరెడ్డి సినిమాలు సమాజాన్ని జాగృతం చేశాయి
- చెన్నైలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



బి.నాగిరెడ్డి పేరిట స్టాంపును విడుదల చేస్తున్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తమిళనాడు గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్, నాగిరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: నేటి చిత్ర పరిశ్రమ తప్పక ఆత్మపరిశీలన చేసుకోవాల్సి ఉందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దేశ, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సినిమాలు తీయాలని హితవు పలికారు. అలనాటి ప్రముఖ నిర్మాత, విజయా మెడికల్స్ ట్రస్టు వ్యవస్థాపకులు బి.నాగిరెడ్డి స్టాంపు, 'నాగిరెడ్డి- ది లెజెండ్' పుస్తకావిష్కరణ కార్యక్రమం చెన్నైలో జరిగింది. ముఖ్యఅతిథి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. బి.నాగిరెడ్డిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా కొనియాడారు. ఎందరో మహానుభావుల కలయిక, అన్నింటిని మించి మానవత్వం నిండిన వ్యక్తి అని పేర్కొన్నారు. విజయా ప్రొడక్షన్స్, వాహిని స్టూడియోస్ ద్వారా ఉన్నత ప్రమాణాలతో కూడిన సినిమాలు తెరకెక్కించి సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని తెలిపారు. నాగిరెడ్డి రూపుదిద్దిన 'చందమామ' కథల పుస్తకాలు సుమారు 14 భాషల్లో అనువాదమయ్యాయని వివరించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన నాగిరెడ్డి ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారని, ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశానికి పెద్ద బలం కుటుంబ వ్యవస్థేనని, అవన్నీ నాగిరెడ్డి సినిమాల్లో స్పష్టంగా కనిపిస్తాయని వెల్లడించారు. ఆ తర్వాత ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు తమ ఉషా కిరణ్ మూవీస్ బ్యానరుపై తీసిన సినిమాల్లోనూ ఈ వ్యవస్థ కనిపించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్, నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అందరి ముందు బలవంతంగా ముద్దు

- నవీ ముంబయి తుర్భే రైల్వే స్టేషన్‌లో ఘటన
- బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు



నిందితుడు నరేష్ జోషి

ముంబయి, న్యూస్‌టుడే: కుమార్తె వయసున్న యువతిని ఓ ప్రబుద్ధుడు వెంబడించి అందరు చూస్తుండగానే బలవంతంగా ముద్దు పెట్టుకున్న సంఘటన ఇది. బాధితురాలు ఘణ్సోలీకి వెళ్లేందుకు గురువారం ఉదయం 11.30 గంటలకు నవీ ముంబయి తుర్భే రైల్వే స్టేషన్‌లో లోకల్ రైలు కోసం ప్లాట్‌ఫాంపై వేచి ఉండగా.. అప్పటికే ఆమెను వెంబడిస్తూ వచ్చి వెనుక నిల్చున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా సదరు యువతిని ముద్దు పెట్టుకున్నాడు. ఒక్కసారిగా జరిగిన ఘటన నుంచి వెంటనే తేరుకున్న బాధిత యువతి ప్రతిఘటించడంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటన ప్లాట్‌పాంలోని సీసీ కెమెరాలలో నిక్షిప్తమైంది. యువతిని ముద్దు పెట్టుకుంటుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది సీసీటీవీ దృశ్యాలలో గమనించారు. వెంటనే ఓ పోలీస్ అధికారి అప్రమత్తమై సిబ్బందిని ఘటనా స్థలానికి పంపడంతో వారు యువతి నుంచి వివరాలు సేకరించారు. ఆ వివరాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ప్లాట్‌ఫాం నంబర్ 2, 3 సమీపంలోని సబ్‌వేలో ఉన్న నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు, సీసీ కెమెరాలలోని దృశ్యాల ఆధారంగా పోలీసులు నరేష్ జోషి(43)పై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. దీంతో న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల కస్టడీకి ఆదేశించారు.

గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.747 కోట్ల గ్రాంట్ విడుదల

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ.747.37 కోట్ల గ్రాంటు విడుదల చేసింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత కింద వీటిని విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికలో చేసిన తాజా సిఫార్సులకు అనుగుణంగా ఈ నిధులను స్థానిక సంస్థలకు పంపిణీ చేయాలని ఆర్థిక శాఖ నిర్దేశించింది. ఒకవేళ రాష్ట్ర ఆర్థికసంఘం సిఫార్సులు లేకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభాకు 90%, ప్రాంతానికి 10% ప్రాధాన్యం ఇచ్చి నిధులు పంపిణీ చేయాలని పేర్కొంది. కేంద్రం నుంచి నిధులు అందిన 15 రోజుల్లో వీటిని స్థానిక సంస్థలకు బదిలీచేయాలని కేంద్ర ఆర్థికశాఖ రాష్ట్రాన్ని నిర్దేశించింది. నిధుల బదిలీలో ఆలస్యం చేస్తే రిజర్వుబ్యాంకు నిబంధనల ప్రకారం రోజులవారీగా వడ్డీ చెల్లించాలని ఆదేశించింది.

మాఫియా నడిపిస్తుంటే మీరేం చేస్తున్నారు?

- నియంత్రించకుంటే జైలుకు పంపిస్తా..
- గుంటూరు జిల్లా అధికారులపై పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి ఆగ్రహం

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను ఓ మాఫియా నడిపిస్తుంటే రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులను ప్రశ్నించారు. రేషన్ దుకాణాన్ని ఒకరికి కేటాయిస్తే మరొకరు దాన్ని నిర్వహిస్తారని మాఫియా నాయకుడు చెబితే మీరు పాటిస్తారా? చట్టాలు దుర్వినియోగమవుతుంటే చూస్తూ ఊరుకుంటారా? మాఫియాను నియంత్రించని అధికారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తానని ఆయన మండిపడ్డారు. శుక్రవారం జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై జిల్లా అధికారులకు గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ జె.ఆర్.పుష్పరాజ్ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలో 5 మండలాలు, కర్నూలు, విశాఖపట్నం జిల్లాలో ఒక్కో మండలంలో మొత్తం 7 మండలాల్లో 310రేషన్ దుకాణాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తే చాలాచోట్ల లోపాలు, అవినీతి వెలుగు చూసిందన్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న రాజశేఖర్ గుంటూరు జిల్లాలో పౌర సరఫరాలను ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎస్‌వో విస్మరించారన్నారు. రొంపిచర్ల మండలంలో పేదలు వేలి ముద్రలు వేస్తే మాఫియాకు చెందిన వ్యక్తి ఆ నెలకు సంబంధించిన మొత్తం సరుకులు తీసుకెళుతున్నట్లు సర్వేలో తేలిందన్నారు. మండల తహసీల్దారు నాసరయ్య, నరసరావుపేట ఆర్డీవో రవీంద్రను ఉద్దేశించి ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ముఖ్య కార్యదర్శి ప్రశ్నించారు. ఒకరికి దుకాణాన్ని కేటాయిస్తే ఇంకో వ్యక్తి నిర్వహిస్తాడని చెప్పితే మీరు ఆమోదిస్తారా? ఇందుకు సిగ్గుపడాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు పని చేయలేకపోతే అక్కడ నుంచి వెళ్లిపోండని హెచ్చరించారు. ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ వ్యాఖ్యలతో అధికారులు మిన్నకుండిపోయారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకయ్య, నాయకులు పోడియం వద్దకు వచ్చి ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధించాయన్నారు. చివరకు అక్కడున్న అధికారులు, నాయకులు సర్ది చెప్పారు.



సిక్కోలు సంబరాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి కళావెంకట్రావు, చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు

‘సిక్కోలు’లో సంబరాలు

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సిక్కోలు సంబరాలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సవాలను జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి ప్రారంభించారు. మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కిమిడి కళావెంకటరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి తదితరులు హాజరయ్యారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జానపద కళారూపాలు, డప్పు వాయిద్యం, కోలాటం, పులి వేషాలు, తప్పెటగుళ్ల ప్రదర్శనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం ఫ్యూజన్ నృత్యం, వీణా వాయిద్యం, మిమిక్రీ, సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు.

విదేశాల్లో ఎంబీబీఎస్‌కు నీట్ తప్పనిసరిపై ఉత్తర్వు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో ఉత్తీర్ణత సాధించిన వారినే విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఎంబీబీఎస్ చదివేందుకు అనుమతిస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిబంధన 2018, మే నుంచి ప్రవేశాలు పొందేవారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం భారత వైద్య మండలి (ఎంసీఐ) నుంచి ఆవశ్యకత పత్రం పొంది విదేశాల్లో ప్రవేశం పొందినవారికి ఈ నిబంధన వర్తించదని స్పష్టంచేసింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనందసూర్య

ఈనాడు, అమరావతి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య తెలిపారు. తాను ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంలేదని, కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గుంటూరులోని రాష్ట్ర తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవాలయాల్లో పనిచేస్తున్న 1300 మంది అర్చకుల కోసం చంద్రబాబు అర్చక మిత్ర పేరిట పథకం రూపొందించి రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

11 మంది డీఎల్‌పీఓలకు డీపీఓలుగా అవకాశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 11 మంది డివిజినల్ పంచాయతీ అధికారుల(డీఎల్‌పీఓ)కు ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారులు(డీపీఓ)గా నియమించే అర్హుల జాబితాను ప్రభుత్వం శుక్రవారం ఆమోదించింది. వీరిలో పి.బాదుషాఖాన్, బి.సత్యనారాయణ, బి.మోహనరావు, కేఎల్ ప్రభాకరరావు, పి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఎ.మోహనరావు, ఎంవీఎస్ సుబ్రహ్మణ్యం, జేవీకే అపూర్వసుందరి, ఆర్.విక్టర్, జి.రాజ్యలక్ష్మి ఉన్నారు. వీరికి జిల్లాలు కేటాయిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ త్వరలో ఉత్వరులు జారీ చేయనున్నది.

పేదలకు అందని జీవన్‌దాన్

- దాతల అవయవదానంతో ధనికులకే ఎక్కువ లబ్ధి
- ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో చేర్చకపోవడంతో నష్టం

ఈనాడు – అమరావతి

పేద, మధ్యతరగతి వర్గాల రోగులకు అవయవ మార్పిడి పెద్ద ఆర్థిక అడ్డంకిగా తయారైంది. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నేతృత్వంలో ఏర్పడిన ‘జీవన్‌దాన్’ మార్పిడి దిశానిర్దేశం చేస్తుండగా పేదలకు మాత్రం అక్కరకు రావడంలేదు. దాతలు తమ అవయవాలను ఉచితంగానే ఇస్తుండగా వాటిని అవసరాల మేరకు రోగులకు అమర్చడానికి అయ్యే వ్యయం ఎక్కువగా ఉంటోంది. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత మార్పిడి చేయడంలేదు. కేవలం రక్తసంబంధీకుల నుంచి తీసుకుంటేనే ఈ ఉచితం లభిస్తుంది. అనారోగ్యానికి గురైన ఉత్తరాంధ్రకు చెందిన 22 సంవత్సరాల యువకుడికి తెల్లరేషన్‌కార్డు ఉన్నా కిడ్నీ మార్పిడి సాధ్యం కాలేదు. రక్తసంబంధీకులది సరిపడకపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో లేని అంశమైంది. దాతలిచ్చిన దాన్ని అమర్చేందుకు కార్పొరేట్ ఆస్పత్రి వారు అడిగిన రూ.8 లక్షలను చెల్లించే స్థితి లేక అతడు నిస్సహాయ పరిస్థితుల్లో మరణించాడు.

ఇప్పటిదాకా జీవన్‌దాన్‌లో...: ‘జీవన్‌దాన్’ ద్వారా అవయవాల మార్పిడికి వైజాగ్‌లో తొమ్మిది, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 17, నెల్లూరు, తిరుపతి, కర్నూలులలో ఏడు ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతులు పొందాయి. బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించిన 103 మంది నుంచి 305 అవయవాలు సేకరించారు. ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రస్తుతం 468 మంది మూత్రపిండాలు, 16 మంది గుండె, 62 మంది కాలేయం, నలుగురు ఊపిరితిత్తుల కోసం పేర్లను నమోదు చేయించుకున్నారు. [illegible] ప్రైవేట్ ఆస్పత్రుల్లో పేర్ల నమోదు కోసం పదివేల రూపాయలు చెల్లించాల్సిన నిబంధన వల్ల పేద కుటుంబాలు [illegible]. రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు జీజీహెచ్ (కిమ్స్), వైజాగ్ కేజీహెచ్‌లో మూత్రపిండాల మార్పిడికి ‘జీవన్‌దాన్’ గుర్తింపు ఇచ్చినప్పటికీ ఆస్పత్రుల వారు ఆ దిశగా చొరవ చూపడం లేదు. దాంతో ఇప్పటివరకు ఒక పేరు కూడా నమోదవలేదు. [illegible] అవయవాలను దానంచేసే వారిలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని జీవన్‌దాన్ సీఈవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఈ మార్పిడి జరిగితే కార్పొరేట్ ఆస్పత్రుల కంటే తక్కువ మొత్తంతో ఈ ప్రక్రియ జరుగుతుంది.

బ్రెయిన్‌డెడ్ కేసుల గురించి సమాచారం అందిన వెంటనే అవయవాల దానం కోసం ఎదురుచూసే జాబితాలో ఉన్న వారికి వరుస క్రమంలో రక్త పరీక్షల నివేదికలు, ఇతర ఆరోగ్య పరీక్షలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తున్నారు. నిబంధనల ప్రకారమైతే.. ప్రభుత్వాసుపత్రుల్లో పేర్లు నమోదు చేయించుకున్న వారికి తొలిప్రాధాన్యం ఇవ్వాలి. దీనికి ప్రభుత్వాసుపత్రుల్లో సరైన ప్రచారం లేకపోవడం తగిన చొరవ చూపకపోవడంతో రోగులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇది కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేర్ల నమోదు చేయించుకునే వారికి అనుకూలంగా మారింది. బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల అవయవాల దానం పెరిగేందుకు ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి. పక్కనున్న తెలంగాణాలో మాదిరిగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని వర్తించేలా చేయాలని సూచించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు జీవన్‌దాన్ ఛైర్మన్, ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి సీవీ రావు.

తెలంగాణలో ఇలా...: తెలంగాణ రాష్ట్రంలో బ్రెయిన్‌డెడ్ కేసుల ద్వారా అవయవాల దానం జరిగితే ఆరోగ్యశ్రీ కింద అర్హత ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వమే ఆస్పత్రులకు అవసరమైన మొత్తాన్ని చెల్లిస్తోంది. అయితే.. ఉస్మానియా, నిమ్స్‌లో జరిగే అవయవాల మార్పిడికి మాత్రమే ఈ చెల్లింపులు జరుగుతున్నాయి. దీనివల్ల అక్కడ వైద్యులకు ప్రత్యేక గుర్తింపు, పారితోషికం వస్తుంది. ప్రభుత్వాసుపత్రులకు మంచి పేరు కూడా వస్తోంది. అవసరమైన సదుపాయాలు సమకూరుతాయి.

నా వాదనను వినేందుకు అనుమతించండి

ఓటుకు నోటు కేసులో సీజేఐకి మత్తయ్య లేఖ

ఈనాడు, దిల్లీ: ఓటుకు నోటు కేసులో వ్యక్తిగతంగా తన వాదనను వినిపించేందుకు (పార్టీ ఇన్ పర్సన్‌గా) అనుమతించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి లేఖ రాశానని జెరూసలెం మత్తయ్య తెలిపారు. శుక్రవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవాలు వెల్లడించే అవకాశం తనకు ఇవ్వాలని లేఖలో విజ్ఞప్తి చేశానన్నారు. దళిత క్రిస్టియన్ సంఘాల సమాఖ్య కార్యదర్శిగా ఉన్న తనకు తెదేపా, తెరాస, వైకాపా తదితర రాజకీయ పార్టీలతో సత్సంబంధాలున్నట్లు తెలిపారు. ఓటుకు నోటు కేసులో తనకు సంబంధం లేకపోయినా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తనను ఉపయోగించుకోవాలని చూశాయని మత్తయ్య ఆరోపించారు. రెండు ప్రభుత్వాలు కలిసి అన్యాయం చేస్తాయని భావించే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశానని వెల్లడించారు. ఓటుకు నోటు కేసులో తనను సాక్షిగా ఉపయోగించుకొని ఏపీ సీఎం చంద్రబాబును ఇరికించాలని చూశారన్నారు. వారి మాట వినలేదని తెరాస మంత్రి కేటీఆర్, ఆయన గన్‌మెన్‌లు తనను బెదిరించారని, ప్రాణాలు తీస్తామంటూ ఇప్పటికీ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని మత్తయ్య ఆరోపించారు. ఈ నేపథ్యంలో తన ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ సీజేఐకు రాసిన లేఖ సుప్రీంకోర్టులో అందజేశానని మత్తయ్య తెలిపారు. తన విజ్ఞప్తిని మన్నిస్తూ.. ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ కేసులపై సీబీఐ దర్యాప్తునకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు.

ఆనంద నగరాల సదస్సు వర్కింగ్ కమిటీ ఛైర్మన్‌గా నారాయణ

ఈనాడు డిజిటల్, అమరావతి: అమరావతిలో నిర్వహించే ఆనంద నగరాల సదస్సు వర్కింగ్ కమిటీ ఛైర్మన్‌గా పురపాలక శాఖ మంత్రి నారాయణ నియమితులయ్యారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు ఈ సదస్సు జరగనుంది. సదస్సు నిర్వహణకు విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సదస్సు స్టీరింగ్ కమిటీ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు.

వినియోగదారుల పరిరక్షణ మండళ్ల ఏర్పాటు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వినియోగదారుల పరిరక్షణ మండళ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కలెక్టర్లు ఛైర్మన్లు. 10 మంది సభ్యులుండే ఈ మండలి కాలపరిమితి మూడేళ్లు. సభ్యులను కలెక్టర్ నామినేట్ చేస్తారు.

ఎన్టీఆర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన విరమణ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి దీక్షలు చేపట్టిన ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన విరమించారు. ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు, నాయకులు విద్యాసాగర్, ఇక్బాల్, జగదీష్, యూనివర్సిటీ ఉద్యోగుల సంఘ ప్రతినిధులతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ శుక్రవారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. యూనివర్సిటీ నిధుల సంరక్షణకు ప్రత్యేకంగా జీఓ విడుదల చేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సీఆర్‌డీఏ ద్వారా స్థలం కేటాయింపు, యూనివర్సిటీకి కేటాయించే గ్రాంట్‌ను రూ.6 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు పెంచడం, అడ్‌హక్ ఉద్యోగుల జీతాల పెంపుదలపై అంగీకారం కుదిరింది. దీనిపై సంతృప్తి చెందిన ఉద్యోగులు దీక్షలను విరమించి శనివారం నుంచి విధులకు హాజరవుతున్నట్లు ప్రకటించారు.



మంత్రి కామినేనితో ఏపీ ఎన్జీవో నాయకులు, యూనివర్సిటీ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

నూర్పిడి యంత్రం తిరగబడి ఇద్దరు మహిళలు దుర్మరణం

పోలాకి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం వెదుళ్ల వలసలో శుక్రవారం వరి నూర్పిడి యంత్రం తిరగబడడంతో ఇద్దరు మహిళలు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పొలంలో ధాన్యం నూర్పిడి చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కూలీలు యాడ్ల పాపమ్మ, యాడ్ల లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంలో మరో నలుగురు తీవ్రంగా గాయపడడంతో వారిని నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిడ్నీ వ్యాధుల పీడిత చిన్నారుల్లో ఐక్యూ తగ్గుముఖం!

మెల్‌బోర్న్: కిడ్నీ వ్యాధులు చుట్టుముట్టే చిన్నారుల్లో ఐక్యూ తగ్గుతుందని తాజా అధ్యయనంలో తేలింది. కృత్రిమంగా రక్తశుద్ధి చేయించుకునే వారిపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోందని బయటపడింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. 21 ఏళ్ల లోపు వయసున్న 3000 మంది కిడ్నీ వ్యాధుల బాధితులపై ఇదివరకు చేపట్టిన పరిశోధన ఫలితాలను వారు విశ్లేషించారు. దీంతో శారీరక సామర్థ్యంతోపాటూ మేధోశక్తిపైనా కిడ్నీ వ్యాధులు ప్రభావం చూపిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. మిగతా చిన్నారులతో పోల్చినప్పుడు కిడ్నీ బాధితుల్లో సగటున 10.5 పాయింట్లు తేడా ఉంటున్నట్లు బయటపడింది. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న వారిలో ఇది 11.2 పాయింట్లు, కృత్రిమంగా రక్తశుద్ధి చికిత్సను ఆశ్రయించేవారిలో ఇది 16.2 పాయింట్లుగా ఉంటున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపాలు వీరిలో ఎక్కువగా కనిపిస్తున్నట్లు పరిశోధకులు కెర్రీ చెన్ తెలిపారు. గణితం సహా ఇతర పరీక్షల్లో మార్కులు తగ్గిపోవడానికి ఇదే కారణమని ఆయన వివరించారు.

నిషేధిత భూముల జాబితా అందుబాటులోకి తెండి

ఈనాడు, కాకినాడ: భూవివాదాలకు తావులేకుండా నిషేధిత భూముల వివరాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీసీఎల్ కార్యాలయం కలెక్టర్లను కోరింది. వాస్తవంగా దీనికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇప్పటికీ అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో 22ఎ1 (ఎ) నుంచి 22ఎ1 (ఇ) వరకు నిషేధిత భూములకు సంబంధించి అయిదు జాబితాలను శనివారం లోపు అందుబాటులో ఉంచాలని సీసీఎల్ కార్యాలయం కోరింది. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు జిల్లా వెబ్‌సైట్లలో, సంబంధిత ఏజన్సీల వద్ద ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించింది. సాఫ్ట్‌కాపీ, హార్డ్ కాపీలను ఇందుకు అనుగుణంగా సిద్ధంగా ఉంచాలని సూచించింది. అసైన్డ్ భూములు, దేవాలయ భూములు, ల్యాండ్ సీలింగ్‌లో ఉన్నవి రిజిస్ట్రేషన్ కాకుండా, తాకట్టు పెట్టకుండా, లీజులు ఇవ్వకుండా ముందస్తు సమాచారం కింద 22ఎ జాబితాలో చేర్చితే అలాంటి భూములపై క్రయ, విక్రయాలను నిషేధిస్తారు. ప్రస్తుతం ఈ భూముల జాబితాలు ప్రజలకు అందుబాటులో లేవు.



గోదావరి తీరంలో వీరభద్రుడి భక్తుల కోలాహలం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లోని ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి వేషధారిగా ఉన్న విగ్రహం వద్ద మహిళలు నైవేద్యాలు నెత్తిన పెట్టుకుని సంబరాలు జరుపుతున్నట్లుంది కదూ ఈ దృశ్యం. వాస్తవంగా అక్కడి వీరభద్రుడి ఆలయ మహాసంబరాల్లో భాగంగా శుక్రవారం విగ్రహం చెంతనుంచి ఊరేగింపు ప్రారంభమైంది. భక్తులు తలపై వీరభద్రుని ప్రతిమలను ఉంచి వాటికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి నగరంలో ఊరేగింపు చేపట్టిన అనంతరం స్థానికంగా మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఘాట్ వద్ద సందడి నెలకొంది.

– ఈనాడు, రాజమహేంద్రవరం

పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌ను ముట్టడిస్తాం

ఈనాడు అమరావతి: విద్యారంగ సమస్యలపై ఈ నెల 26న ఇబ్రహీంపట్నంలోని పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌ను ముట్టడించనున్నట్లు ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, తెలుగును పరిరక్షించాలని, స్వయం పోషిత స్వతంత్ర్య పాఠశాలల బిల్లును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రెజరీ బిల్లుల చెల్లింపుపై ఆంక్షలా

జీపీఎఫ్ ఖాతాల నుంచి రుణ సదుపాయం పొందేందుకు వీలులేకుండా ‘ఫ్రీజింగ్’ పేరుతో ట్రెజరీ బిల్లులు మంజూరుపై ప్రభుత్వం ఆంక్షలు విధించిందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు..

ఆరోగ్య సేవలకు ప్రపంచ బ్యాంకు సాయం

ప్రపంచబ్యాంకు సహాయంతో రోగులకు మెరుగైన సేవలు అందించనున్నారు. పీహెచ్‌సీలను బలోపేతం, మందుల విక్రయ యంత్రాల ఏర్పాటు, ప్రసూతి సిబ్బందికి శిక్షణలాంటి చర్యలు చేపడతారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆ కరెన్సీ నోట్లను పార్టీకి ఇస్తాం: నారాయణ

పార్టీ చిత్తూరు జిల్లా మహాసభల్లో కరెన్సీ నోట్ల దండను తన వ్యక్తిగత అవసరం కోసం వేయించుకోలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నోట్లను పార్టీకి అందిస్తామని, ఇందుకు సంబంధించిన రసీదును స్థానిక పార్టీకి అందిస్తామని వివరించారు. చిత్తూరు జిల్లా మహాసభల్లో ఆయనకు రూ.20వేలు విలువచేసే కరెన్సీ నోట్ల దండను కార్యకర్తలు వేశారు. దీనిపై విమర్శలు వస్తుండడంతో ఆయన స్పందించారు.

రూ.65 కోట్ల ఒప్పందానికి అనుమతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: గుంటూరు సార్వజనీన ఆసుపత్రిలో ప్రసూతి, చిన్నారుల ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, గుంటూరు బోధనాసుపత్రి పూర్వ విద్యార్థులు- నార్త్ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.65 కోట్లతో నిర్మించే భవనానికి రూ.30 కోట్ల సాయాన్ని అందించనున్నారు.

గడువు తీరినా బాండ్లకు చెల్లింపుల్లేవ్

- గందరగోళంలో బాలికా సంరక్షణ పథకం
- రూ. 470 కోట్ల వరకు ప్రీమియం బకాయి పడిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: బాలికా శిశు సంరక్షణ పథకం (జీసీపీఎస్) గందరగోళంగా తయారైంది.

సుమారు నాలుగున్నర లక్షల మంది బాలికలను అయోమయంలోకి నెడుతోంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతంలో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఆడపిల్ల పుట్టగానే ఈ పథకం కింద నమోదు చేస్తారు. బాలిక పదోతరగతికి వచ్చినపుడు కొంత, ఇంటర్‌లోకొచ్చాక మరికొంత మొత్తం తిరిగిస్తారు. 21ఏళ్ల వయసులో బాండ్‌లకు గడువు ముగుస్తుంది. అప్పుడు పూర్తి మొత్తం చెల్లిస్తారు. అలాంటి బాండ్లలో చాలావాటికి గడువు ముగుస్తోంది. ఈ బాండ్లపై మొత్తాన్ని చెల్లించేందుకు జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ) అంగీకరించట్లేదు. ఇందుకు కారణం ఆయా బాండ్లకు సంబంధించిన ప్రీమియం బకాయిలుండడం. ఇప్పటివరకూ రూ.470 కోట్లు బకాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ బాండ్లపై ఇప్పటిరకూ ప్రభుత్వం సుమారు రూ.500 కోట్ల వరకు ప్రీమియంగా చెల్లించింది. లబ్ధిదారులు మొత్తం 4.30 లక్షల మంది వరకు ఉంటారు. ఏటా ప్రీమియం చెల్లింపుల కోసం రూ.15 కోట్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. బకాయి మొత్తాన్ని వచ్చే నెల ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేటాయించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర ఆర్థిక మంత్రిని కోరింది. ఇంత పెద్ద మొత్తం చెల్లిస్తే.. . లబ్ధిదారులకు తిరిగి వచ్చేదెంత అనేదీ ఆలోచించాలి కదా అని ఆర్థికమంత్రి అన్నట్లు తెలిసింది. దీంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎల్ఐసీ వారితో సంప్రదింపులు ప్రారంభించారు.

ఆలయాలపై ‘చిన్న’చూపు!

- ఆదాయాల్లేని వాటి పరిస్థితి అగమ్యగోచరం
- అర్చకులకు అప్పగించట్లేదు
- నైవేద్యానికీ సాయం లేదు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ గ్రామాన ఉన్న అనేక చిన్న ఆలయాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వీటికి దేవదాయ శాఖ నుంచి అందుతున్న సాయం ఏమీ లేదు. ఆ ఆలయాలను అర్చకులకో, ఆ గ్రామానికో వదిలేసి దేవతార్చన, ధూప-దీప నైవేద్యాలు సక్రమంగా జరిగేలా చేసిన ఏర్పాటూ లేదు. రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాల నిర్వహణను అర్చకులకే అప్పజెప్పాలని ఇప్పటికే ఆదేశాలున్నా అమలు కావడం లేదు. చిన్న ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియమిస్తూ కొందరి రాజకీయ అవసరాలు తీర్చడం తప్ప ప్రభుత్వ స్థాయిలో ఆలయాల నిర్వహణకు చేస్తున్నదేమీ లేదని కొందరు అధికారులే అంగీకరిస్తున్నారు. ఆలయాల్లో ధూప, దీప నైవేద్యం పథకం కింద రూ. ఒకో ఆలయానికి రూ.5000 ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీని కింద అర్చకుడికి రూ.3000 గౌరవ వేతనంగా, మరో రూ.2000 నైవేద్యం, ఇతర ఖర్చులకు అన్న ఉద్దేశంతో ఇస్తున్నారు. కేవలం 1408 ఆలయాలకే ఈ పథకం అమలవుతోంది. మిగిలిన ఆలయాల్లో హుండీ సొమ్ములు, పళ్లెంలో భక్తులు సమర్పించే సొమ్ములు అర్చకేతర సిబ్బంది జీతాల కోసమే వెచ్చిస్తున్నారు తప్ప దైవానికి, దైవిక విధులు నిర్వహించే వారి కోసం వెచ్చించలేకపోతున్నారు. గతంలో ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్థాయిలో ఒక సమావేశం నిర్వహించారు. చిన్న ఆలయాల్లో హుండీలు తీసేయ్యాలని, ఆలయాల ఖర్చులో తొలి పద్దు అర్చకుడి జీతమే కావాలని ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ అవి అమలు కావడం లేదు. అన్ని అంశాలను పరిష్కరించేందుకు గత సంవత్సరం ఫిబ్రవరి 16న 76వ నెంబరు జీవో ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ జీవో తుది నోటిఫికేషన్ ఇస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అర్చక సంఘాలు అంటున్నాయి.

ప్రశాంతంగా లక్ష్యం వైపు సాగండి: రజనీకాంత్

ఈనాడు డిజిటల్, చెన్నై: ఇతరులు రాజకీయంగా ఎంత హడావిడి చేసినా పట్టించుకోకూడదని, అదే సమయంలో ప్రశాంతంగా లక్ష్యం వైపునకు దూసుకెళ్లాలని రజనీకాంత్ తన అభిమానులకు ఉద్బోధించారు. ఆయన రాజకీయాల్లోకి రానున్నానని ప్రకటిస్తూ తన అభిమానులంతా సభ్యులయ్యేందుకు రజనీ ప్రజా ఫోరం (తమిళంలో మక్కల్ మండ్రం) ఏర్పాటు చేశారు. తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. చెన్నై నగరంలోని కోడంబాక్కంలో ఉన్న రాఘవేంద్ర కల్యాణ మండపంలో ఫోరం సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. “ఇటీవల నా స్నేహితుడు కమల్‌హాసన్ పార్టీ ప్రారంభ కార్యక్రమాన్ని చూశా. చాలా బాగా చేశారు. మా ఇద్దరి దారులు వేరైనా ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యం ఒక్కటే. నా అభిమానులకు ఎవరూ రాజకీయ పాఠాలు నేర్పించాల్సిన అవసరం లేదు” అని అన్నారు. కుటుంబ నిర్వహణ సాఫీగా సాగాలంటే యజమాని క్రమశిక్షణ, బాధ్యతగా ఉండాలన్నారు. ఇదే విధానాన్ని మక్కల్ మండ్రం విషయంలో కూడా అనుసరిస్తున్నానని పేర్కొన్నారు.

సంతాన సాఫల్య సంజీవని

వాషింగ్టన్: సంతానలేమితో బాధపడే మహిళలకు శుభవార్త! అండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొత్త విధానాన్ని పరిశోధకులు అభివృద్ధిచేశారు. ఇది పిల్లలు పుట్టే అవకాశాలను పెంచేందుకు తోడ్పడటం విశేషం. నాలుగు పదుల వయసుకు చేరువైతే మహిళలకు సంతానం కలగడం కాస్త కష్టమే. అండాల నాణ్యత తగ్గిపోవడమే దీనికి ప్రధాన కారణం. దీనిపైనే దృష్టికేంద్రీకరిస్తూ అమెరికాలోని ప్రిన్స్‌టన్ వర్సిటీ నిపుణులు తాజా అధ్యయనం చేపట్టారు. మనుషుల జన్యువులకు సమీపంగా ఉండే సీ-ఎలెగన్స్ పురుగులను దీని కోసం ఎంపికచేశారు. వీటి సంతాన సామర్థ్యం కూడా వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతుంది. వయసులో ఉన్నప్పుడు ఇవి ఉత్పత్తిచేసిన అండాలను వయసు పైబడినప్పుడు ఉత్పత్తిచేసిన వాటితో పరిశోధకులు సరిపోల్చారు. దీంతో వయసు పైబడిన అండాల్లో కెథెప్సిన్ బిగా పిలిచే ఓ ప్రోటీన్ స్థాయిలు ఎక్కువగా ఉంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. వీటికి ప్రత్యేక ఔషధాల సాయంతో పరిశోధకులు కళ్లెంవేశారు. దీంతో సంతాన సామర్థ్యం 10 శాతం వరకూ పెరిగింది. మిగతా పురుగులు నాణ్యతలేని అండాలు ఉత్పత్తిచేసే దశకు చేరుకున్నా.. వీటిలో ఇంకా ఆరోగ్యకర అండాలు ఉత్పత్తి అయ్యాయి. ఈ పరిజ్ఞానం సాయంతో మహిళల్లో ఆరోగ్యకర అండాలు విడుదలయ్యే దశను మూడు నుంచి ఆరేళ్లవరకూ పెంచే వీలుందని పరిశోధనకు నేతృత్వం వహించిన కొలీన్ మోర్ఫీ తెలిపారు.

విజేత

మాటల నగిషీ...
సుశీల్ దోశి



ఆకాశం లో మబ్బుల్లేవు గానీ, మైదానం లో మాత్రం పరుగుల వర్షం...

గుండెజబ్బు ఉన్న వారు దయచేసి ఈ కామెంటరీ వినకపోవడం మంచిది. ఎందుకంటే నరాలు తెగే ఉత్కంఠ వారి ఆరోగ్యానికి హాని చేస్తుందని వైద్యులు చెప్పే ఉంటారు....

ఈ తరహా వ్యాఖ్యానం ఒకతరం రేడియో శ్రోతలకు సుపరిచితం!

సాధారణంగా స్కోరు వివరాల చుట్టూ పరిభ్రమించే క్రికెట్ కామెంటరీలో కొంచెం కవిత్వం, మరి కొంచెం చమత్కారం, ఇంకొంచెం ఉత్కంఠ ముప్పేటలా కలగలిస్తే.. అందమైన హిందీలో వినిపిస్తే.. ఆ విన్యాసం పేరు సుశీల్ దోశి.. క్రికెట్ కామెంటరీని చెప్పడంలో ఆయనదో ప్రత్యేక శైలి!

ఇంగ్లిష్ తప్ప ఇతర భాషలేవీ క్రికెట్ ఆటను కళ్ళకు కట్టించలేవన్న ఒకప్పుడు బలంగా పాతుకుపోయిన అభిప్రాయాన్ని బద్దలు చేసిన గళం సుశీల్ దోషి! అది అలరించే హిందీలో, అద్భుతమైన జనరంజక శైలిలో ప్రపంచ వ్యాప్తంగా శ్రోతల్ని రేడియోకు చెవులొగ్గేలా చేసింది.. టీవీల ఎదుట వీక్షకుల్ని కదలకుండా కూర్చోబెట్టింది. క్రికెట్ కామెంటరీ ద్వారా హిందీ భాషకు అందించిన సేవకు గుర్తింపుగా లభించిన పద్మశ్రీ పురస్కారం, ఇండోర్‌లోని హోల్కర్ క్రికెట్ స్టేడియం కామెంటరీ బాక్స్ కు ఆయన పేరు పెట్టడం సుశీల్ దోశి ప్రతిభకు ఉదాహరణలైతే, హిందీలో ఆయన రాసిన ఖేల్ పాత్రికారిత, క్రికెట్ కా మహాభారత్ పుస్తకాలు క్రీడా పాత్రికేయతలో ఆయన అనుభవాలను ప్రతిబింబించే దర్పణాలు.

తెల్ల రంగు వేసుకుని రా..

ఆకాశవాణిలో హిందీలో క్రికెట్ వ్యాఖ్యానాలు ప్రసారం చేయాలంటూ 1968లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఏడాది మధ్యప్రదేశ్ రాజస్థాన్‌ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ ఆటకు హిందీ వ్యాఖ్యాత కోసం అప్పటికప్పుడు ఆకాశవాణి అధికారులు గాలింపు మొదలుపెట్టారు. ఇండోర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి అక్కడే ఇంజినీరింగ్ చదువుకున్న సుశీల్ దోశి ఇంటర్వ్యూకు వెళ్ళారు. అప్పటికి ఆయనకున్న ఏకైక అర్హత క్రికెట్ వ్యాఖ్యానం పై చెప్పలేనంత అభిమానం! హిందీ భాషలో అద్భుతమైన ప్రవేశం. ఆయనను ఇంటర్వ్యూకు పిలిచిన ఆకాశవాణి అధికారులు అప్పుడే ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్న ఆ యువకుణ్ణి చూస్తూనే ఆశ్చర్యపోయారు. వారిలో ఒకరు.. అబ్బాయ్ జుట్టు నల్లగా నిగనిగలాడుతోంది కొంచెం తెల్ల రంగు వేసుకుని రాకూడదూ? అంటూ వ్యంగ్యం ఒలకబోశాడు. వారి దృష్టిలో క్రికెట్ కామెంటరీ చెప్పాలంటే ఆరమగ్గిన అనుభవం అడుగడుగునా కానరావాలి. ఇవేవీ సుశీల్ దోశిలో కనిపించకపోవడంతో అధికారులు ఓ పట్టాన అంగీకరించలేదు. కానీ ఇంటర్వ్యూకు వచ్చిన ఏకైక అభ్యర్థి సుశీల్ దోశి కావడంతో ఆయనను ఎంపిక చేయక తప్పింది కాదు. కామెంటరీ బాక్స్‌లో అడుగుపెడుతూనే ఎదురైన ఓ అనుభవజ్ఞుడైన ఒక వ్యాఖ్యాత చెప్పిన పాఠాలు శ్రద్ధగా విన్న సుశీల్ దోశి మైకు ముందుకొచ్చారు.

ఆల్‌రౌండర్...

డ్రింక్స్ విరామంలో వాణిజ్య ప్రకటనలు రాని రోజులవి. విరామం పూర్తయి, అట మొదలయే వరకు శ్రోతలు మరో స్టేషన్‌కు మార్చేయకుండా కూర్చోబెట్టాలి. ఆట రక్తికడుతున్నప్పుడు సహజంగానే వ్యాఖ్యానం కూడా అదే పోకడలో సాగుతుంది. కానీ ఆట నెమ్మదిగా సాగుతున్నప్పుడో, ఆటలో ఆసక్తి తగ్గుముఖం పడుతున్నప్పుడో శ్రోతల్ని కూర్చోబెట్టాలంటే వ్యాఖ్యాతకు కత్తి మీద సామే! ఆ కష్ట సాధ్యమైన పనిని సులభంగా నిర్వహించే ప్రక్రియను సుశీల్ దోశి కనుగొన్నారు. చిన్న చిన్న మాటలతో, అందమైన పదబంధాలతో, పోలికలతో, ప్రయోగాలతో తనదైన శైలిని సృష్టించుకున్నారు. కంటికి కనిపించకుండా ఎక్కడో జరుగుతున్న ఆటను కళ్లకు కట్టించడం కోసం దోశి సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఆయనలో ఉన్న కథకుడికి పదును పెట్టారు. స్క్వేర్ కట్... ఫోర్ రన్స్ అంటూ పొడిపొడిగా తుంచేయకుండా 'బ్యాట్స్‌మన్ బ్యాక్ ఫుట్ తీసుకున్నాడు... మణికట్టును ఒడుపుగా ఉపయోగించి, బంతిని దారి మళ్లించాడు... ఒక పరుగు పూర్తి చేశాడు, మరో పరుగు అందుకున్నాడు... ఇలా ఉత్కంఠను పండిస్తూ సాగేది ఆయన వ్యాఖ్యానం. హిందీలో సామెతలు పొదుగుతూ, ఛలోక్తులు పండిస్తూ వ్యాఖ్యానాన్ని పండించడం సుశీల్ ప్రత్యేకత. హిందీ వ్యాఖ్యానంలో సమున్నత ప్రమాణాలను సృష్టించి భాషపై అనురక్తిని, ఆసక్తిని పండించిన ప్రతిభావంతుడాయన.

– ఓలేటి శ్రీనివాసభాను

ఆకలి పంచ్





2006 విశాఖ పోర్టు స్టేడియం..

బాక్సింగ్ పోటీలు జోరుగా సాగుతున్నాయి.

బక్క పలచగా ఉన్న ఆ కుర్రాడు అన్న పక్కన వాలుతూ నిల్చొని.. అంత కళ్లేసుకుని బౌట్లు చూస్తున్నాడు. ఆ వయసులో వేరే పిల్లాడు అయితే బోర్ కొట్టి పక్కకి వెళ్లిపోతాడు. లేదా ఇంటికి వెళిపోదాం అని అంటాడు.. కానీ ఇతను మాత్రం చూపు పక్కకు తిప్పట్లేదు. ఒకటే ఏకాగ్రత!.. మెకానిక్ షెడ్డులో చేయడం వల్ల అతని చేతులు నల్ల బారిపోయాయి.. అన్నను చూస్తూ చప్పట్లు కొడుతుంటే అతని ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోంది. పోటీలు అయిపోయాయి..

సాగర్.. ఎవరీ కుర్రాడు? కోచ్ ఆరా తీశాడు...

సార్.. మా తమ్ముడు .. ఏదో సరదాగా వచ్చాడు... బెరుగ్గానే చెప్పాడు సాగర్.

బాక్సింగ్ అంటే ఇష్టమా..

ఆ అబ్బాయి.. అవునన్నట్లు తలూపాడు..

బాబూ... రేపటి నుంచి ప్రాక్టీస్‌కు వస్తావా..? ఆ ప్రశ్నే ఊహించలేదు అన్నదమ్ములిద్దరూ..

షాక్‌లోనే తడబడుతూ.. వస్తా.. సార్! అని నెమ్మదిగా చెప్పాడు ఆ పిల్లాడు. అదే తన జీవితంలో మలుపు అవుతుందని అతను అనుకోలేదు.

కొన్నేళ్లు తిరిగేసరికి.. రెండుసార్లు కింగ్స్ కప్ విజేత.. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం ఇలా పతకాలు పడుతూనే ఉన్నాయి అతని మెడలో.. కష్టాలకు పంచ్ ఇస్తూ వేగంగా ఎదుగుతున్న ఆ యువ బాక్సరే కాకర శ్యామ్‌కుమార్. ఒకవైపు పక్షవాతంలో మంచానపడ్డ నాన్న.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. ఇన్ని కష్టాల మధ్య కూడా ఈ యువ కెరటం అద్భుతంగా రాణిస్తున్నాడు. ఇటీవల రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత హసన్‌బొ దుస్మతోవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించి సత్తా చాటాడు.

నిజానికి శ్యామ్ తాను బాక్సర్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే బాక్సర్‌గా కెరీర్ ఎంచుకుని నాన్న అర్జున్ పడ్డ కష్టాలు చూశారు ఆ ఇంట్లో అందరూ! కానీ రక్తంలోనే ఉందేమో ఆ ఇంట్లో మరో ఇద్దరు ఛాంపియన్లు తయారయ్యారు.. ఒకరు శ్యామ్, మరొకరు అతని అన్న సాగర్. జాతీయ ఛాంపియన్‌గా నిలవాలన్న నాన్న కోరికను బాక్సింగ్ రింగ్‌లోకి దిగిన కొన్నేళ్లకే తీర్చేశారు ఈ ఇద్దరు అన్నదమ్ములు. ముఖ్యంగా శ్యామ్...! తండ్రి మెకానిక్ పనిలో సాయంగా ఉంటూ... ఇంట్లో పనులు చేస్తూ ఉండే శ్యామ్ బాక్సింగ్ రింగ్‌లోకి రావడమే విచిత్రం. ముగ్గురు అన్నదమ్ములు, ఒక అమ్మాయి ఉన్న ఆ పెద్ద ఇంట్లో గడవడమే కష్టంగా ఉండేది. అయితే సన్నగా ఉన్నా.. చాలా ఉత్సాహంగా, దూకుడుగా ఉండే శ్యామ్ కచ్చితంగా బాక్సింగ్‌లో రాణిస్తాడని సాయ్ కోచ్ వెంకటేశ్వరరావు గుర్తించాడు. అతనిలో ఉన్న ఆ దూకుడుని రింగ్‌లో పెడితే కచ్చితంగా మంచి ఫలితాలొస్తాయని చెప్పాడు. కోచ్ మాటే శ్యామ్‌కు వేదం. రింగ్‌లోకి వచ్చిన తర్వాత అతనికి బాక్సింగే లోకం. ఒక్కోసారి అలా ప్రాక్టీస్ చేస్తూ చేస్తూ సమయం కూడా మర్చిపోయేవాడు. ఒకవైపు నాన్నకు మెకానిక్ పనిలో సాయం చేస్తూనే బాక్సింగ్ సాధన చేసేవాడు.

కాకర శ్యామ్ కుమార్

స్వస్థలం: కంచరపాలెం, విశాఖపట్నం

వయసు: 21 ఏళ్లు

వెయిట్ కేటగిరి: 49 కేజీలు

చదువు: ఇంటర్మీడియట్ (సీఈసీ)

ఇష్టమైన ఆటగాడు: అఖిల్ కుమార్, విజేందర్

హాబీలు: బాక్సింగ్ రింగే లోకం.. నృత్యం అన్నా చాలా ఇష్టం. ఆరు అంతర్జాతీయ స్వర్ణాలు, తొమ్మిది సార్లు జాతీయ ఛాంపియన్

మరిచిపోలేని అనుభవం: రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత దుస్మతోవ్‌ను ఓడించడం

స్ఫూర్తి: నాన్న అర్జున్

లక్ష్యం: 2020 టోక్యో ఒలింపిక్స్



ఒలింపిక్సే లక్ష్యంగా..

శ్యామ్ మొదటి లక్ష్యం రాబోయే కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో సత్తా చాటడం. అంతిమ లక్ష్యం ఒలింపిక్స్. ప్రస్తుతం పక్షవాతంతో బాధపడుతున్న నాన్నకు ఆనందాన్ని కలిగించాలని కచ్చితంగా ఈ మెగా ఈవెంట్లలో రాణించాలనే పట్టుదలతో ఉన్నాడు యువ కెరటం. ఒకప్పుడు అంతర్జాతీయంగా పతకాలు గెలిచినా.. అతనికి రావాల్సినంత గుర్తింపు లేదు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు. నాన్నకు అనారోగ్యంతో వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ స్థితిలో 2016లో శ్యామ్‌కు రైల్వేస్‌లో ఉద్యోగం రావడం ఆ కుటుంబానికి ఊరట కలిగించింది.

తిరుగులేని ఆట..

ప్రత్యర్థి ఆటకు తగ్గట్టుగా అప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ఎదురుదాడి చేసే సత్తా. ఎదుటివారి ఆలోచనలను చదివే నైపుణ్యం.. రింగ్‌లో మెరుపు వేగంతో ఇచ్చే కుడి చేతి పంచ్.. అన్నిటికి మించి గొప్ప ఆత్మవిశ్వాసం ఇవే శ్యామ్‌కుమార్ బలాలు. ఇవే అతణ్ని విజేతను చేశాయి. ఆసియా ఛాంపియన్‌షిప్, జాతీయ క్రీడల్లో వెనకబడినా పుంజుకుని గెలవడం శ్యామ్ సత్తాకు నిదర్శనం. ముఖ్యంగా బలమైన టెక్నిక్‌కు మారుపేరైన క్యూబా, కజక్, ఉజ్బెకిస్థాన్ బాక్సర్లను సైతం దీటుగా ఎదుర్కొని అందరి దృష్టిలో పడ్డాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత దుస్మతోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచి స్వర్ణం సాధించి అందర్నీ అబ్బురపరిచాడు. అందుకే 48 కేజీల విభాగంలో అతనిప్పుడు తిరుగులేదు. రాబోయే కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో రాణిస్తాననే నమ్మకం అతనికి బలంగా ఉంది.



నాన్న అర్జున్‌తో..

నాన్న కల కోసం..

శ్యామ్ తండ్రి అర్జున్‌కు మాత్రం తనలా పిల్లలు మధ్యలోనే బాక్సింగ్ వదిలేయకూడదనే పట్టుదల. మరి బాక్సర్‌గా కొనసాగాలంటే దానికి ప్రత్యేక శిక్షణ, ఆహారం కావాలి. ఒకవైపు ఇళ్లు గడిస్తే చాలు అన్న స్థితి. కానీ ఆ తండ్రి మాత్రం శ్యామ్, సాగర్‌లకు ప్రత్యేక ఆహారం కోసం చాలా కష్టపడేవాడు. అప్పులు చేసి మరీ పిల్లలకు అవసరమైనవి కూర్చేవాడు. అతని పట్టుదల వల్లే సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో శ్యామ్ అన్న సాగర్ ఐదుసార్లు జాతీయ ఛాంపియన్ అయ్యాడు. అన్న బాటలోనే శ్యామ్ నడిచాడు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు.. ప్రాక్టీస్... పాఠశాలకు వెళ్లడం.. ఆ తర్వాత సాయంత్రం 5 నుంచి 7 వరకు ప్రాక్టీస్.. ఇదే శ్యామ్ దినచర్య. చిన్న చిన్న టోర్నీల్లో గెలుస్తూ జాతీయ సబ్ జూనియర్ పోటీలకు (2008, అసోం) వెళ్లిన శ్యామ్.. తొలి ప్రయత్నంలోనే పసిడి పట్టాడు. అక్కడ నుంచి అతను వెనుదిరిగి చూడలేదు. ఏ పోటీకి వెళ్లినా పతకం పక్కా. 46 కేజీల కేటగిరిలో నాలుగుసార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. అయితే తనకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఎక్కువకాలం తమ పిల్లలను బాక్సర్లుగా చూడలేమని శ్యామ్ తండ్రి అర్జున్‌కు అర్థమైంది. టోర్నమెంట్లకు వెళ్లడానికి చాలాసార్లు కోచ్ వెంకటేశ్వరరావే ఆర్థిక సాయం చేసేవాడు. సాయ్ హాస్టల్‌లో చేరితే కాస్త తిండికి బాధలు తప్పుతాయని చెప్పి.. శ్యామ్‌ను హాస్టల్‌లో చేర్పించాడాయన. అప్పుడు తిండి గురించి ఆలోచన మానేసి బాక్సింగ్ మీదే దృష్టి పెట్టగలిగాడు శ్యామ్.



"శ్యామ్‌లో నాకు నచ్చే విషయం మొండి ధైర్యం. రింగ్‌లో ప్రత్యర్థి ఎవరైనా కూడా అస్సలు భయపడడు. అతని దూకుడు, వేగం చూసి కచ్చితంగా బాక్సింగ్‌కు పనికొస్తాడని అనుకున్నా. నిజానికి అతని ఆర్థిక స్థితికి ఈ స్థాయికి రావడం చాలా కష్టం. కానీ శ్యామ్ ఎంతో కష్టపడి అంతర్జాతీయ బాక్సర్‌గా ఎదిగాడు. రాబోయే కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకం తేలవాలని కోరుకుంటున్నా"

–వెంకటేశ్వరరావు, కోచ్



"పెద్ద టోర్నీల్లో భారత్‌కు పతకం తేవాలి.. ఇది మా నాన్న కల. ఆయన అభిలాష కోసమే నేను ఇంతగా శ్రమపడుతున్నా. నాకు బాక్సింగ్ అంటే ప్రాణం. అఖిల్ కుమార్ దూకుడు.. విజేందర్ టెక్నిక్ అంటే చాలా ఇష్టం. జాతీయ శిబిరంలో అఖిల్ దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నా. సంధు సార్ చెప్పిన సలహాలైతే అమూల్యం. నాకిప్పుడు అంతిమ లక్ష్యం ఒలింపిక్స్. సమీప లక్ష్యాలు కామన్వెల్త్, ఆసియా క్రీడలు. రింగ్‌లోకి దిగే ముందు ప్రత్యర్థి గట్టివాడా లేదా నాకన్నా బలహీనుడా ఆలోచించను.. ఒకవైపు ప్రణాళిక.. మరోవైపు దూకుడుతో దూసుకెళ్తా. మా నాన్న, కోచ్ వెంకటేశ్వరరావు సార్ ప్రోత్సాహం లేకుంటే ఇక్కడదాకా వచ్చేవాణ్నే కాదు. మెకానిక్‌గా ఉన్న నన్ను అంతర్జాతీయ బాక్సర్‌ను చేశారు. ఎన్ని పతకాలు తెచ్చినా సరైన గుర్తింపు రాలేదు. రియో ఒలింపిక్స్ సమయంలో నేను భారత జట్టులో ఉన్నా.. కానీ అర్హత పోటీలు ఆడే అవకాశం ఇవ్వలేదు. 2022 ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటడమే నా లక్ష్యం"

–శ్యామ్‌కుమార్

–దాస్యం వెంకట వంశీకృష్ణ

13 ఏళ్ల వయసు 64 గళ్ల తపస్సు

మాగ్నస్ కార్ల్‌సన్.. హికారు నకమురు.. ఫాబియానో కరౌనా..! ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేర్లివి! కార్ల్‌సన్ ప్రపంచ చెస్‌ను శాసిస్తోన్న వీరుడు కాగా.. మిగతా ఇద్దరు ర్యాంకింగ్స్‌లో టాప్-10 ఆటగాళ్లు. వీరితో తలపడటమంటే మాటలు కాదు! కానీ మొన్నే టీనేజీలో అడుగుపెట్టిన ఓ భారత కుర్రాడు వాళ్లతో పోటీకి సై అంటూ కలకలం సృష్టిస్తున్నాడు.



పేరు నిహాల్ సరీన్!... ఊరు కేరళ. మేటి ఆటగాళ్లతో కేవలం పోటీపడటమే కాదు ప్రపంచ నంబర్-8 నకమురను పలుమార్లు ఓడించాడు కూడా! నకముర మాత్రమే కాదు.. 13 ఏళ్ల నిహాల్ ముందు తలవంచిన తలపండిన చెస్ క్రీడాకారులు ఎందరో! ప్రత్యక్షంగా ఆ కుర్రాడు వారిని ఢీకొన్న సందర్భాలు తక్కువే. కానీ ఆన్‌లైన్ చెస్‌లో తన ప్రతిభను వారికి ఎన్నోసార్లు రుచి చూపించాడు. విశేషమేంటంటే నిహాల్ సీరియస్‌గా ఏ గురువు దగ్గరా శిక్షణ తీసుకోవట్లేదు. చదరంగంలో తనదైన ముద్ర వేయాలనే లక్ష్యంతో సాగుతున్న అతడికి కంప్యూటరే ప్రపంచం.. అంతర్జాలమే గురువు.

అలా మొదలైంది..

అందరి కుర్రాళ్లలానే చిన్నప్పుడు ఆటలపై నిహాల్ ఎంతో ఉత్సాహం చూపించాడు. స్కేటింగ్‌పై ఆసక్తి ప్రదర్శించినా.. దెబ్బలు తగలడంతో దాన్ని వదిలేశాడు. సరదాగా చెస్ ఆడే తాతయ్య నిహాల్‌కు 64 గళ్ల గురించి పరిచయం చేశాడు. ఏ రోజైతే అతడు ఆట గురించి ఓనమాలు నేర్చాడో గానీ అప్పటి నుంచి చదరంగం పలకే అతడి లోకమైంది. చిన్నప్పటి నుంచి కంప్యూటర్ ముందు కూర్చునే అలవాటున్న నిహాల్ ఆటలో నైపుణ్యం సంపాదించేందుకు ఇంటర్‌నెట్‌ను శోధించాడు. ఆటపై పట్టు సాధించాడు. అతడి ఆసక్తిని గమనించిన తల్లితండ్రులు.. నిహాల్‌ను రాష్ట్ర ఛాంపియన్ అయిన ఓ కోచ్ దగ్గరకు తీసుకెళ్లారు. ఆ కోచ్ తీసుకున్న నిర్ణయం ఆ కుర్రాడి భవితవ్యాన్ని మలుపు తిప్పింది. ఓపెనింగ్స్, డిఫెన్స్, అటాకింగ్ గేమ్ అంటూ ఆటను ఓ క్రమ పద్ధతిలో చెప్పని ఆ కోచ్.. ఆన్‌లైన్‌లో వీలైనన్ని ఎక్కువ గేమ్‌లు ఆడమని ప్రోత్సహించాడు. ఆడుతున్న సమయంలో చేసే తప్పొప్పుల గురించి చర్చించాడంతే..! అలా ఆట నేర్పిన అంతర్జాలమే ఇప్పుడు అతడిని మేటిగా చేసింది.

యువ ప్రపంచంలో నం.1..

అండర్-14 విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు అతడు.. అండర్-18 విభాగంలో అగ్రస్థానానికి అడుగు దూరంలో ఉన్నాడు. ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన భారత రెండో పిన్నవయస్కుడు.. ప్రపంచంలో మూడో పిన్న వయస్కుడు అతడు. అంతేనా.. అండర్-10 ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన ఈ కుర్రోడు.. అండర్-12 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలుచుకున్నాడు. ఆరేళ్ల వయసులో చెస్‌లో ఓనమాలు దిద్దుకున్న నిహాల్ అతికొద్ది కాలంలో లెక్కలేనన్ని ఘనతలు అందుకున్నాడు. 2013లో 1300 ఎలో రేటింగ్ పాయింట్లతో ఉన్న నిహాల్ ఖాతాలో ప్రస్తుతం 2532 పాయింట్లున్నాయి.

ఆటపై పట్టు సాధించేందుకు ఇప్పటికీ అతడు నమ్ముకునేది ఆన్‌లైన్ ప్రపంచాన్నే. చెస్.కామ్ వెబ్‌సైట్‌లో అత్యధికంగా గేమ్‌లు ఆడుతున్న వారిలో ప్రస్తుతం అతడిదే అగ్రస్థానం. నాలుగేళ్ల కాలంలో 11 వేలకు పైగా గేమ్‌లు ఆడి.. మొత్తంమీద ఆ వెబ్‌సైట్‌లో అత్యధిక గేమ్‌లు ఆడిన రెండో ఆటగాడిగా రికార్డులకెక్కాడు. విశేషం ఏంటంటే నాలుగేళ్ల వ్యవధిలోనే అతడు ఈ ఘనత అందుకున్నాడు. అగ్రస్థానంలో ఉన్న ఆటగాడు ఎనిమిదేళ్లుగా ఆడుతున్నాడు. 23 ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ శ్రీనాథ్ నారాయణన్, ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ దిమిత్రి కొమరోవ్‌ల సలహాలు నిహాల్ కెరీర్‌కు తోడ్పాటును అందిస్తున్నాయి. వారు చెప్పే సలహాలు, సూచనలను వెంటనే ఆన్‌లైన్ గేమ్స్‌లో అమలు చేసేందుకు సిద్ధమైపోతాడు. గ్రాండ్‌మాస్టర్ హోదాకు చేరువగా ఉన్న నిహాల్ భవిష్యత్‌లో మరెన్ని సంచలనాలు సృష్టిస్తాడో చూడాలి.

ఒంటి చేతి వీరుడు



హెల్మెట్ పెట్టుకుని.. ఒంటి నిండా రక్షణ కవచాలు ధరించినా.. బంతి ఏ మూల వచ్చి తాకుతుందోనన్న భయం ఈ తరం క్రికెటర్లది. అలాంటిది హెల్మెట్ లేకుండా.. ఒకవైపు చేతికి గాయమై.. నిఖార్సైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొంటూ ఒంటి చేత్తో బ్యాటింగ్ చేస్తే..? అలా ఎవరు చేస్తారు అనేయకండి! వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ మల్కం మార్షల్ ఈ సాహసం చేశాడు. 1984 ఇంగ్లాండ్-వెస్టిండీస్ నాలుగో టెస్టులో జరిగిందీ సంఘటన. హెడింగ్లీలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది. విండీస్ ఒక దశలో 201/4తో మెరుగైన స్థితిలో ఉంది. అయితే ఇంగ్లాండ్ బౌలర్లు విజృంభించడంతో ఆ జట్టు 206 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. గోమ్స్ (104 నాటౌట్)కు మద్దతుగా నిలిచే వాళ్లే కరవయ్యారు. గాయపడిన మాల్కం మార్షల్ క్రీజులోకి రావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. పాల్ అలాట్ వేసిన బంతిని ఒంటి చేత్తో ధైర్యంగా ఎదుర్కొంటూ అతను ఫోర్ కొట్టడంతో స్టేడియం హోరెత్తింది. ఆ తర్వాత మార్షల్ ఔటైనా.. అతని స్ఫూర్తికి, సాహసానికి అభిమానులు నిలబడి చప్పట్లతో అభినందించారు. ఆ తర్వాత ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మార్షల్ (7/53) బౌలింగ్‌లోనూ విజృంభించి విండీస్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

ఈనాడు సినిమా

'పిజ్జా' దర్శకుడితో...


రజనీకాంత్

రజనీకాంత్ కోరుకుంటే... అగ్ర దర్శకులంతా ఆయన ఇంటి ముందు క్యూ కడతారు. సినిమాలు తీయడానికి పోటీ పడతారు. కానీ రజనీ ఆలోచనలు మారాయి. ఆయన యువ దర్శకులతో సినిమాలు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. 'కబాలి', 'కాలా' రెండూ పా.రంజిత్‌తో పనిచేసిన చిత్రాలే. ఇప్పుడు మరో కుర్ర దర్శకుడికి ఛాన్స్ ఇచ్చారు. తనే... కార్తీక్ సుబ్బరాజు. తమిళనాట 'పిజ్జా'ని రూపొందించి అందరి దృష్టినీ ఆకర్షించారాయన. రెండో చిత్రం 'జిగడ్తాండ' కూడా విమర్శకుల్ని మెప్పించింది. తను రజనీ కోసం ఓ కథ సిద్ధం చేశాడు. అది తలైవాకి నచ్చింది. 'కాలా' తరవాత సెట్స్‌పైకి వెళ్లే చిత్రం ఇదే కావొచ్చు. రజనీ 'కాలా' ఏప్రిల్ 27న విడుదల కానుంది. ఆ తరవాత '2.ఓ' వస్తుంది. ఈలోగా కార్తీక్ సినిమా మొదలయ్యే అవకాశాలున్నాయి.

లక్షణమైన అబ్బాయ్


కల్యాణ్‌రామ్, కాజల్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఎమ్.ఎల్.ఎ'. మంచి లక్షణాలున్న అబ్బాయ్... అనేది ఉపశీర్షిక. కాజల్ కథానాయిక. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహిస్తున్నారు. కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. "ఇంటిల్లి పాదినీ అలరించే చిత్రమిది. 'పటాస్' తరహాలో ఆద్యంతం వినోదాన్ని పంచుతుంది. పేరుకు తగ్గట్టుగానే కల్యాణ్‌రామ్ తెరపై లక్షణంగా కనిపిస్తాడ"ని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ళ, సంగీతం: మణిశర్మ.

ద్వేషించి.. ప్రేమిస్తే



శ్వేత, అనురాగ్‌పై క్లాప్‌నిస్తున్న దర్శకుడు బి. గోపాల్

అనురాగ్, శ్వేత నటిస్తున్న చిత్రం 'ఈ క్షణమే'. సాయిదేవ రామన్ దర్శకుడు. పి.లక్ష్మణాచారి నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ క్లాపిచ్చారు. న్యాయమూర్తి రామారావు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "కాలేజీ నేపథ్యంలో నడిచే ప్రేమకథ. అబ్బాయిని ద్వేషించిన అమ్మాయి, మళ్లీ ఆ అబ్బాయినే ప్రేమిస్తుంది. ద్వేషం ప్రేమగా ఎలా మారిందన్నది ఆసక్తికరం. పాటలు కథానుగుణంగానే వస్తాయ"ని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "మార్చి రెండో వారం నుంచి ఏకధాటిగా కొనసాగించి, ఒకే ఒక్క షెడ్యూల్‌తో సినిమాని పూర్తిచేస్తామ"న్నారు. ఈ చిత్రానికి మాటలు: హేమంత్ కార్తీక్

పంచ్ డైలాగ్

అద్భుతం జరిగేటప్పుడు ఎవరూ గుర్తించరు. జరిగాక గుర్తించాల్సిన అవసరం లేదు.

చిత్రం: ఖలేజా
- పంపినవారు: టి. శ్రీనివాసులు, శ్రీకాళహస్తి


విజయ్ దేవరకొండ

దూసుకొస్తున్న టాక్సీ

'పెళ్లి చూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో ఆకట్టుకున్నాడు విజయ్ దేవరకొండ. తను ఇప్పుడు 'టాక్సీవాలా'గా మారాడు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా జీఏ 2, యూవీ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్.కె.ఎన్ నిర్మాత. ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ కథానాయికలు. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. ఈ చిత్రానికి 'టాక్సీవాలా' అనే పేరు నిర్ణయించారు. మే 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "అన్ని వర్గాల్నీ ఆకట్టుకునే కథ ఇది. కథానుసారమే టైటిల్ నిర్ణయించాం. విజయ్ నటన, డైలాగులు ఆశ్చర్యపరుస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ప్రచార చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. జేక్స్ బిజాయ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సుజిత్ సారంగ్, కథనం - మాటలు: సాయి కుమార్ రెడ్డి, పాటలు: కృష్ణకాంత్.


అనుపమ పరమేశ్వరన్

తప్పొప్పులు ఆలోచించలేదు!

"మనసు నిండా సినిమాపై ఇష్టాన్ని నింపుకొని కెమెరా ముందుకొచ్చా. ఆ ఇష్టమే అన్నీ నేర్పించింద"ని చెబుతోంది అనుపమ పరమేశ్వరన్. మలయాళ భామ అయినప్పటికీ, తెలుగుదనం ఉట్టిపడే అందం ఆమెది. తెలుగు కూడా గడగడా మాట్లాడేస్తోంది. కొత్త భాష... కొత్త మనుషులు.. కొత్త ప్రాంతం... పరిశ్రమలోకి అడుగుపెట్టాక తొలిరోజులు ఎలా గడిచాయని అనుపమని అడిగితే "సినిమా రంగంలోకి రాకముందు నిజంగానే కొత్త ప్రదేశాలంటే కొంచెం బెరుగ్గానే ఉండేది. ఎవరితోనూ అంత తొందరగా కలిసేదాన్ని కాదు. మరి సినిమానే మాయ చేసిందో లేక, ఇక్కడి మనుషుల తీరే అలాంటిదో తెలియదు కానీ.. తెలుగు చిత్ర పరిశ్రమతో మమేకం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. భాష కూడా నాకెవ్వరూ నేర్పించలేదు. తప్పా? ఒప్పా? అని ఆలోచించకుండా తెలుగు మాట్లాడటం మొదలుపెట్టా. ఒక్క భాషనే కాదు... సినిమాకి సంబంధించి నేనేదీ ప్రత్యేకంగా నేర్చుకున్నది లేదు" అని చెప్పింది అనుపమ. ప్రస్తుతం ఆమె తెలుగులో నానితో 'కృష్ణార్జున యుద్ధం'లో నటిస్తోంది. సాయిధరమ్ తేజ్‌తోనూ కలిసి ఓ చిత్రం చేస్తోంది.

గీతోపదేశం

అపాయమ్ము దాటడానికి
ఉపాయమ్ము కావాలి
అంధకారమలమినపుడు
వెలుతురుకై వెదకాలి
ముందు చూపు లేనివాడు
ఎందునకు కొరగాడు
సోమరియై కునుకువాడు
సూక్ష్మమ్ము గ్రహించలేడు

- పంపినవారు: ఎం. ముస్తఫా, పెనుగొండ

గీతం: మత్తువదలరా...
చిత్రం: శ్రీకృష్ణపాండవీయం
రచన: కొసరాజు రాఘవయ్య చౌదరి

భయంకర చిత్రం... 50 రెట్లు లాభం!

ఆస్కార్ బరి

ఒక సినిమా బడ్జెట్‌కు 50 రెట్లు పైగానే వసూళ్లు సాధించడమంటే మాటలా..?. అదీ ఓ తొలి చిత్ర దర్శకుడు పెద్దగా పేరు లేని నటులతో అతి తక్కువ వ్యయంతో తెరకెక్కించిన సినిమా అంతటి విజయం అందుకుందంటే ఎంత ఆశ్చర్యం! అంతేకాదు, గతేడాది వచ్చిన పది అత్యుత్తమ చిత్రాల జాబితాలో స్థానం సంపాదించుకుంది. అంతటితో అయిపోలేదు... ఆస్కార్ బరిలోనూ నాలుగు ప్రధాన నామినేషన్లు అందుకుని సత్తా చాటింది. ఆస్కార్ చరిత్రలో ఓ హారర్ సినిమా ఉత్తమ చిత్రం పురస్కారం కోసం పోటీపడటం చాలా అరుదు. ఆ ఘనత అందుకున్న చిత్రమే 'గెటవుట్'. ఆఫ్రికన్ అమెరికన్ దర్శకుడు జోర్డాన్ పీలె తెరకెక్కించిన ఈ చిత్రంలో డేనియల్ కలూయ, అలిసన్ విలియమ్స్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆ విశేషాలివీ.


'గెటవుట్'

హాలీవుడ్‌లో 5 మిలియన్ డాలర్లు అంటే చాలా తక్కువ బడ్జెట్ కిందే లెక్క. అంతే వ్యయంతో కేవలం 23 రోజుల్లో 'గెటవుట్'ను తెరకెక్కించాడు దర్శకుడు జోర్డాన్. అయితే విడుదలయ్యాక మాత్రం బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించిందీ చిత్రం. సుమారు 255 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. గతేడాది వచ్చిన పది అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా టైమ్ మ్యాగజైన్, అమెరికన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్, నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ ఈ సినిమాను ఎంపిక చేశాయి. గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా లాంటి చిత్రోత్సవాల్లో ఈ చిత్రానికి నామినేషన్లు, ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ఆస్కార్ బరిలోనూ ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే లాంటి ప్రధాన విభాగాల్లో పోటీపడుతోంది. ఓ హారర్ సినిమా ఈ విభాగాల్లో నామినేషన్లు దక్కించుకోవడం విశేషమే.

కథేంటి: నల్లజాతీయుడైన ఫొటోగ్రాఫర్ క్రిస్ వాషింగ్టన్(డేనియల్), శ్వేతజాతీయురాలైన తన ప్రియురాలు రోజ్(అలిసన్)తో కలసి ఓ మారుమూల ఉన్న వాళ్ల ఇంటికి వెళ్తాడు. నల్లజాతీయులను ద్వేషించే రోజ్ తల్లిదండ్రులు, సోదరుడు క్రిస్‌తో సరిగా మాట్లాడరు. ఇంట్లో పనిచేసే నల్లవారూ విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. క్రిస్ పొగతాగే అలవాటును హిప్నోథెరపీ ద్వారా పోగొడతానని చెప్పి రోజ్ తల్లి అతనిపై హిప్నాటిజం చేస్తుంది. దీంతో అతడు ఓ శూన్య ప్రపంచంలోకి జారిపోతాడు. అక్కడ అతనికి బాల్యంలో జరిగిన ఓ దుర్ఘటన కనిపిస్తుంది. పీడకల నుంచి తేరుకున్నట్లుగా మేల్కొన్న క్రిస్‌కు సిగరెట్లపై విరక్తి ఏర్పడుతుంది. కానీ ఇంట్లో వాతావరణం విచిత్రంగా కనిపిస్తుంటుంది. ఆ ఇంటికి ఓ పార్టీకి వచ్చిన కొందరు శ్వేతజాతీయులు, క్రిస్ ఫొటోగ్రఫీ ప్రతిభ చూసి అబ్బురపడతారు. అంధుడైన జిమ్ హడ్సన్, లోగన్ కింగ్ అనే నల్లజాతీయుడు కూడా పార్టీకి వచ్చిఉంటారు. లోగన్‌ను క్రిస్ ఫొటో తీస్తే పిచ్చివాడిలా కేకలు వేస్తూ గెటవుట్ అని అరుస్తాడు. ఇంట్లో వారి విచిత్ర ప్రవర్తన చూసి అనుమానంతో వారి ఫొటోలను తన స్నేహితుడికి పంపుతాడు క్రిస్. వాటిలో లోగన్‌ను చూసి అతడు కొన్ని రోజుల క్రితం కనిపించకుండా పోయిన ఆండ్రె అని వ్యక్తి అని, అక్కడేదో ప్రమాదం పొంచి ఉందని చెబుతాడు స్నేహితుడు. దీంతో అక్కణ్నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమవుతాడు క్రిస్. ఆ విషయం పసిగట్టిన రోజ్ కుటుంబ సభ్యులు గేట్లు మూసేస్తారు. రోజ్ తల్లి మళ్లీ అతణ్ని హిప్నటైజ్ చేసి ఇంటి బేస్‌మెంట్‌లో కుర్చీలో బంధిస్తుంది. అక్కడ అతనికి ఓ భయంకరమైన నిజం తెలుస్తుంది. రోజ్ కుటుంబం తెల్లజాతీయుల మెదళ్లను నల్లజాతీయుల శరీరాల్లోకి ప్రవేశపెడ్తుంటారని, ఇంట్లో ఉన్న పనిమనుషుల శరీరాల్లో రోజ్ పూర్వీకుల ఆత్మలున్నాయని అర్థమవుతుంది. ఇప్పుడు క్రిస్ శరీరంలోకి అంధుడైన జిమ్ మెదడును ప్రవేశపెట్టడానికి చూస్తుంటారు. దాంతో తనకు చూపుతో పాటు క్రిస్‌లోని ఫొటోగ్రఫీ నైపుణ్యం లభిస్తాయని జిమ్ ఆశపడ్తుంటాడు. మరి ఆ ఇంటి నుంచి క్రిస్ బయటపడ్డాడా? ప్రాణాలు కాపాడుకున్నాడా? అన్నది 'గెటవుట్'లో చూడాలి.

విశేషాలు :

- ర్యాప్ సింగర్ చాన్స్‌కు ఈ సినిమా తెగ నచ్చేసింది. ఎంతలా అంటే ఒకరోజు షికాగోలోని అన్ని థియేటర్లలోని అన్ని టికెట్లనూ అతనే కొని జనాలకు ఉచితంగా సినిమా చూసే అవకాశాన్ని కల్పించాడు.
- తొలి చిత్రంతోనే వంద మిలియన్ డాలర్లు వసూళ్లు సాధించిన తొలి నల్లజాతీయుడైన దర్శకుడిగా జోర్డాన్ రికార్డు సాధించాడు.

నా జీవితాన్నే మార్చేసిన సినిమా


ఆలియాభట్

'స్టూడెండ్ ఆఫ్ ది ఇయర్'... ఆలియాభట్ నటించిన తొలి చిత్రం. తొలి విజయం కూడా ఈ చిత్రంతోనే దక్కింది. ఈ చిత్రంతో ఆలియాభట్ స్టార్ అయిపోయింది. షారుఖ్ ఖాన్‌తో కలిసి ఆలియా నటించిన చిత్రం 'డియర్ జిందగీ'. జీవితం గురించి చెప్పే చిత్రమిది. ఈ రెండింటిలో ఏదీ ఆలియా మనసు దోచుకోలేదు. మరి ఏ చిత్రం అంటే ఆమెకు ఇష్టమంటే 'హైవే' అని చెబుతోంది. ఈ సినిమా వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆలియాభట్ ఆ చిత్రంలోని ఓ ఫొటోను ట్విట్టర్‌లో పంచుకొంది. "నా జీవితాన్ని మార్చేసిన చిత్రం 'హైవే'. ఈ సినిమాపై ప్రేక్షకులు చూపించిన ప్రేమకు ఎప్పటికీ రుణపడే ఉంటాను. ఇంతియాజ్ అలీకి కృతజ్ఞతలు" అని ట్వీటింది. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'హైవే'లో వీరా పాత్రలో ఆలియా నటనకు మంచి ప్రశంసలు దక్కాయి.

బ్రహ్మాస్త్ర కోసం బల్గేరియా: భారీ బడ్జెట్ చిత్రంగా రణ్‌బీర్‌కపూర్, ఆలియాభట్ జంటగా 'బ్రహ్మాస్త్ర'ను తెరకెక్కించబోతున్నారు. యాక్షన్ సన్నివేశాలు ఇందులో కీలకం. అందుకోసం రణ్‌బీర్‌కపూర్, ఆలియాభట్‌తో పాటు చిత్ర బృందంలోని కీలక నటులు బల్గేరియాలో శిక్షణ తీసుకొంటున్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఇడో పోర్టల్ నేతృత్వంలో ఈ శిక్షణ కొనసాగుతోంది. మార్షల్ ఆర్ట్స్, జిమ్నాస్టిక్స్, ఏరోబిక్స్.. ఇలా అన్నింటిలోనూ కొత్త తరహా మెళకువలు నేర్చుకుంటున్నారు. కరణ్‌జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకుడు.

మార్చి 2 నుంచి థియేటర్లు బంద్!

■ చర్చలు విఫలం ■ మెట్టు దిగని డిజిటల్ ప్రొవైడర్లు

సినీ నిర్మాతలకీ... చిత్రాల ప్రదర్శన నిమిత్తం డిజిటల్ కంటెంట్ అందజేస్తున్న క్యూబ్, యు.ఎఫ్.ఓ సంస్థలకీ మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ప్రస్తుతం వసూలు చేస్తున్న ఛార్జీలు తగ్గించేందుకు ససేమిరా అనడంతో దక్షిణాది వ్యాప్తంగా ఆ రెండు సంస్థలకి సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్మాతలు నిర్ణయించారు. దాంతో మార్చి 2 నుంచి థియేటర్లలో ప్రదర్శనలు కూడా నిలిచిపోతాయని తెలిపారు. దక్షిణాదికి చెందిన నాలుగు భాషల చిత్ర పరిశ్రమలు కలిసి ఏర్పాటు చేసుకొన్న ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో క్యూబ్, యు.ఎఫ్.ఓ సంస్థలతో శనివారం బెంగుళూరులో చర్చలు జరిగాయి. ప్రస్తుతం నిర్మాతల నుంచి వసూలు చేస్తున్న వర్చువల్ ప్రింట్ ఫీజు 25 శాతం మేర తగ్గించడంతో పాటు... విడతలవారీగా ఆ ఛార్జీలు మొత్తం ఎత్తివేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. విరామం సమయంలో వచ్చే ప్రకటనల్లోనూ కొత్త సినిమాలకి సంబంధించిన ట్రైలర్లని ప్రదర్శించాలని డిమాండ్ చేసింది. అయితే ఆ డిమాండ్లకి డిజిటల్ సంస్థలు అంగీకరించలేదు. దాంతో ముందుగా నిర్ణయించినట్టుగానే దక్షిణాది రాష్ట్రాల్లో ఆ రెండు సంస్థలకి నిర్మాతలెవ్వరూ కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయించారు.

అక్కడ ఐదేళ్లే వసూలు చేశారు...

సినిమాల ప్రదర్శన ఇదివరకు రీళ్లతో కూడిన ప్రింట్లతో జరిగేది. డిజిటల్ సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పట్నుంచి రీళ్లు కనుమరుగయ్యాయి. థియేటర్లలో సినిమాల ప్రదర్శన విధానమే మారిపోయింది. దాంతో డిజిటల్ ప్రొవైడింగ్ కంపెనీలు పుట్టుకొచ్చాయి. ఆ సంస్థలు థియేటర్లలో ఉచితంగా డిజిటల్ సామాగ్రిని సమకూర్చి కంటెంట్‌ని తమ ద్వారానే అందజేస్తున్నాయి. అందుకుగానూ ప్రతి సినిమాకీ వర్చువల్ ప్రింట్ ఫీజుతో పాటు, సర్వీసు ఛార్జీల్ని వసూలు చేస్తున్నాయి. డిజిటల్ సామాగ్రిని ఉచితంగా సమకూర్చినందుకు థియేటర్ల యాజమాన్యాలతోనూ ఒప్పందం కుదుర్చుకొన్నాయి. ఈ తరహా ఒప్పందాలు హాలీవుడ్‌లోనూ జరిగాయి. అయితే అక్కడ ఐదేళ్లపాటే ఛార్జీలు వసూలు చేశాయి ఆయా కంపెనీలు. కానీ మన దేశంలో మాత్రం నిరంతరాయంగా అన్ని రకాల ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దాంతో నిర్మాతలకి పెద్దయెత్తున నష్టం జరుగుతోందని పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి. ఆ విషయంపైనే కొంతకాలంగా దక్షిణాదికి చెందిన చిత్ర పరిశ్రమలు డిజిటల్ సర్వీస్ ప్రొవైడింగ్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నాయి. ఎక్కువ థియేటర్లకి డిజిటల్ కంటెంట్ సేవలు అందిస్తున్న క్యూబ్, యు.ఎఫ్.ఓ సంస్థలు ఛార్జీల్ని 9 శాతానికి మించి తగ్గించే ప్రసక్తే లేదని శనివారం తేల్చిచెప్పడంతో చివరి దఫా చర్చలు విఫలమయ్యాయి. థియేటర్లలో ప్రదర్శన నిలిచిపోతే కొత్త సినిమాల విడుదలపై తీవ్రంగా ప్రభావం పడే అవకాశముంది. రానున్నది కీలకమైన వేసవి సీజన్ కాబట్టి నిర్మాతలు ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించనున్నట్టు తెలుస్తోంది. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు జెమిని కిరణ్ 'ఈనాడు సినిమా'తో మాట్లాడుతూ "హాలీవుడ్ తరహాలోనే ఇక్కడ కూడా డిజిటల్ కంపెనీలు తొలి ఐదేళ్లే ఛార్జీలు వసూలు చేస్తామని, ఆ తర్వాత ప్రదర్శన ఉచితమని చెప్పి అడుగుపెట్టాయి. కానీ ఛార్జీలు తగ్గించకపోగా ఎప్పటికప్పుడు పెంచుతూ నిర్మాతల్ని తీవ్ర ఇబ్బందులకి గురిచేస్తున్నాయి. ఐదేళ్లే ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా, పదమూడేళ్లయినా ఆపలేదు. దీనిపైనే మా నిరసన. దక్షిణాదికి చెందిన నిర్మాతలంతా కలిసి మరో దఫా సమావేశమై ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి ఆలోచించనున్నాం" అన్నారు.



మందారంలా... మెరిసేలా!

పెళ్లిళ్ల సీజన్ వచ్చేసిందంటే... మగువల చేతులు మెహెందీ మెరుపులతో మందారాల్లా పూయాల్సిందే! మరి గోరింటాకు ఎక్కువ రోజులు ఉండాలన్నా.. బాగా పండాలన్నా ఎలాంటి నియమాలు పాటించాలో తెలుసా!

- కోన్ పెట్టుకోవడానికి ముందు తప్పనిసరిగా.. కాళ్లూ, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఎందుకంటే చేతుల మీద మురికి పూర్తిగా వదిలిపోతే రంగు చర్మంలోకి బాగా ఇంకిపోయి చక్కగా పండుతుంది. ఏదైనా సందర్భానికి అయితే పెడిక్యూర్, మానిక్యూర్ వంటివి చేసుకున్నాకే మెహెందీ పెట్టుకోవాలి.
- మెహెందీని ఎంత ఎక్కువ సేపు ఉంచుకుంటే అంత బాగా పండుతుంది. రాత్రంతా ఉంచుకుని మర్నాడు చేతులకి కొబ్బరి నూనె రాసి కాసేపయ్యాక కడిగేసుకుంటే ఎర్రగా కనిపిస్తుంది.
- నిమ్మరసంలో చక్కెర కలిపి... పక్కన పెట్టుకోవాలి. మెహెందీ డిజైన్ పెట్టుకున్నాక కాసేపటికి పొడిబారుతుంది. అలాంటప్పుడు నిమ్మరసం మిశ్రమంలో దూదిని ముంచి అద్దుతుండాలి. లేదంటే నిమ్మరసం కూడా చల్లుకోవచ్చు. మరీ ఎక్కువ చల్లితే డిజైన్ పాడైపోతుంది. ఇలా చేయడం వల్ల ముదురు ఎరుపు రంగులో పండుతుంది.
- ఒకవేళ ఆకు రుబ్బి పెట్టుకునేటట్లయితే అందులో కాస్త చింతపండూ, మజ్జిగ కలపాలి. ఇలా చేయడం వల్ల మెత్తగా, మృదువుగా వస్తుంది. బాగా పండుతుంది. ఒంట్లో వేడి కూడా దూరమవుతుంది.
- మెహెందీ తీసిన వెంటనే చేతులు కడుక్కోకూడదు. సబ్బు అసలు వాడకూడదు. ఎండిపోయిన తరవాత అరచేతులు రుద్దినట్లు చేస్తే చాలు. పెళ్లిళ్లూ, ఫంక్షన్లు ఉన్నప్పుడు డిజైన్ ఎక్కువరోజులు పోకుండా ఉండాలంటే.. నీళ్లలో ఎక్కువ శాతం నానకుండా ఉండాలి. లేదంటే త్వరగా పోతుంది.
- మెహెందీని తీసేశాక పెయిన్‌బామ్ రాయాలి. ఇలా చేస్తే ఎర్రగా పండుతుంది. అలానే మెహెందీ పెట్టుకున్నాక ఫ్యాన్ కింద ఆరబెట్టడం, డ్రయ్యర్‌తో పొడిబారేలా చేయడం చేయకూడదు. సహజంగా పండితేనే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

ఆంగ్లం నేర్పిస్తాం... ఆకలి తీరుస్తాం!

వాళ్లిద్దరి ప్రాంతాలు వేరు, నేపథ్యాలు వేరు. ఒకరికొకరు పరిచయం లేరు. కానీ ఆ ఇద్దరికీ చదువంటే ఇష్టం.. పేద పిల్లలంటే అభిమానం. అందుకే ఒకరు విద్యాదానం దిశగా అడుగులు వేస్తే.. మరొకరు పిల్లల ఆకలి తీరుస్తున్నారు. వాళ్లే సంధ్యా వేణుగోపాల్, తాళ్లూరి భాగ్యశ్రీ. సంధ్య పిల్లలకు ఆంగ్లం నేర్పిస్తోంటే, భాగ్యశ్రీ పరీక్షల సమయంలో కడుపునిండా అన్నం పెడుతున్నారు.

ఒక్కరూ మాట్లాడలేకపోయారు...



నేడు తెలుగు భాష ఎంత ముఖ్యమో...ఆంగ్లం కూడా అంతే అవసరం. కానీ మామూలు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఆంగ్లంపై అంత పట్టులేదు. నాకు చదువు చెప్పడం అంటే ఇష్టం. స్వతహాగా ఆ రంగంలోకి వెళ్లకపోయినా... కొందరు చిన్నారులను చూశాకా ఆంగ్లం నేర్పించాలని అనుకున్నా. ఇది రెండేళ్ల క్రితం మాట.

మా అంకుల్ ఒకరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్. నేను రోటరీ క్లబ్ తరఫున ఓ కార్యక్రమం ఏర్పాటు చేశా. దానికి ఏయూ ఇంగ్లిష్ మీడియం చిన్నారులను ఆహ్వానించాను. వాళ్లకి లిటరసీ పోటీల్లో అవకాశం ఇచ్చాను. అందులో వారికి సున్నా మార్కులు వచ్చాయి. అప్పుడే అనిపించింది వారికి ఆంగ్లం నేర్పించాలని.



ఎనిమిదీ, తొమ్మిది తరగతులు చదివే పిల్లలకు చెప్పడం కంటే.. మొదటి తరగతి నుంచే శిక్షణ ప్రారంభించడం మంచిదనిపించింది. అలా 2016 అక్టోబరులో స్పీకింగ్ చాక్ పేరుతో సేవ మొదలుపెట్టా. నాకు తోడుగా కొందరు వలంటీర్లూ చేరారు. వారికోసం సొంతంగా ఓ సిలబస్‌నూ రూపొందించా. ఇందుకోసం ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో విరాళాలతో నడుస్తోన్న ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ని ఎంచుకున్నా. మా గురించి తెలిసి ఆ స్కూల్‌లో పిల్లలకు చదువు చెప్పడానికి మరో నలభై మంది వలంటీర్లు వచ్చారు. అలా మేం అందరం అక్కడ చదివే ఏడొందల మంది చిన్నారులకు... ఆంగ్ల పాఠాలను ప్రతి గురువారం రెండు గంటల పాటు చెబుతాం.

వీరంతా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదివేవాళ్లే. మిగతా చిన్నారులకు మేం ఓ రెండు లక్షల రూపాయలతో ఉపకారవేతనం కూడా అందిస్తున్నాం. అంతేకాదు ఆ బడిలో వారికోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. దానికి మూడు లక్షలరూపాయలు ఖర్చయ్యింది. పిల్లల కోసం గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశాం. స్కూలు బ్యాగులూ... డిక్షనరీలు అందించాం.

ఆధునిక తరగతులు... అప్పుడప్పుడు రోబో ద్వారా ఆంగ్ల తరగతులు చెప్పించడం ఈ మధ్యనే మొదలుపెట్టాం. అలా చెబుతుంటే వారికీ ఆసక్తి ఉంటుంది. అయితే పిల్లల దగ్గర నామమాత్రపు ఫీజులు వసూలు చేస్తాం. ఎందుకంటే ఉచితం అంటే తల్లిదండ్రులు కూడా పెద్దగా పట్టించుకోరు. అందుకే పిల్లల స్థోమతను బట్టి ఫీజు తీసుకుంటాం. అలా వచ్చిన ఫీజును ఆ స్కూలును బాగు చేయడానికీ, వారికి ఉపకార వేతనాలు అందించడానికి ఉపయోగిస్తుంటాం. ప్రస్తుతం ఇక్కడ వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మా సిలబస్ ప్రకారం పాఠాలు చెప్పి... వేసవి సెలవులకు ముందు పరీక్షలు పెడతాం. ప్రతిభ ఆధారంగా తరగతికి ఇద్దరు చొప్పున గుర్తించి బహుమతులు ఇస్తాం. తొమ్మిదో తరగతి విద్యార్థులనైతే విమానం ఎక్కించి హైదరాబాద్ తీసుకొచ్చి స్టార్ హోటల్ ఉంచుతాం. ఎవరైనా సినిమా నటుల వద్దకు తీసుకెళ్లి వారితో ఫొటో తీయిస్తాం. మళ్లీ విమానంలో వైజాగ్ తీసుకెళతాం. ఇలా చేయడం వల్ల వారిలో ఇంగ్లిష్ నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందనేది నా ఆలోచన. అందుకే అలా ప్రోత్సహిస్తున్నాం.

ఆ కష్టాలు తెలుసు కాబట్టే...

తాజాగా ఇంటర్నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ నుంచి ఫోనొచ్చింది. 'మీకు మా సంస్థ నుంచి అవార్డు ఇస్తున్నాం' అన్నారు. నేనెప్పుడూ అలాంటి ప్రత్యేకతల కోసం ఆశపడలేదు. నాలాగా ఆడపిల్లలు బాధపడకూడనే ఇదంతా చేస్తున్నా.

మాది తెనాలి దగ్గర మోపర్రు. నాన్న మిలటరీ ఉద్యోగి. దురదృష్టవశాత్తూ... చిన్నతనంలోనే చనిపోయారు. అమ్మ మీద కుటుంబభారం పడింది. అయినా ఒక పూట తినీ తినక కష్టపడి చదివించింది. అప్పట్లో నేను చదివిన కాలేజీలోనే ప్రస్తుతం పనిచేస్తున్నా.

అప్పుడే చూశా... 2001లోనే బాలికల కాలేజీకి వచ్చాను. అందులో 1400 మంది విద్యార్థినులున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎమ్ఈసీ గ్రూపుల్లో ఆంగ్ల, తెలుగు మాధ్యమాలున్నాయి. వారిలో చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన వాళ్లే. పైగా గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారు. మా కాలేజీలో నేను పౌరశాస్త్రం చెబుతా. కొన్నాళ్లపాటు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగానూ పనిచేశా. ఆ సందర్భంలో ఆడపిల్లలకి దగ్గరగా ఉండే అవకాశం వచ్చింది. అప్పుడే అమ్మాయిల సమస్యల్ని దగ్గరగా చూశా. చాలామంది ఆర్థిక సమస్యలతో మధ్యాహ్న భోజనం తెచ్చుకోవట్లేదని గుర్తించి బాధపడ్డా. నేను తినకుండా నా బాక్సు వారికిచ్చేదాన్ని. ఒక్కరికి అయితే ఇవ్వగలను.. అలా చాలామంది ఉన్నప్పుడు ఎంత మందికి ఇవ్వను. ఇదే ప్రశ్న నాకు నేను వేసుకున్నప్పుడు ఆ విద్యార్థులకు కనీసం మధ్యాహ్న భోజనం అందిస్తే బాగుంటుందనిపించింది.





అన్నం, మంచినీళ్లూ... వెంటనే మా ప్రిన్సిపల్, తోటి ఉద్యోగులతో మాట్లాడి పిల్లలకు భోజనం పెడదామనుకుంటున్నట్టు చెప్పా. దానికి అందరూ సరే అని కొంత మొత్తం డబ్బు ఇవ్వడానికి ముందుకొచ్చారు. నేనే బాధ్యత తీసుకుని క్యాటరింగ్ వాళ్లతో కాంట్రాక్టు మాట్లాడాను. పిల్లలకి భోజనంలో ఏం పెట్టాలి... ఎంత వండాలి వంటివన్నీ ముందు రోజు చెబుతాను. అలా 2007 నుంచి పిల్లలకి ప్రతి గురువారం భోజనం పెట్టడం మొదలుపెట్టాం. ఏటా ఫిబ్రవరి ఒకటో తారీఖు నుంచి పరీక్షల సమయం వరకూ రోజుకి రెండొందల మంది చిన్నారుల ఆకలి తీరుస్తున్నాం. అందులో భాగంగా అన్నం, కూర, పచ్చడి... లేదంటే కొబ్బరిఅన్నం, వెజిటబుల్ రైస్, పులిహోర, స్వీటు, పెరుగు చట్నీ వంటివి పెడతాం. భోజన సమయానికి మిగతా కళాశాలల పిల్లలూ వస్తుంటారు. అందుకే రెండొందల మందికి వండిస్తాను. ఈ భోజనాలకు నాకు ఆరేడు వేల రూపాయల ఖర్చు అవుతుంది. మావారూ, సిబ్బంది సాయపడతారు. లేదంటే నేనే సర్దుబాటు చేసుకుంటా. క్రమంగా పిల్లలకోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించా. దీనికి తెలిసిన వారూ కొంత సాయం చేశారు.

దుస్తుల పంపిణీ... పిల్లలకు యూనిఫాంలే కాదు, పుస్తకాలూ, బ్యాగులు... అందజేస్తా. ఎవరైనా పెద్దవాళ్లు సాయం చేయాలనుంది అంటే.. మా పిల్లలకి స్టేషనరీ, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లూ, వైద్య చికిత్సలు చేయించమని అడుగుతాం. పిల్లలు క్రీడలపోటీలకు వెళుతుంటే దుస్తులూ, షూలూ, ఛార్జీలకీ డబ్బులు ఇస్తుంటా. నా జీతంలో సగభాగం పిల్లలకే కేటాయిస్తున్నా.

నాకు ప్రభుత్వ ప్రభుత్వేతర అవార్డులెన్నో వచ్చాయి. 2005 నుంచి రన్నింగ్‌లో పాల్గొంటున్నా. మరోవైపు పిల్లలకు రెండు కిలోమీటర్ల బేర్‌ఫూట్ రన్నింగ్ పోటీలు పెట్టాను. ఒకేసారి ఏడువేల ఐదొందల మంది ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్‌బుక్‌లోనూ స్థానం లభించింది. ఇవన్నీ చేస్తూనే వాళ్లకు సమయానికి భోజనం అందేలా చూస్తున్నా.

– పద్మ వడ్డె

బంగారం వెండి

23న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,912	2,909
వెండి (గ్రా)	41.60	41.40



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,470	31,440	31,350	31,350	31,400	31,300	31,120	31,090	31,300	31,300
ఆర్నమెంట్	29,400	29,360	29,100	29,150	29,070	28,950	29,120	29,090	29,110	29,110
వెండి(కిలో)	39,700	39,500	39,700	39,700	39,700	39,500	39,000	38,900	39,900	39,900

రాత్రుళ్లు పనిచేస్తున్నారా...



ఉద్యోగులందరికీ అనుకూలమైన పని వేళలే ఉండవు. అర్ధరాత్రి వరకూ ఉండొచ్చు.. ఇంకొందరికి రాత్రంతా విధులు నిర్వర్తించాల్సి రావచ్చు. అలాంటి వారు నిద్ర విషయంలోనే కాదు.. తీసుకునే ఆహారంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఏం చేయాలంటే...

పనంతా అయ్యాక భోజనం చేయాలనే ఆలోచన చాలామందికి ఉంటుంది. కానీ అది ఆరోగ్యానికి మంచిది కాదు. త్వరగా భోజనం చేసి పనిలో కూర్చుంటే నిద్ర రాదు. అదే పనయ్యాక తింటే మాత్రం వెంటనే నిద్రపోవాలనిపిస్తుంది. దీనివల్ల త్వరగా బరువు పెరగొచ్చు. ఒకవేళ ముందు తినాలనే ఆసక్తి లేకపోతే తేలికపాటి అల్పాహారం అయినా తీసుకోవాలి.

- రాత్రి వేళలో విధులు పాటించే వారు సమయానికి భోజనం చేసినప్పటికీ ప్రతి మూడు గంటలకోసారి పోషకాల మిళితమైన పదార్థాలు తీసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి. అంటే వాల్‌నట్లూ, బఠాణీలూ, పిస్తా, అంజీర్, జీడిపప్పూ, గుమ్మడి గింజలూ, అవిసెగింజలు వంటివన్నమాట. వీటిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. ఇవి రాత్రి పూట తీసుకున్నా ఇబ్బంది ఉండదు.
- వేళకాని వేళల్లో పనిచేసేవారు నిద్ర ఆపుకోవడానికి టీ, కాఫీలు ఎక్కువ తాగుతుంటారు. అలాంటి వారు బ్యాగులో ఏవైనా పండ్లు తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. టీ, కాఫీలు తాగాలనిపించినప్పుడు ఆ పండు తింటే సరి. అవి ఆరోగ్యానికి హాని చేస్తాయి. నిద్రనూ దూరం చేస్తాయి.
- ఆలస్యంగా పడుకునేవారు పని ముగించుకుని ఇంటికి రాగానే నిద్రపోకూడదు. కనీసం ఓ పావుగంటైనా చిన్నపాటి వ్యాయామాలు చేయాలి. ఇలా చేయడం వల్ల జీవక్రియ రేటు సక్రమంగా ఉంటుంది. రోగనిరోధశక్తి కూడా మెరుగవుతుంది.

అలర్జీ రాకుండా

అలర్జీకి కారణాలు అనేకం. అయితే దుమ్మూధూళి వల్ల కూడా అలర్జీ రావొచ్చు. వీటిలోని హానికరక సూక్ష్మక్రిములే అందుకు కారణం. ముక్కు కారడం, ఒంటిపై దద్దుర్లూ, కళ్లు మంట పుట్టడం, నీరు కారడం కూడా అలర్జీ సంకేతాలే. కాబట్టి దుమ్ముధూళిని వీలైనంత మేరకు ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి.



- దుప్పట్లూ, బెడ్‌షీట్లూ, తలగడ కవర్లూ... ఇలా అన్నింటిని వేడినీటిలో నానబెట్టి ఉతకాలి. ఆ తరువాత ఎండలో ఆరేయాలి. అప్పుడే అలర్జీకి కారణమయ్యే సూక్ష్మక్రిములన్నీ పోతాయి. మంచం మీద వేసే దుప్పట్లూ, దిండు గలేబుల్ని వారానికోసారి మారుస్తూ ఉండాలి.
- ఫర్నిచర్‌ను శుభ్రం చేసిన వస్త్రాన్ని ఒకసారి కంటే వాడకూడదు. వెంటనే ఉతికేయాలి.
- ఇంటిని శుభ్రం చేసే సమయంలో ముక్కూ, నోటికి అడ్డుగా వస్త్రాన్ని కట్టుకోవడం మంచిది.
- ఇంట్లో బూజు దులిపే కార్యక్రమం పెట్టుకున్నప్పుడు మంచం, సోఫాలూ, ఎలక్ట్రానిక్ వస్తువులపై ప్లాస్టిక్ కవర్‌ను కప్పేయాలి. దాంతో వాటిమీద దుమ్ము పడదు.
- కార్పెట్లూ, సోఫాలూ, మంచాలను వారంలో ఒకటిరెండుసార్లు శుభ్రం చేస్తేనే మంచిది. లేదంటే దుమ్మూధూళి పేరుకుపోయి అలర్జీ వచ్చే ప్రమాదం ఉంది.
- పరదాలను కూడా తరచూ మారుస్తుండాలి. లేదా నెలకోసారి అయినా వేడినీటితో శుభ్రం చేయాలి.
- కుక్కపిల్లలూ, బొమ్మలూ... ఇలా దుమ్ము వెంటనే ఎక్కువగా పేరుకుపోయే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉంటే అలర్జీకి దూరంగా ఉండొచ్చు.

పిల్లల్లేరు... క్యాన్సర్ అంటున్నారు!

? నా వయసు ఇరవై ఏడు. ఏడాది క్రితం పెళ్లయ్యింది. అయితే కొన్ని రోజుల క్రితం రొమ్ములో నొప్పిగా అనిపించి డాక్టర్ దగ్గరకు వెళ్లా. క్యాన్సర్ అని అనుమానించి పరీక్షలు చేయించారు. చివరకు రొమ్ముక్యాన్సర్ మొదటిదశలో ఉందని తేలింది. తగ్గిపోతుందనీ చెప్పారు. మాకు ఇంకా పిల్లలు లేరు. ఇప్పుడు నా పరిస్థితి ఏంటో అర్థంకావడంలేదు.

- ఓ సోదరి


✔ మొదటి దశలో ఉందని చెప్పారు కాబట్టి రొమ్మును తీసేయాల్సిన అవసరంలేదు. ఆ కణితి దాని చుట్టుపక్కల ఒక సెంటీమీటరు వరకూ టిష్యూను వరకూ తీసేస్తే సరిపోతుంది. అవసరం అయితే బాహుమూలల్లోని గ్రంథుల్ని కూడా తీసేస్తారు. శస్త్రచికిత్స తరువాత కీమో థెరపీ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ సమయంలో నెలసరి మాత్రం రాదు. చికిత్స పూర్తిగా అయిపోయిన కొన్నినెలలకు నెలసరి మామూలుగానే వచ్చేస్తుంది. అండం కూడా ఒకప్పటిలానే విడుదల అవుతుంది. కాబట్టి భయపడాల్సిన అవసరంలేదు. అయితే క్రమం తప్పకుండా రెండుమూడేళ్లు వైద్యుల పర్యవేక్షణలో ఉండటం తప్పనిసరి. ఆ తరువాత మరోసారి పరీక్షించి ఏ ఇబ్బందీ లేదని వైద్యులు చెబితే... అప్పుడు గర్భం దాల్చొచ్చు. కొందరిలో మాత్రం క్యాన్సర్‌కి చేసే చికిత్సల వల్ల నెలసరి పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటివారికి మాత్రం పిల్లలు కలగకపోవచ్చు. అప్పుడు ప్రత్యామ్నాయం ఆలోచించాల్సి ఉంటుంది. కాబట్టి మీరు ముందు వీటన్నింటి గురించి ఆలోచించకుండా క్యాన్సర్ చికిత్సను పూర్తిగా చేయించుకోవడం మంచిది.

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

నజరానా



కొత్తిమీర ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే... కాడలతో సహా నీళ్లలో ఉంచాలి.


ఈ మొక్క నిద్రపోతుంది

ముదురు ఊదారంగులో త్రికోణాకారపు ఆకులతో, అందమైన చిన్న చిన్న పూలతో, సుకుమారంగా, ఎంతో ఆకర్షణీయంగా ఉండే మొక్క ఆగ్జాలిస్. దీని శాస్త్రీయ నామం 'ఆగ్జాలిస్ రెగ్నెల్లి' లేదా 'ఆగ్జాలిస్ పాపిలియోనేసియా'. దీన్ని 'లవ్ ప్లాంట్', 'పర్పుల్ ఫామ్‌రాక్', 'వుడ్ సోరెల్' అని రకరకాల పేర్లతో పిలుస్తారు. ఇది బ్రెజిల్‌కు చెందిన మొక్క.



ఆగ్జాలిస్ దుంపతో పెరిగే మొక్క. ఆకులూ, పూలు నేలమట్టం నుంచి సన్నటి పొడవాటి సుకుమారమైన కాడల చివర వస్తాయి. కొమ్మలు ఉండవు. దీని ఆకులు ముదురు ఊదా రంగులో మూడు త్రికోణాకారపు పత్రదళాలతో కలిసి ఉంటాయి. కొన్ని హైబ్రిడ్ రకాలు ఆకుల మధ్యలో లేత ఊదా రంగుతో మరింత ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ మొక్కకు ఉండే ప్రత్యేక లక్షణం వల్ల ఆకులు రాత్రిపూట కిందికి గొడుగులా ముడుచుకుంటాయి. అలా ముడుచుకున్నప్పుడు ఇవి గుంపుగా వాలిన సీతాకోక చిలుకల్లా కనిపిస్తాయి. అందుకే ఈ మొక్కను 'బటర్‌ఫ్లై ప్లాంట్' అనీ అంటారు. దీని పూలు చిన్నవైనా కూడా అందంగా ఉంటాయి. అవి తెలుపు/ లేత గులాబీ రంగులో, గరాటు ఆకారంలో ఉండి ఆకులను దాటి... పైకి వస్తాయి. ఈ పూలను సలాడ్లలో కూడా వాడతారు.

నిద్రావస్థలోకి వెళుతుంది... ఆగ్జాలిస్ సులువుగా పెంచగలిగే మొక్క. ఇందులో ట్రయాంగ్యులాలిస్ రకం ఆకుపచ్చని ఆకులతో ఉండి, ఊదా ఆకుల రకం కంటే కూడా తక్కువ శ్రద్ధతో పెరుగుతుంది. ఆగ్జాలిస్ దాదాపు ఎనిమిది అంగుళాల ఎత్తు పెరుగుతుంది. ఇది ఎక్కువకాలం బతుకుతుంది కూడా. తేమగా ఉండే నీరు నిలవని సారవంతమైన మట్టి మిశ్రమం దీనికి అనువుగా ఉంటుంది. సూటిగా ఎండపడని వరండాల్లో,



బాల్కనీల్లో, చెట్ల నీడలో ఈ మొక్క బాగా పెరుగుతుంది. నీళ్లు మరీ ఎక్కువ కాకుండా జాగ్రత్తపడాలి. మట్టి మిశ్రమం పైపొర పొడిబారాకే మళ్లీ నీళ్లు పోయాలి. సాధారణంగా ఎండాకాలం మొదలవడానికి ముందు ఆగ్జాలిస్ నిద్రావస్థలోకి వెళుతుంది. ఆకులు వాటి సహజ సిద్ధమైన ప్రకాశాన్ని కోల్పోయి, పగలు విచ్చుకోవడం మానేస్తాయి. దీన్ని నిద్రావస్థగా గుర్తించి నీళ్లు పోయడం 3-4 వారాలపాటు ఆపేయాలి. అయితే ఇతర సమయాల్లో మట్టి మిశ్రమం బాగా పొడారిపోయినా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. కుండీని రెండు సంవత్సరాలకోసారి మార్చుకుంటే మంచిది. ఎక్కువైన పిలకలను ఎప్పటికప్పుడు తీసి నాటుకుంటుంటే కుండీని అంత తరుచుగా మార్చనవసరం లేదు.

తెగుళ్లతో జాగ్రత్త... ఆగ్జాలిస్‌ను ఇంట్లోనూ, బయటా కూడా చక్కగా పెంచుకోవచ్చు. కుండీల్లోనూ, గ్రౌండ్ కవర్‌గానూ, మిశ్రమ అమరికల్లోకీ, వేలాడే కుండీల్లో కూడా చాలా బాగుంటుంది. దీని ఆకుల అందమైన రంగు మిగిలిన గ్రౌండ్ కవర్లతో కలిపి నాటినప్పుడు చాలా అందంగా, ప్రత్యేకంగా కనిపిస్తుంది. కుండీలో నాటుకునేటప్పుడు అంగుళం దూరంలో దుంపలు నాటుకుంటే నిండుగా, చక్కగా ఉంటుంది.

ఆగ్జాలిస్‌కు రెండు వారాలకోసారి 17:17:17 లాంటి సమగ్ర రసాయన ఎరువును ద్రవరూపంలోనో లేదా జీవామృతం లాంటి సేంద్రియ ఎరువునో ఇస్తే మొక్క అందంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేపనూనె, ఇతర ఆకు కషాయాలు తరచూ చల్లుతూ ఉండటం వల్ల రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచవచ్చు. క్రమం తప్పకుండా ఎరువులు వేసి ఆరోగ్యంగా పెంచుతూ, నీళ్లు ఎక్కువ కాకుండా జాగ్రత్త పడితే చాలావరకూ తెగుళ్ల సమస్య ఉండదు. విత్తనాల ద్వారా, దుంపలను విడదీసి నాటుకోవడం ద్వారా సులువుగా ప్రవర్ధనం చేయవచ్చు. చక్కగా ముద్దుగా, చిన్నగా ముడుచుకునే ఆకులతో, ముచ్చటైన పూలతో ఉండే ఆగ్జాలిస్‌తో ప్రేమలో పడనివారుంటారా! అందుకే దీన్ని లవ్ ప్లాంట్ అనడం సరైనదే కదూ!

– బోడెంపూడి శ్రీదేవి, లాండ్‌స్కేప్ కన్సల్టెంట్

కంప్యూటరు ముందు కూర్చునే ఉద్యోగం...! అయిదంకెల వేతనం...! జీవితం సాఫీగా సాగిపోతోంది. అప్పుడు మొదలైంది ప్రశ్నల వర్షం. అతను తడిసి, కొత్తగా మొలకెత్తే దాక కురిసింది.

ఇదేనా జీవితం..? ఏం చేస్తున్నాం.? అన్నదాత కష్టం తెలిసిన నేను... కర్షకులకు ఏం చేస్తున్నాను? ప్రశ్నలు.. ఎడతెగని ప్రశ్నలు. గమ్యం మార్చే ప్రశ్నలు. లక్ష్యం చేరే వరకూ విశ్రమించని ప్రశ్నలు...

అన్ని ప్రశ్నలకు జవాబులు రాశాడు. తన రాతనే కాదు... ఎంతోమంది తలరాతను మార్చే శక్తిఉన్న ఉద్యోగం సంపాదించాడు ఆకుల వెంకటరమణ.

ఎవరీ వెంకటరమణ... ఏమాయన ప్రస్థానం..?



ఒకటో నంబర్ కుర్రాడు

ఏడేళ్ల నిరీక్షణ. పదేళ్ల తపన. ఫలించిన వేళ గ్రూప్-1లో ప్రథమర్యాంకు విజేత వెంకటరమణ ఆనందానికి అవధుల్లేవు. అమ్మానాన్నల కష్టాన్ని చూసి పెరిగిన కళ్లు వారిని తలచుకొని ఒక్కసారిగా చమర్చాయి. అన్నదాతలు ఎంతో మందికి సేవ చేసే భాగ్యం త్వరలోనే తనకు కలుగుతుందన్న సంతోషంతో వచ్చిన ఆనందభాష్పాలవి. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వెంకటరమణ విజయం వెనుక... అమ్మానాన్నల ఆశయం, అన్నయ్య ఆశీర్వాదం ఉన్నాయి.

వారి ఆశయం బతికే ఉంది

పొద్దెక్కగానే పొలానికి వెళ్లాలి. లేకుంటే పూట గడవదు. సేద్యమే ఆ కుటుంబానికి జీవనాధారం. అప్పులు చేసి, ఆర్థిక కష్టాలను మింగి పిల్లలను పెద్దచేశారు. తమలా పిల్లలు కాకూడదని నలుగురు కుమారులను చదివించారు తల్లిదండ్రులు శ్రీరాములు, లక్ష్మీనరసమ్మ. జీవితాన్ని పొలానికి, పిల్లలకే ధారపోశారు. పిల్లలు చేతికందే సమయానికి ఇద్దరూ ఊపిరి విడిచారు. ఈ కష్టాలు వెంకటరమణను కదిలించాయి. 'బాగా చదువుకోండి బిడ్డలారా... ఉన్నతస్థాయిలో ఉండాలి.' అంటూ నాన్న చెప్పిన మాటలు తరచూ తట్టిలేపాయి. అందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడినా, దాన్ని విడిచి గ్రూప్స్‌పై దృష్టిపెట్టారు వెంకటరమణ. ప్రస్తుతం వారు లేకపోయినా... వారి ఆశయాన్ని బతికించాడు.

తొలి ప్రయత్నంలోనే తొలిర్యాంకు

ఆకుల వెంకటరమణ గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంకు సాధించారు. ఏపీపీఎస్సీ 2011 గ్రూప్-1 పరీక్షలో ఆయన అత్యధికంగా 489.5 మార్కులు సాధించారు. గ్రూప్స్ రాయడం ఆయనకు అదే తొలిసారి. మొదటి ప్రయత్నంలోనే విజేతగా నిలిచారు. సివిల్స్‌లో రెండుసార్లు అవకాశం తప్పినా... ఈ విజయంతో కలెక్టరుగా అర్హత సాధించే వైపుగా అడుగులు పడ్డాయి.

ప్రభుత్వ బడిలోనే చదువు

మార్కాపురం సర్కారీ బడిలోనే ఓనమాలు దిద్దిన రమణ... మొదట సాధారణ విద్యార్థి. పదోతరగతి తరువాత చదువు విలువ తెలుసుకుని తీరు మార్చారు. పదిలో 68 శాతం మార్కులే. స్థానికంగా ఉన్న జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో మొత్తం కరవు. ఏ పంట వేసినా నష్టాలే. ఇంటిల్లిపాది పొలంలో పనిచేసినా వచ్చేదేం లేదు. అప్పులు, ఆర్థిక బాధలు వెంటాడాయి. అప్పుడే బాగా చదువుకోవాలి, ఉద్యోగంలో స్థిరపడాలనే కసి మొదలైంది.

ఇంటర్‌లో 74 శాతం మార్కులు సాధించారు. ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 1000 ర్యాంకు వచ్చింది. విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఈ చదువు పూర్తికాకుండానే తండ్రి మరణించారు. పెద్దన్నయ్య తోడుతో చదువు పూర్తిచేసి వెంటనే ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువు దక్కించుకున్నాడు. ఉద్యోగమైతే దక్కింది. నెలనెలా వేతనం అందుతోంది. ఏదో అసంతృప్తి వెంటాడేది. జనజీవనంలో ఏదైనా మార్పు తేవాలంటే సర్కారీ కొలువుతోనే సాధ్యం. అందుకే 2009లో ఉద్యోగాన్ని వదిలేశాడు. గ్రూప్స్ కోసం శిక్షణ తీసుకున్నాడు. ఆదర్శనీయుల జీవిత చరిత్రలు చదివాడు. రాజ్యాంగాన్ని పూర్తిగా అవలోకనం చేశాడు.

సామాజిక బాధ్యత

గ్రూప్స్ రాశారు. ఫలితాలకు ఆలస్యమవుతోంది. ఉద్యోగం వస్తుందనే భరోసా ఉంది, కానీ ఫలితాలే రావడం లేదు. అందుకే 2011 నుంచి 2015 వరకు ఓ శిక్షణ సంస్థలో చేరారు. గ్రూప్స్ రాయబోయే అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. మరోవైపు లా చదివారు. 2016లో ఎల్ఎల్‌బీ పట్టా తీసుకున్నారు. అన్నిటా పరిజ్ఞానం ఉండాలనే తపనతో చట్టాలను బాగా చదివారు. రాజ్యాంగం, చట్టాలు, వివిధ వ్యవసాయ పద్ధతులు, విద్యారంగంపై పరిజ్ఞానం సాధించారు. ఇదే క్రమంలో సామాజిక బాధ్యతగా హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని పిల్లలకు ఉచితంగా చదువులు చెప్పేవాడు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆసక్తి ఉండడంతో 2016లో హైదరాబాద్‌లోని ఓ ఎన్జీవోలో సుస్థిర వ్యవసాయం- సహజ ఆహారం విభాగంలో ఉద్యోగంలో చేరారు. రైతులకు సహజసిద్ధ పంటలు పండించడం, లాభదాయక వ్యవసాయం చేసేలా సూచనలివ్వడం దీని ఉద్దేశాలు. ఇవి చేస్తూనే దూరవిద్య ద్వారా ఎంఏ ఎకనామిక్స్ చదువుతున్నారు.

అదే నా లక్ష్యం: రమణ

వ్యవసాయం, విద్యారంగాల్లో జనానికి ఉపయోగపడేలా విధుల్లో ఉండాలని నిశ్చయించుకున్నాను. అన్నిటా పరిజ్ఞానం అవసరమని ఓ వైపు బీటెక్ పూర్తిచేసినా... లా చదివాను. రైతులకు లాభదాయక వ్యవసాయం, పిల్లలకు మంచి చదువులు అందాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం ఉప కలెక్టర్ హోదా వచ్చినా భవిష్యత్తులో కలెక్టరుగా అర్హత సాధించి, లక్ష్యాలను సాధిస్తాను.

– మాసెం శ్రీనివాసరావు, ఈనాడు డిజిటల్– ఒంగోలు



ఆ నల్ల కలువల్లాంటి కళ్లు..
పెద్దవి చేసి చూసి..
ఎక్కుపెట్టిన విల్లంభులాంటి కనుబొమలు..
ఎగరేసి...
ఓ గీటు గీటితే... ఎంతటి పురుషపుంగవులైనా
గాలిలో తేలిపోవాల్సిందే
అలా ఆ కళ్లతో బాణం వేసి...
రెండు వేళ్లతో గురి చూసి
గుండెల్లో కాల్చింది.. ప్రియా!
అంతే....!

సంచలనానికి 'కన్ను గీటు'రాయి

పాజ్‌కొట్టి.. రిపీట్ చేసి.. ఆ 30 సెకన్ల దృశ్యాన్నే తిప్పి తిప్పి చూసి.. నెటిజన్లందరూ అలసిపోయారు. అప్పటికైతే ప్రేమికుల దినోత్సవం మత్తులో ఉన్నవాళ్లకు..గమ్మత్తయిన జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లిన సంఘటన ఇది. ఒక్క ప్రేమికులకే కాదు. పద్దెనిమిదేళ్ల ఈ మళయాల కుట్టీ ప్రియా ప్రకాష్ వారియర్ నేషనల్ క్రష్. ఒక్క కనుసైగతో మాయచేసి.. రాత్రికి రాత్రే అంతర్జాలంలో అతిలోక సుందరిలా వెలిగిపోయింది..! తనేమీ కష్టపడి డ్యాన్సులు చేయలేదు. మగరాయుడిలా ఫైట్లు చేయలేదు. యాక్షన్‌తో అదరగొట్టలేదు. తను చేసిందల్లా.. సులువుగా, సొగసుగా, కొంటెతనంతో కన్నుకొట్టిందంతే! ఆ ఓరచూపులో అమాయకత్వం. అప్పుడే అరవిరిసిన సహజత్వం. ఆ పిలగాడు (హీరో) ఒక కనుతో సైగ చేస్తే.. తను రెండు కనుబొమలు ఎగరేస్తుంది. కాస్త ఆశ్చర్యంగా మళ్లీ 'నేనంటే ఇష్టమా' అన్నట్లు కళ్లతోనే అడుగుతాడు. 'ఎందుకు కాదు, చచ్చేంత ఇష్టం' అన్నట్లు కన్నుకొట్టి బుట్టలో పడేస్తుంది ప్రియ. మళయాలీ చిత్రం 'ఒరు అదార్ లవ్'లోని మాణిక్య మలరాయ పూవీ పాట టీజర్ అంత సంచలనం అవుతుందని దర్శకుడే ఊహించలేదు. అప్పటి వరకు గూగుల్‌లో అత్యధికంగా శోధించే సెలబ్రిటీ సన్నీలియోన్‌ను ప్రియావారియర్ అధిగమించింది. ఇప్పుడు మోస్ట్ సెర్చ్‌డ్ సెలబ్రిటీ తనే! కన్నుగీటడంలో తనూ పీహెచ్‌డీ ఏం చేయలేదు. కన్ను గీటడంలో తనేం శిక్షణ పొందలేదు. అయినా లోకం ఆమెకు ఫిదా అయ్యింది. ఇందులో తన గొప్పెంత ఉందో... దీన్ని ఆస్వాదించిన కళ్లదీ అంతేగొప్ప. సున్నిత భావాలకు దూరంగా...మోడుబారిన వృక్షాలపై తొలకరి చినుకుల్లా కురిసిందా కన్నుగీటు సుందరి.

అంతే ఒక్కసారిగా లోలోపల దాగున్న సున్నితత్వం ఇంతలా పరిమళించింది. కన్నుగీటడం ఇప్పుడే కాదు.. .ఎప్పుడూ సంచలనమవుతూనే ఉంది... కావాలంటే మీరే చదవండి.

చిన్నప్పుడు సరదాగా కన్నుకొట్టి సరసం ఆడిన సంఘటనలు ప్రతి ఒక్కరి జీవితంలో ఉంటాయి. ప్రియావారియర్ కన్నుకొట్టే దృశ్యాన్ని చూసి.. 'నా కళ్లు చెబుతున్నాయి.. నిను ప్రేమించానని' అంటూ పాత జ్ఞాపకాల్లోకి వెళ్లేవాళ్లుంటారు. అలాగని కళ్లకు నచ్చినవన్నీ సొంతం అవ్వవు. 'కన్నులతో చూసేవి గురువా.. కనులకు సొంతమవునా' అన్నది అందుకే! మనసు లోతుల్లో గూడుకట్టుకున్న ఆ ప్రేమను కొందరు అర్థం చేసుకోలేరు. 'కన్నుల బాసలు తెలియవులే.. కన్నెల మనసులు ఎరుగములే' అనీ పాడుకుని బాధను దిగమింగుకోవాల్సి వస్తుంది. కళ్లు పలికించే ఆ సరసం విరిగిపోతే.. చూపులు చురకత్తుల్లాగే ఉంటాయి. 'కళ్లలోకి కళ్లు పెట్టి చూడవెందుకు.. చెప్పలేని గుండెకోత పోల్చుకుందుకు' అని మధనపడాల్సి వస్తుంది. కళ్ల సైగలతో మాట్లాడుకునేంత దగ్గరైన ప్రేమ.. రెండు గుండెల్ని తాకిందనుకోవచ్చు. 'కళ్లు కళ్లు ప్లస్సు.. వాళ్లు వీళ్లు మైనస్.. ఒళ్లు ఒళ్లు ఇన్ టు.. చేసేటి ఈక్వేషన్'లా కథ మొత్తం మారిపోతుంది. అప్పుడా ప్రేమకు హద్దులు ఉండవు. ఎందుకంటే ప్రేమ గుడ్డిది. లేకపోతే.. ప్రియా వారియర్ కన్ను కొట్టిన దృశ్యాన్ని.. అందరూ గుడ్డిగా ఎందుకిలా పదే పదే చూస్తున్నారు చెప్పండి?


ముఖం కింది భాగం సులభంగా కదులుతుంది. అంటే.. పెదవులు, బుగ్గలు, నోరు, ముక్కు.. వీటిని అవలీలగా కదిలించి.. భావోద్వేగాలను వ్యక్తపరచవచ్చు. ముఖం పైభాగాన్ని ఇంత సులభంగా కదిలించలేం. కారణం మన మెదడు అడుగు భాగంలోని మోటార్ న్యూక్లియర్స్. కదలికలకు కేంద్రమైన ఈ నాడీ కణ సముదాయమే.. ముఖకవలికల్ని నియంత్రిస్తుంది. కనురెప్పల్ని పైకెగరేసి కన్నుకొట్టాలంటే.. మనసులో సంకల్పిత చర్య జరిగాకే సాధ్యమవుతుంది. పెదాలతో చిరునవ్వు నవ్వి.. మన ఆనందాన్ని వ్యక్తపరిచినంత సులభంగా.. కన్నుకొట్టలేం.




■ పదేళ్ల కిందట రిపబ్లికన్ పార్టీ తరపున వైస్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో పాల్గొన్నప్పుడు సరాపాలిన్ కన్నుకొట్టారు. ఆమె ఏకంగా ఆరుసార్లు కన్నుకొట్టడంతో అప్పట్లో అదో సంచలనవార్త అయ్యింది.

■ ఆస్ట్రేలియాకు చెందిన టోనీ అబోట్ కూడా కన్నుగీటిన ప్రముఖుల జాబితాలో చేరిపోయారు. రేడియోలో బడ్జెట్ మీద చర్చాకార్యక్రమం నడుస్తోందప్పుడు. పన్నుల విధానంపై ఒక సెక్స్‌వర్కర్ అడిగిన ప్రశ్నకు.. రేడియో జాకీని చూస్తూ.. ఆయన కన్నుగీటి నవ్వారు.

■ అమెరికాలోని శ్వేతసౌధంలో ఆహ్వానవేడుక అట్టహాసంగా జరుగుతోంది. జార్జ్ డబ్ల్యు బుష్ ప్రసంగిస్తున్నారు. ఎలిజబెత్ క్వీన్ గురించి చెబుతున్నప్పుడు.. 1976కు బదులు 1776 సంవత్సరం అంటూ పొరపాటు దొర్లింది. తప్పును గ్రహించానంటూ కన్నుగీటి మరీ సరిదిద్దుకునే ప్రయత్నం చేశాడాయన.





■ రియో ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో పాల్గొంది హెర్నాండెజ్. పోటీలో విన్యాసం చేస్తూ.. జడ్జిలవైపు చూసి కన్నుకొట్టింది. అప్పట్లో అదో పెద్ద సంచలనం అయ్యింది.

■ ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్ కూడా.. వాణిజ్య ప్రకటనల్లోని తన బేబీ కూడా కన్నుకొట్టించింది.

■ ఇతరుల్ని ఆటపట్టించేందుకు మరో వ్యక్తిని చూస్తూ కన్నుకొడుతుంటారు.

■ ఉత్తినే, ఊరికే.. అంటూ తాత్కాలికంగా నిజాన్ని దాచిపెట్టే సందర్భంలోనే ఇలా చేస్తుంటారు.

■ తమకు తామే అవాక్కయిన సందర్భంలో 'అబ్బా.. ఛా' అంటూ కళ్లు మిటకరించే వాళ్లున్నారు.

■ ప్రేమికులు, స్నేహితులు, భార్యాభర్తలు.. ఇలా చనువున్న బంధాల్లో కన్నుగీటడం సహజం.

■ ఇద్దరి మధ్య ప్రేమ మొలకెత్తడానికి చూపులు కలిసిన శుభవేళ తప్పనిసరి. ఆ చూపులు వలచి.. మనసులు మురిసి.. హృదయాలు ఒక్కటయ్యాక.. కన్నుకొట్టని కొంటెతరం ఉంటుందా?

■ కారు ముందు అద్దానికి వైపర్స్ ఉన్నట్లే.. మన ముఖాలకు కనురెప్పలు అలాంటివన్న మాట. లవర్స్‌కు ప్రేమదారి చూపించే వైపర్స్ కళ్లు.







■ తల్లీ బిడ్డల మధ్య అల్లుకున్న మాతృబంధంలోని చిలిపితనం.. అప్పుడప్పుడు కన్నుగీటేలా చేస్తుంది. పిల్లలు ముద్దుమాటలు చెబుతున్నప్పుడు.. చిలిపిచేష్టలతో అల్లరి చేస్తున్నప్పుడు.. కనుసైగలు మురిపిస్తాయి.

■ కను సైగలతోనే భయపెట్టేవాళ్లున్నారు. మాటలతో కాకుండా.. కేవలం చూపులతోనే అంతరార్థాన్ని గ్రహించవచ్చు.

■ ఆసియాలో కన్ను గీటడం కొంచె చిలిపితనంగా ఎక్కువగా భావిస్తారు. అదే యూరప్‌లోనైతే పెద్దలు ఏదైనా మాట్లాడుకోవాల్సిన సమయంలో చిన్నపిల్లలు ఇక్కడి నుంచి వెళ్లాలని చెబుతూ ఇలా చేస్తారు.

ఓ..ఎస్..బైక్

బుల్లి స్కూటర్‌లో ఆండ్రాయిడ్



కాలేజీ క్యాంపస్‌ల్లోనో... కాలనీ గల్లీల్లో చక్కర్లు కొట్టేందుకు ట్రెండీగా కుర్రోళ్లకు పరిచయం కానుందీ బుల్లి ఎలక్ట్రిక్ స్కూటర్. ఆండ్రాయిడ్ ఓఎస్‌తో ప్రపంచంలోనే తొలిసారి ముస్తాబైయిందీ బైక్. దీని పేరు 'సిటీ కనెక్ట్'. ఫ్రెంచ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆర్చోస్ దీని రూపకర్త. హ్యాండిల్ భాగంలో ఐదు అంగుళా తాకేతెరతో ఫోన్‌లా కనిపించే డిస్‌ప్లేని ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ ఓరియో ఓఎస్‌తో పని చేస్తుంది. ర్యామ్ 1జీబీ. ఇంటర్నల్ మెమొరీ 8జీబీ. స్కూటర్ మోటార్‌తో ఇది కనెక్ట్ అయ్యి పని చేస్తుంది. దీంతో దీనిపై ప్రయాణించే వారిని నిత్యం ట్రాక్ చేయొచ్చు. బైక్ బ్యాటరీ సామర్థ్యాన్ని తెరపై నిత్యం చూపిస్తుంది. ఎంత వేగంలో వెళ్తున్నామో కూడా తెరపై చూసి తెలుసుకోవచ్చు. లోకల్‌గా ఎక్కడికి వెళ్లాలన్నా మ్యాపింగ్ పెట్టుకుని దూసుకెళ్లొచ్చు. గూగుల్ ప్లే నుంచి ఆప్స్‌ని ఇన్‌స్టాల్ చేసుకునే వీలుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 25 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. వేగం గంటికి 25 కిలోమీటర్లు. నెలాఖరులో జరగనున్న 'వరల్డ్ మొబైల్ కాంగ్రెస్-2018'లో దీన్ని ప్రదర్శించనున్నారు.



...అలాగైతేనే ప్రేమించండి

మనసులో మాట

తూర్పుగోదావరి జిల్లా నాది. ప్రకాశం జిల్లాలో డీఈడీ చేయడానికి వెళ్లాను. అక్కడ సార్ తొలిరోజు అందరినీ పరిచయం చేసుకొమ్మని చెప్పారు. ఆ ప్రక్రియ సాగుతుండగా ఒక మధురమైన గొంతు 'మే ఐ కమ్ ఇన్ సార్' అంటూ అందరి చెవులనూ పలకరించింది. ఆ శ్రావ్యమైన స్వరం విని గుమ్మం వైపు తలతిప్పని వారుంటే ఒట్టు. ఎవరీ అమ్మాయి అని చూడాలనుకున్న వారందరి ఆశలు అడియాశలయ్యాయి. ఆ అమ్మాయి ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని వచ్చింది. నేను ఆ స్వరానికి ఫిదా అయిపోయాను. తన పేరు అయిషా. కొన్ని రోజులకు పరిచయం అయ్యింది. తన డ్రెస్, గాజులు, రింగులు ఇలా అన్నీ నాకు నచ్చేవి. తన మాటలు నన్ను వెంటాడేవి. తనంటే చాలా ఇష్టం ఏర్పడిపోయింది. మొదట స్నేహితులుగా దగ్గరయ్యాం. తర్వాత నా మనసులో మాట చెప్పాను. ఆమె ఇష్టాన్నీ చెప్పేసింది. ఇద్దరం బాగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి అప్పుడు ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకోవాలని అనుకున్నాం. అవుట్‌డోర్స్ టీచింగ్, ప్రాజెక్టు వర్క్స్... అంటూ మేం కలిసి ఉండే అవకాశం ఎక్కువగా ఉండేది. ప్రేమలో ఉన్నప్పుడు ఎన్ని సంవత్సరాలైనా క్షణాల్లా గడిచిపోతాయి. ఇలా టీచర్ ట్రైనింగ్ రెండేళ్లు రెండు వసంతాల్లా కరిగిపోయాయి. ఇంతలో డీఎస్సీ-2014 నోటిఫికేషన్ వచ్చింది. ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలని విజయవాడకు కోచింగ్ వెళ్లాను. రోజూ ఫోన్లో మాట్లాడుకునే వాళ్లం. డీఎస్సీలో పోస్టు సాధించలేకపోయాను. నా కలలు చెదిరిపోయాయి. జీవనం గడవడానికి ఒక పత్రికలో విలేకరిగా చేరాను. తనకు ఇంట్లో వేరే సంబంధం చూస్తున్నారని ఒకసారి తను చెప్పింది. ఏంకాదులే అని నేను ధైర్యం చెప్పాను. ఇంతలో అమ్మకు గుండె నొప్పి వచ్చింది. హాస్పిటల్ స్టంట్ వేయించాల్సి వచ్చింది. ఇలా వారం రోజులు అక్కడే ఉండిపోయాను. ఆ రోజు తను ఫోన్ చేసింది... "నువ్వు లేకుండా బతకలేను. ఇంట్లో నాకు వేరే పెళ్లి చేస్తున్నార"ని ఏడ్చింది. నాకు ఏం చేయాలో పాలుపోలేదు. వెంటనే తనకు సంబంధం వచ్చిన అబ్బాయి వాళ్ల ఫోన్ నంబర్ తీసుకొని మా ప్రేమ విషయం చెప్పాను. ఇక తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. తన నుంచి కాల్ లేదు. నేను హాస్పిటల్ నుంచి అమ్మను తీసుకొని ఇంటికి వచ్చి... తన కోసం వాళ్ల ఊరెళ్లాను. వాళ్లంటికి తాళం వేసింది. తను ఆచూకి గురించి తన ఫ్రెండ్స్ అందరినీ అడిగాను. తెలియదన్నారు. తన అడ్రెస్ కోసం వెదకని ప్రదేశమంటూ లేదు. మూడేళ్లవుతోంది. తన ధ్యాసలోనే ఉండిపోయాను. తన కోసం ఎదురుచూసే నా కళ్లలో తడి ఆరిపోవడం లేదు. తనని తలవని క్షణం లేదు. ఉద్యోగం సాధించలేక, సరైన సమయానికి సరిగ్గా స్పందించలేక ప్రేమలో ఓడిపోయాను. ప్రాణంగా ప్రేమించిన అమ్మాయిని పోగొట్టుకున్నాను. ప్రేమిస్తే సరిపోదు... దాన్ని దక్కించుకొనే ధైర్యం, సాహసం చేయగలగాలి. అప్పుడే ప్రేమించండి.



– రాజు

'కుర్రా'క్

అవకాడో.. చెలికాడు

కొన్ని తుంటరి ఆలోచనలు మనసును తుళ్లి పడేట్లు చేస్తాయి. అవకాడో లవ్ ప్రపోజల్ అలాంటిదే. తినే అవకాడో పండు ఇప్పుడు ప్రేమను వ్యక్తం చేయటానికి ఉపయోగపడుతోంది. ఈ మధ్యకాలంలో ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్ లాంటి పేజీల్లో 'అవకాడో ప్రపోజల్' అంటూ ట్యాగ్స్ ఎక్కువయ్యాయి. అమెరికా, యూరప్ దేశాల్లో ఇపుడిదో కొత్త ట్రెండ్. అవకాడో పండును సగానికి కోస్తారు. పండు మధ్యలో ఉండే గింజను తీసి కోడిగుడ్డు ఆకారంలో ఉండే భాగంలో ఉంగరాన్ని అమర్చుతారు. ప్రేమికురాలి దగ్గర అవకాడో పండులోని ఉంగరాన్ని తీసి వేలికి తొడుగుతారు. పెళ్లి ఫిక్స్ అయిన వాళ్లు కూడా ఇలాంటి అవకాడో ప్రపోజల్స్ చేస్తున్నారు. వాటిని సోషల్ వెబ్‌సైట్స్‌లో షేర్ చేస్తున్నారు. అమ్మాయిలు మాత్రం 'ఇదో కొత్తరకం పచ్చని ప్రేమానుభూతి' అంటున్నారు. కూలెన్ డెక్ అనే ఫుడ్ స్టైలిస్ట్ మొన్న ప్రేమికుల రోజుకి ముందు 'అవకాడోప్రపోజల్' అంటూ సరదాగా ఓ ఫొటోను ఇన్‌స్టగ్రామ్‌లో షేర్ చేశాడంతే. పదకొండువేల లైక్స్, రెండువేల కామెంట్స్ వచ్చాయి. అందరూ భలే అన్నారు. ఫాలో అయ్యారు. ఇదీ అవకాడో ప్రపోజల్ వెనకున్న అసలు కథ!





ప్రారంభాలు ఘనం... చెల్లింపులు గగనం

- బిల్లులు పూర్తిగా ఇవ్వకుండానే సామూహిక ప్రారంభోత్సవాలు
- గ్రామీణ గృహ నిర్మాణ లబ్ధిదారులకు తప్పని అవస్థలు

ఈనాడు - అమరావతి

ప్రభుత్వ పథకాల్లో భాగంగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది... అధికారులు అట్టహాసంగా ప్రారంభించారంటే అర్థమేంటి? ప్రభుత్వ పరంగా లబ్ధిదారులకు చిట్టచివరి చెల్లింపులు కూడా జరిగిపోయాయనే కదా. కానీ వాస్తవంలో అలా లేదు. అక్టోబరు 2న రాష్ట్ర వ్యాప్తంగా సామూహికంగా ప్రారంభించిన 1,01,486 ఇళ్లకు సంబంధించి బిల్లులు దక్కని బాధితులెందరో! గత మూడు నెలల వ్యవధిలో మరో లక్షకుపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పూర్తయిన ఇళ్ల నిర్మాణ సంఖ్యను ఎప్పటికప్పుడు పెంచుతూ వస్తున్న యంత్రాంగం వాస్తవ పరిస్థితులపై దృష్టి పెట్టడం లేదు. "సామూహికంగా ప్రారంభించిన ఇళ్లకు ఇంకా బిల్లులు చెల్లించాల్సిన విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. కారణాలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం" అంటున్నారు గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు.

ఇళ్ల నిర్మాణాల్లో పారదర్శకత కోసం అనేక చర్యలు తీసుకున్నా బిల్లుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలను సాకులుగా పరిష్కరించలేకపోతున్నారు. నిర్మాణాలు పూర్తయ్యాయని చెబుతున్నా 35 వేలకుపైగా ఇళ్లకు ఇప్పటికీ తుది బిల్లులు చెల్లించని పరిస్థితి. అప్పులు చేసి పనులు చేపట్టి మొదటి బిల్లుల కోసం 52 వేలకు పైగా కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సంయుక్తంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణం పేరుతో పాత, కొత్తవి కలిపి 12.97 లక్షల ఇళ్లను దశల వారీగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో 11.80 లక్షలకుపైగా అర్హులను ఎంపిక చేసి 9.10 లక్షలకుపైగా ఇళ్ల పనులు ప్రారంభించారు. వీటిలో ఇప్పటివరకు రూ.4.29 లక్షలకుపైగా నిర్మాణాలను పూర్తి చేశామని గృహ నిర్మాణశాఖ వెల్లడించింది.

ఈయన మేడిద సుబ్బారావు, తూర్పు గోదావరి జిల్లా అల్లవరం మండలం ఎంట్రుకోన. ఇప్పటివరకు ఆయనకు రూ.1.14 లక్షలు చెల్లించారు. చివరి బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉంది. మిగతా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ అక్టోబరు 2న ప్రారంభించారు.





విశాఖ జిల్లా పాడేరులోని గుడివాడవీధికి చెందిన అల్లంగి జగదీశ్వరి ఇల్లు పూర్తయినట్లుగా అధికారులు నమోదు చేసుకున్నారు. రూ.41 వేలు ఇంకా రావాలి. తుది బిల్లుల కోసం ఆమె ఎదురు చూపులే మిగులుతున్నాయి.



అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం బీఎన్‌హళ్లికి చెందిన హనుమంతరాయుడు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయకపోయినా అధికారులు ప్రారంభించి ఫొటోలు తీసుకున్నారు. చివరి బిల్లు చెల్లించకపోవడంతో మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారు.



ఈ చిత్రంలోని వ్యక్తి మద్ది చినపోలయ్య, విజయనగరం జిల్లా సాలూరు మండలం పురోహితునివలస. గత ఏడాది ఆగస్టులో ఇల్లు మంజూరైనట్లు సమాచారమివ్వడంతో పనులు ప్రారంభించారు. రూ.లక్షకుపైగా అప్పులు చేసి ఆయన ఖర్చు చేశారు. మొదటి బిల్లు ఇప్పటికీ మంజూరు కానందున పనులు నిలిపివేశారు. రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా సంఖ్య ఇచ్చినా ఫలితం లేకపోయింది.

అక్టోబరు 2న ప్రారంభించి నిర్మాణం పూర్తయినట్లు చూపించిన గ్రామీణ ఇళ్లు ఇవే....

జిల్లా	ప్రారంభించిన ఇళ్లు
శ్రీకాకుళం	4976
విజయనగరం	6079
విశాఖపట్నం	7920
తూర్పు గోదావరి	12,188
పశ్చిమ గోదావరి	14,891
కృష్ణా	7775
గుంటూరు	9969
ప్రకాశం	6160
నెల్లూరు	7637
చిత్తూరు	6042
కడప	4380
అనంతపురం	7486
కర్నూలు	5983
మొత్తం	1,01,486

రుజువులుంటే నిరూపించండి

వైకాపా నేతలకు అచ్చెన్నాయుడు సవాలు

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వైకాపా శాసనసభ్యులను కొనడానికి తనతోపాటు మంత్రి కళా వెంకటరావు, సీఎం కార్యాలయానికి చెందిన సతీష్‌చంద్ర, మరికొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నామని ఆ పార్టీ నేతలు అనడం మంచిది కాదని.. రుజువులు ఉంటే తక్షణమే బయటపెట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాలు చేశారు. శుక్రవారం శ్రీకాకుళంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. హిందూజాకు సంబంధించిన బిల్లుల విషయంలో తిరిగి ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి మారిషస్ నుంచి నోటీసులు వచ్చాయని.. దీంతో దేశం పరువు పోయిందన్నారు. హిందూజాకు సంబంధించి ప్రధాన పాత్రదారి అయిన జగన్ హఠాత్తుగా పాదయాత్ర రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి వాటి నుంచి ఎలా బయటపడాలో ఆలోచనలో పడిపోయారన్నారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి వైకాపా శాసనసభ్యులను కొంటున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెరవెనుక ఉండి జగన్మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలు అధికారులను బెదిరించి దొంగ సంతకాలు చేయించారని.. రూ.లక్ష కోట్లు సంపాదించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. అధికారులలోకి రావాలన్న ఆలోచనతో అధికారులందరినీ భయాందోళనలకు గురిచేస్తున్నారని.. ఆయన అధికారంలోకి వస్తే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రికి ఏ చట్టం వర్తిస్తుంది?

- అప్పుడు హోదా వద్దని.. ఇప్పుడెందుకు పోరాటం
- వాస్తవాలు ప్రజలకు తెలియాలి: ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ఈనాడు డిజిటల్, అమరావతి: 'ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేం లేదని గతంలో ప్రకటించారు. ఇప్పుడా మాటలన్నీ ఎటు పోయాయి' అని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. వాస్తవాలన్నీ ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. శుక్రవారం విజయవాడలో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సోము వీర్రాజు మాట్లాడారు. 'అందోళనలు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.. ఇప్పుడెందుకు పోరాటాలు చేస్తున్నారు? ఈ విషయంలో ముఖ్యమంత్రికి ఏ చట్టం వర్తిస్తుంది. హోదా రాకపోతే నష్టం రూ.3వేల కోట్లేనన్నారు. హోదా ఇచ్చిన ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి జరగడం లేదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికే అధిక నిధులు వచ్చాయని ప్రకటించారు. మరి ఇప్పుడేమయింది. దీనిపై వివరణ ఆయనే ఇవ్వాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి మీద భాజపాకు ఉన్న చిత్తశుద్ధి ఎవరికీ లేదన్నారు. 2019 ఎన్నికలు తమ లక్ష్యం కాదని వెల్లడించారు.

జగన్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు: మంత్రి సుజయ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి కేసుల నుంచి బయటపడేందుకు కేంద్రంతో సన్నిహితంగా మెలగాలని చూస్తున్నారని మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు ఆరోపించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత ఇబ్బందుల్లో ఉన్న జగన్‌కు కేంద్రం అవసరం వచ్చిందని అభిప్రాయపడ్డారు.

నీ చరిత్ర.. నా చరిత్రపై చర్చకు సిద్ధం

జగన్‌కు మంత్రి ఆదినారాయణరెడ్డి సవాల్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి తీరు పట్ల రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల్ని అనుసరించి అభివృద్ధి, సంక్షేమం కోసం తాను, శాసనమండలి విప్ రామసుబ్బారెడ్డి కలిసి పనిచేస్తుంటే దానిని జగన్ పత్రిక, ఛానల్ వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. వాటాలు, కోటాలు పంచుకుంటూ నీచంగా కనిపిస్తున్నామా?.. అటూ ఆగ్రహం ప్రకటించారు. వైకాపా నుంచి తెదేపాలో చేరిన వృద్ధ తమను జగన్ జంతువులతో పోల్చారని, ఆ పోలిక ఆయనకే వర్తిస్తుందన్నారు. జగన్ దురాలోచనల వల్ల ప్రధానికి నోటీసులు వచ్చాయన్నారు. జగన్ కుటుంబ చరిత్ర, తన చరిత్రపై సచివాలయంలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. తమను విమర్శించే స్థాయి జగన్‌కు లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం పోరాడతామని, మునిగిన అధ్యాయాన్ని మళ్లీ తెరుస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అధికారులకు ప్రలోభ పెట్టి జగన్ ఐఏఎస్‌లను కొంప ముంచారన్నారు.

ఎల్ అండ్ టీ గోదాములో అగ్నిప్రమాదం

రూ. 6.20 కోట్ల నష్టం

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ఓబుళదేవర చెరువు మండల కేంద్రం సమీపంలో ఎల్అండ్‌టీ గోదాములో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో 86 అల్యూమినియం కండక్టర్ డ్రమ్ములు కాలిపోయాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు గోదాము నుంచి మంటలు వ్యాపించి, ఎగిసిపడ్డాయి. కదిరి నుంచి అగ్నిమాపకదళాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. కడప నుంచి కర్నూలు సమీపంలోని మదురగిరి వరకు ఏర్పాటవుతున్న 440 కేవీ లైన్‌కు అవసరమైన సామగ్రిని ఇక్కడ నిల్వ ఉంచారు. ప్రమాదంతో రూ.6.20 కోట్ల నష్టం వాటిల్లిందని గోదాము మేనేజర్ వెంకట్రామన్ చెప్పారు. ఎండకు పక్కన ఉన్న ఎండుగడ్డి అంటుకుని గోదాములోకి వ్యాపించిందని భావిస్తున్నారు.

ఆంధ్ర క్రీడాకారులకు మొండిచెయ్యి

- తెలంగాణ వారికి రూ.కోట్లు
- భారత బ్యాడ్మింటన్ సంఘం

కార్యదర్శి పున్నయ్యచౌదరి విమర్శ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు నజరానాలు ఇవ్వకుండా తెలంగాణ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు రూ.కోట్లు వెచ్చిస్తోందని భారత బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి (ఏపీఎస్) కేసీహెచ్ పున్నయ్యచౌదరి ఆరోపించారు. విశాఖలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్రీడా ప్రతిభ కేటాయింపు నిధులు ఇవ్వడంలో హరిస్తోందన్నారు. ఒక్క బ్యాడ్మింటన్ తప్ప మిగతా క్రీడలకు ఆసలు ప్రభుత్వ ప్రోత్సాహమే ఇవ్వడం లేదన్నారు. విశాఖలో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల నిర్వాహకుల ప్రభుత్వం కనీసం ఇవ్వాల్సిన మొత్తం కూడా మంజూరు చేయకపోతే టోర్నీలను క్రీడా సంఘాలు ఎలా నిర్వహిస్తాయని ప్రశ్నించారు.

అమరావతిలో 1000 ఫ్లాట్లు

- సీఆర్‌డీఏ ద్వారా నిర్మాణం
- వేలంలో విక్రయించాలని నిర్ణయం
- ముఖ్యమంత్రి సూత్రప్రాయ ఆమోదం
- మంత్రి నారాయణ వెల్లడి

ఈనాడు - అమరావతి

అమరావతి రాజధాని పరిధిలో సీఆర్‌డీఏ స్వయంగా 1000 ఫ్లాట్లు ఉండే బహుళ అంతస్తుల నివాస భవనాలు (అపార్ట్‌మెంట్) నిర్మించనుంది. వీటిని వేలం ద్వారా విక్రయించనుంది. శుక్రవారం సచివాలయంలో జరిగిన సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారని మంత్రి నారాయణ వెల్లడించారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి రూ.372 కోట్ల వ్యయం కానుందని అంచనా వేసినట్లు చెప్పారు. వీటిని ఒకేసారి నిర్మించాలా? వేర్వేరు ప్రాంతాల్లో నిర్మించాలా అన్న దానిపై సమాలోచనలు జరుగుతున్నాయన్నారు. చదరపు అడుగు రూ.2,700 నుంచి రూ.3000ల మధ్య ఉండొచ్చునని తెలిపారు. ప్రభుత్వమే వీటిని నిర్మించడం ద్వారా ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గాంధీనగర్, చండీగఢ్‌లలో ఇలాగే ప్రభుత్వ పరంగా నిర్మాణాలు జరిగినట్లు తెలిపారు. రాజధాని అమరావతి పరిధిలోని తలపెట్టిన 3,840 ఫ్లాట్ల నిర్మాణంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వీటిని ఏపీఎస్, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులకు కేటాయిస్తామని తెలిపారు. 274 కిలోమీటర్లలో సెంటర్ డివైడర్ మధ్య మొక్కలను నాటి కొత్త అందాలను తీసుకువచ్చేందుకు చేపట్టిన చర్యల్లో 75% పనులు పూర్తయినట్లు వెల్లడించారు. విజయవాడ నగరంలో కూడా పచ్చదనం తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 110 మున్సిపల్ కార్పొరేషన్లలో కమాండ్ కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. వీటిని సీఎం కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు.





హైకోర్టు భవన నమూనా ★ ఐటీ టవర్ నమూనా

తాత్కాలిక హైకోర్టు, ఐటీ టవర్లకు ఉత్తమ ఆకృతులు ఎంపిక చేయండి

రాజధాని అమరావతిలో నిర్మించే తాత్కాలిక హైకోర్టు భవనానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నియమించిన ఆర్కిటెక్ట్‌లు మొత్తం 12 నమూనా ఆకృతులు రూపొందించారు. ఐటీ టవర్లకు కూడా 19 సిద్ధమయ్యాయి. వీటిని సీఆర్‌డీఏ తన వెబ్‌సైట్‌లోను, సామాజిక మాధ్యమాల్లోను ఉంచింది. ఉత్తమమైన వాటిని ఎంపిక చేయాల్సిందిగా ప్రజల్ని కోరింది. తాత్కాలిక హైకోర్టుని 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తారు. నిర్మితప్రాంతం 1.8 లక్షల చ.అడుగులు. అంచనా వ్యయం సుమారు రూ.108 కోట్లు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని అమరావతికి తరలించేందుకు అనువైన వీగా ఎంపిక చేసిన కొన్ని భవనాలను హైకోర్టు నియమించిన కమిటీ ఇటీవల పరిశీలించింది. అవి నచ్చకపోతే కొత్త భవనాన్ని ఆరు నుంచి ఏడు నెలల్లో రాజధానిలో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. హైకోర్టు కూడా దీనికే మొగ్గు చూపింది. ఈ నేపథ్యంలోనే తాత్కాలిక హైకోర్టు ఆకృతిని ఎంపికచేసి, త్వరలోనే టెండర్లు పిలవాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. అమరావతిలో ఐటీ కంపెనీల కోసం సీఆర్‌డీఏ మొత్తం 10 లక్షల చ.అడుగుల నిర్మితప్రాంతంతో రెండు ఐటీ టవర్లు నిర్మించాలని నిర్ణయించింది. వీటికి సంబంధించి రూపొందించిన ఆకృతుల్ని ప్రజాభిప్రాయం కోసం ఉంచింది. ఈ ఆకృతుల్లో కొన్ని జంట టవర్లు ఉండగా, కొన్ని ఒకే భవనంగా రూపొందించారు.



గూడూరులో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విభజన హామీలకు భాజపా, తెదేపా తూట్లు

ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: 2014 ఎన్నికల సమయంలో తిరుపతి సభలో వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని తెలిపిన ప్రధాని నరేంద్రమోదీ ఇప్పుడెందుకు చెయ్యడం లేదని, పిడికెడు మట్టితో సరిపెట్టారని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రశ్నించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఆనాడు కాంగ్రెస్ పార్టీ విభజన చట్టంలో ఏపీకి ఐదేళ్లు ప్రత్యేకహోదా అందిస్తామని చట్టం చేస్తే.. రాజ్యసభలో ఇదే ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఐదేళ్లు చాలదు పదేళ్లు కావాలని మాట్లాడారని గుర్తుచేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో ప్యాకేజీ పేరుతో తాకట్టుపెట్టిన చంద్రబాబు ఆంధ్రులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. అమరావతిని ఢిల్లీ కంటే గొప్పగా తీర్చిదిద్దుతామన్న మోదీ, సింగపూరులా అభివృద్ధి చేస్తానన్న చంద్రబాబు నాలుగేళ్లయినా ఏం చేయలేకపోయారని నిలదీశారు.

జగన్ డైరెక్షన్‌లో సోము వీర్రాజు..

బుద్దా వెంకన్న విమర్శ

కృష్ణలంక, న్యూస్‌టుడే: తిరుపతి వెంకన్న సాక్షిగా నరేంద్రమోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు.. ఆ క్షేత్రంలోనూ భాజపా నాయకులు ఎందుకు మాపించడం లేదు.. అని శాసనమండలి విప్ బుద్దా వెంకన్న ప్రశ్నించారు. విజయవాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి డైరెక్షన్‌లో భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు నటిస్తున్నారని ఆరోపించారు. జగన్ ఏ స్క్రిప్ట్ రాసిస్తే వీర్రాజు ఆ విధంగా మాట్లాడుతున్నారని.. వీర్రాజు వైకాపా ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఆక్వాజోన్‌ల ఏర్పాటుకు కమిటీ

ఈనాడు, అమరావతి: అనధికారికంగా వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా మార్చి చేయడాన్ని నియంత్రించేందుకు, ఆక్వా కల్చర్‌లో క్రమబద్ధమైన వృద్ధిని సాధించేందుకు జోన్లు ఏర్పాటుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్వాసాగుకు విద్యుత్తు సరఫరా, రవాణా సదుపాయం, చెరువుల్లో నుంచి లోపలికి, బయటకు వెళ్లే నీటి వ్యవస్థ, అనుమతుల జారీలాంటి వాటిని గాడిలో పెట్టేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీకి మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా, మత్స్యశాఖ కమిషనర్ కన్వీనర్, సభ్యులుగా 9 మంది సభ్యులను నియమిస్తూ కమిటీ ఏర్పాటు చేశారు.

రెండో రాజధానిని సీమలో ఏర్పాటు చేయాలి

- 8 జిల్లాలకు పెంచాలి
- ప్రాజెక్టులపై తక్షణ దృష్టి అవసరం
- తీర్మానం చేసిన భాజపా నాయకులు

కర్నూలు వీక్షాంపు, న్యూస్‌టుడే: "ఆంధ్రప్రదేశ్ రెండో రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలి. తక్షణమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి" అని భాజపా నేతలు డిమాండ్ చేశారు. రాయలసీమ ముఖ్యనేతల సమావేశంలో తీర్మానం చేశారు. శుక్రవారం కర్నూలులో పార్టీ రాయలసీమ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ముఖ్య నాయకులు హాజరైన 16 అంశాలతో కూడిన తీర్మానం చేశారు. 'సీమలో అసెంబ్లీ నిర్మించి కర్నాటక, మహారాష్ట్ర తరహాలో ఆరు నెలలకోసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. తక్షణమే సచివాలయం, కొన్ని శాఖల భవనాలు, ముఖ్యమంత్రి నివాసం, గవర్నర్ తాత్కాలిక విడిది నివాసం ఏర్పాటు చేయాలి. 2018-19లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి. రైతుల ఆత్మహత్యలు, వలసలను నివారించేందుకు రూ.20 వేల కోట్ల నిధి ఏర్పాటు చేయాలి. పరిపాలన సౌలభ్యం కోసం రాయలసీమను ప్రస్తుతం 4 జిల్లాల నుంచి 8 జిల్లాలకు పెంచాలి. ఎన్టీ రామారావు ప్రారంభించిన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, గుండ్రేవుల, రాజోలిబండ ప్రాజెక్టులను 2019 నాటికి పూర్తి చేయాలి. రాయలసీమ అభివృద్ధి కోసం గతంలో ఉన్న రాయలసీమ అభివృద్ధి బోర్డును పునరుద్ధరించాలి. నిధులు కేటాయించి దీనికి చట్టబద్ధత కల్పించాలి..." అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు శాంతారెడ్డి, భారతీయ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కపిలేశ్వరయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరీషబాబు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానం విడుదల చేస్తున్న భాజపా నాయకులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

'చింతలపూడి' నిర్వాసిత రైతులకు పరిహారం తేల్చాలి: మధు

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చి తీరాలన్న డిమాండ్‌తో దిల్లీలో మార్చి 5, 6 తేదీలలో వామపక్షాలు ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు గిట్టుబాటు పరిహారం కోరుతూ చింతలపూడిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. దిల్లీలో చేయబోయే ఆందోళనకు ముందుగా గుంటూరులో 1న సన్నాహక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశం ద్వారా ఆందోళనకు తమతో చేతులు కలపున్న పార్టీలను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల నిర్వాసిత రైతులకు ఇచ్చే పరిహారం విషయంలో వివక్ష చూపుతోందన్నారు. పట్టిసీమ తరహాలో అందరికీ సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కూడా ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలన్నారు. పరిహారం విషయం తేలకుండా రైతుల సొమ్ము చెల్లించకుండా కాలువ తవ్వకం పనులు జరిపితే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు.

బాలికకు ముద్దు పెట్టి.. వివాదంలో బాలీవుడ్ గాయకుడు!

పాపోన్‌పై ఎన్‌సీపీసీఆర్‌లో ఫిర్యాదు

ముంబయి: ఓ టీవీ రియాల్టీ షోలో ఒక బాలికను ముద్దు పెట్టుకోవడంతో బాలీవుడ్ గాయకుడు పాపోన్ వివాదంలో చిక్కుకున్నారు. బాల గాయకులకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతల్లో ఒకరైన ఆతను బాలికకు ముద్దు పెడుతున్న వీడియో అంతర్జాలంలో చక్కర్లు కొట్టింది. దీంతో సుప్రీం కోర్టు న్యాయవాది రూనా భూయాన్ - పాపోన్‌పై 'పోక్సో' చట్టం కింద బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్)లో ఫిర్యాదు చేశారు. కాగా దీనిపై పాపోన్ వివరణ ఇస్తూ - తానెలాంటి తప్పు చేయలేదని, తనకెలాంటి దురుద్దేశం లేదని పేర్కొన్నారు. అప్పటికే ఈ వ్యవహారం వివాదంగా మారడం గమనించి పలువురు 'ఎన్‌సీపీసీఆర్' స్పందించాలని ప్రశ్నించారు. ఆయినా అలా జరిగినందుకు చింతిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. బాలిక తండ్రి కూడా గాయకుడికి బాసటగా నిలిచారు.

విశాఖలో రాజకీయ వేడి?

ఈనాడు-అమరావతి: తెలుగుదేశం, భాజపా మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు ఉద్ధృతంగా సాగుతున్న నేపథ్యంలో విశాఖ కేంద్రంగా మూడు రోజులపాటు జరుగుతున్న పెట్టుబడుల సదస్సుపై రాజకీయ వర్గాల దృష్టి కేంద్రీకృతమైంది. ఈ సందర్భంగా సీఎం, కేంద్ర మంత్రుల మధ్య జరిగే భేటీల్లో రాజకీయాలు ప్రస్తావనకు వచ్చే వీలుందా? అన్న చర్చ రెండు పార్టీల్లోనూ సాగుతోంది. పలువురు కేంద్ర మంత్రులు సదస్సులో పాల్గొనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు రోజులపాటు అక్కడే మకాం వేయనున్నారు. కేంద్ర మంత్రుల్తో రాష్ట్ర ప్రయోజనాల విషయంలో సానుకూలంగా ఉండే వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్‌ప్రభు సైతం మూడు రోజుల పాటు సదస్సులో పాల్గొంటారు. విశాఖలో శుక్రవారం రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీ కంభంపాటి హరిబాబు భేటీ అయిన సందర్భంగా.. రెండు పార్టీల అగ్రనేతల సమావేశం జరిగితే బాగుంటుందన్న చర్చ సాగింది. రెండు పార్టీల మధ్య రాజకీయ భేటీ ఏర్పాటయ్యేలా చూడాలన్న భావన వ్యక్తమైంది. శని, ఆదివారం విశాఖకు వచ్చే ముఖ్యమంత్రితో మంత్రి గంటా, కేంద్ర మంత్రులతో ఎంపీ హరిబాబు ఈ అంశాన్ని ప్రస్తావించాలని అనుకున్నారు. రెండు పార్టీల మధ్య విమర్శల దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇలాంటి రాజకీయ సమావేశం ఏమేరకు సాధ్యమన్న సందేహాలు ఉన్నాయి.

ధనుష్ క్షిపణి పరీక్ష దిగ్విజయం

బాలాసోర్: అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల బాలిస్టిక్ క్షిపణి ధనుష్‌ను భారత్ శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. 350 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అస్త్రాన్ని ఒడిశా తీరానికి చేరువలోని ఒక యుద్ధనౌక నుంచి ఉదయం 10.52 గంటలకు ప్రయోగించారు. ఇది పృథ్వీ క్షిపణికి సంబంధించిన నౌకాదళ వెర్షన్. నేల, సముద్రంలోని లక్ష్యాలను ఛేదించగలదు.

రాజస్థాన్ అసెంబ్లీలో దెయ్యాలపై చర్చ

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు శుక్రవారం అసాధారణ అంశంపై చర్చ చేపట్టారు. శాసనసభ ప్రాంగణంలో దెయ్యం ఉనికి గురించి మాట్లాడారు. 'శుద్ధి కార్యక్రమాలను జరిపించాలని స్పీకర్‌ను కోరారు. దాదాపు 17 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ భవనాన్ని నిర్మించారు. దానికి పక్కనే లాల్ కోటి శ్మశానవాటిక ఉంది. భాజపా ఎమ్మెల్యే హబీబుర్ రెహ్మాన్ గురువారం మాట్లాడుతూ.. ఈ ప్రాంగణంలో కొంతభాగం కూడా లోగడ శ్మశానంగా ఉండేదని, అందువల్ల అసెంబ్లీ భవనంలో దెయ్యాలు ఉండొచ్చని తెలిపారు. గత ఆరు నెల్లలో ఇద్దరు ఎమ్మెల్యేలు మరణించిన నేపథ్యంలో మిగతా శాసనసభ్యులు కూడా రెహ్మాన్ మాటలను సమర్థించారు. శుక్రవారం ఈ అంశంపై సభలో చర్చ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల లోపు సమావేశాలు ముగించాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి రాజేంద్ర రాథోడ్.. స్పీకర్‌ను కోరారు. అసెంబ్లీ భవనంలో దెయ్యం ఉన్నట్లు చర్చ జరుగుతోందని, శుద్ధి కార్యక్రమాలు జరిపించాలని పశుసంవర్ధక శాఖ మంత్రి ఓతారామ్ దేవసిని పలువురు సభ్యులు కోరినట్లు చెప్పారు. దీనిపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ కాలులాల్ గుర్జర్ సరదా వ్యాఖ్యానించారు. చర్చ సాగుతుండగా స్పీకర్ మేఘ్వాల్ జోక్యం చేసుకుంటూ.. "అంతుచిక్కని ఈ అంశం నా చెవిన కూడా పడింది. దీనిపై ప్రత్యేకంగా చర్చ జరగాలి" అని చెప్పారు.

రోదసిలోకి తొలి హైస్పీడ్ ఇంటర్నెట్ ఉపగ్రహాలు

లాస్ ఏంజెలెస్: అంతరిక్షం నుంచి అంతర్జాతీయ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను అందించే కార్యక్రమం కోసం అమెరికాకు చెందిన ప్రైవేటు రోదసి సంస్థ స్పేస్‌ఎక్స్ రెండు ఉపగ్రహాలను ప్రయోగించింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ వైమానిక స్థావరం నుంచి పునర్వినియోగ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరిగింది. ఇందులో స్పెయిన్‌కు చెందిన పీఏజెడ్ ఉపగ్రహం, స్పేస్‌ఎక్స్‌కు చెందిన రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాలు ఉన్నాయి. తాజా ప్రయోగం తర్వాత 11 నిమిషాలకు పీఏజెడ్ ఉపగ్రహం కక్ష్యలోకి చేరింది. ఇందులో అధునాతన రాడార్ పరికరం ఉంది. ఇది ప్రపంచం మొత్తాన్నీ 24 గంటల్లో కవర్ చేస్తుంది. వాణిజ్య, ప్రభుత్వ అవసరాలను తీరుస్తుంది. భూమిని రోజుకు 15సార్లు చుట్టివస్తుంది.

భారత సంతతి శాస్త్రవేత్తకు రూ.3.9 కోట్ల గ్రాంటు

హ్యూస్టన్: ప్రమాదకర లూపస్ వ్యాధికి సంక్లిష్ట చికిత్సను అభివృద్ధి చేసే దిశగా విస్తృత పరిశోధనలు చేపట్టేందుకుగాను భారత సంతతి శాస్త్రవేత్త చంద్ర మోహన్‌తో కూడిన ముగ్గురు పరిశోధకుల బృందానికి లూపస్ పరిశోధక కూటమి(ఎల్ఆర్ఏ) దాదాపు రూ.3.9 కోట్ల గ్రాంటును మంజూరు చేసింది. చంద్ర మోహన్ ప్రస్తుతం హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

స్వచ్ఛభారత్ చిహ్నంగా పేరొందిన 106 ఏళ్ల మహిళ మృతి

రాయ్‌పూర్: 'స్వచ్ఛ భారత్ అభియాన్' చిహ్నంగా పేరుగాంచిన 106 ఏళ్ల వయోవృద్ధురాలు కున్వర్‌బాయి శుక్రవారం మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లో 2016 నుంచి ఈమె పేరు ఒక్కసారిగా మారుమోగి పోయింది. తనకున్న మేకలను అమ్మేసి.....ఇంట్లో మరుగుదొడ్డి కట్టించుకున్న నేపథ్యంలో కున్వర్‌బాయి పేరు తొలిసారి వెలుగులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ ఏడాది ఆమెను కలుసుకుని గ్రామంలో జరిగిన బహిరంగసభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వచ్ఛభారత్ అభియాన్ చిహ్నంగా ఆమెనే ప్రకటించారు. వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను గురువారం ఆసుపత్రిలో చేర్పారు.

కారు రిమోట్ పేలి బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన అరవింద్


బొబ్బిలి (ఐజాడ్యం), న్యూస్‌టుడే: కారు రిమోట్ పేలడంతో బాలునికి తీవ్రగాయాలైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం కొత్తూరుకు చెందిన పాయం శ్రీను, రజిత దంపతుల కుమారుడు అరవింద్(9) గంటల తరగతి చదువుతున్నాడు. రోజులాగే పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చిన అరవింద్ రిమోట్ సాయంతో కారుతో ఆడుకొంటున్న క్రమంలో రిమోట్ ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో అరవింద్ ఎడమ అరచేయి నుజ్జునుజ్జైంది. కడుపు భాగంలో గాయాలై పేగులు కనిపిస్తున్నాయి. అరవింద్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పినట్లు తండ్రి శ్రీను 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

మరిన్ని కోణాలు



ఆస్తులు జప్తు చేస్తే వచ్చేది

రూ.4000 కోట్లే!



నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ చెల్లించిన ఆదాయపు పన్ను లెక్కల ప్రకారం వీళ్ల ఆస్తుల విలువ రూ.4000 కోట్ల వరకు ఉండొచ్చని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) భావిస్తోంది. వీటిని జప్తు చేయడం వల్ల ఆ మేరకు బకాయిను వసూలు చేసే అవకాశం ఉంటుందని అనుకుంటోంది. వీటికి తోడు ఈడీ జప్తుచేసిన వజ్రాలు, విలువైన రాళ్ల విలువ రూ.5,186 కోట్ల వరకు ఉండొచ్చు. వీటిని విలువ లెక్కించే నిమిత్తం ఇప్పటికే ప్రయోగశాలకు కూడా ఈడీ పంపింది. నీరవ్‌కు ముంబయి, సూరత్, పుణె, నాసిక్‌లో 25 వరకు స్థిరాస్తులు ఉండొచ్చని ఆదాయపు పన్ను శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వీటి విలువ రూ.1,500 కోట్లకు మించకపోవచ్చు. అలాగే మెహుల్ ఛోక్సీకి నాలుగు సెజులు, రెండు మాల్‌లు, ఆరు ఫ్లాటులు ఉన్నాయి. వీటి విలువ రూ.2,500 కోట్లకు పైనే. ఛోక్సీకి చెందిన ఆస్తుల వివరాలు కంపెనీల పద్దు పుస్తకాల్లో ఉన్నప్పటికీ, డొల్ల కంపెనీల పేరుతో ఇవి ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.



అలా తెరిచారు..

ఇలా మూసేశారు

నీరవ్ మోదీకి చెందిన 9 కంపెనీలు స్థాపితమైనప్పటి నుంచి ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకపోగా, రెండేళ్లలోనే వాటిని మూసేశారని తెలుస్తోంది. ఓ వార్త సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది. 2010లో ఈ తొమ్మిది కంపెనీలు ఏర్పాటయ్యాయి. 2012లో వీటిని మూసేశారు. ఈ 9 కంపెనీలకు నీరవ్ మోదీ సోదరుడు నీషల్ మోదీ డైరెక్టరుగా ఉన్నారు. రూ.11,400 కోట్ల కుంభకోణంలో నిందుతుడిగా ఈయన పేరును కూడా సీబీఐ చేర్చింది. మూసివేతకు ఈ కంపెనీలన్నీ ఒకే కారణాన్ని చూపాయి. 'స్థిరమైన వాణిజ్య కార్యకలాపాలు లేకపోవడంతో, ఆదాయాన్ని ఆర్జించే స్థితిలో లేమ'ని ఈ కంపెనీల బోర్డు తీర్మానాల్లో ఉంది. అయితే ఈ విషయంపై మెయిల్, ఫోను ద్వారా ఆ వార్త సంస్థ సంప్రదించగా నీరవ్ మోదీ, ఆయన న్యాయవాది విజయ్ అగర్వాల్ నుంచి ఎలాంటి స్పందన లేదు.

120 డొల్ల కంపెనీలపై దర్యాప్తు

నీరవ్, ఛోక్సీకి సంబంధమున్న 120 డొల్ల కంపెనీల్లో ఈడీ దర్యాప్తు నిర్వహిస్తోంది. ఇందులో నీరవ్‌వి 41 కంపెనీలు కాగా, గీతాంజలి జెమ్స్‌కు చెందినవి 79 కంపెనీలని ఈడీ అధికారి ఒకరు వెల్లడించినట్లు ఓ వార్తా సంస్థ పేర్కొంది. నీరవ్ మోదీ, నీషల్ మోదీ, మెహుల్ చోక్సీలు సుమారుగా 100 కంపెనీలకు డైరెక్టర్లుగా, భాగస్వాములుగా ఉన్నట్లు గుర్తించారని తెలిపింది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఈ కంపెనీలకు మళ్లించారా అనే విషయంపై ప్రస్తుత దర్యాప్తు జరుగుతోందని ఆ అధికారి వెల్లడించినట్లు పేర్కొంది.



కోయంబత్తూరులో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఫోరెన్సిక్ ఆడిట్‌ను

పీడబ్ల్యూసీకి అప్పగించలేదు: పీఎన్‌బీ

నీరవ్ మోదీ ఖాతాలపై ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించేందుకు ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)ను నియమించుకున్నట్లు వచ్చిన వార్తలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖండించింది. పీడబ్ల్యూసీపై సెబీ ఆంక్షలున్న నేపథ్యంలో అలాంటి ఆలోచనేమీ చేయలేదని పేర్కొంది. సత్యం కుంభకోణంలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో ఆడిట్ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం నుంచి పీడబ్ల్యూసీ, దాని నెట్‌వర్క్ సంస్థలపై జనవరిలో సెబీ ఆంక్షలు విధించింది. ఫోరెన్సిక్ ఆడిట్ విషయంపై స్టాక్ ఎక్స్ఛేంజీలకు అడిగిన వివరణకు స్పష్టతనిస్తూ ఆడిట్ బాధ్యతను అప్పగించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని పీఎన్‌బీ తెలిపింది. దిగ్గజ ఆడిట్ సంస్థల నుంచి బిడ్‌లను ఆహ్వానించామని పేర్కొంది. అయితే సెబీ ఆదేశాల దృష్ట్యా ఆడిట్ బాధ్యత అప్పగింతకు పీడబ్ల్యూసీని పరిగణనలోకి తీసుకోవడం లేదని వివరించింది.



వైదొలగిన ప్రియాంకా

నీరవ్ మోదీ బ్రాండుకు ప్రచారకర్తగా ప్రియాంకా చోప్రా తప్పుకున్నారు. రూ.11,400 కోట్ల మోసానికి పాల్పడిన ఆరోపణలపై నీరవ్ మోదీపై కేసు నమోదైనందున, ఇక నుంచి ఆయన బ్రాండుకు ప్రియాంకా ప్రచారం చేయదని ఆమె ప్రతినిధి వెల్లడించారు. ప్రచారం చేసే నిమిత్తం కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకునేందుకు ఆమె నిర్ణయించుకున్నారని తెలిపారు.

యాజమాన్యం మార్పుచేర్పులు ప్రభుత్వ చేతిలోనే

పీఎన్‌బీ యాజమాన్యంలో మార్పుచేర్పులపై నిర్ణయాన్ని ప్రభుత్వమే తీసుకుంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. పీఎస్‌బీ కుంభకోణం వ్యవహారంపై బ్యాంకుల బోర్డు బ్యూరో ఎలాంటి నిర్ణయాలు తీసుకోదని పేర్కొన్నాయి. మరోవైపు ఇప్పటివరకు జారీ చేసిన లెటర్ అఫ్ అండర్‌టేకింగ్స్‌ను (ఎల్‌ఓయూ) పరిశీలించుకోవాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీలు) ప్రభుత్వం ఆదేశించింది.




కోహ్లి కొనసాగుతారు: పీఎన్‌బీ

తాజా కుంభకోణం నేపథ్యంలో ప్రచారకర్త బాధ్యతల నుంచి విరాట్ కోహ్లి తప్పుకోనున్నారంటూ వచ్చిన వార్తలను పీఎన్‌బీ ఖండించింది. ఆ వార్తల్లో వాస్తవం లేదని, తమ ప్రచారకర్తగా కోహ్లి కొనసాగుతారని స్పష్టం చేసింది.

నగదు ఉపసంహరణ

పరిమితి విధించలేదు



నగదు ఉపసంహరణను రూ.3000కు పరిమితం చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో, ఇతర వార్తా సంస్థల్లో వచ్చిన వార్తలను పీఎన్‌బీ కొట్టిపారేసింది. అలాంటి పరిమితులేమీ విధించలేదని, ఆ వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది. ఎప్పుడూ ఉండే మాదిరే బ్యాంకింగ్ కార్యకలాపాలు సాగుతున్నాయని పేర్కొంది. ఎల్‌ఓయూల ఆధారంగా నీరవ్ మోదీకి ఇతర బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా పీఎన్‌బీ చెల్లించాలని ఆర్‌బీఐ, ప్రభుత్వం ఆదేశించినట్లు వచ్చిన వార్తలను కూడా బ్యాంకు ఖండించింది. అలాంటి ఆదేశాలేమీ రాలేదని పేర్కొంది.



మోసపూరిత పథకాలపై ఉక్కుపాదం

- నమోదిత పథకాల ద్వారానే నగదు వసూలు
- లేకపోతే ఏడేళ్ల జైలు ● స్థిరాస్తి, బంగారం పథకాలపై పరిశీలన

ఈనాడు, దిల్లీ: మోసపూరిత పథకాలతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసుకుని, పరారయ్యే వ్యాపారులకు అడ్డుకట్ట పడనుంది. స్థిరాస్తి, బంగారు ఆభరణాల వ్యాపారులు 'కచ్చితమైన ప్రతిఫలం' అందిస్తామని ప్రకటిస్తే, వాటిని సామూహిక మదుపు పథకాలుగా ప్రకటించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

✦ స్థిరాస్తి అభివృద్ధి సంస్థ కనుక, కొనుగోలుదార్లకు సదరు ఆస్తిని బదలాయించే వరకు 'స్థిర ప్రతిఫలం అందిస్తామనే' హామీపై నగదు వసూలు చేస్తే, వాటిని 'అనియంత్రిత డిపాజిట్లు'గా పరిగణించనున్నారు. ఎక్కువమంది స్థిరాస్తి వ్యాపారులు 9-14 శాతం మొత్తం ప్రతిఫలం ఇస్తామని చెబుతూ, డిపాజిట్ రూపేణ నగదు జమ చేసుకుంటున్నారు. మరికొందరు అభివృద్ధిదారులు కూడా కనీసం 10 నెలల పాటు వాయిదాల్లో నగదు చెల్లించాలని కోరుతున్నారు. అనంతరం, డిపాజిట్ల కాలావధికి అనుగుణంగా, నెలవారీ మొత్తంపై 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నారు. ఇవన్నీ అనియంత్రిత డిపాజిట్ల కిందకే వస్తాయి. అధిక కేసుల్లో స్థిరాస్తి అభివృద్ధి దారులు ప్రారంభంలో కొన్ని నెలల వాయిదాలు చెల్లిస్తారు. అనంతరం వారు చెల్లింపులు ఆపేస్తారు. ఇలాంటివి చట్టం ద్వారా నియంత్రించాల్సి ఉంది.

✦ ఇదేవిధంగా ఆభరణాల విక్రేతలు కూడా '11 నెలల పాటు నెలసరి వాయిదాలు చెల్లించండి, 12న వాయిదాను మా సంస్థ జమచేస్తుంది. ఈ 12 నెలల మొత్తాన్ని వినియోగించుకుని, మా విక్రయశాలోనే ఆభరణాలు కొనుగోలు చేసుకోవచ్చు' అని ప్రకటిస్తున్నాయి.

ఈ రెండు రకాల డిపాజిట్లు 'అనియంత్రిత డిపాజిట్ల నిషేధ బిల్-2018' పరిధిలోకి రానున్నాయి. మార్చి 5న ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశ పెట్టనున్నారు. మోసపూరిత సామూహిక మదుపు పథకాలపై ఉక్కుపాదం మోపడమే ఈ బిల్లు లక్ష్యం. నియంత్రణ, అనియంత్రణ పద్ధతుల్లో డిపాజిట్లు వసూలు చేసేవారంతా, సంబంధిత అధీకృత అధికారి వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదు చేయకుండా పథకాల రూపేణ నగదు వసూలు చేస్తే, ఏడేళ్ల జైలు శిక్ష విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈ బిల్లుకు కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించింది.



పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీల ప్రభావం తమ వ్యాపారంపై లేదని, బ్యాంక్ అనుబంధ గృహరుణ సంస్థ 'పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్' మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ గుప్తా చెబుతున్నారు. మసాలా బాండ్ల (రూపాయి రూపేణ విదేశాల్లో నిధుల సమీకరణకు జారీ చేసేవి) ద్వారా 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 3,250 కోట్లు) సమీకరణ ప్రణాళికపై యథాతథంతా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇందుకోసం వచ్చే సోమవారం లండన్ నుంచి ప్రచారం (రోడ్‌షో) ప్రారంభించనున్నామని 'కోజెన్సీస్' ఇంటర్వ్యూలో వివరించారు. ముఖ్యాంశాలివీ..

మసాలా వదిలిపెట్టం

- ఆ బాండ్ల ద్వారా నిధులు సమీకరిస్తాం
- పీఎన్‌బీ వ్యవహారాల ప్రభావం లేదు
- రేటింగ్ సంస్థలు కూడా గుర్తించాయ్



ఇంటర్వ్యూ

పీఎన్‌బీ హౌసింగ్ ఎండీ సంజయ్‌గుప్తా

✦ మా కార్యకలాపాలు వేరే

ఈ ఇష్యూ వాస్తవ సామర్థ్యం కంటే 30 శాతం తక్కువనే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూపొందించింది. ఇందువల్ల మధ్యకాల (5-10 ఏళ్లు) నిధుల సమీకరణ కార్యక్రమం, ఈ ఆర్థిక సంవత్సరం తగ్గే అవకాశం ఉంది. రూ.వేలకోట్ల కుంభకోణం తరవాత ప్రమోటర్ సంస్థ (పీఎన్‌బీ)పై రేటింగ్ సంస్థలు తీసుకునే చర్యల ప్రభావం, తమ నిధుల సమీకరణపై ఉండదు. ప్రమోటర్ సంస్థ నుంచి పీఎన్‌బీ హౌసింగ్ కార్యకలాపాలను వేరుగా చూడటమే ఇందుకు కారణం. పీఎన్‌బీలో కుంభకోణం వెలుగుచూశాక, తాము తీసుకునే రేటింగ్ చర్యల వల్ల పీఎన్‌బీ హౌసింగ్ రుణ పటిష్ఠతపై ప్రభావం చూపదని ఇండియా రేటింగ్స్ ప్రకటించిన సంగతి విదితమే. పీఎన్‌బీ హౌసింగ్‌లో పీఎన్‌బీకి 32.96 శాతం వాటా ఉంది. కుంభకోణం నేపథ్యంలో, నిధులు అవసరమై, హౌసింగ్ సంస్థలో తమ వాటాను ప్రమోటర్ అయిన పీఎన్‌బీ తగ్గించుకోవాలనుకున్నా, 2019 నవంబరు లోపు 20 శాతం కంటే తగ్గించుకునే అవకాశం లేదు. ఈక్విటీ మూలధనాన్ని పెంచుకునేందుకు 2020 తొలి త్రైమాసికం వరకు వేచి ఉండాలి.

✦ నెట్‌వర్క్‌లు సహా అన్నీ వేర్వేరు

పీఎన్‌బీ హౌసింగ్ నిర్వహించే నెట్‌వర్క్ సేవలు, ట్రెజరీ కార్యకలాపాలు, హార్డ్‌వేర్, ఇతర సేవలకు ప్రమోటర్‌తో సంబంధం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల మేరకు, ఉన్నత కార్పొరేట్ గవర్నెన్స్‌కు మేము కట్టుబడి ఉండాలి. ఇరు సంస్థలు, పరస్పరం తమ లాబీలు, నెట్‌వర్క్, హార్డ్‌వేర్, సర్వర్లు, ఇతర సదుపాయాలను కలిసి వినియోగించవు. పూర్తి భిన్నంగా ఉండాల్సిందే. కొన్నేళ్లుగా ఇది పాటించడం వల్ల, పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయగలిగాం.

✦ ఆ వార్తలు సరికాదు

మసాలా బాండ్ ఇష్యూ తరవాత పీఎన్‌బీ హౌసింగ్, ఐఎఫ్‌సీ కలిసి 'అందుబాటు ధర గృహనిధి' ఏర్పాటు చేయనున్నాయని వచ్చిన వార్తలు సరికాదు. మేము సేకరించిన నిధులను అందుబాటు ధర, పర్యావరణ అనుకూలంగా నిర్మించే వ్యక్తిగత నిర్మాణదార్లు, అభివృద్ధి సంస్థలకు రుణాలిచ్చేందుకు వినియోగిస్తాం. అందువల్ల దీనిని ప్రత్యేక నిధిగా చూడొద్దు.

✦ వృద్ధి అంచనాలు

గృహరుణ విభాగంలో అగ్రగామిగా ఉన్న సంస్థలు హేతుబద్ధత లేని వడ్డీరేట్లు నిర్ణయించారు. ఇది ఇతర సంస్థలకు ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఇదే విధానం కొనసాగితే, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ విస్తరణ 2018-19లో 10-12 బేసిస్ పాయింట్ల మేర తగ్గొచ్చు. ప్రస్తుతం పీఎన్‌బీ హౌసింగ్ వ్యాపార విస్తరణ 2.50 శాతంగా ఉంది. ఇది సంతృప్తికరమే. సామర్థ్యం మేరకు 1.5-1.7 శాతం వృద్ధి లభించవచ్చని, ఇందువల్ల ఆస్తుల నాణ్యత క్షీణించదని భావిస్తున్నాం. రుణాల జారీతో పాటు తిరిగి వసూలు అత్యంత కీలకం. ఈ అంశంలో మా విభాగాలు సమర్థంగా పనిచేస్తున్నాయి. తదుపరి 8 త్రైమాసికాల వరకు, మొత్తం వ్యాపారంలో వార్షిక వృద్ధి 32-33 శాతం ఉండాలని ఆశిస్తున్నాం.

✦ 8.85-8.90 శాతం వడ్డీ సహేతుకం

ప్రస్తుతం బాండ్లపై చెల్లిస్తున్న వడ్డీరేటును పరిగణనలోకి తీసుకుంటే, గృహరుణ వడ్డీరేటు 8.85-8.90 శాతం కంటే తక్కువ ఉండటం సరికాదు. కొత్త గృహ రుణాలను కూడా 8.35 శాతం, 8.50 శాతం వడ్డీపై ఇవ్వడం సరికాదు. పీఎన్‌బీ హౌసింగ్ నుంచి వేతన జీవులు-స్వయం ఉపాధి పొందేవారికి చలన ప్రాతిపదికన 8.60-10.75 శాతం, వృత్తి నిపుణులు కాకుండా స్వయం ఉపాధి పొందేవారికి 8.75-11.00 శాతం వడ్డీరేటు వసూలు చేస్తున్నాం. అయితే బజాజ్ ఫైనాన్స్ 8.30 శాతం, ఇండియాబుల్స్ హౌసింగ్ 8.35 శాతం నుంచి వడ్డీరేట్లు అమలు చేస్తుండటం గమనార్హం.

✦ అందుబాటు ధర గృహాలు కలిసొస్తున్నాయ్

అందుబాటు ధర గృహాల రంగంలో కొన్ని నెలలుగా చురుకుదనం కనపడుతోంది. అధిక ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఈ విభాగానికి అధిక రుణాలిస్తూ, ఖాతాదార్లను ఆకట్టుకుంటున్నాయి. అనైతికంగా, అత్యధిక రాబడులు ఆర్జించాలనే ధోరణి మా కంపెనీకి లేదు. అందువల్లే సంప్రదాయేతర వ్యాపారాలకు దూరంగా ఉన్నాం. ఆస్తులు తనఖా పెట్టుకునే రుణాలిచ్చే వ్యాపారం అసంఘటితంగానే ఎక్కువగా జరుగుతోంది. దీన్ని కూడా మేము గృహరుణ విభాగానికి సంబంధించినదిగా చూస్తున్నాం. ఖాతాదారు ఆర్థిక చరిత్ర, ఆస్తి విలువ వంటివి మదింపు చేశాక, స్వయంఉపాధి పొందేవారికి రుణాలిస్తున్నాం. అందువల్ల ఈ విభాగంలో నష్టభయం ఉండదు. తనఖా పెట్టుకున్న రూ.2,500-3,000 కోట్ల విలువైన ఆస్తులు విక్రయించాలనుకుంటే, 5-6 బ్యాంకులు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు.

ఎన్‌బీఎఫ్‌సీలకూ అంబుడ్స్‌మన్

ప్రారంభించిన రిజర్వ్ బ్యాంక్

ముంబయి: ఇటీవల నిర్వహించిన ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ప్రకటించినట్లుగానే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీలకు) కూడా అంబుడ్స్‌మన్ పథకాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రారంభించింది. ఈ పథకం కింద ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను ఇక్కడ పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించారు. ఈ పథకం కింద ఎన్‌బీఎఫ్‌సీలు అందించే సేవల్లో ఎదురయ్యే ఇబ్బందుల్ని అంబుడ్స్‌మన్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదుదారులు పరిష్కారం పొందవచ్చు. ఇందుకు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం చెన్నై, కోల్‌కతా, ముంబయి, దిల్లీ నుంచి అంబుడ్స్‌మన్ కార్యాలయాలు పని చేస్తాయి. ఆయా జోన్ల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని ఎక్కడికక్కడ పరిష్కరిస్తారు. డిపాజిట్లు సేకరించే అన్ని ఎన్‌బీఎఫ్‌సీల్ని ఈ పథకం కిందకు తీసుకొచ్చారు. రూ.100 కోట్లు, అంతకు మించి ఆస్తులున్న ఎన్‌బీఎఫ్‌సీలను కూడా భవిష్యత్తులో ఈ పథకం కిందకు తీసుకురావాలని ఆర్‌బీఐ భావిస్తోంది. అంబుడ్స్‌మన్ ఇచ్చిన పరిష్కారం నచ్చకపోతే అప్పిలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం అటు ఫిర్యాదుదారుడికి, ఇటు ఎన్‌బీఎఫ్‌సీకి కల్పిస్తూ అప్పిలేట్ యంత్రాంగాన్ని కూడా రూపొందించారు. ఇదిలా ఉంటే అంబుడ్స్‌మన్ పథకంలో తొలుత ఫిర్యాదుదారుడు సదరు ఎన్‌బీఎఫ్‌సీలో ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదును వారు తీసుకోకపోయినా, నెల రోజుల్లోపు సమాధానం ఇవ్వకపోయినా, ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోయినా ఫిర్యాదుదారుడు ఎన్‌బీఎఫ్‌సీ అంబుడ్స్‌మన్ పథకం కింద ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది.

నిఘా వ్యవస్థను పునఃసమీక్షించుకోవాలి

పీఎన్‌బీ మాజీ అధిపతి ఉషా సుబ్రమణియన్

ముంబయి: కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ (సీబీఎస్)కు స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీ కమ్యూనికేషన్)ను అనుసంధానం చేయకపోవడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల కుంభకోణం జరిగిన నేపథ్యంలో ఆ బ్యాంకు మాజీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ఉషా సుబ్రమణియన్ నిఘా వ్యవస్థ వైఫల్యంపై మాట్లాడారు. 'బ్యాంకులన్నీ నిఘా వ్యవస్థను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వ్యవస్థలో లొసుగులుంటే బయటపడతాయ'న్నారు. ప్రస్తుతం ఉషా సుబ్రమణియన్ అలహాబాద్ బ్యాంక్ ఎండీ, సీఈఓగా కొనసాగుతున్నారు. ఆమె మాట్లాడుతూ 'మా బ్యాంకులోనూ సీబీఎస్‌కు స్విఫ్ట్‌ను ఇప్పటిదాకా అనుసంధానించలేదు. ప్రస్తుతం ఆ పనిలోనే ఉన్నాం. సాంకేతికత వేగంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు మనం దాన్ని అందుకోలేకపోతే వ్యవస్థలో లొసుగులకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకులన్నీ తమ నిఘా వ్యవస్థను పునఃసమీక్షించుకొని భద్రతను పటిష్ఠం చేసుకొనే దిశగా చర్యలు తీసుకోవల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

ముమ్ముందూ ఆశావహమే..

- భరోసా నింపిన అక్టోబరు- డిసెంబరు
- 2018-19లోనూ అంచనాలను అందుకుంటాయ్

దిల్లీ

కార్పొరేట్ కంపెనీల లాభాదాయాల్లో ముమ్ముందూ వృద్ధి కొనసాగుతుందనే భరోసాను అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలు కల్పించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 2018-19లోనూ కంపెనీల ఫలితాల అంచనాలకు అనుగుణంగా ఉంటాయనే సంకేతాన్ని కూడా ఇచ్చాయని అంటున్నారు. నిఫ్టీ 50లో 31 కంపెనీల ఫలితాలు అంచనాలను అందుకోనప్పటికీ విశ్లేషకులు పై విధమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం గమనార్హం. 'బ్యాంకుల మొండి బకాయిలు పెరిగినప్పటికీ వరుసగా రెండో త్రైమాసికంలోనూ కొన్ని రంగాల ఆదాయ అంచనాలను పెంచడాన్ని మనం చూశామ'ని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో వెల్లడించింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా పుంజుకుంటోందనే విషయంపై అక్టోబరు- డిసెంబరు ఫలితాల ద్వారా మరింత స్పష్టత వచ్చిందని పేర్కొంది. తద్వారా 2018-19 ఆదాయాలపైనా ఆశావహ ధోరణిని, విశ్వాసాన్ని పెంచాయని వివరించింది. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో నిఫ్టీ- 50 కంపెనీల ఫలితాలపై విశ్లేషణ ఇలా..

* అక్టోబరు- డిసెంబరులో అంబుజా సిమెంట్స్ మినహా నిఫ్టీ 50 కంపెనీల నికర లాభం 12.7 శాతం పెరిగింది. రెండు త్రైమాసికాలుగా నికర లాభంలో రెండంకెల వృద్ధి నమోదుకావడం గమనార్హం.



నిఫ్టీ-50 కంపెనీలపై విశ్లేషకుల అంచనాలు

నిర్వహణ లాభాల్లోనూ 16.5 శాతం వృద్ధి ఉంది.

✦ నిఫ్టీ 50లో 29 కంపెనీలు ఆదాయ అంచనాలను అందుకోలేదు.

✦ ఐటీసీ, హిందుస్థాన్ యునిలీవర్‌లు అంచనాలకు మించిన ఫలితాలను ప్రకటించాయి. కొన్ని రోజులుగా జీఎస్‌టీ అమలు అనంతర అంతరాయాలు తగ్గుముఖం పట్టి వినియోగదారుల వ్యయాలు పెరగడంతో హెచ్‌యూఎల్ ఆదాయంలో వృద్ధి నమోదైంది.

✦ మారుతీ సుజుకీ మినహా మిగిలిన వాహన కంపెనీల్లో చాలా వరకు అంచనాలకు మించిన ఫలితాలను ప్రకటించాయి.

✦ వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లోహ, గనుల కంపెనీలు ఆకర్షణీయ పనితీరును కనబర్చాయి. లోహాల ధరల్లో పెరుగుదల ఇందుకు దన్నుగా నిలిచింది. వేదాంతా, టాటా స్టీల్, హిందాల్కోలు అమ్మకాల విషయంలో అంచనాలను మించినప్పటికీ, లాభంలో ఆ జోరును కనబర్చలేకపోయాయి.

✦ నిఫ్టీ- 50లో మూడు ఐటీ కంపెనీల నికర లాభం అంచనాలకు మించి నమోదైంది. అలాగే ఆదాయపరంగా ఈ కంపెనీలు పుంజుకుంటున్నాయనే సంకేతాలు కూడా అక్టోబరు- డిసెంబరులో కనిపించింది.

✦ చమురు-గ్యాస్, మౌలిక, వినియోగ ఆదారిత కంపెనీలు మెరుగైన లాభాలను నమోదు చేశాయి. ఔషధ, ఆర్థిక రంగ కంపెనీల పనితీరు నిరుత్సాహపరిచింది.

నిఫ్టీ- 200.. భేష్

దిగ్గజ కంపెనీలతో పోలిస్తే నిఫ్టీ-200 కంపెనీలే ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించాయి. నిఫ్టీ- 200లో ఇప్పటివరకు 181 కంపెనీలు ఫలితాలను ప్రకటించగా, వీటిల్లో 45.3 శాతం కంపెనీల ఫలితాలు అంచనాలకు మించి నమోదయ్యాయి. నిఫ్టీ-50లో 38 శాతం కంపెనీలు మాత్రమే విశ్లేషకుల అంచనాలకు మించి రాణించాయి. ఈ నేపథ్యంలో ముమ్ముందు నిఫ్టీ- 200 కంపెనీల ఆదాయాల్లో వృద్ధి మరింత మెరుగవ్వొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సెన్సెక్స్ ▲ 323
34142

నిఫ్టీ ▲ 108
10491

రూపాయి 64.73 ▲ 31 పైసలు
(ఒక అమెరికా డాలరుకు)

బంగారం 30570 ▲ రూ.లలో 15
(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)

వెండి 38390 ▲ రూ.లలో 75
ముంబయిలో కిలో

ముడి చమురు 67.12 ▲
(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,103	+141
నాస్‌డాక్	7,276	+66
నిక్కీ 225 (జపాన్)	21,893	+156
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,533	+45
షాంఘై(చైనా)	3,289	+21
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,244	−08
డాక్స్ (జర్మనీ)	12,484	−22

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.04	68.46
పౌండ్ స్టెర్లింగ్	82.36	95.53
యూరో	72.66	84.26
జపనీస్ యెన్/100	55.23	64.04
ఆస్ట్రేలియా డాలరు	46.22	53.49
సింగపూర్ డాలరు	44.70	52.96
థాయ్ బాత్/100	187.55	224.31
బహ్రెయిన్ దీనార్	159.88	183.22
కువైట్ దీనార్	179.06	222.91
సౌదీ రియాల్	15.70	18.61
యూఏఈ దిర్హమ్	16.07	18.79
మలేషియా రింగిట్	14.80	18.20
చైనీస్ యువాన్	7.24	11.75



శుక్రవారం నిఫ్టీ కదలికలు



రూ.200 కోట్లతో 500 విక్రయశాలలు

- రిటైల్ రంగంలోకి సెలెక్ట్ మొబైల్

హైదరాబాద్ (మాదాపూర్), న్యూస్‌టుడే: మొబైల్ రిటైల్ స్టోర్ల రంగంలోకి కొత్తగా 'సెలెక్ట్ మొబైల్ స్టోర్లు' రాబోతున్నాయి. రానున్న రెండేళ్లలో రూ.200కోట్ల పెట్టుబడులతో దేశవ్యాప్తంగా 500 స్టోర్లు ఏర్పాటుచేసే లక్ష్యంతో మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు సెలెక్ట్ మొబైల్ స్టోర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.గురుస్వామినాయుడు పేర్కొన్నారు. రానున్న మార్చి 15న మొదటి స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సంస్థకు సంబంధించి లోగోను మాదాపూర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విడుదలచేశారు. మొత్తం 1000 స్టోర్లను ఏర్పాటుచేసే ప్రణాళికతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. రానున్న మార్చిలో తెలంగాణ వ్యాప్తంగా 23, తిరుపతిలో 2 స్టోర్లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మొబైల్‌స్టోర్లకు విభిన్నంగా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేలా తమ స్టోర్లు ఉంటాయన్నారు. రూ.600 విలువ చేసే సెల్‌ఫోన్ల నుంచి రూ.60వేల విలువైన మల్టీబ్రాండ్ ఫోన్లు లభిస్తాయన్నారు. అన్ని స్టోర్స్ కంపెనీ ఆధ్వర్యంలోనే ఏర్పాటుచేస్తామన్నారు. స్టోర్స్‌లో సెల్‌ఫోన్ విడిభాగాలతోపాటు సర్వీసింగ్ సెంటర్లు ఉంటాయని చెప్పారు. సమావేశంలో సెల్కట్ మొబైల్ స్టోర్స్ డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేస్తే మంచిదే!

- హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఐపీఓపై సానుకూలంగా విశ్లేషకులు
- సోమవారం ఇష్యూ ప్రారంభం
- ధరల శ్రేణి రూ.263- 270

ముంబయి: హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూపై విశ్లేషకులు సానుకూల ధోరణితో ఉన్నారు. ఐపీఓలో షేర్ల కోసం సబ్‌స్క్రైబ్ చేసుకోవడం మంచిదేనని మదుపర్లకు సిఫారసు చేస్తున్నారు. కంపెనీకున్న పటిష్ఠ సామర్థ్యాలు, వృద్ధి ప్రణాళికల ఆధారంగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.300 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూలో భాగంగా 1.1 కోట్ల కొత్త షేర్లతో పాటు ప్రమోటర్లకు చెందిన 60 లక్షల షేర్లను విక్రయించనున్నారు.

సానుకూలతలు ఏమిటంటే..

✦ ప్రభుత్వం మౌలిక రంగానికి పెద్ద పీట వేస్తుండటం, బడ్జెట్లో ఈ రంగానికి భారీ మొత్తంలో నిధులు కేటాయించడం లాంటి అంశాలు హెచ్‌జీ ఇన్‌ఫ్రా లాంటి మౌలిక రంగ సంస్థలు రాణించేందుకు దోహదం చేస్తాయని ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ చెబుతోంది. అందువల్ల దీర్ఘకాల ప్రాతిపదికన ఈ కంపెనీ షేర్ల కొనుగోలుకు సిఫారసు చేస్తోంది.



✦ మౌలిక రంగ వృద్ధికి ఉన్న అవకాశాలు, కంపెనీ ప్రణాళికలను పరిగణనలోకి తీసుకొని హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఐపీఓపై సానుకూల ధోరణితో ఉన్నామని సెంట్రమ్ బ్రోకింగ్ తెలిపింది. అందువల్ల ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూలో పాల్గొనేందుకు సిఫారసు చేస్తున్నామని పేర్కొంది.

✦ కొత్త ఆర్డర్లు చేజిక్కించుకోకపోతే హెచ్‌జీ ఇన్‌ఫ్రా పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలూ లేకపోలేదని మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎప్పుడెప్పుడు.. ఎంతెంత

ప్రారంభం	: ఫిబ్రవరి 26 (సోమ)
ముగింపు	: ఫిబ్రవరి 28 (బుధ)
షేరు ధరల శ్రేణి	: రూ.263- 270
ముఖ విలువ	: రూ.10
లాట్ పరిమాణం	: 55 షేర్లు

పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను మూలధన నిధుల అవసరాలు, రుణాల చెల్లింపు, ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగించనుంది.

హెచ్‌జీ ఇన్‌ఫ్రా నేపథ్యం ఇది..

2003లో వ్యవస్థాపితం. రాజస్థాన్‌లోని జైపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. రహదారులు, వంతెనలు లాంటి మౌలిక వసతుల నిర్మాణ పనులు, అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలను నిర్వర్తిస్తోంది. 2012-2017మధ్య కంపెనీ ఆదాయం వార్షికంగా 34.3 శాతం వృద్ధి చెందగా.. నికర లాభం 37 శాతం పెరిగింది. నవంబరు 30 నాటికి హెచ్‌జీ ఇన్‌ఫ్రా వద్ద రూ.3780 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో 21 రహదారి ప్రాజెక్టులు, నాలుగు నిర్మాణ ప్రాజెక్టులు రెండు నీటి సరఫరా ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్డర్లు ఉన్నాయి.

మెర్క్ లాభంలో 40% వృద్ధి

ముంబయి: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మెర్క్ రూ.27.26 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.19.44 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 40.23 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.267.66 కోట్ల నుంచి 15.64 శాతం వృద్ధితో రూ.309.52 కోట్లకు చేరింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.11.71 నుంచి రూ.16.43కు పెరిగింది. ఇక డిసెంబరుతో ముగిసిన సంవత్సరంలో కంపెనీ రూ.93.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇది రూ.79.12 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.1054.18 కోట్ల నుంచి రూ.1143.42 కోట్లకు చేరింది. ఇక రూ.10 ముఖవిలువ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.15 డివిడెండు చెల్లించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

బీఎస్ఈలో షేరు 2.91 శాతం లాభంతో రూ.1485.95 వద్ద ముగిసింది.

పెరిగిన విదేశీ మారకపు నిల్వలు

ముంబయి: విదేశీ కరెన్సీ ఆస్తులు పెరగడంతో విదేశీ మారకపు నిల్వలు ఫిబ్రవరి 23వ తేదీతో ముగిసిన వారానికి 1.96 బిలియన్ డాలర్లు (రూ.12,740 కోట్లు) పెరిగి 421.72 బిలియన్ డాలర్లకు (రూ.27.42 లక్షల కోట్లు) చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. ఫిబ్రవరి 16తో ముగిసిన వారానికి ఈ నిల్వలు అంతక్రితం వారంతో పోలిస్తే 2.154 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.14,000 కోట్లు) తగ్గి 419.76 బిలియన్ డాలర్లు (రూ.27,28,440 కోట్లు)గా నమోదైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 9నాటికి విదేశీ మారకపు నిల్వలు రికార్డు స్థాయి అయిన 421.914 బిలియన్ డాలర్లకు చేరాయి. సమీక్షిస్తున్న వారానికి మొత్తం నిల్వల్లో ప్రధానమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.925 బిలియన్ డాలర్లు (రూ.12,512 కోట్లు) పెరిగి, 39,657 కోట్ల డాలర్ల (రూ.25.77 లక్షల కోట్లు)కు చేరాయి. బంగారం నిల్వల్లో ఎలాంటి మార్పు లేదు. ఇవి 21.514 బిలియన్ డాలర్లు (రూ.1,39,841 కోట్లు) ఉన్నాయి.

మార్కెట్ కబుర్లు

✦ వివిధ వ్యాపార విభాగాల్లో రూ.1,266 కోట్ల విలువైన ఆర్డర్లు చేజిక్కించుకున్నామని **ఎల్అండ్‌టీ** తెలిపింది. ఇందులో భవనాలు, పరిశ్రమల విభాగానికే రూ.928 కోట్ల విలువైన కాంట్రాక్టు లభించిందని పేర్కొంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 284 గృహ సముదాయ భవంతుల నిర్మాణం నిమిత్తం ఈ ఆర్డరు దక్కింది. విద్యుత్ సరఫరా, పంపిణీ విభాగానికి రూ.338 కోట్ల ఆర్డరు లభించింది.

✦ ఇన్ఫోసిస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మేనేజింగ్ డైరెక్టరుగా సలీల్ ఎస్ పరేఖ్ నియామక ప్రతిపాదనకు కంపెనీ వాటాదార్లు ఆమోదం తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఇ-ఓటింగ్ పద్ధతిలో ఆయన నియామకంపై వాటాదార్ల అనుమతిని అడగగా.. 97.96 శాతం మంది ఆయనకు అనుకూలంగా ఓటేశారని ఎక్స్ఛేంజీలకు **ఇన్ఫోసిస్** తెలిపింది.

✦ పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు విద్యుదుత్పత్తి సంస్థ **సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా** సెబీకి సంబంధింత దరఖాస్తు పత్రాలను సమర్పించింది. సింగపూర్ ఎక్స్ఛేంజీలో నమోదైన సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ప్రమోటరుగా ఉన్న సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియాకు భారత్‌లో థర్మల్, పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇష్యూలో భాగంగా 4,095 కోట్ల కొత్త షేర్లతో పాటు ప్రస్తుత వాటాదార్లకు చెందిన 14,67,74,194 షేర్లను విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన పత్రాల్లో పొందుపరిచింది.

✦ రూ.10 లక్షల ముఖ విలువ గల సెక్యూర్డ్, రెడీమబుల్ మార్పిడి రహిత డిబెంచర్ల (ఎన్‌సీడీలు)ను జారీ చేయడం ద్వారా రూ.3,000 కోట్లు సమీకరించినట్లు **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్** వెల్లడించింది. 2028 ఫిబ్రవరి 22న ఈ బాండ్ల గడువు తీరుతుంది. వీటి వార్షిక కూపన్ రేటు 8.43 శాతం. ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో ఈ బాండ్లు నమోదవుతాయి.

✦ ఉత్తరప్రదేశ్‌లో రహదారి ప్రాజెక్టు అభివృద్ధి నిమిత్తం జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి రూ.981 కోట్ల విలువైన కాంట్రాక్టును **సద్భావ్ ఇంజినీరింగ్** చేజిక్కించుకుంది. తక్కువ మొత్తానికి బిడ్ వేసి ఈ ఆర్డరును దక్కించుకుంది.

✦ అర్హులైన సంస్థాగత మదుపర్లు (క్యూఐపీ) ద్వారా రూ.3,500 కోట్లను విజయవంతంగా సమీకరించినట్లు టెలికాం దిగ్గజం **ఐడియా సెల్యులార్** ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కో ఈక్విటీ షేరును రూ.82.50 చొప్పున 42.42 కోట్ల షేర్లను కంపెనీ జారీ చేసింది.

✦ హైదరాబాద్‌లో **అరబిందో ఫార్మా**కు చెందిన యూనిట్-4కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఫారం 483 జారీ చేసింది. ఇందులో కొన్ని లోపాలు గుర్తించినట్లు కంపెనీ వర్గాల సమాచారం.

✦ బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా ఔషధ సంస్థ **జుబిలెంట్ లైఫ్ సైన్సెస్‌**లో 3 శాతం వాటాను రూ.455 కోట్లకు ఇద్దరు కంపెనీ ప్రమోటర్లు జుబిలెంట్ కన్జ్యూమర్, జుబిలెంట్ అడ్వైజర్స్ విక్రయించారు.

సూత్రధారులను గుర్తించండి

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు సెబీ ఆదేశం
- వాట్సాప్‌లో ఫలితాల లీకు కేసు

దిల్లీ: వాట్సాప్‌లో త్రైమాసిక ఫలితాల లీకుల ఘటనకు సంబంధించి.. సూత్రధారులను గుర్తించాల్సిందిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. బ్యాంక్‌లోని వ్యక్తులే ఈ పని చేసి ఉంటారని సెబీ ప్రాథమికంగా నిర్ధారించింది. ఇందుకు సంబంధించి బ్యాంక్ అధికారులతో పాటు వ్యక్తులను సైతం గుర్తించాలని సూచించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పలు కంపెనీల త్రైమాసిక ఫలితాలు అధికారికంగా విడుదల కాక ముందే. . వాట్సాప్‌లో లీకైన విషయం తెలిసిందే. అన్ని విభాగాలను బలోపేతం చేయాలని, భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు సెబీ ఆదేశించింది. ప్రస్తుత వ్యవస్థలు, అవి ఏ విధంగా బలోపేతం కావొచ్చు, ఇటువంటి వ్యవస్థలను పర్యవేక్షించే వ్యక్తులను సంబంధించిన వివరాలతో కూడిన నివేదిక సమర్పించాల్సిందిగా సైతం సెబీ బ్యాంక్‌ను ఆదేశించింది. దర్యాప్తును మూడు నెలల్లో ముగించాలని, అక్కడి నుంచి ఏడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సెబీ వెల్లడించింది.



ఎన్ని రోజులైందో..

- 323 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- కోలుకున్న రూపాయి

సమీక్ష


గత కొద్ది రోజులుగా కీలక స్థాయిలను కోల్పోతూ.. మదుపర్లను బెంబేలెత్తించిన సూచీలు ఒక్కసారిగా మళ్లీ విజృంభించాయి. చడీచప్పుడూ లేకుండా లాభాలను తెచ్చి.. తీపిని పంచాయి. బలమైన అంతర్జాతీయ సంకేతాలతో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో దాదాపు అన్ని రంగ షేర్లు కళకళలాడాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి కోలుకోవడం, మార్చి డెరివేటివ్ సిరీస్ ప్రారంభం సైతం కలిసొచ్చింది. ఆసియా షేర్లు రాణించగా, ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి. వారం మొత్తం మీద చూస్తే.. సెన్సెక్స్ 131.39 పాయింట్లు, నిఫ్టీ 38.75 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఫిబ్రవరిలో సూచీలు ఒక్కవారంలో సాధించిన అత్యధిక లాభం ఇదే.

సెన్సెక్స్ ఉదయం 33,832 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. తిరిగి 34,000 పాయింట్ల స్థాయిని అందుకుంది. ఇంట్రాడేలో 34,167 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 322.65 పాయింట్ల లాభంతో 34,142.15 దగ్గర స్థిరపడింది. ఫిబ్రవరి 15 తర్వాత సూచీకిదే గరిష్ఠ స్థాయి. ఇక నిఫ్టీ సైతం 108.35 పాయింట్లు పెరిగి 10,491.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,396.65- 10,499.10 పాయింట్ల మధ్య కదలాడింది.

గీతాంజలి నష్టాల్లోనే..: వరుసగా ఎనిమిదో రోజూ గీతాంజలి జెమ్స్ షేరు బలహీనపడింది. శుక్రవారం 4.98 శాతం కోల్పోయిన షేరు.. అనుమతించిన కనిష్ఠ పరిమితి (లోయర్ సర్క్యూట్) రూ.24.80 దగ్గర స్థిరపడింది. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం వెలుగుచూసినప్పటి నుంచి షేరు 60.5 శాతం పతనమైంది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.450.83 కోట్లు ఆవిరైంది.


సెన్సెక్స్ 30 షేర్లలో 25 లాభాలతో ముగిశాయి. టాటా స్టీల్ అత్యధికంగా 6.26% దూసుకెళ్లింది. సన్‌ఫార్మా 5.17%, యెస్ బ్యాంక్ 2.28%, డాక్టర్ రెడ్డీస్ 2.26%, భారతీ ఎయిర్‌టెల్ 2.26%, ఓఎన్‌జీసీ 2.04%, ఎన్‌టీపీసీ 1.43%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.34%, ఎస్‌బీఐ 1.28%, యాక్సిస్ బ్యాంక్ 1.24 శాతం, టీసీఎస్ 1.20%, పవర్‌గ్రిడ్ 1.20 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.14 శాతం చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్ (1.29%), కోల్ ఇండియా (0.48%), ఇన్ఫోసిస్ (0.42%)లు నష్టాలు చవిచూశాయి. లోహ, ఆరోగ్య సంరక్షణ, మౌలిక, విద్యుత్, బ్యాంకింగ్, పీఎస్‌యూ షేర్లు 3.16 శాతం వరకు పెరిగాయి.

టాటా స్టీల్



రూ.640.85 వద్ద ప్రారంభమై రూ.639 - 686.40 మధ్య కదలాడి క్రితం ముగింపు 637.55తో పోలిస్తే రూ.40.20 (6.31%) లాభంతో రూ.677.75 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 2,18,66,214.

గెయిల్




రూ.465.40 వద్ద మొదలై రూ.452.55-465.40 మధ్య చలించి క్రితం ముగింపు 466.15తో పోలిస్తే రూ.7.75 (1.66%) నష్టంతో రూ.458.40 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 41,27,768 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
బ్రిటానియా	4981.80	భారతీయ ఇంటర్నేషనల్	392.00
చోళమండలం ఫైనాన్స్	1426.35	కాస్మో ఫిలిమ్స్	285.10
డీమార్ట్	1306.00	ద్వితీయ ట్రేడింగ్	159.30
ఇప్కా ల్యాబ్స్	687.50	గ్లోబల్ ఇన్‌ఫ్రాటెక్	81.65
మైండ్ ట్రీ	819.80	గీతాంజలి జెమ్స్	24.80
		మ్యాక్స్ ఇండియా	95.25

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
23/02	5,344	5,831	−487	4,241	2,727	1514
22/02	7,595	9,931	−2,335	6,510	5,451	1,059
21/02	5,860	7,074	−1,214	4,218	2,843	1,375
20/02	3,053	3,903	−850	4,124	2,687	1437
19/02	3,368	4264	−896	3,121	2,534	587

23న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు



(100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	365
బెంగళూరు	385	చెన్నై	395
24వ తేదీకి...		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	363	నమక్కల్	380

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 406.50 (404.00) 1953157
AMBUJA CEMEN 260.20 (256.90) 2201036
ASIAN PAINTS 1101.80 (1118.10) 1140118
AUROBIND PHA 601.90 (586.85) 5799249
AXIS BANK LT 536.65 (530.25) 3888629
BAJAJ AUTO L 2986.40 (2974.30) 377558
BAJAJ FINANC 1633.40 (1600.35) 711474
BHARTI AIRTE 425.55 (416.10) 6763260
BHARTI INFRA 340.40 (333.85) 3108532
BOSCH LTD 18920.60 (18889.70) 11409
BPCL 429.90 (427.45) 3418049
CIPLA 595.65 (589.65) 1576584
COAL INDIA L 310.95 (311.55) 3195456
DR. REDDYS 2167.05 (2123.45) 743506
EICHER MOTOR 26724.40 (26868.50) 86803
GAIL 458.40 (466.15) 4127768
HCL TECH 955.60 (941.00) 2837583
HDFC 1824.20 (1819.25) 2023292
HDFC BANK 1880.55 (1853.20) 1019187
HERO MOTOCOR 3494.70 (3481.20) 142023
HINDALCO IND 246.55 (239.90) 6908252
HINDUSTAN UN 1323.15 (1326.45) 896708
HPCL 386.10 (384.10) 2025920
ICICI BANK 322.75 (318.35) 7949765
INDIABULLS H 1283.65 (1267.40) 1179582
INDIAN OIL 368.40 (363.20) 2608100
INDUSINDBANK 1643.50 (1623.50) 616552
INFOSYS LTD 1155.65 (1160.75) 4729914
ITC 269.05 (267.10) 6529253
KOTAK MAHIND 1080.85 (1072.50) 2272854
LARSEN & TOU 1301.70 (1292.00) 2176017
LUPIN 807.50 (800.05) 1754473
M&M 718.65 (721.95) 1648932
MARUTI SUZIK 8698.80 (8634.05) 567960
NTPC LTD 163.55 (160.75) 3809344
ONGC 189.80 (186.10) 4880302
POWER GRID C 193.25 (190.25) 6506718
RELIANCE IND 934.25 (924.35) 4850839
SBI 276.05 (272.60) 15482147
SUN PHARMA 569.65 (541.45) 30844893
TATA CONSULT 3075.80 (3050.20) 1681250
TATA MOTORS 360.20 (358.50) 6751064
TATA STEEL L 677.75 (637.55) 21866214
TECH MAHINDR 621.45 (602.60) 3490526
ULTRATECH 4116.40 (4099.90) 136480
UPL LIMITED 700.55 (675.45) 2454631
VEDANTA LIMI 337.90 (328.65) 11270987
WIPRO 295.00 (292.65) 3667414
YES BANK LTD 323.45 (316.10) 11399732
ZEE ENTERTAI 569.95 (567.05) 1052867

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1523.25 (1516.25) 34475
ACC 1651.45 (1632.35) 301333
ASHOK LEYLAN 134.40 (132.35) 7724163
AVENUE SUPER 1300.25 (1240.65) 1724635
BAJAJ FINSER 5019.65 (4951.85) 136396
BANK OFBAROD 145.55 (143.40) 14280404
BEL 150.95 (146.55) 11344848
BHEL 92.90 (91.25) 5903091
BRITANNIA 4961.90 (4855.85) 152705
CADILA HEALT 406.55 (400.65) 618503
COLGATE PALM 1049.80 (1042.15) 248270
CONTAINER 1329.75 (1332.70) 311096
CUMMINS INDI 820.30 (816.95) 190266
DABUR INDIA 330.60 (327.10) 2071180
DLF LIMITED 225.15 (219.85) 4446123
EMAMI LIMITE 1072.20 (1059.75) 34912
GLAXOSMI CON 6788.65 (6764.95) 18761
GLAXOSMI PHA 2404.70 (2411.95) 17257
GLENMARK PHA 534.30 (523.55) 929934
GODREJ CONSU 1048.20 (1042.05) 272575
HAVELLS INDI 507.70 (495.20) 1096165
HINDUSTAN ZI 328.00 (314.15) 3963412
ICICI PRU LI 408.50 (400.80) 536937
IDEA CELLULR 82.15 (81.20) 8054441
INTERGLOBE A 1285.00 (1275.45) 642218
JSW STEEL LT 306.95 (297.70) 4641724
LIC HOUS.FIN 517.65 (506.60) 1184937
MARICO LIMIT 306.65 (302.90) 901694
MCDOWELL 3238.85 (3157.30) 249224
MOTHERSON 318.90 (310.65) 8097594
MRF 72473.40 (70107.80) 7984
NHPC LTD 27.60 (26.60) 7747226
NMDC LTD 130.15 (126.65) 3376900
OIL INDIA 344.50 (340.25) 425682
ORACLE FIN S 4032.30 (4090.60) 103709
P&G HYG&HEAL 9355.05 (9407.65) 3176
PETRONET LNG 243.55 (240.70) 5663188
PIDILITE IND 900.70 (885.50) 901633
PIRAMAL ENTE 2623.90 (2590.10) 122361
PNB 113.45 (114.60) 45035931
POWER FIN CO 107.80 (104.65) 5622029
RURAL ELEC C 140.30 (136.65) 2495145
SAIL 87.05 (83.90) 17567924
SHREE CEMENT 17219.50 (16729.55) 14677
SHRIRAM TRAN 1322.85 (1298.45) 447273
SIEMENS 1172.10 (1193.20) 449737
SUN TV LTD 928.55 (908.30) 852264
TATA POWER 85.75 (84.90) 6224406
TITAN IND 814.20 (817.50) 2446637
TORRENT PHAR 1336.55 (1322.20) 103815

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 173.00 (168.30) 1272941
ADANI ENTERP 204.35 (203.30) 5007111
ADANI POWER 32.15 (31.05) 7417257
ALL BANK 52.20 (51.95) 3421153
AMARA RAJA 814.15 (795.55) 255893
ANANT RAJIND 57.50 (56.45) 841576
ANDHRA BANK 45.85 (45.55) 1639619
APOLLO HOSPI 1231.60 (1246.45) 361498
APOLLO TYRES 268.85 (262.95) 2901084
APTECH 325.10 (323.15) 835359
BAJAJ ELECT. 505.60 (500.35) 297187
BAJAJ HIND 12.95 (12.90) 1498963
BAJAJ HOLDIN 2737.10 (2712.95) 2975
BALAJI TELE 140.90 (140.10) 117032
BALLARPUR IN 13.85 (13.40) 935295
BALRAMPUR CH 116.40 (114.45) 2647876
BANK OF MAHA 16.75 (16.70) 661385
BANK OFINDIA 128.95 (129.00) 3975621
BATA INDIA 718.20 (698.60) 267871
BGR ENERGY S 118.90 (118.25) 43845
BHARAT FORGE 750.00 (756.20) 833265
BHUSHAN STEE 50.40 (48.95) 4637440
BIOCON LTD 628.25 (619.75) 7309244
BOMBAY DYE 280.00 (277.20) 3029496
CANARA BANK 313.85 (309.20) 2566173
CEAT LIMITED 1617.60 (1571.45) 571941
CENTRAL BANK 69.40 (65.50) 2554156
CHAMBAL FERT 157.50 (154.05) 265133
CHENNAI PETR 355.35 (351.05) 789900
CITY UNIBANK 170.25 (170.10) 296168
CORPO BANK 33.35 (32.70) 313968
COX & KINGS 239.75 (234.95) 94303
D B REALTY L 58.15 (55.50) 950026
DELTA CORP L 365.90 (348.90) 3637022
DENA BANK 20.90 (20.55) 1113525
DHANALAKBANK 23.10 (22.85) 360387
DIVIS LAB 1050.10 (1019.25) 806228
EDELWEISS CA 260.60 (257.50) 1008079
EID PARRY 319.70 (311.10) 149842
EIH 168.80 (169.45) 141456
ESSAR SHIPPI 25.35 (25.10) 16330
ESTER INDUST 66.70 (63.70) 160979
EXIDE INDUST 210.05 (206.75) 673366
FEDERAL BANK 94.75 (89.75) 18729626
FINOLEX CABL 704.35 (694.70) 146224
G E SHIP LTD 379.35 (383.75) 34772
GAMMON INFRA 3.10 (3.15) 2117043
GATI LIMITED 113.15 (112.05) 391056
GAYATRI PROJ 212.95 (213.50) 213609
GITANJALIGEM 24.75 (26.05) 41191
GMR INFRASTR 18.75 (17.55) 52498421
GODREJ IND 548.50 (539.05) 373670
GRASIM IND 1136.70 (1110.40) 461991
GUJ ALK&CHEM 748.55 (737.05) 100100
HCL INFOSYS 63.90 (62.25) 4627945
HEXA TECH 352.15 (351.90) 2015711
HIMACHAL FUT 28.20 (27.90) 3968857
HOUSING DEV 49.95 (49.40) 9160643
IDBI 77.15 (74.10) 29336696
IDFC 53.00 (51.60) 2745351
IFCI 23.15 (22.65) 7253091
IL&FS TRANS 71.85 (70.45) 191838
IND SWIFTLAB 70.85 (67.50) 40108
INDBULLS REL 221.70 (221.45) 3468033
INDIA CEM 158.05 (155.10) 2893309
INDIAN BANK 318.00 (319.50) 1260148
INDO RAMA SY 35.40 (34.45) 98590
INDRAPRASTHA 295.50 (291.70) 2122103
IND-SWIFTLTD 9.10 (9.10) 11537
INGERSOLL-R 729.15 (713.60) 12596
IOB 19.60 (19.65) 596461
IPCA LAB 672.75 (661.45) 759359
IRB INFRA DE 227.25 (217.05) 1014568
J&K BANK 66.00 (66.50) 328104
JAI CORP 162.20 (158.70) 1279737
JAIN IRRIGAT 118.00 (112.75) 12061348
JAYPEE INFRA 13.65 (13.00) 19246272
JAYSHREE TEA 101.90 (99.85) 25251
JET AIRWAYS 745.45 (733.90) 2853445
JINDAL SAW 138.70 (134.25) 1483251
JINDAL STEEL 265.00 (250.25) 13491018
JK LAKSHMI C 425.80 (420.60) 63703
JK PAPER LIM 139.45 (134.55) 647674
JM FINANCIAL 148.15 (147.25) 943333
JP ASSOCIATS 19.15 (16.35) 185260648
JSW ENERGY L 82.00 (79.10) 2070976
JUBILANT FOO 2003.30 (1974.90) 593887
JUBILANT ORG 883.80 (991.80) 14259561
JYOTHY LABS 346.85 (348.50) 33276
JYOTI STRUC 10.25 (9.90) 223068
KARNATA BANK 133.45 (128.70) 2151261
KEC INTL LTD 401.25 (398.85) 1744260
KOLTE PATIL 337.55 (330.75) 131109
KPIT CUMMINS 206.75 (201.25) 2797712
L&TFIN.HOLD 162.20 (158.70) 2591635
LAK VIL BANK 115.00 (114.90) 228809
M & M FINANC 441.35 (423.75) 1070597
MANAPPURAM G 108.25 (105.45) 4728694
MMTC LIMITED 52.25 (52.05) 850244
MPHASIS LTD 906.80 (906.25) 336166
MRPL 116.60 (115.70) 774740
MTNL 23.70 (24.25) 1581435
NAGARJUNA OI 4.15 (3.95) 1046018
NCC LIMITED 125.30 (122.80) 5497936
NETWORK18 FI 49.90 (48.60) 504486
NEULAND LAB 706.65 (701.30) 7662
NIIT LTD 94.55 (95.55) 637007
NIIT TECHNOL 831.25 (822.55) 1198297
OMAXE LTD 225.25 (226.85) 129514
ONMOBILE GLO 51.80 (50.45) 301670
ORIENT PAPER 40.90 (40.45) 233186
ORIENTALBANK 106.10 (105.10) 2121958
PARSVNATH DE 21.30 (21.85) 479409
PATEL ENGG 72.85 (72.05) 208514
PFIZER 2306.80 (2268.85) 17256
POLARIS SOFT 470.55 (470.50) 85296
POWERTRADING 100.10 (98.30) 2301984
PRAJ IND 90.95 (89.65) 486651
PRISM CEMENT 125.85 (124.40) 595233
PROVOGUE (IN 5.85 (5.75) 49376
PUNJ LLOYD 20.65 (20.35) 1069659
PUNJAB & SIN 38.95 (38.65) 64878
PURAVANKARA 136.70 (134.85) 207383
PVP VENTURES 7.15 (7.05) 110251
PVR LIMITED 1370.15 (1384.55) 230219
RADICO KHAIT 353.00 (330.80) 2842857
RAJESH EXPOR 801.35 (797.45) 124314
RALLIS INDIA 227.85 (225.55) 128160
RAMCO IND 256.75 (246.30) 108390
RAMCO SYS 456.10 (447.40) 25226
RAMKY INFRA 199.95 (198.70) 195317
RAYMOND 950.95 (922.00) 382278
RELIANCE CAP 469.80 (456.10) 5502284
RELIANCE COM 27.60 (27.35) 33561141
RELIANCE INF 454.55 (439.95) 2192481
RELIANCE POW 44.35 (43.55) 7064831
ROLTA INDIA 71.30 (70.50) 1443713
SAGAR CEMENT 971.85 (955.45) 3271
SAREGAMA 695.75 (675.30) 156407
SHANTHI GEAR 143.75 (139.85) 16929
SHIPPNG CORP 73.10 (72.80) 853415
SHREE RENUKA 16.10 (15.85) 2480428
SINTEX IND 21.30 (21.25) 1502487
SOBHA DEVELO 552.85 (551.45) 96860
SOUTHINDBANK 26.90 (26.40) 5422797
SRS LIMITED 1.20 (1.15) 598123
STERLITE TEC 343.30 (334.75) 1128769
SUJANA METAL 1.35 (1.40) 90994
SUN PHARMA 458.00 (432.30) 2922829
SUND FASTNER 573.65 (540.05) 466361
SUZLON ENERG 13.00 (12.55) 42440805
SYND. BANK 60.60 (59.70) 4257981
TATA CHEM 706.75 (696.85) 300185
TATA COFFEE 135.35 (133.00) 328950
TATA COMMUN 639.15 (617.85) 307812
TATA GLOBAL 270.70 (262.15) 3895920
TATA METALIK 787.95 (787.65) 139403
TATA MOT DVR 203.75 (201.95) 1182460
TATA TELESER 6.15 (6.15) 550006
THE INDIAN H 131.45 (132.55) 1221717
TORRENT POWE 263.80 (254.35) 1153410
TRIVENI ENGG 63.85 (64.40) 301025
TTK PRESTIGE 7107.10 (7085.85) 1933
TV TODAY NET 455.15 (456.15) 52311
TV18 BROADCA 58.45 (56.15) 9439247
TVS MOTOR 667.85 (631.40) 1229159
UCO BANK 27.15 (27.25) 443457
UNION BANK 108.60 (107.35) 4372709
UNITECH 7.15 (6.90) 22335891
UNITED BANK 13.70 (13.60) 990954
UNITED BREWE 1080.30 (1056.35) 280657
USHA MARTIN 23.10 (22.40) 1165105
VADILAL INDU 887.00 (883.80) 18003
VENKYS 3198.70 (2938.95) 770998
V-GUARD IND 235.65 (225.50) 1981482
VIJAYA BANK 57.00 (57.40) 1055225
VIP 343.75 (334.05) 216295
VOLTAS 588.90 (581.05) 1932922
ZEE LEARN LI 41.40 (41.15) 367457
ZUARI GLOBAL 190.15 (187.55) 97229
ZYDUS WELLNE 1250.80 (1252.70) 7207

ఘనం (+)

నిఫ్టీ	23న	మార్పు %
TATA STEEL	677.75	6.31
SUN PHARMA	569.65	5.21
UPL	700.55	3.72
TECH MAHINDRA	621.45	3.13
VEDANTA	337.90	2.81
HINDALCO	246.55	2.77
AUROBINDO PHA	601.90	2.56

గ్రహణం (-)

నిఫ్టీ	23న	మార్పు %
GAIL	458.40	-1.66
ASIAN PAINTS	1101.80	-1.46
EICHER MOTORS	26724.40	-0.54
M & M	718.65	-0.46
INFOSYS	1155.65	-0.44
HUL	1323.15	-0.25
COAL INDIA	310.95	-0.19

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 814.05 (808.40) 2426
AMAR RAJA BA 814.45 (797.05) 10924
ANDHRA BANK 45.95 (45.55) 137717
ANDHRA CEMEN 11 (10.92) 11590
ANDHRA PAPER 319 (311.05) 12700
ANDHRA PETRO 58.40 (56.95) 64564
ANDHRA SUGAR 490.15 (482.20) 2717
ASTRA MICROW 93.95 (90.45) 100987
AUROBINDO PH 601.85 (587.15) 351051
AVANTEL SOFT 521.85 (523.35) 6452
AVANTI FEEDS 2413.45 (2310.25) 11582
AVON ORG 12.25 (12.85) 10204
BALAJI AMIN 666.70 (651.45) 13386
BARTRONICS 13.57 (12.93) 56822
BHAGYA NAG 41.60 (41.80) 10426
BN RATHI SEC 41.55 (40.50) 1199
BRILLIANT SE 10.85 (10.35) 40779
CAMBRIDGE TE 72.40 (72.40) 11034
CONT COFFEE 287.70 (278.45) 4663
COROMAN FERT 552.30 (519) 42028
CYIENT LIMIT 622.30 (623.95) 10776
DECCAN CEMEN 585.50 (567.55) 1008
DIVI'S LAB 1049.55 (1018.25) 34752
DR REDDY 2169.25 (2121.30) 25863
GATI CORPN 113.30 (112) 55960
GAYATRI PROJ 212.45 (213.30) 22405
GMR INFRASTR 18.75 (17.60) 4084890
GOLDST INFRA 195.85 (194.80) 19194
GRANULES (I) 117.45 (113.15) 169076
GVK POWER 17.50 (16.75) 1889750
HBL NIFE POW 57.55 (55.25) 82500
HERITAGE FOO 677.20 (678.60) 1538
HYD INDUS 1733.15 (1621.85) 3169
IDL INDUSTRS 557.20 (556.15) 2243
ILFS ENGINEE 44.30 (43.55) 4869
INNAREDY COM 3.22 (3.34) 23806
IVRCL INFRAS 4.55 (4.51) 163152
KALLAM SPG 30.75 (30.35) 88044
KAVERI SEED 494.20 (460.25) 50779
KCP LTD 130.90 (128.10) 18640
LANCO INDUS 356.70 (353.60) 11532
LANCO INFRAT 1.32 (1.26) 757263
LAURUS LABS 514.95 (513.10) 2238
LOKESH MACH 67.55 (68.10) 25222
MADHUCON PRO 27.40 (27.60) 31995
MIC ELECTRON 7.25 (7.22) 50959
NAGARJAGRICH 43.40 (42.70) 10987
NATCO PHARMA 778.40 (766.85) 35981
NAVA BH VENT 150.85 (145) 24742
NCC 125.30 (122.70) 378352
NETTLINX 79.75 (84.50) 24078
NEULAND LAB 706.70 (698) 114
NILE 808.90 (828.05) 11244
OIL COUNTRY 43.30 (42.70) 11209
PANKAJ POLY 10.20 (10.70) 1005
PANYAM CEMEN 48.55 (48) 10935
PENNER IND 59.40 (58.50) 40462
PIONEER DIST 185.30 (182.90) 1672
POKARNA 206.85 (208.95) 2609
PRAJAY ENGS 13.25 (13.50) 23407
PRISM CEMENT 126.10 (124.90) 68353
PRUDENTL PHA 4.58 (4.47) 132379
RAIN INDUSTR 382.90 (372.10) 477620
RAM INFORMAT 40.60 (40.60) 74713
SAMKRG PIST 302.25 (293.10) 15200
SATVAH. ISPA 21.70 (22.10) 12798
SMS PHARMA 88.85 (89.30) 5526
SREE RAYAL A 58.90 (56.45) 111218
SRINIVASA SH 59.85 (60.80) 2625
STEEL EXCHAN 29.55 (28.15) 100795
SUJANA METAL 1.42 (1.38) 13348
SUJANA TOWER 3.95 (3.91) 3550
SUJANA UNIVE 0.94 (0.90) 67101
SURANA TELE 5.21 (5.15) 2677
SURYALAKSH.C 80.50 (80.20) 13477
SUVEN PHARMA 189.70 (189.40) 26652
TAJ GVK HOTE 167.85 (165) 7597
TANLA 31.45 (30.40) 42521
TERA SOFTWAR 59.25 (60.35) 4115
TRANS BIOTEK 2.39 (2.36) 2220
VICEROY HOTE 15.80 (15.60) 16210
VIJAY TEXTIL 56.55 (55.65) 3550
VIMTA LABS 209.95 (207) 1706
VISTA PHARMA 42.55 (42.60) 11383
VIVIMED LABS 76.75 (76) 123311
YBRANT DIGIT 5.37 (5.35) 61113
ZENTECH 117.85 (117.35) 13990


రింగ్, జెండాతో గ్రేట్‌నాట్ పక్షి

గ్రేట్ వాల్ ఎగిరొచ్చి..

- కాకినాడకు వచ్చిన అరుదైన చైనా పక్షులు
- 500 లోపే ఉన్న ఈ జాతి విహంగాలు

భానుగుడి సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: అంతరించి పోయే జాబితాలో ఉన్న గ్రేట్‌నాట్ అనే అరుదైన పక్షి జాతి గుంపును కాకినాడలో గుర్తించారు. కుంభాభిషేకం చేపల రేవు వద్ద చిత్తడి నేలలో ఇటీవల ఇవి కనిపించినట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇగ్రీ ఫౌండేషన్, వన్యప్రాణి అధికారులు తెలిపారు. ఈ జాతి పక్షులు చైనా నుంచి 4,303 కిలోమీటర్లు సుదీర్ఘ ప్రయాణం చేసి ఇక్కడకు వచ్చాయన్నారు. ఇటీవల పక్షుల గణన సమయంలో



తీసిన ఛాయాచిత్రంలో ఒక పక్షి కాలికి తగిలించి ఉన్న రింగు, నలుపు తెలుపు జెండా ఆధారంగా అది చైనా నుంచి వచ్చినట్లు గుర్తించామన్నారు. ఆ ఛాయా చిత్రాలను చైనా షాంఘైలోని సంబంధిత విభాగానికి పంపగా.. 'ఆ పక్షులు తమ దేశం నుంచి వలస వచ్చాయని.. ఇక్కడ అంతరించి పోతున్న పక్షి జాతులు ఎక్కడకు వలస వెలుతున్నాయో తెలుసుకునేందుకే ఇలా జెండా, రింగ్ అమర్చామని, ఈ పక్షులు సుమారు 460కు పైగా ఉన్నాయని' అక్కడి అధికారులు తెలిపినట్లు స్థానిక వన్యప్రాణి అధికారి తెలిపారు. చైనాలో చిత్తడి నేలలు మంచుతో కప్పబడి ఉండటంతో ఆహారం కోసం కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఈ పక్షి జాతి కాకినాడకు వచ్చిందన్నారు.


శుక్రవారం దిల్లీలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసం నుంచి సాక్ష్యాలను సేకరించి తీసుకెళ్తున్న పోలీసులు

కేజ్రీవాల్ నివాసంలో పోలీసు సోదాలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి కేసులో ఆధారాల సేకరణ
- బలగాల తీరుపై మండిపడ్డ దిల్లీ సీఎం
- లోయా కేసులో అమిత్‌షాను ఎప్పుడు ప్రశ్నిస్తారని నిలదీత

దిల్లీ: దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై ముఖ్యమంత్రి నివాసంలోనే ఆప్ శాసనసభ్యులు ఇటీవల దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు శుక్రవారం దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసానికి వెళ్లారు. ఇంటిని పెద్దఎత్తున చుట్టుముట్టి సోదాలు నిర్వహించడం వివాదానికి దారి తీసింది. సీసీటీవీ దృశ్యాలు సహా ఆధారాల సేకరణ కోసం పోలీసు బృందాలు వెళ్లాయి. ముందస్తు సమాచారం లేకుండా 60-70 మంది పోలీసులు సీఎం నివాసంలోకి వెళ్లారని ప్రభుత్వ అధికార ప్రతినిధి అరుణోదయ ప్రకాశ్ తెలిపారు. 'సీఎం నివాసం మొత్తం పోలీసుమయమే అయింది. దిల్లీలో ప్రజాస్వామ్యాన్ని పోలీసు రాజ్యం ఖూనీ చేస్తోంది. ఎన్నికైన ముఖ్యమంత్రికే ఇలా జరిగితే ఇక సామాన్యుడి సంగతేమిటో ఆలోచించండి' అని ఆయన ట్వీట్ చేశారు. పోలీసుల రాకపై కేజ్రీవాల్ మండిపడ్డారు. 'పోలీసులను పెద్ద గుంపుగా మా ఇంటికి పంపించారు. నివాసం మొత్తాన్ని వారు గాలించారు. అది సరే... మరి న్యాయమూర్తి లోయా మృతి కేసులో భాజపా అధ్యక్షుడు అమిత్‌షాను ఎప్పుడు ప్రశ్నిస్తారు?' అని ట్విటర్లో ప్రశ్నించారు. 'ప్రజాస్వామ్యంలో కొన్ని కనీస సంప్రదాయాలు పాటించాలి. ప్రతీ పౌరునికీ రాజ్యాంగం ప్రకారం కొన్ని హక్కులు ఉంటాయి. పేదల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రిని చిన్నబుచ్చడానికి జరిగిన ప్రయత్నమేనా ఇది?' అని ప్రశ్నించారు. కేంద్రం ప్రోద్బలంతో దిల్లీ పోలీసులు రంకెలు వేస్తూ, దాదాగిరి చేస్తున్నారని ఆప్ నేత అశుతోష్ ఆరోపించారు.

ముఖ్యమంత్రి, మంత్రివర్గ సహచరులు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలిసి పోలీసు చర్య గురించి వివరించారు. మంత్రులు ఏర్పాటు చేసే సమావేశాలను బహిష్కరించాలని అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ పనితీరు ప్రభావితం కాకుండా అధికారులతో తాను మాట్లాడతానని బైజాల్ హామీ ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తెలిపారు.

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా 37 మంది

- ప్రతిపాదిత పేర్లను ప్రకటించిన సుప్రీంకోర్టు కొలీజియం

దిల్లీ: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు... తాను ప్రతిపాదించిన 37 మంది అదనపు న్యాయమూర్తుల పేర్లను సుప్రీం కోర్టు కొలీజియం శుక్రవారం వెల్లడించింది. అలహాబాద్, రాజస్థాన్, కేరళ, గుజరాత్, బాంబే హైకోర్టుల్లో వీరిని నియమించనుంది. ప్రతిపాదిత న్యాయమూర్తుల్లో కొందరిపై ఆరోపణలు తమ దృష్టికి వచ్చినా, వాటిలో పసలేదని కొలీజియం తీర్మానించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర, జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగొయ్‌లతో కూడిన కొలీజియం గురువారమే ప్రతిపాదిత న్యాయమూర్తుల పేర్లను ప్రతిపాదించింది. వీటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో శుక్రవారం వెల్లడించారు.

అక్రమ ఇసుక తవ్వకాలు ఆగకపోతే.. నదులు ఎండిపోతాయ్

- సుప్రీం కోర్టు ఆందోళన

దిల్లీ: అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు ఏమైనా విధానాలను సిద్ధంచేశారా? అని కేంద్రాన్ని సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. రాజస్థాన్‌లో అక్రమ ఇసుక తవ్వకాలపై దాఖలైన వరుస అభ్యర్థనలపై జస్టిస్ మదన్ బి.లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గంగ, యమున లాంటి నదుల పరివాహక ప్రాంతంలో పరిస్థితులను ఉదహరిస్తూ.. అక్రమ తవ్వకాలు అరికట్టకపోతే నదులు ఎండిపోయే ముప్పుందని ఆందోళన వ్యక్తంచేసింది. 'ఇళ్లు కడుతున్నాం. అందుకే ఇసుక తవ్వుతున్నాం..అని మాత్రం చెప్పొద్దు.. ఈ సమస్యను అడ్డుకునేందుకు మీరు కొత్త మార్గాలను అనుసరించాలి''అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం విచారణను మూడు వారాల తర్వాతకు వాయిదా వేసింది.

చిరంజీవి, సచిన్, రేఖ, జయాబచ్చన్.. పదవీ విరమణ





- 59 రాజ్యసభ స్థానాలకు మార్చి 23న ఎన్నిక
- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- రిటైర్ కాబోతున్న వారిలో 8 మంది కేంద్రమంత్రులు

ఈనాడు - దిల్లీ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న 58 రాజ్యసభ స్థానాలకు మార్చి 23న ఎన్నిక జరుగనుంది. కేరళ నుంచి ప్రాతినిధ్యం వహించిన జేడీయూ సభ్యుడు వీరేంద్రకుమార్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి అదేరోజు ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. దీంతో ఎన్నికలు జరుగబోయే మొత్తం స్థానాల సంఖ్య 59 కానుంది. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మూడు చొప్పున మొత్తం ఆరు స్థానాలకు ఆరోజు ఎన్నిక జరుగనుంది.

పదవీవిరమణ చేయబోతున్నవారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి చిరంజీవి, రేణుకాచౌదరి, దేవేందర్‌గౌడ్, తెలంగాణ నుంచి సీఎంరమేష్, రాపోలు ఆనందభాస్కర్‌లు ఉన్నారు. పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మృతితో ఖాళీ అయిన స్థానానికి ఇప్పుడు ఎన్నిక జరుగనుంది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి 10 స్థానాలకు, బిహార్, మహారాష్ట్ర నుంచి ఆరు, పశ్చిమబంగ, మధ్యప్రదేశ్ నుంచి అయిదుస్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. రిటైర్ కాబోతున్న వారిలో 8 మంది కేంద్రమంత్రులున్నారు. వీరిలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, సామాజిక న్యాయం, సాధికార శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లోత్, ప్రకాశ్ జావడేకర్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, పెట్రోలియం మంత్రి ధర్మేంద్రప్రధాన్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, సహాయమంత్రులు పురుషోత్తం రూపాల, మన్‌సుఖ్ ఎల్.మాండవీయలు ఉన్నారు.

భాజపా ముఖ్యనాయకులు వినయ్‌కటియార్, భూపేందర్‌యాదవ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ తెండూల్కర్, సినీనటీమణులు రేఖ, జయాబచ్చన్, కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వీ, సత్యవ్రత చతుర్వేది, ఎస్పీ నేత నరేష్ అగర్వాల్‌ల పదవీకాలమూ ఏప్రిల్ 2తో ముగియనుంది. అత్యధికంగా భాజపా నుంచి 17మంది, కాంగ్రెస్ నుంచి 14, ఎస్పీ నుంచి 6, జేడీయూ, టీఎంసీ, నామినేటెడ్ విభాగం నుంచి ముగ్గురుచొప్పున, జేడీయూ, టీడీపీ, ఎన్సీపీ, ఇండిపెండెంట్ల నుంచి ఇద్దరు చొప్పున రిటైర్ అవుతున్నారు. జీఎంఎం, బీఎస్పీ, శివసేన, సీపీఎం నుంచి ఒకొక్కరు ఉన్నారు.

రాష్ట్రాలు, పార్టీల వారీగా ఖాళీకాబోతున్న సీట్ల వివరాలు ఈనాడు.నెట్‌లో

ఇదీ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్‌జారీ	5 మార్చి (సోమవారం)
నామినేషన్లకు చివరి తేదీ	12 మార్చి (సోమవారం)
నామినేషన్ల పరిశీలన	13 మార్చి (మంగళవారం)
ఉపసంహరణకు చివరి తేదీ	15 మార్చి (గురువారం)
పోలింగ్ తేదీ	23 మార్చి (శుక్రవారం)
పోలింగ్ సమయం:	ఉ॥ 9 నుంచి సా॥4 వరకు
ఓట్ల లెక్కింపు	23 మార్చి (శుక్రవారం) సా॥ 5 గంటలకు
ఎన్నికల ప్రక్రియ పూర్తి	26 మార్చి (సోమవారం)

రాజ్యసభ అభ్యర్థులెవరు?

ఈనాడు-అమరావతి: రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవటంతో తెదేపాలో రెండు స్థానాలు ఎవరికి దక్కుతాయన్న దానిపై ఆసక్తికర చర్చ ప్రారంభమైంది. ఈ స్థానాన్ని ఆశించే వారు కనీసం పది మందికిపైగా ఉన్నారు. తెదేపా నుంచి దేవేందర్‌గౌడ్, సీఎం రమేష్‌ల పదవీ కాలం పూర్తవుతోంది. దేవేందర్‌గౌడ్ తెలంగాణకు చెందిన వారు కావటంతో తిరిగి అవకాశం లేదు. సీఎం రమేష్‌కు మరో అవకాశం వస్తుందా? లేదా? అన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఆయన్ను ఇంకోసారి రాజ్యసభకు పంపించే వీలుంటే రెండో స్థానం బీసీ, ఎస్సీల్లో ఒకరికి దక్కొచ్చన్న ప్రచారం ఉంది. వైకాపా నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు తెదేపాలో చేరటంతో మూడో స్థానానికి కూడా అభ్యర్థిని నిలపాలన్న వాదన పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. పార్టీపరంగా నిలిపే పరిస్థితి లేకుంటే.. ఎవరైనా బలమైన స్వతంత్ర అభ్యర్థిని పోటీకి దించి మద్దతివ్వాలనే సూచన వస్తోంది. వైకాపా తన అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన నాయకుడిని ఎంపిక చేయాలని గతంలో సూత్రప్రాయంగా నిర్ణయించింది. అదే పరిస్థితి ఇప్పటికీ ఉందా? లేదా? అన్నదానిపై స్పష్టత రాలేదు. ఆయన్నే ఎంపిక చేస్తే.. రెండు స్థానాలూ ఒకే జిల్లా నుంచి ఒకే వర్గానికి ఇచ్చినట్లవుతుందన్న వాదన కూడా ఉంది. కాంగ్రెస్ నుంచి రాష్ట్రానికి చెందిన చిరంజీవి పదవీకాలం పూర్తవుతోంది. ఆయన్ను మరోసారి రాజ్యసభకు పంపించే అవకాశం లేదు.

'టైగర్ రిజర్వు' నుంచి గిరిజనుల తరలింపు ఆపేయండి

- జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశం

ఈనాడు, దిల్లీ: పులులకు సంబంధించిన అభయారణ్యాల్లో (టైగర్ రిజర్వు)ని గిరిజనులను ఖాళీ చేయించేందుకు జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) చేపడుతున్న చర్యలను జాతీయ ఎస్టీ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి చర్యలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజనులు నివసిస్తున్న అడవి.. టైగర్ రిజర్వు కిందకు వస్తే, అక్కడి భూములపై వారికి ఎలాంటి హక్కులు ఉండబోవని ఎన్‌టీసీఏ గత ఏడాది మార్చిలో ఉత్తర్వు జారీ చేసింది. అయితే ఇది గిరిజనుల హక్కులను హరించడమేనంటూ సదరు ఉత్తర్వులను జాతీయ ఎస్టీ కమిషన్ కొట్టేసింది. సరైన పునరావాస విధానాన్ని రూపొందించేవరకూ గిరిజనుల తరలింపును వాయిదావేయాలని స్పష్టంచేసింది. నిర్వాసిత కుటుంబానికి నాలుగు హెక్టార్ల భూమి ఇవ్వాలని, పరిహారాన్ని రూ. 10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచాలని కేంద్ర పర్యావరణ శాఖకు స్పష్టంచేసింది. ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేవరకూ ఏ గిరిజన కుటుంబాన్ని ఖాళీ చేయించకూడదని పేర్కొంది. పునరావాస ప్రక్రియ మొత్తాన్నీ మూడేళ్లలోగా పూర్తిచేయాలని సూచించింది.

కృష్ణా ట్రైబ్యునల్ విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: కృష్ణా ట్రైబ్యునల్‌లో విచారణ మార్చి 26, 27, 28 తేదీలకు వాయిదా పడింది. శుక్రవారం రెండోరోజూ తెలంగాణ క్రాస్ ఎగ్జామినేషన్ కొనసాగింది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ధర్మాసనం ముందు తెలంగాణ సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ అడిగిన ప్రశ్నలకు ఏపీ తరపు సాక్షి పీవీ సత్యనారాయణ సమాధానాలు ఇచ్చారు. సత్యనారాయణ దాఖలు చేసిన ప్రమాణ పత్రంలోని అంశాలపై వైద్యనాథన్ ప్రశ్నించారు. వ్యవసాయ శీతోష్ణస్థితి మండలాలను పరిగణనలోకి తీసుకొనే ఏపీ, తెలంగాణలోని భూములకు సరిపడే పంటలను తన అధ్యయనంలో సూచించానని సత్యనారాయణ తెలిపారు. ఏపీలోని కృష్ణా బేసిన్‌లో ప్రధానంగా వరి పండిస్తారా?, తెలంగాణలోని కృష్ణా బేసిన్ పరిధిలో ఆరుతడి పంటలు వేయాలంటారా? అన్న ప్రశ్నలకు ఆయన 'అవును' అని సమాధానమిచ్చారు. జాతీయ ఆహార సంస్థ సాగునీటి నిర్వహణ ఆధారంగా ఇరు రాష్ట్రాల్లో నీటి ఆవిరి పరిమాణాన్ని తీసుకున్నట్లు తెలిపారు. నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే, ల్యాండ్ యూజ్ ప్లానింగ్ (ఎన్‌బీఎస్ఎస్, ఎల్‌యూపీ), జాతీయ ఆహార భద్రత మిషన్‌కు తెలంగాణ సమర్పించిన పత్రాల ఆధారంగానే వ్యవసాయ శీతోష్ణస్థితి మండలాల గురించి ప్రమాణపత్రంలో పేర్కొన్నానని పేర్కొన్నారు. అనంతరం హైడ్రాలజీకి సంబంధించి ఏపీ తరపు సాక్షి సమర్పించాల్సిన ప్రమాణ పత్రాన్ని తదుపరి విచారణ కన్నా ముందే అందజేయాలని ధర్మాసనం సూచిస్తూ, తదుపరి విచారణను మార్చికి వాయిదా వేసింది.

లొంగిపోయినంత మాత్రాన బెయిల్ మంజూరు చేయలేం

చట్టానికి భాష్యం చెప్పిన సుప్రీంకోర్టు

దిల్లీ: విచారణలో అరెస్టు కాకుండా నిందితుడు తనంత తానుగా నేరుగా న్యాయస్థానంలో లొంగిపోయినంతమాత్రాన... బెయిల్‌పై విడుదల కావడాన్ని అతనికి ఉన్న హక్కుగా పరిగణించజాలమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ మేరకు నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ)లోని 88వ సెక్షన్‌కు జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌ల ధర్మాసనం శుక్రవారం భాష్యం చెప్పింది. కోర్టు ఎదుట లొంగిపోయినవారిని పూచీకత్తుపై విడుదల చేయడం తప్పనిసరేనా అనే అంశంపై స్పష్టతనిచ్చింది. బెయిల్ విషయాన్ని న్యాయమూర్తి పరిశీలించవచ్చని చెప్పడానికి వాడిన ఆంగ్లపదం... 'మే' గురించి ధర్మాసనం ప్రస్తావిస్తూ- నిందితుని విడుదలపై నిర్ణయం తీసుకోవడంలో న్యాయమూర్తికి ఉండే విచక్షణనే ఇది సూచిస్తుందని తేల్చిచెప్పింది. అంతేగానీ విడుదల చేసి తీరాలనేది దీని ఉద్దేశం కాదని తెలిపింది. నిందితునికి ఈ సెక్షన్ ఎలాంటి హక్కును ప్రసాదించడం లేదని చెప్పింది. నోయిడా మాజీ చీఫ్ ఇంజినీర్ యాదవ్‌సింగ్‌తో పాటు సహ నిందితునిగా ఉన్న నిర్మాణ సంస్థ భాగస్వామి పంకజ్ జైన్ బెయిలు దరఖాస్తును సీబీఐ న్యాయమూర్తి, అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చడాన్ని ధర్మాసనం సమర్థిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.

అదనంగా రూ.2 లక్షలు చెల్లించండి

- బాధిత రైతు కుటుంబాలకు ఊరట

ముంబయి, న్యూస్‌టుడే: క్రిమిసంహారక మందుల పిచికారీతో విష ప్రభావానికిలోనై మృత్యువాతపడ్డ రైతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని బొంబాయి హైకోర్టు ఔరంగాబాద్ ధర్మాసనం ఆదేశించింది. విదర్భ ప్రాంతంలోని పలుచోట్ల పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తూ గతేడాది పదుల సంఖ్యలో రైతులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 21 మంది రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. అయితే, ఈ మొత్తం చాలా తక్కువని.. రెట్టింపు సహాయం అందించాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఒకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.


శుక్రవారం దిల్లీలో రాష్ట్రపతి భవన్ వద్ద కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోను ఆప్యాయంగా హత్తుకున్న మోదీ

భారత సమైక్యతే ముఖ్యం

- సవాల్ చేసేవారిని ఉపేక్షించబోం
- కెనడా ప్రధానితో భేటీ తర్వాత మోదీ వ్యాఖ్యలు

దిల్లీ: భారత సార్వభౌమాధికారాన్ని, ఐక్యతను, సమగ్రతకు సవాల్ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడోతో విస్తృత చర్చలు జరిపాక ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఖలిస్థాన్ అంశంపై కెనడా మెతక వైఖరిని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ మేరకు పేర్కొన్నారు.

భారత్‌లో పర్యటిస్తున్న జస్టిన్ ట్రూడో శుక్రవారం దిల్లీలో మోదీతో దాదాపు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడారు. రాజకీయ ఉద్దేశాల కోసం మతాన్ని దుర్వినియోగం చేస్తూ, వేర్పాటువాదాన్ని ప్రేరేపించేవారికి ఎలాంటి స్థానంలేదని మోదీ స్పష్టంచేశారు. "ద్వైపాక్షిక సంబంధాలపై పూర్తిస్థాయిలో చర్చ జరిపాం. సహకారాన్ని పెంపొందించుకోవడానికి పటిష్ఠ చర్యలను గుర్తించాం. రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, అతివాదం వల్ల భారత్, కెనడా వంటి ప్రజాస్వామ్య దేశాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ట్రూడో గత కొద్దిరోజులుగా భారత్‌లో విస్తృతంగా పర్యటించారని, ఆయనకు ఇక్కడి భిన్నత్వంపై అవగాహన ఏర్పడి ఉంటుందని చెప్పారు. ద్వైపాక్షిక పెట్టుబడి, ప్రోత్సాహక ఒప్పందం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒడంబడికను ఖరారు చేసే కసరత్తును వేగవంతం చేయాలని తాను, ట్రూడో.. ఇరు దేశాల అధికారులకు సూచించామని తెలిపారు.

ట్రూడో మాట్లాడుతూ.. వాణిజ్య సహకారంలో భారత్ తమకు సహజసిద్ధ భాగస్వామి అని చెప్పారు. శుక్రవారం నాటి సమావేశంలో రెండు పక్షాలూ పౌర అణు పరిజ్ఞానం, విద్య, ఐటీ, మేధో హక్కులు, క్రీడలు వంటి అంశాల్లో ఆరు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. భారత్‌లో తయారీ, అంకుర భారత్ వంటి కీలక పథకాల ద్వారా మరిన్ని పెట్టుబడులకు మార్గాలను అన్వేషించేలా ప్రైవేటు రంగాలను ప్రోత్సహించాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు.

సిక్కు ఉగ్రవాద ముఠాలపై పనిచేద్దాం

సిక్కు తీవ్రవాద ముఠాలైన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్‌తో పాటు లష్కరే తొయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఎదురయ్యే ముప్పులను సంయుక్తంగా ఎదుర్కోవాలని భారత్, కెనడా నిర్ణయించాయి. మోదీ, ట్రూడోల మధ్య చర్చల అనంతరం ఉగ్రవాదం, అతివాదంపై పోరు కోసం ఉద్దేశించిన ఒక కార్యాచరణ విడుదలైంది.

- ఉగ్రవాద చర్యల వెనుక ఎలాంటి కారణాలున్నా, వాటికి ఎవరు పాల్పడ్డా.. అవి సమర్థనీయం కావు. వాటిని నేరపూరిత చర్యలుగానే పరిగణించాలి.
- ఉగ్రవాదుల నియామకాలు, కదలికలు, విదేశీ ముఠా సభ్యుల రాక వంటివాటిని విచ్ఛిన్నం చేయాలి. సీమాంతర ఉగ్రవాదం, ప్రభుత్వ ప్రాయోజిత తీవ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కోవాలి. ఉగ్రవాదులకు ఆర్థిక వనరులను స్తంభింపచేయాలి. ముష్కరుల మౌలికవసతులను నాశనం చేయాలి.
- భారత్, కెనడా సార్వభౌమాధికారం, సమైక్యత, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తూ ఈ కార్యాచరణను రూపొందించారు.

ట్రూడో సంతానానికి మినహాయింపు

రాష్ట్రపతి భవన్ వద్ద ట్రూడోకి లాంఛనంగా స్వాగతం పలికే కార్యక్రమంలో ఆయన పిల్లలు జేవియర్, ఎల్లా-గ్రేస్, హేడ్రియన్‌లు కూడా పాల్గొనేందుకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చినట్లు సీనియర్ అధికారులు తెలిపారు. ట్రూడో సంతానాన్ని కలుసుకునేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని మోదీ గురువారం సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

బాపూ నీడన బాల్యం సరదా

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం దిల్లీలో రాజ్‌ఘాట్‌ను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ట్రూడో కుమారుడు హడ్రీన్ ఇలా ఆడుకున్నాడు.



రోటామాక్ యజమానికి ఒక రోజు రిమాండ్



దిల్లీ: బ్యాంకులకు రూ. 3,695 కోట్ల రుణాలను ఎగవేసిన కేసులో రోటామాక్ కంపెనీ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్‌ను లఖ్‌నవూలోని ఒక న్యాయస్థానంలో హాజరుపర్చేందుకు దిల్లీ న్యాయస్థానం సీబీఐకి ఒక రోజు ట్రాన్సిట్ రిమాండ్‌కు అనుమతించింది. దారి మళ్లించిన సొమ్మును రాబట్టుకోవడానికి వారిని ఉత్తర్‌ప్రదేశ్‌కు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీబీఐ చేసిన వాదనతో దిల్లీ న్యాయస్థానం ఏకీభవించింది. నిందితులిద్దరినీ గురువారం అరెస్టు చేశారు. వారి తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ సీబీఐ విజ్ఞప్తిని వ్యతిరేకించారు. సీబీఐ ఆరోపించిన వారిలో ఒకరు దేశం విడిచివెళ్లిపోయినందున తమ క్లయింట్లను బలిపశువు చేస్తున్నారన్నారు. పారిపోయినదెవరో ఆయన వెల్లడించలేదు. మరోవైపు రోటామాక్ గ్రూప్‌నకు చెందిన మరో 12 బ్యాంకు ఖాతాలను ఆదాయపు పన్ను విభాగం స్వాధీనం చేసుకుంది.

26న విచారణకు హాజరుకండి

- నీరవ్ మోదీ, అమీ, ఛోక్సీలకు సమన్లు
- ముగ్గురినీ ఒకేసారి విచారించనున్న ఈడీ
- మరో రూ.44 కోట్ల జప్తు
- ఖరీదైన విదేశీ చేతి గడియారాలు లభ్యం

ముంబయి, దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించిన కేసులో ప్రధాన నిందితుడైన వజ్రాభరణాల వ్యాపారి నీరవ్‌మోదీ భార్య అమీని విచారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ణయించింది. అమెరికా పౌరురాలైన ఆమెకు ఈ మేరకు సమన్లు జారీ చేసింది. ఈ నెల 26న ముంబయిలోని ఈడీ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా అమీని, నీరవ్‌మోదీ మేనమామ మెహుల్ ఛోక్సీలను ఆదేశించింది. గురువారం నాటి విచారణకు గైర్హాజరైన నీరవ్‌ను కూడా అదే రోజు రావాల్సిందిగా సమన్లు పంపించింది. నీరవ్ గ్రూపు సంస్థల ఆస్తుల జప్తు కార్యక్రమాన్ని శుక్రవారం ఈడీ కొనసాగించింది. 'అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం' (పీఎంఎల్ఏ) కింద రూ.30 కోట్ల బ్యాంకు ఖాతాలు, రూ.13.86 కోట్ల షేర్లను జప్తు చేసుకొంది. ఖరీదైన విదేశీ చేతి గడియారాలు, స్టీలు అల్మారాలు, 158 పెట్టెలు తదితరాలు వారం రోజుల్లో లభ్యమైనట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.5870 కోట్లకు చేరింది.

అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా కృష్ణపట్నం ఓడరేవు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఉన్న కృష్ణపట్నం ఓడరేవును 'అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్'గా కేంద్రం ప్రకటించింది. అంతర్జాతీయ పర్యాటకులు చెల్లుబాటయ్యే పత్రాలతో భారతదేశానికి రావాలన్నా, ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లాలన్నా ఈ ఓడరేవు వీలు కల్పిస్తుందని హోంశాఖ అధికారిక ప్రకటన వెలువరించింది. ప్రయాణికుల నౌకలు ఆంధ్రప్రదేశ్‌కు రాకపోకలు చేయడానికి ఇది ఉపకరిస్తుందని పేర్కొంది.

ట్రైబ్యునల్ న్యాయమూర్తిగా జస్టిస్ అమితవ రాయ్?

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమితవ రాయ్ త్వరలోనే ఓ పెద్ద ట్రైబ్యునల్‌కు న్యాయమూర్తిగా కనిపిస్తారని అటార్నీ జనరల్ (ఏజీ) కేకే వేణుగోపాల్ సంకేతాలిచ్చారు. జస్టిస్ రాయ్ ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందనున్నారు. ఆయన గౌరవార్థం సుప్రీంకోర్టు పచ్చికలో శుక్రవారం బార్ అసోసియేషన్ వీడ్కోలు సమావేశం నిర్వహించింది. ఏజీ మాట్లాడుతూ-"జస్టిస్ రాయ్ పదవీ విరమణ పొందనుండటం బాధాకరం. అయినా.. ఆయన త్వరలోనే కీలకమైన ట్రైబ్యునల్ లేదంటే మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో మనకు అందుబాటులోకి వస్తారు" అని అన్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాశ్ సింగ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర మాట్లాడుతూ- "వారిలా నేను జోష్యం చెప్పలేను. కాకపోతే సంఖ్యాశాస్త్ర నిపుణుడినైతే కావొచ్చేమో. భవిష్యత్తులో జస్టిస్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందువాదనలు వినిపించేందుకు మీరంతా సిద్ధపడండి" అంటూ చమత్కరించారు.

ఛాంపియన్



దాదాపు ఎనిమిది వారాలు గడిచిపోయాయి.. మూడు టెస్టులు అయిపోయాయి.. ఆరు వన్డేలు ముగిసిపోయాయి.. రెండు టీ20లూ ఖతం. ఇక మిగిలింది సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరి మ్యాచ్! రెండు జట్లు ఎక్కడైతే పోరాటాన్ని ఆరంభించాయో.. మళ్లీ అక్కడికే వచ్చాయి. నేడే కేప్‌టౌన్‌లో చివరి టీ20 మ్యాచ్. పర్యటనను సిరీస్ విజయంతో ఘనంగా ముగించేందుకు భారత్‌కు మంచి అవకాశం.

రాత్రి 9.30 నుంచి సోని టెన్ 1, 3లో

ఆఖరి పోరాటం

నేడే దక్షిణాఫ్రికాతో భారత్ చివరి టీ20

17 టీ20ల్లో 2000 పరుగుల మైలురాయి అందుకున్న తొలి భారత బ్యాట్స్‌మెన్‌గా నిలవడానికి విరాట్ కోహ్లికి అవసరమైన పరుగులు.

కేప్‌టౌన్

సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనలో ఆఖరి మజిలీ! విరామం లేకుండా ఆడుతున్న భారత జట్టుకు చివరి సవాల్! శనివారం సఫారీ జట్టుతో మూడో టీ20 మ్యాచ్. గెలిస్తే మరో సిరీస్ గెలిచే సువర్ణావకాశం. కోహ్లి సేన ఆఖరి పంచ్ ఇచ్చే సమయం వచ్చేసింది. తొలి మ్యాచ్‌లో గెలిచి.. రెండో మ్యాచ్‌లో ఓడినా.. భారత ఆటతీరు మాత్రం ఆకట్టుకుంది. మరోవైపు చివరి మ్యాచ్‌లో విజయంతో దక్షిణాఫ్రికా కూడా ఊపు మీదుంది. ఈ నేపథ్యంలో మూడో టీ20 హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. న్యూలాండ్స్ మైదానంలో భారత్ ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే. దక్షిణాఫ్రికాకు కూడా ఈ మైదానంలో పెద్దగా కలిసి రాలేదు. 8 టీ20లు ఆడిన ఆ జట్టు ఐదింట్లో ఓడిపోయింది. ద్వైపాక్షిక సిరీస్‌లో మాత్రం ఒకేసారి (2016, ఇంగ్లాండ్)పై గెలిచింది. అయితే సఫారీ జట్టు రికార్డేమి భారత్‌కు అనుకూలం అనుకోవడానికి లేదు. ఎందుకంటే డుమిని సారథ్యంలోని దక్షిణాఫ్రికా ఊపు మీద కనిపిస్తోంది.

బుమ్రా వస్తాడా!: కడుపు నొప్పి కారణంగా రెండో టీ20 మ్యాచ్‌కు దూరమైన యువ పేసర్ జస్ప్రిత్ బుమ్రా ఆఖరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అనేది అనుమానంగా ఉంది. ఫిట్‌నెస్ సాధిస్తే అతను తుది జట్టులో చేరడం పక్కా. రెండో మ్యాచ్‌లో బుమ్రా స్థానంలో వచ్చిన జయ్‌దేవ్ ఉనద్కత్ భారీగా పరుగులిచ్చేశాడు. మరో పేసర్ శార్దూల్ ఠాకూర్ (4 ఓవర్లలో 1/31) రెండో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శనే చేశాడు. కానీ ఈ సిరీస్‌లో లెగ్‌స్పిన్నర్ చాహల్ 8 ఓవర్లు వేసి 12.87 ఎకానమీతో 103 పరుగులిచ్చుకోవడమే ఆందోళన కలిగిస్తోంది. మరోసారి రాత్రి వేళ మ్యాచ్ ఉండడంతో బంతిపై అతనికి పట్టు దొరుకుతుందా అనేది అనుమానం. ఈ నేపథ్యంలో చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ ఆఖరి మ్యాచ్‌లో జట్టులోకి వచ్చినా ఆశ్చర్యం లేదు. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగల అక్షర్‌పటేల్ తుది జట్టులోకి తీసుకునే అవకాశాలనూ కొట్టిపారేయలేం.

క్లాసన్.. క్లాసన్: ఇప్పుడు సఫారీ అభిమానులు ఈ జపమే చేస్తున్నారు. గత మ్యాచ్‌లో భీకర బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడీ వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను అతను ఎదుర్కొంటున్న తీరు భారత్‌కు రుచించట్లేదు. ఆఖరి మ్యాచ్‌లోనూ ఇప్పుడు అందరి దృష్టి క్లాసన్ మీదే ఉంది. అతణ్ని వీలైనంత త్వరగా పెవిలియన్ చేర్చడానికి భారత్ వ్యూహాలు రచిస్తోంది. క్లాసన్, డుమిని రాణిస్తున్నా... మిల్లర్ ఫామ్‌లో లేకపోవడం దక్షిణాఫ్రికాను ఇబ్బందిపెడుతోంది.

బ్యాటింగ్‌కు అనుకూలం: ఎత్తైన కొండల మధ్య ఉండడంతో ఈ మైదానంలో వాతావరణం చాలా భిన్నం. గాలి ఎక్కువగా వీస్తుంటుంది. భారీ సిక్స్ ఖాయం అనుకున్న బంతి ఫీల్డర్ చేతిలో పడే అవకాశాలుంటాయి. కానీ ఈ న్యూలాండ్స్ స్వతహాగా బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్. చిరు జల్లులు పడే అవకాశాలున్నాయి. స్పిన్ బౌలర్లకు పట్టు దొరకడం కష్టం.

జట్లు (అంచనా): భారత్: కోహ్లి (కెప్టెన్), రోహిత్‌శర్మ, ధావన్, రైనా, మనీష్ పాండే, ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్, శార్దూల్ ఠాకూర్, చాహల్/కుల్‌దీప్ బుమ్రా/ఉనద్కత్

దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), హెండ్రిక్స్, స్మట్స్, మిల్లర్, బెహర్డీన్, క్లాసన్, ఫెలుక్వాయో, మోరిస్, జూనియర్ డాలా, ప్యాటర్సన్/శంసి/ఫాంగిసో



"న్యూలాండ్స్ పిచ్‌పై తెలివిగా ఆడాలి. ఇక్కడ 160 పరుగులు కూడా పోరాడదగ్గ స్కోరే. గత రెండేళ్లుగా ఈ పిచ్‌లో ఎలాంటి మార్పు లేదు. సెంచూరియన్‌లోలా సిక్సర్లు కొట్టడం సులభం కాదు. అక్కడ కొట్టిన షాట్లే ఇక్కడ ఆడితే ఔటయ్యే అవకాశముంటుంది. రాత్రి వేళ మ్యాచ్ కావడంతో బంతి కూడా స్వింగ్ అవుతుంది. పరిస్థితిని బట్టి ఇద్దరు స్పిన్నర్లతో బరిలో దిగుతాం. ఈ పర్యటనలో కుల్‌దీప్ బౌలింగ్‌లో ఇబ్బంది పడ్డాం. అతను ఆడితే కచ్చితంగా మునుపటి కంటే మెరుగ్గా ఎదుర్కొంటాం."

– బెహర్డీన్



"ఈ పిచ్‌పై సగటు స్కోరు 150. పిచ్‌ను చూసిన తర్వాత ప్రణాళికలు రచించుకుంటాం. బ్యాటింగ్‌లో తొలి 6 ఓవర్లే కీలకం. ఈ సిరీస్‌లో మేం బాగా ఆడాం. ఈ మ్యాచ్‌ను కూడా గెలిచి సిరీస్‌ను ఘనంగా ముగించాలనుకుంటున్నాం"

- సురేశ్ రైనా



సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-1, 3లో

చివరి అవకాశం


సిరీస్ లక్ష్యంగా బరిలో అమ్మాయిలు • దక్షిణాఫ్రికాతో నేడే ఐదో టీ20

కేప్‌టౌన్: పురుషుల జట్టుకు మాత్రమే కాదు.. చరిత్ర సృష్టించేందుకు భారత మహిళల క్రికెట్ జట్టుకూ ఇదే చివరి అవకాశం. దక్షిణాఫ్రికాతో చివరిదైన ఐదో టీ20 శనివారం జరగనుంది. ఇప్పటికే 2-1 ఆధిక్యంలో నిలిచిన టీమ్ ఇండియా చివరి టీ20లో ఎలాగైనా విజయం సాధించి ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు గెలిచిన తొలి జట్టుగా రికార్డు సాధించాలని పట్టుదలతో ఉంది. తొలి రెండు టీ20ల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు మూడో టీ20లో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. నాలుగో టీ20 వర్షం కారణంగా రద్దయ్యింది. మ్యాచ్ ఆగిపోయేసరికి దక్షిణాఫ్రికా 15.4 ఓవర్లలో 130/3తో నిలిచింది. స్పిన్నర్లు అనుజ పాటిల్, పూనమ్ యాదవ్, పేసర్ పూజాలతో కూడిన బౌలింగ్ దళం మరింత మెరుగ్గా రాణించి ఆతిథ్య జట్టును కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. బ్యాటింగ్ విభాగంలో మిడిల్ ఆర్డర్ వైఫల్యం జట్టును వెంటాడుతోంది. మరోమారు బ్యాటింగ్ భారం మిథాలీ, స్మృతి మంధాన, హర్మన్ ప్రీత్‌లపైనే ఉంది. మరోవైపు చివరి మ్యాచ్‌లో సిరీస్‌ను సమం చేయాలని దక్షిణాఫ్రికా కోరుకుంటోంది.

చింటూ ఇంట చిన్నారి



రాజ్‌కోట్: టీమ్ఇండియా టెస్టు బ్యాట్స్‌మన్ చెతేశ్వర్ పుజారా (చింటూ) తండ్రయ్యాడు. అతని భార్య పూజ పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని పుజారా ట్విటర్‌లో తెలిపాడు. తన భార్య, చిన్నారితో కలిసి ఉన్న ఫోటోను ట్విటర్‌లో అతను పోస్టు చేశాడు. పుజారా 2013 ఫిబ్రవరిలో పూజను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.



అంతా మీ ఇష్టమేనా..

డేనైట్ టెస్టు ప్రతిపాదనపై సీఓఏ మండిపాటు

ముంబయి: వీలైనంత త్వరగా భారత్‌లో తొలి డేనైట్ టెస్టు మ్యాచ్ నిర్వహించాలని భావిస్తోన్న బీసీసీఐకి ఎదురుదెబ్బ. అక్టోబరులో టీమ్ ఇండియా, వెస్టిండీస్ మధ్య డేనైట్ మ్యాచ్ నిర్వహించాలని ప్రతిపాదించిన బీసీసీఐ అందుకు ఏర్పాట్లు కూడా ఆరంభించింది. ఐతే సుప్రీం కోర్టు నియమిత పాలకుల కమిటీ (సీఓఏ) బీసీసీఐ తీరును తప్పుపట్టింది. ఎవరితో చర్చించి మ్యాచ్ నిర్వహణపై నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈ విషయంపై సీఓఏ చీఫ్ వినోద్ రాయ్.. బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరిపై ఘాటైన వ్యాఖ్యలు చేశాడు. "మీ దృష్టిలో ముఖ్యమైన వారనుకున్న నలుగురితో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టున్నారు. క్రికెట్ పరమైన అంశం కాబట్టి.. నాతో పోల్చుకుంటే మీకు జ్ఞానం ఎక్కువ. ఐతే మీ కంటే సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీకి ఎక్కువ తెలుసు" అని అమితాబ్‌కు రాసిన లేఖలో రాయ్ విమర్శించాడు. టీమ్ఇండియా కోచ్ రవిశాస్త్రి, బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి, తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కోశాధికారి అనిరుధ్ చౌదరి, క్రికెట్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ సబా కరీంతో పాటు మరికొందరిని సంప్రదించి బీసీసీఐ అక్టోబరులో డేనైట్ టెస్టు నిర్వహించాలని నిర్ణయించింది. "రవిని సంప్రదించి వుండొచ్చు. ఐతే ఐదు రోజుల పాటు కొత్త సమయంలో మైదానంలో ఆడాల్సిన ఆటగాళ్లను ముందు అడగాలి. వాళ్ల శరీరం ఎలా స్పందిస్తుందో పరిగణనలోకి తీసుకోవాలి" అని వినోద్ రాయ్ చెప్పాడు. మళ్లీ చెప్పే వరకు మ్యాచ్ నిర్వహణపై ముందుకు సాగొద్దని రాయ్.. బోర్డును ఆదేశించాడు. వినోద్ లేఖ.. బీసీసీఐ వర్గాలను విస్మయానికి గురి చేసింది. "కోహ్లి, ధోనీలు తమ కెరీర్లో ఎక్కువ భాగం డేనైట్ మ్యాచ్‌లు ఆడారు. అవన్నీ 2.30కి ప్రారంభమై, రాత్రి 10.30కి ముగిశాయి. కాబట్టి ఈ విషయంలో పూర్తిగా తప్పులో కాలేశాడు వినోద్ రాయ్. అందరి కంటే డయానా ఎడుల్జీకి క్రికెట్ గురించి ఎక్కువ తెలుసన్న విషయం కూడా తప్పే. సబా కరీం భారత్ తరఫున 34 వన్డేలు ఆడాడు" అని ఒక బీసీసీఐ అధికారి తెలిపాడు.



గదిలో నిషేధిత ఉత్ప్రేరకం

అథ్లెట్‌కు నాలుగేళ్ల శిక్ష

దిల్లీ: నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నందుకు అథ్లెట్లకు డోపింగ్ నిరోధక సంస్థ శిక్షలు విధించడం మామూలే. ఐతే వాడకపోయినా.. నిషేధిత ఉత్ప్రేరకం కలిగివున్నందుకు ఓ అథ్లెట్‌పై నాలుగేళ్ల నిషేధం పడింది. భారత రన్నర్ జితిన్ పాల్ ఈ శిక్ష ఎదుర్కొన్నాడు. దక్షిణాసియా క్రీడల్లో రజతం నెగ్గిన జితిన్.. 400 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ ఓపెన్ ఛాంపియన్ కూడా. అతడు పటియాలాలోని జాతీయ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్నాడు. నిరుడు ఏప్రిల్‌లో అతడి గదిలో తనిఖీలు నిర్వహించగా.. నిషేధిత ఉత్ప్రేరకం మెల్డోనియం లభించింది. దీనిపై విచారణ చేపట్టిన జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ.. జితిన్‌పై నాలుగేళ్ల నిషేధం విధించింది. భారత్‌లో ఈ తరహాలో శిక్ష ఎదుర్కొన్న తొలి అథ్లెట్ జితినే.

ఫైనల్లో మేరీకోమ్

- సరితా, మీనాలకు కాంస్యమే
- స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీ



సోఫియా (బల్గేరియా): భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. 48 కిలోల విభాగం సెమీఫైనల్లో మేరీ.. యూ జియ్‌లి (చైనా)ని చిత్తు చేసింది. ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించిన మేరీ.. సులభంగా గెలిచి ముందంజ వేసింది. సరితా దేవి (60 కిలోలు), మీనా కుమారి (54 కిలోలు) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. సెమీస్‌లో పొకెనెన్ (ఫిన్లాండ్) చేతిలో సరిత పరాజయం పాలైంది. మరో సెమీస్‌లో మీనా.. పెట్రోవా (బల్గేరియా) చేతిలో ఓడింది. పురుషుల విభాగంలో వికాస్ కృష్ణన్ (75 కిలోలు), గౌరవ్ సోలంకి (52 కిలోలు), సతీశ్‌కుమార్ (91 కిలోల పైన) సెమీస్‌లో అడుగుపెట్టారు.

బౌచర్డ్‌కు అనుకూలంగా..



న్యూయార్క్: అమెరికా టెన్నిస్ సంఘం (యూఎస్‌టీఏ) నిర్లక్ష్యం కారణంగానే బౌచర్డ్ గాయపడిందని అమెరికా న్యాయస్థానం తేల్చింది. 2015లో లాకర్ రూమ్‌లో బాగా జారేలా, ప్రమాదకరంగా ఉన్న శుభ్రపరిచే పదార్థాలు వాడడం వల్లే తాను జారిపడ్డానని, దాని వల్ల తన కెరీర్ దెబ్బతిందని, నష్ట పరిహారం చెల్లించాలంటూ బౌచర్డ్ కోర్టులో దావా వేసిన సంగతి తెలిసిందే. తొలి దశ విచారణ ముగించిన కోర్టు యూఎస్‌టీఏను తప్పుపట్టింది. లాకర్ రూమ్‌లో బౌచర్డ్ గాయపడడంలో ఆమె తప్పు 25 శాతం కాగా.. యూఎస్‌టీఏ నిర్లక్ష్యం 75 శాతం ఉందని వ్యాఖ్యానించింది. తుది దశ విచారణ ముగిశాక బౌచర్డ్‌కు చెల్లించాల్సిన పరిహారంపై కోర్టు తీర్పు ఇస్తుంది.

టీ20లు లేకుంటే క్రికెట్ కష్టమే: గంగూలీ

దిల్లీ: టీ20 క్రికెట్ లేకుంటే క్రికెట్ మనుగడ కష్టమేనని టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే భారత జట్టు శ్రీలంకలో ముక్కోణపు టీ20 టోర్నీ ఆడనుండటంపై ఓ విలేకరి ప్రశ్నించగా అతడు ఈ విధంగా బదులిచ్చాడు. "క్రికెట్‌కు టీ20లు తప్పనిసరి. అవి లేకుంటే ఆట మనుగడ కష్టమే" అని గంగూలీ చెప్పాడు. మూడో మ్యాచ్‌లో గెలిచి టీమ్ఇండియా టీ20 సిరీస్ సొంతం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. మనీష్ పాండే, హార్దిక్ పాండ్య లాంటి కుర్రాళ్లు నిలదొక్కుకోవాలంటే వారికి మరింత సమయం కావాలని గంగూలీ అభిప్రాయపడ్డాడు. "మనీష్ పాండే, హార్దిక్ పాండ్య భారత జట్టులో నిలకడగా ఆడుతున్నారు. సెహ్వాగ్, హర్భజన్‌లా జట్టులో కీలక ఆటగాళ్లుగా మారడానికి వారికి మరింత సమయం పడుతుంది. వీరూ, భజ్జీలకు చాలా కాలమే పట్టింది" అని అన్నాడు.



తండ్రి, కొడుకు.. ఓ రనౌట్

గయానా: ఆధునిక క్రికెట్లో తండ్రీ కొడుకులు కలిసి ఆడడమంటే అద్భుతమే. ఐతే.. వెస్టిండీస్ మాజీ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్.. అతని కొడుకు త్యాగనారాయణ్ చందర్‌పాల్ కొన్నేళ్లుగా కలిసి ఆడుతున్నారు. కరీబియన్ దేశవాళీ క్రికెట్లో వీరిద్దరు గయానా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. తాజాగా జరుగుతున్న సూపర్ ఫిఫ్టీ టోర్నీలో త్యాగనారాయణ్ రనౌటైన విధానం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. కారణం.. ఆ అవుట్‌కు పరోక్షంగా తండ్రి శివ్ నారాయణ్ చందర్‌పాల్ కావడమే. శివనారాయణ్ స్ట్రైట్‌డ్రైవ్ ఆడగా.. బంతిని అడ్డుకునే ప్రయత్నంలో బౌలర్ కాలు అడ్డుపెట్టాడు. అతడి కాలికి తాకిన బంతి బెయిల్స్‌ను పడగొట్టింది. అప్పటికి క్రీజు బయట ఉన్న త్యాగనారాయణ్ రనౌటై వెనుదిరగాల్సి వచ్చింది. అలా అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన రనౌట్ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00


బంగారు
ఆభరణాలు కొనండి
మరియు అదే బరువుకి
వెండిని ఉచితంగా
పొందండి
1GM
ఉచిత బంగారం నాణెం
₹50,000 మరియు అంతకంటే ఎక్కువ విలువ చేసే
డైమండ్ మరియు పోల్కి ఆభరణాల ప్రతి కొనుగోలు పై
0%
మినహాయింపు
బంగారం ఎక్స్ఛేంజ్ పై
*Conditions apply
ఒక సంవత్సరం
ఉచిత బీమా
జీవితాంతం
ఉచితంగా నిర్వహణ
బై-బ్యాక్
గ్యారంటీ
ఉత్తమమైన ధరకు
గ్యారంటీ
www.joyalukkas.com
Joyalukkas
World's favourite jeweller
HYDERABAD • KUKATPALLY • VIJAYAWADA • CHITTOOR • GUNTUR • NELLORE • ONGOLE • VISAKHAPATNAM • KAKINADA
NIZAMABAD • WARANGAL • KHAMMAM • KADAPA • RAJAHMUNDRY • TIRUPATI • KARIMNAGAR • ANANTAPUR • KURNOOL
140 SHOWROOMS AROUND THE WORLD • OPEN ON SUNDAYS